www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శనివారం | 22-6-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 67 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, శుక్లపక్షం; తిథి: పౌర్ణమి ఉ. 9.37, పాడ్యమి తె. 5.12 వరకు; నక్షత్రం: మూల సా. 5.54 తదుపరి పూర్వాషాఢ; వర్జ్యం: సా. 4.19-5.54, తె. 3.10-4.12; దుర్ముహూర్తం: ఉ. 5.45-7.30; అమృతఘడియలు: ఉ. 11.36-1.11; రాహుకాలం: ఉ. 9.00-10.30; సూర్యోదయం: 5.45; సూర్యాస్తమయం: 6.48 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ప్రభుత్వానికి ఎస్‌బీఐ రూ.6,959 కోట్ల డివిడెండ్

న్యూఢిల్లీ: దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ.. 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను కేంద్ర ప్రభుత్వానికి రూ.6,959 కోట్ల డివిడెండ్‌ను చెల్లించింది. శుక్రవారం నాడిక్కడ ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్‌కు ఎస్‌బీఐ ఛైర్మన్ దినేశ్ కుమార్ ఖారా ఈ డివిడెండ్ చెక్‌ను అందజేశారు. గడచిన ఆర్థిక సంవత్సరానికి గాను ఎస్‌బీఐ ఒక్కో షేరుకు రూ.13.70 డివిడెండ్‌ను ప్రకటించింది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరంలో ఇది రూ.11.30గా ఉంది. కాగా బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర (బీఓఎం) కూడా కేంద్ర ప్రభుత్వానికి రూ.857 కోట్ల డివిడెండ్‌ను చెల్లించింది. బ్యాంక్ ఎండీ నిధు సక్సేనా ఈ మేరకు ఆర్థిక మంత్రికి డివిడెండ్ చెక్‌ను అందించారు.

రికార్డుల ర్యాలీకి బ్రేక్

- సెన్సెక్స్ 269 పాయింట్లు డౌన్

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లో ఆరు రోజుల వరుస రికార్డుల ర్యాలీకి తెరపడింది. ప్రతికూల అంతర్జాతీయ సంకేతాల నేపథ్యంలో ఇన్వెస్టర్లు ఆయిల్ అండ్ గ్యాస్, క్యాపిటల్ గూడ్స్, ఎఫ్ఎంసీజీ రంగ షేర్లలో అమ్మకాలకు పాల్పడటంతో శుక్రవారం ఈక్విటీ సూచీలు నష్టాల్లో ముగిశాయి. అయితే, విదేశీ పెట్టుబడుల ప్రవాహం కొనసాగడంతో పాటు ఐటీ షేర్లలో కొనుగోళ్లు నష్టాలకు కొంత అడ్డుకట్ట వేయగలిగాయి. వారాంతం ట్రేడింగ్ లాభాల్లోనే ప్రారంభమైనప్పటికీ, ఆ తర్వాత గంటకే సెన్సెక్స్ నష్టాల్లోకి మళ్లింది. ఒకదశలో సూచీ 677 పాయింట్ల మేర క్షీణించి 77,000 స్థాయిని సైతం కోల్పోయింది. మళ్లీ కాస్త తేరుకుని 269.03 పాయింట్ల నష్టంతో 77,209.90 వద్ద ముగిసింది. నిఫ్టీ విషయానికొస్తే, ప్రారంభ ట్రేడింగ్‌లో 100 పాయింట్ల వరకు పెరిగి 23,667.10 వద్ద సరికొత్త ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును నమోదు చేసింది. కానీ, జోరును కొనసాగించలేక డీలా పడిన సూచీ చివరికి 65.90 పాయింట్ల నష్టంతో 23,501.10 వద్ద స్థిరపడింది.సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 19 నష్టపోయాయి.

అవాన్స్ రూ.3,500 కోట్ల ఐపీఓ: విద్యా రుణాలందించే ఎన్‌బీఎఫ్‌సీ అవాన్స్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ)కు రాబోతోంది. ఇందుకు అనుమతి కోరుతూ సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు (డీఆర్‌హెచ్‌పీ) సమర్పించింది. ఐపీఓ ద్వారా సంస్థ రూ.1,000 కోట్ల తాజా ఈక్విటీ జారీతోపాటు ప్రస్తుత వాటాదారులకు చెందిన రూ.2,500 కోట్ల విలువైన షేర్లను ఆఫర్ ఫర్ సేల్ పద్ధతిన విక్రయించాలనుకుంటోంది. తద్వారా సంస్థ మొత్తం రూ.3,500 కోట్లు సమీకరించనుంది.



యులిప్స్ ప్రచారంపై జర జాగ్రత్త

పెట్టుబడి సాధనాలుగా ప్రచారం చేయొద్దు : ఐఆర్‌డీఏఐ

న్యూఢిల్లీ: యూనిట్ లింక్డ్ ప్లాన్స్ (యులిప్స్)పై భారతీయ బీమా అభివృద్ధి, నియంత్రణ మండలి (ఐఆర్‌డీఏఐ) కీలక నిర్ణయం తీసుకుంది. వీటిని పెట్టుబడి సాధనాలుగా ప్రచారం చేయవద్దని బీమా సంస్థలను ఆదేశించింది. దీనికి సంబంధించి ఒక మాస్టర్ సర్క్యులర్ విడుదల చేసింది. ఈ పథకాలు సాంప్రదాయ ఎండోమెంట్ పాలసీలకు భిన్నమైనవని చెప్పడంతో పాటు వీటిపై రాబడులు మార్కెట్ పనితీరుపై ఆధారపడి ఉంటాయనే విషయాన్ని బీమా సంస్థలు మదుపరులకు ముందుగానే స్పష్టం చేయాలని కోరింది.

బీమా సంస్థల ఏజెంట్లు అధిక రాబడుల పేరుతో ఈ పాలసీను మదుపరులకు అంటగడుతున్నట్టు వార్తలు రావడంతో ఐఆర్‌డీఏఐ ఈ చర్య తీసుకుంది. అలాగే పార్టిసిపెంట్ ఎండోమెంట్ పాలసీలపై ఉదహరించిన రాబడులకు కూడా హామీ లేదని బీమా సంస్థలు స్పష్టం చేయాలని కోరింది. యులిప్స్, వేరియబుల్ పే అవుట్ ఆప్షన్‌తో కూడిన యాన్యుటీ పథకాల ప్రచారంలో వాటిలో ఉండే నష్ట భయాలనూ ప్రముఖంగా పేర్కొనాలని ఐఆర్‌డీఏఐ స్పష్టం చేసింది.

ఎన్‌పీఎస్ ఖాతాదారులకు కొత్త ఆప్షన్

నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్) పథకాన్ని మరింత ఆకర్షణీయంగా చేయాలని పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ (పీఎఫ్ఆర్‌డీఏ) భావిస్తోంది. ఇందులో భాగంగా ప్రభుత్వేతర ఖాతాదారుల కోసం ఈ ఏడాది సెప్టెంబరు నాటికి కొత్త లైఫ్ సైకిల్ ఆప్షన్ ఫండ్ ఆప్షన్ ప్రవేశ పెట్టాలని యోచిస్తోంది. పీఎఫ్ఆర్‌డీఏ ఛైర్మన్ దీపక్ మొహంతి ఈ విషయం వెల్లడించారు. ఎన్‌పీఎస్‌లో ఈ కొత్త ఆప్షన్ ద్వారా ఖాతాదారులు ఈక్విటీ మార్కెట్లో పెట్టుబడులు పెంచుకునే ఆప్షన్ కల్పించాలని పీఎఫ్ఆర్‌డీఏ భావిస్తోంది. దీనివల్ల మార్కెట్ బాగుంటే ఎన్‌పీఎస్ ఖాతాదారులకు మరిన్ని రాబడులు లభిస్తాయి. ఇందుకోసం ఖాతాదారుల టాపరింగ్ వయసుని ప్రస్తుత 35 సంవత్సరాల నుంచి 45 సంవత్సరాలకు పెంచబోతున్నట్టు తెలిపారు.

భవిష్యత్ అంతా ఫార్మా సేవల రంగానిదే

ఇందుకు ప్రత్యేక పారిశ్రామిక పార్క్ అవసరం

పార్క్ ఏర్పాటుతో మరిన్ని అవకాశాలు

తెలంగాణ ప్రభుత్వానికి ఫార్మా సర్వీసెస్ సంస్థల వినతి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఐటీ సర్వీసుల రంగం తరహాలోనే రానున్న రోజుల్లో ఫార్మా సేవల రంగానికి అమితమైన గిరాకీ ఏర్పడనుందని ఈ రంగంలోని కంపెనీలంటున్నాయి. శుక్రవారం నాడిక్కడ భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) తెలంగాణ చాప్టర్ నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఫార్మా సంస్థలకు చెందిన సీఈఓలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అరాజెన్ లైఫ్ సైన్సెస్ సీఈఓ మణి కంటిపూడి మాట్లాడుతూ.. కాంట్రాక్ట్ పద్ధతిలో వినూత్న ఔషధాల మాలిక్యూల్స్ కోసం పరిశోధన, అభివృద్ధితో పాటు వాటిని ఉత్పత్తి చేసే (సీఆర్ఓ-సీడీఎంఓ) ఫార్మా సేవల కంపెనీలకు మంచి భవిష్యత్ ఉందన్నారు. అయితే ఇందుకు ప్రభుత్వ ప్రోత్సాహం కూడా తోడైతే ఈ రంగం ఐటీ సేవల రంగం తరహాలోనే శరవేగంగా వృద్ధి చెంది పెద్ద ఎత్తున ఉద్యోగావకాశాలతో పాటు ఎగుమతి అవకాశాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఇప్పటి వరకు ఈ సేవల కోసం చైనాపై ఆధారపడిన అమెరికా, యూరప్ దేశాలకు చెందిన పలు ఫార్మా కంపెనీలు.. చైనా ప్లస్ వన్ వ్యూహంలో భాగంగా ఫార్మా సేవల కోసం భారత్ వైపు చూస్తున్నాయని మణి పేర్కొన్నారు. అయితే ఈ అవకాశాలను దక్కించుకునేందుకు గాను ఫార్మా సేవల రంగానికి చెందిన కంపెనీల కోసం ప్రత్యేక పారిశ్రామిక పార్కు లేదా క్లస్టర్‌ను ఏర్పాటు చేయాలని ఈ రంగంలోని కంపెనీలు తెలంగాణ ప్రభుత్వాన్ని కోరుతున్నాయని ఆయన వివరించారు. కాగా బల్క్ డ్రగ్స్‌తో పాటు ఫార్మా సేవల కంపెనీలకూ హైదరాబాద్ కేంద్రంగా ఎదుగుతోందని ఈ సమావేశంలో పాల్గొన్న సప్తగిర్ గ్రూప్ ఎండీ శిల్పా రెడ్డి తెలిపారు. మరోవైపు ఫార్మా సేవల కంపెనీలకు తెలంగాణ ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు.. ఫార్మా కంపెనీల ప్రతినిధులకు హామీనిచ్చారు.


సీఐఐ సమావేశంలో పాల్గొన్న ఫార్మా సంస్థల సీఈఓలు

రూ.35 కోట్ల బుగాటీ టూర్‌బిల్లాన్

అల్ట్రా లగ్జరీ కార్ల తయారీ కంపెనీ బుగాటీ సరికొత్త కారును ఆవిష్కరించింది. దాని పేరు టూర్‌బిల్లాన్. ధరెంతో తెలుసా.. 38 లక్షల యూరోలు. మన కరెన్సీలో రూ.35 కోట్ల పైమాటే. ఎందుకంత రేటు అంటారా..? దాని ప్రత్యేకతలు అలాంటివి మరి. 8.3 లీటర్, వీ 16 ఇంజన్‌తో కూడిన ఈ మెగా కార్.. ఒక మెగావాట్‌కు పైగా పవర్‌ను ఉత్పత్తి చేయగలదు. అంతేకాదు, సున్నా నుంచి గంటకు 100 కి.మీ వేగాన్ని కేవలం 2 సెకన్లలో అందుకోగలదని కంపెనీ తెలిపింది. 5 సెకన్లలో 200 కి.మీ, 10 సెకన్లలో 300 కి.మీ, 25 సెకన్లలోగా 400 కి.మీ వేగాన్ని అందుకుంటుందని బుగాటీ వెల్లడించింది. గంటకు 445 కి.మీ గరిష్ఠ వేగంతో దూసుకెళ్లగలదు. కేవలం 250 టూర్‌బిల్లాన్‌లను మాత్రమే తయారు చేయనున్నట్లు బుగాటీ తెలిపింది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	73,250 ▲	67,150 ▲	98,500 ▲
ముంబై	72,746 ▲	66,635 ▲	90,666 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

22వ తేదీ			
హైదరాబాద్	515	విజయవాడ	510
వరంగల్	517	గోదావరి	505
చిత్తూరు	573	విశాఖపట్నం	515
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	119	విజయవాడ	130
వరంగల్	119	గుంటూరు	130
కరీంనగర్	119	ఒంగోలు	130
మహబూబ్‌నగర్	119	చిత్తూరు	144
కర్నూలు	119	నెల్లూరు	144
విశాఖపట్నం	136	అనంతపురం	130
గోదావరి	130		

జేకే టైర్ నుంచి సరికొత్త శ్రేణి టైర్లు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): వాణిజ్య ట్రక్కులు, బస్సులు, ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) కోసం జేకే టైర్ సరికొత్త శ్రేణి టైర్లను తీసుకువచ్చింది. శుక్రవారం నాడిక్కడ జరిగిన కార్యక్రమంలో ఈ టైర్లను జేకే టైర్ అండ్ ఇండస్ట్రీస్ ప్రెసిడెంట్ అనూజ్ కథూరియా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత రవాణా రంగ అవసరాలకు తగ్గట్టుగా ఈ కొత్త టైర్లను డిజైన్ చేసినట్లు తెలిపారు. జెట్‌వే జేయూసీ ఎక్స్‌ఎం, జెట్‌స్టీల్ జేడీసీ ఎక్స్‌డీ పేరుతో ట్రక్కులు, బస్సుల కోసం రేడియల్ టైర్లను తీసుకురాగా, ఎలక్ట్రిక్ బస్సుల కోసం జెట్‌వే జేయూఎక్స్‌ఈ పేరుతో టైర్లను తీసుకువచ్చినట్లు కథూరియా వెల్లడించారు. ఈ కొత్త టైర్లతో సంస్థ ఉత్పత్తుల పోర్టుఫోలియో మరింతగా పెరగటమే కాకుండా మార్కెట్లో స్థానాన్ని బలోపేతం చేసుకునే అవకాశం లభించనుందన్నారు. కర్ణాటక, మైసూరులో కంపెనీ రూ.600 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేసిన ఆర్ అండ్ డీ కేంద్రం ఈ టైర్ల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిందని కథూరియా తెలిపారు. కాగా ఆర్ అండ్ డీపై ఏటా రూ.125 కోట్లు వెచ్చిస్తున్నట్లు ఆయన చెప్పారు. ప్రస్తుతం తెలంగాణలో కంపెనీకి 380 మంది డీలర్లు ఉండగా మార్కెట్ వాటా 4 నుంచి 5 శాతం వరకు ఉందని కథూరియా తెలిపారు.

నలుగురు నై, ఇద్దరు సై

రెపో తగ్గింపుపై ఎంపీసీలో భిన్న ధోరణులు

ముంబై: దేశంలో రిటైల్ ద్రవ్యోల్బణం తగ్గుదల మందకొడిగా ఉండడానికి ఆహార ధరలే కారణమని, అవి పట్టూ విడుపూ లేకుండా గరిష్ఠ స్థాయిల్లో కొనసాగుతూ ఉంటున్నందు వల్ల రెపో రేటులో యథాతథ స్థితికి అనుకూలంగా తాను ఓటు వేస్తున్నానని ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ స్పష్టం చేశారు. శుక్రవారం ఆర్‌బీఐ విడుదల చేసిన ఎంపీసీ తీర్మానాల వివరాలు ఈ విషయాన్ని వెల్లడించాయి. వాస్తవానికి ఈ సారి రెపో రేటు తగ్గుదలకు బలం పెరిగింది. గతంలో ఎంపీసీ సభ్యుడు జయంత్ ఆర్ వర్మ ఒక్కరే రెపో రేటు తగ్గింపునకు అనుకూలంగా ఓటు వేసే వారు. ఈసారి అషిమా గోయెల్ కూడా ఆయనతో జత కలిశారు. ఫలితంగా రెపో రేటులో యథాతథ స్థితికి నలుగురు, తగ్గింపునకు ఇద్దరు ఓటు వేసినట్టయింది. ఫలితంగా వరుసగా ఎనిమిదో సారి కూడా రెపో రేటు 6.5 శాతం వద్ద స్థిరంగా ఉంది. యథాతథ స్థితికి ఓటు వేసిన వారిలో శశాంక భిడే ఒక్కరే ఆర్‌బీఐ వెలుపలి సభ్యుడు. కాగా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజీవ్ రంజన్, డిప్యూటీ గవర్నర్ మైకేల్ దేవవ్రత పాత్రా, గవర్నర్ శక్తికాంత దాస్ ఇంటర్నల్ సభ్యులు.

జెప్టో రూ.5,560 కోట్ల సమీకరణ

రూ.30,000 కోట్లు దాటిన కంపెనీ మార్కెట్ విలువ

న్యూఢిల్లీ: పలువురు ఇన్వెస్టర్ల నుంచి 66.5 కోట్ల డాలర్ల (దాదాపు రూ.5,560 కోట్లు) నిధులు సమీకరించినట్లు ముంబైకి చెందిన క్విక్ కామర్స్ స్టార్టప్ జెప్టో శుక్రవారం వెల్లడించింది. ఈ సందర్భంగా కంపెనీ మార్కెట్ విలువను 360 కోట్ల డాలర్ల (రూ.30,060 కోట్లు) స్థాయిలో లెక్కగట్టినట్లు జెప్టో తెలిపింది. ఏడాది క్రితంతో పోలిస్తే, కంపెనీ మార్కెట్ విలువ దాదాపు మూడింతలైంది. ఏడాది కన్నా తక్కువ సమయం క్రితమే సంస్థ 140 కోట్ల డాలర్ల మార్కెట్ విలువ వద్ద 23.5 కోట్ల డాలర్లు సమీకరించింది. ఈసారి ఫండింగ్ రౌండ్‌లో కొత్త ఇన్వెస్టర్లు అవెనీర్, లైట్‌స్పీడ్, అర్వతో పాటు ఇప్పటికే సంస్థలో ఇన్వెస్ట్ చేసిన గ్లేడ్ బ్రూక్, నెక్సస్, స్టెప్‌స్టోన్, గుడ్‌వాటర్, ల్యాచీ గ్రూప్ కూడా పాల్గొన్నాయని జెప్టో వెల్లడించింది. త్వరలో పబ్లిక్ ఇష్యూకు వచ్చేందుకు సిద్ధమవుతున్నట్లు జెప్టో సహ వ్యవస్థాపకులు వెల్లడించారు.

- హైదరాబాద్ కేంద్రంగా ఉన్న టెక్‌టోరో కన్సల్టింగ్ ప్రైవేట్ లిమిటెడ్.. 2024 సంవత్సరానికి గాను గూగుల్ నుంచి ప్రతిష్ఠాత్మకమైన గ్లోబల్ యాక్సిలరేటర్ అవార్డును అందుకుంది. ఆండ్రాయిడ్ ఎంటర్‌ప్రైజ్ సొల్యూషన్స్ విస్తరణ, ఇంటిగ్రేషన్‌లో చేసిన విశేష కృషికి గుర్తింపుగా ఈ అవార్డును దక్కించుకుంది. లండన్‌లో జరిగిన ఆండ్రాయిడ్ ఎంటర్‌ప్రైజ్ గ్లోబల్ పార్ట్‌నర్ సమ్మిట్‌లో టెక్‌టోరో ఎండీ శ్రీధర్ దన్నపనేని ఈ అవార్డును అందుకున్నారు.

స్పోర్ట్స్

ప్రపంచకప్‌లో నేటి మ్యాచ్‌లు

వెస్టిండీస్ x అమెరికా (ఉ.6. గం.)

భారత్ x బంగ్లాదేశ్ (రా.8. గం.)

విండీస్‌కు కావాలి భారీ విజయం

బ్రిడ్జిటౌన్ (బార్బడోస్): రికార్డు స్థాయిలో మూడో టైటిల్‌పై కన్నేసిన ఆతిథ్య వెస్టిండీస్..వరల్డ్ కప్ సూపర్-8లో కీలక సమరానికి సిద్ధమైంది. శనివారం జరిగే మ్యాచ్‌లో మరో ఆతిథ్య జట్టు అమెరికాను ఢీకొననుంది. గ్రూపు దశలో అజేయంగా నిలిచిన కరీబియన్లు..సూపర్-8 తొలి పోరులో డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్ చేతిలో 8 వికెట్లతో చిత్తుగా ఓడారు. ఆ మ్యాచ్‌లో ఏకంగా 51 డాట్ బాల్స్ ఆడడం వెస్టిండీస్ బ్యాటర్ల దారుణ స్ట్రయిక్ రొటేట్‌కు అద్దం పడుతుంది. ఇంగ్లండ్‌పై ఓటమి దరిమిలా సూపర్-8 గ్రూప్-2 పట్టికలో వెస్టిండీస్ చివరి స్థానంలో నిలిచింది. ఆ జట్టు నెట్ రన్‌రేట్ కూడా మైనస్ (1.343)గా ఉంది. ఈనేపథ్యంలో టైటిల్ రేసులో నిలవాలంటే అమెరికాపై ఆ జట్టు భారీ విజయం సాధించాల్సి ఉంటుంది.

కమిన్స్ హ్యాట్రిక్



బంగ్లాపై ఆసీస్ గెలుపు

నార్త్ సౌండ్ (ఆంటిగ్వా): ఈసారి టీ20 వరల్డ్ కప్‌లో తొలి హ్యాట్రిక్ నమోదు చేసిన బౌలర్‌గా ఆస్ట్రేలియా స్టార్ పేసర్ ప్యాట్ కమిన్స్ నిలిచాడు. కమిన్స్ (3/29)కు తోడు స్పిన్నర్ ఆడమ్ జంపా (2/24) ఆకట్టుకోవడంతో శుక్రవారం బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో డక్‌వర్త్ లూయిస్ విధానంలో ఆసీస్ 28 పరుగుల తేడాతో నెగ్గింది. అలాగే ఈ మెగా టోర్నీలో అత్యధిక వరుస విజయాలు (8) సాధించిన జట్టుగానూ నిలిచింది. సూపర్-8 గ్రూప్-1లో భాగంగా జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బంగ్లా 20 ఓవర్లలో 8 వికెట్లకు 140 పరుగులు చేసింది. కెప్టెన్ షంటో (41), తౌహిద్ హ్రిదాయ్ (40) మాత్రమే రాణించారు. తొలి ఓవర్‌లోనే ఓపెనర్ తన్‌జీద్‌ను స్టార్క్ డకౌట్ చేయగా.. రెండో వికెట్‌కు 58 పరుగులు జోడించిన షంటో-లిట్టన్ దాస్ (16) జోడీని జంపా పెవిలియన్‌కు చేర్చడంతో బంగ్లా కోలుకోలేకపోయింది. ఇక 18వ ఓవర్ చివరి రెండు బంతుల్లో మహ్మదుల్లా (2), మెహిదీ హసన్ (0)లను అవుట్ చేసిన కమిన్స్.. తన తర్వాతి ఓవర్ (20వ) తొలి బంతికి హ్రిదాయ్‌ను పెవిలియన్ చేర్చి హ్యాట్రిక్ పూర్తి చేశాడు. ఛేదనలో ఆసీస్ ఓపెనర్లు వార్నర్ (53 నాటౌట్), హెడ్ (31) చెలరేగారు. తన వరుస ఓవర్లలో స్పిన్నర్ రిషాద్.. హెడ్, మార్ష్ (1)లను అవుట్ చేసినా మ్యాక్స్‌వెల్ (14 నాటౌట్) సహకారంతో వార్నర్ జోరు కొనసాగించాడు. అయితే ఆసీస్ ఇన్నింగ్స్ 11.2 ఓవర్లలో 100/2 స్కోరు వద్ద భారీ వర్షం కురిసి మ్యాచ్ రద్దయ్యింది. అప్పటికే డక్‌వర్త్ ప్రకారం కంగారూలు 28 రన్స్ అదనంగా చేయడంతో విజయానికి ఢోకా లేకపోయింది.

సంక్షిప్త స్కోర్లు

బంగ్లాదేశ్: 20 ఓవర్లలో 140/8 (షంటో 41, తౌహీద్ 40; కమిన్స్ 3/29, జంపా 2/24).

ఆస్ట్రేలియా: 11.2 ఓవర్లలో 100/2 (వార్నర్ 53 నాటౌట్, హెడ్ 31; రిషాద్ 2/23).

పాయింట్ల పట్టిక — గ్రూప్-1

జట్టు	మ్యా	గె	ఓ	ఫ.తే	పా	రన్‌రేట్
ఆస్ట్రేలియా	1	1	0	0	2	2.471
భారత్	1	1	0	0	2	2.350
అఫ్ఘాన్	1	0	1	0	0	-2.350
బంగ్లాదేశ్	1	0	1	0	0	-2.471

ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; పా: పాయింట్లు

ప్రాక్టీస్‌లో అక్షర్, కోహ్లీ, కుల్దీప్



‘టాప్’ లేపాలి

బంగ్లాదేశ్‌తో భారత్ మ్యాచ్ నేడు



నార్త్‌సౌండ్ (ఆంటిగ్వా): వరల్డ్ కప్ సూపర్-8 తొలి మ్యాచ్ ఆడిన గంటల్లోనే.. భారత్, బంగ్లాదేశ్ మరో పోరుకు సిద్ధమయ్యాయి. శనివారం ఇక్కడ జరిగే మ్యాచ్‌లో రెండు జట్లు తలపడనున్నాయి. మొదటి మ్యాచ్‌లో అఫ్ఘానిస్థాన్‌పై సాధించిన విజయంతో టీమిండియా ఉత్సాహంగా ఉంది. మరోవైపు ఆస్ట్రేలియా చేతిలో పరాజయంతో బంగ్లాదేశ్ డీలా పడింది. రెండో మ్యాచ్‌లోనూ నెగ్గి సెమీస్ రేసులో మరింత ముందంజ వేయాలని రోహిత్ సేన భావిస్తోంది. కాగా..ఈ మ్యాచ్‌లో గెలిస్తేనే బంగ్లాదేశ్ సెమీస్ అవకాశాలు సజీవంగా ఉంటాయి. అయితే టాపార్డర్ బ్యాటర్లు స్థాయికితగ్గ ప్రదర్శన చేయాలని రెండు జట్లు ఆశిస్తున్నాయి. ముఖ్యంగాఓపెనర్లు రోహిత్, విరాట్ భారీ ఇన్నింగ్స్‌తో శుభారంభాలు ఇవ్వాల్సి ఉంది. సిక్సర్ల వీరుడు శివమ్ దూబే అంచనాలను అందుకోలేకపోతున్నాడు. బంగ్లాదేశ్‌పై కూడా అతడు బ్యాట్ ఝుళిపించకపోతే రాబోయే మ్యాచ్‌లకు సంజూ శాంసన్ పట్ల జట్టు మొగ్గుచూపే అవకాశాలు లేకపోలేదు. బౌలింగ్‌కు సంబంధించి ఈ మ్యాచ్‌కు భారత జట్టులో ఎటువంటి మార్పులూ ఉండకపోవచ్చు.

పిచ్, వాతావరణం

స్పిన్నర్లు, సీమర్లకు అనుకూలిస్తుంది. బ్యాటర్లకు పెద్దగా సహకారం లేకపోవడంతో గత మ్యాచ్‌ల్లో ఇక్కడ తక్కువ స్కోర్లు నమోదయ్యాయి. ఆరంభ ఓవర్లలో బ్యాటర్లు జాగ్రత్తగా ఆడాల్సి ఉంటుంది. వర్షం నుంచి ఎటువంటి అంతరాయమూ ఉండబోదు.

బంగ్లా డీలా..

మరోవైపు టోర్నమెంట్‌లో బంగ్లాదేశ్ బ్యాటర్లు పూర్తిగా విఫలమయ్యారు. పవర్ హిట్టర్లు లేకపోవడం ఆ జట్టు ప్రధాన లోపం. దానికితోడు ఓపెనర్ లిట్టన్ దాస్, తన్‌జీద్ రాణించకపోవడంతో బంగ్లా కష్టాలు రెండింతలయ్యాయి. ఈనేపథ్యంలో బుమ్రా పదునైన బౌలింగ్‌ను బ్యాటర్లు ఎలా ఎదుర్కొంటారన్నది వేచి చూడాలి. ముస్తాఫిజుర్ సారథ్యంలోని పేస్ దళం ఆకట్టుకుంటున్నా..లెగ్గీ రిషద్ హొసేన్‌కు ఇతర స్పిన్నర్ల నుంచి సహకారం లభించడంలేదు.

జట్లు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), విరాట్ కోహ్లీ, పంత్, సూర్యకుమార్, దూబే, హార్దిక్, అక్షర్, బుమ్రా, జడేజా, అర్ష్‌దీప్, కుల్దీప్ యాదవ్.

బంగ్లాదేశ్: షంటో (కెప్టెన్), తన్‌జీద్, లిట్టన్ దాస్, హ్రిదాయ్, షకీబల్, మహ్మదుల్లా, మెహిదీ హసన్, రిషాద్, టస్కిన్, తన్జిద్ హసన్ సకీబ్, ముస్తాఫిజుర్.

నవంబరులో సౌతాఫ్రికాతో 4 టీ20లు

ముంబై: నవంబరులో నాలుగు మ్యాచ్‌ల టీ20ల సిరీస్ కోసం భారత జట్టు సౌతాఫ్రికా వెళ్లనుంది. నవంబరు 8న డర్బన్ స్టేడియంలో జరిగే తొలి మ్యాచ్‌తో సిరీస్ మొదలవనుందని బీసీసీఐ, సీఎస్‌ఏ శుక్రవారం సంయుక్తంగా వెల్లడించాయి. రెండో టీ20 నవంబరు 10న ఎబెహాలో, 13న మూడోది సెంచూరియన్‌లో, 15వ తేదీన జొహాన్నెస్‌బర్గ్ వేదికగా ఆఖరి మ్యాచ్ జరగనుంది. టీమిండియాకు స్వదేశంలో న్యూజిలాండ్‌తో టెస్టు సిరీస్ నవంబరు 5న ముగియనుంది. ఆ వెంటనే దక్షిణాఫ్రికాకు భారత జట్టు బయలుదేరనుంది.

సెమీస్‌కు ధీరజ్

ఆర్చరీ వరల్డ్ కప్

అంటాల్యా (తుర్కియే): భారత ఆర్చర్లు బొమ్మదేవర ధీరజ్, అంకితా భక్త్ ఆర్చరీ వరల్డ్ కప్ స్టేజ్-3 పోటీల్లో పతకం సాధించే దిశగా దూసుకెళుతున్నారు. ఈ ఇద్దరూ రికర్వ్ ఈవెంట్ వ్యక్తిగత విభాగాల్లో సెమీఫైనల్స్ చేరారు. పురుషుల వ్యక్తిగత విభాగం క్వార్టర్‌ఫైనల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ధీరజ్ 7-3తో జొనాథన్ వెటర్ (జర్మనీ)ని ఓడించాడు. మహిళల కేటగిరిలో అంకిత 6-4తో జియోన్ హన్‌యంగ్ (కొరియా)పై గెలిచింది. ఫైనల్ బెర్త్ కోసం ఒలింపిక్, వరల్డ్ చాంపియన్ కిమ్ వూజిన్ (కొరియా)తో ధీరజ్.. యాంగ్ గ్జియోలి (చైనా)తో అంకిత తలపడతారు. రికర్వ్ మిక్స్‌డ్ విభాగం సెమీఫైనల్లో ధీరజ్-భజన్ కౌర్ జోడీ 3-5తో కొరియా జంట చేతిలో ఓటమిపాలైంది. కాంపౌండ్ మిక్స్‌డ్ ఈవెంట్‌లో జ్యోతి సురేఖ-ప్రియాన్ష్ ద్వయం క్వార్టర్స్‌లో ఇటలీ చేతిలో ఓడింది.

సఫారీల జోరు

ఉత్కంఠ పోరులో ఇంగ్లండ్ ఓటమి


డికాక్ (65)

గ్రాస్ ఐలెట్ (సెయింట్ లూసియా): టీ20 వరల్డ్‌కప్‌లో దక్షిణాఫ్రికా అజేయ ఆటతీరుతో చెలరేగుతోంది. తక్కువ స్కోరుకే పరిమితమైనా.. బౌలర్ల రాణింపుతో డిఫెండింగ్ చాంప్ ఇంగ్లండ్‌ను అద్భుతంగా కట్టడి చేసింది. ఇక, ఇంగ్లండ్ స్టార్ హ్యారీ బ్రూక్ (53) చివరి వరకు పోరాడినా ఫలితం లేకపోయింది. దీంతో శుక్రవారం గ్రూప్-2లో జరిగిన ఈ మ్యాచ్‌లో ఏడు పరుగుల తేడాతో నెగ్గిన సఫారీలు తమ సెమీస్ అవకాశాలను మరింత మెరుగుపర్చుకున్నారు. టోర్నీలో వీరికిది డబుల్ హ్యాట్రిక్ విజయం. ముందుగా సౌతాఫ్రికా 20 ఓవర్లలో 6 వికెట్లకు 163 పరుగులు చేసింది. ఓపెనర్ డికాక్ (65) మెరుపు ఆటతీరుతో పవర్‌ప్లేలోనే ఈ జట్టు 63 పరుగులతో పటిష్ఠంగా కనిపించింది. కానీ ఆ తర్వాత స్పిన్నర్లు రషీద్, మొయిన్ అలీ పరుగులను కట్టడి చేశారు. 22 బంతుల్లోనే అర్ధసెంచరీ చేసిన డికాక్ తొలి వికెట్‌కు హెన్‌డ్రిక్స్ (19)తో కలిసి 86 పరుగులు అందించాడు. చివర్లో డేవిడ్ మిల్లర్ (43) భారీ షాట్లతో ఆకట్టుకున్నాడు. ఛేదనలో ఇంగ్లండ్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 156 పరుగులకే పరిమితమైంది. లివింగ్‌స్టోన్ (33) రాణించాడు. రబాడ, కేశవ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఓ మాదిరి ఛేదనలో బట్లర్ సేన 61 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ స్థితిలో మిడిలార్డర్‌లో బ్రూక్ అర్ధసెంచరీతో అండగా నిలిచాడు. అతడికి లివింగ్‌స్టోన్ జత కలవడంతో జట్టు గెలుపువైపు సాగినట్టనిపించింది. కానీ 18వ ఓవర్‌లో లివింగ్‌స్టోన్ అవటవడంతో ఉత్కంఠ పెరిగింది. ఇక చివరి ఓవర్‌లో 14 రన్స్ కావాల్సిన వేళ తొలి బంతికే బ్రూక్ క్యాచ్‌ను మార్‌క్రమ్ పట్టేయడంతో సఫారీల సంబరాలు మిన్నంటాయి. డికాక్‌కు ‘మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్’ లభించింది.

సంక్షిప్త స్కోర్లు

దక్షిణాఫ్రికా: 20 ఓవర్లలో 163/6 (డికాక్ 65, మిల్లర్ 43; ఆర్చర్ 3/40).

ఇంగ్లండ్: 20 ఓవర్లలో 156/6 (బ్రూక్ 53, లివింగ్‌స్టోన్ 33; కేశవ్ 2/25, రబాడ 2/32).

పాయింట్ల పట్టిక — గ్రూప్-2

జట్టు	మ్యా	గె	ఓ	ఫ.తే	పా	రన్‌రేట్
సౌతాఫ్రికా	2	2	0	0	4	0.625
ఇంగ్లండ్	2	1	1	0	2	0.412
అమెరికా	1	0	1	0	0	-0.900
వెస్టిండీస్	1	0	1	0	0	-1.343

ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; పా: పాయింట్లు

నాకౌట్‌కు స్పెయిన్

ఇటలీకి షాక్ — యూరో కప్



గెల్సెన్‌కిర్చెన్ (జర్మనీ): యూరో కప్ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో స్పెయిన్ నాకౌట్‌కు దూసుకెళ్లింది. గ్రూప్-బిలో భాగంగా గురువారం అర్ధరాత్రి జరిగిన పోరులో స్పెయిన్ 1-0తో డిఫెండింగ్ చాంపియన్ ఇటలీకి షాకిచ్చింది. దీంతో వరుసగా రెండో మ్యాచ్‌లోనూ నెగ్గిన స్పెయిన్.. 6 పాయింట్లతో రౌండ్-16 బెర్త్ ఖాయం చేసుకుంది. మ్యాచ్‌లో ఇటలీ డిఫెండర్ రికార్డో కలాఫియోరి 55వ నిమిషంలో సెల్ఫ్ గోల్‌తో ప్రత్యర్థిని ఆధిక్యంలో నిలిపాడు. ఈ గోల్‌తోనే స్పెయిన్ గెలుపొందడం విశేషం. గ్రూప్-ఈలో ఉక్రెయిన్ 2-1తో స్లోవేకియాను చిత్తుచేసి టోర్నీలో బోణీ కొట్టింది. గ్రూప్ ‘డి’ మ్యాచ్‌లో ఆస్ట్రియా 3-1తో పోలెండ్‌ను ఓడించింది.

కోచ్ పదవిపై గంభీర్ దాటవేత

కోల్‌కతా: టీమిండియా తదుపరి హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టనున్నారా..అన్న ప్రశ్నకు గంభీర్ సమాధానం దాట వేశాడు. తాను ఇంకా అంతదూరం ఆలోచించలేదని తెలివిగా బదులిచ్చాడు. భారత జట్టు ప్రధాన కోచ్ పదవికి సంబంధించి బీసీసీఐ క్రికెట్ సలహా కమిటీ ఎదుట గతవారం వర్చువల్ ఇంటర్వ్యూకి గంభీర్ హాజరైన విషయం తెలిసిందే. ‘కోచ్ పదవికి సంబంధించిన ప్రశ్నకు ఇప్పుడు సమాధానం ఇవ్వడం కష్టం. అయితే వ్యక్తులకన్నా జట్టును ముందంజలో ఉంచడం నా కోచింగ్ ఫిలాసఫీ’ అని గంభీర్ చెప్పుకొచ్చాడు.

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శనివారం | 22-6-2024

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | విజయవాడ సిటీ**

నీట్ నిర్వహణలో అడుగడుగునా లోపాలు

186 పరీక్షా కేంద్రాల్లో కరువైన సీసీ టీవీ పర్యవేక్షణ 8

16% కేంద్రాల్లో ప్రశ్నపత్రాలుంచే గదులకు భద్రత కరువు

మళ్లీ పరీక్ష కోసం సుప్రీంలో తెలంగాణ అభ్యర్థి పిటిషన్

వెంటనే నిర్ణయం తీసుకోవాలంటూ ఎన్‌టీఏకి ఆదేశం

1,563 మంది అభ్యర్థులకు రేపు 7 కేంద్రాల్లో నీట్ పరీక్ష

జాయింట్ సీఎస్ఐఆర్-యూజీసీ నెట్ పరీక్ష వాయిదా



నీట్ అవకతవకలపై కేంద్రానికి వ్యతిరేకంగా విజయవాడలో ఆందోళన చేస్తున్న పీసీసీ చీఫ్ షర్మిల





ప్రతిజ్ఞ నెరవేరిన వేళ..

అసెంబ్లీకి ప్రణమిల్లి సభలో అడుగు పెడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు. అనంతరం శాసన సభ్యుడిగా ప్రమాణ స్వీకారం

కౌరవ సభను గౌరవ సభగా మార్చాకే.. అది కూడా ముఖ్యమంత్రిగానే అసెంబ్లీలో అడుగుపెడతానని చేసిన శపథాన్ని చంద్రబాబు నెరవేర్చుకున్నారు.. అసెంబ్లీ గేటైనా తాకలేవన్న వైసీపీ నేతల హేళనను సవాల్‌గా స్వీకరించి.. పిఠాపురంలో ఘనవిజయం సాధించడమే కాదు.. ఏకంగా ఉపముఖ్యమంత్రి హోదాలో పవన్ కల్యాణ్ సభలో అడుగుపెట్టారు. 16వ శాసనసభ శుక్రవారం ఘనంగా కొలువుదీరింది..



కొలువుదీరిన గౌరవ సభ!

సీఎం హోదాలోనే అసెంబ్లీలోకి బాబు.. రెండున్నరేళ్ల తర్వాత సభా ప్రవేశం

గౌరవ సభకు స్వాగతమంటూ టీడీపీ సభ్యుల నినాదాలు

తొలిసారి అసెంబ్లీలోకి పవన్.. సాదరంగా స్వాగతించిన ఎమ్మెల్యేలు

మొదటిసారి ఎన్నికైన లోకేశ్‌కూ ఘనస్వాగతం.. వ్యక్తిగత కారణాలతో సభకు ముగ్గురు దూరం.. నేడు ఆ ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం



అసెంబ్లీలో ప్రమాణస్వీకారం సందర్భంగా చంద్రబాబు, పవన్ ఆలింగనం

ప్రతిజ్ఞ నెరవేర్చుకున్న టీడీపీ అధినేత

172 మంది ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం

అమరావతి, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ 16వ శాసనసభ కొలువుదీరింది. దాని తొట్టతొలి సమావేశాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. కొత్త ఎమ్మెల్యేలతో ప్రొటెం స్పీకర్ గోరంట్ల బుచ్చయ్యచౌదరి ప్రమాణం చేయించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి సహా మొత్తం 172 మంది శాసనసభ్యులుగా ప్రమాణ స్వీకారం

మిగతా 9వ పేజీలో...

స్పీకర్‌గా అయ్యన్న ఏకగ్రీవ ఎన్నిక



నేడు అధికారిక ప్రకటన

3 సెట్ల నామినేషన్లు వేసిన కూటమి పార్టీలు 9

ఇదేం సభామర్యాద?

సభ్యులు ప్రమాణం చేస్తుండగానే జగన్ జంప్

స్పీకర్ ఎన్నికకూ వచ్చే చాన్స్ లేదు

పులివెందులకు పయనం

ఇది సభను, సభాపతినీ అవమానపరచడమే!

మందడం మీదుగా రావడానికి ముఖం చెల్లక అసెంబ్లీకి వెనుకదారిలో వచ్చిన మాజీ సీఎం



అసెంబ్లీలో సభ్యుడిగా ప్రమాణం చేస్తున్న జగన్

జగన్‌కు సముచిత గౌరవం

ప్రత్యేక మర్యాద ఇచ్చిన ప్రభుత్వం 9

జగన్ డైరెక్షన్.. సుప్రియ యాక్షన్

‘తాడేపల్లి’ రూల్సే వేరు

క్యాంపు ఆఫీసుకు అడ్డగోలుగా సోకులు



ప్రతిపాదనలు, టెండర్లు లేకుండానే పనులు

తర్వాత బిల్లుల కోసం ఆర్‌అండ్‌బీపై ఒత్తిళ్లు

కుదరదంటే సీఎం ఆఫీసు నుంచి బెదిరింపులు

ప్రశ్నించలేకపోయిన కృష్ణబాబు, ప్రద్యుమ్న

పైగా చెప్పినట్టు చేయాలని అధికారులకు చీవాట్లు

జగన్ అడుగులకు ఆర్‌అండ్‌బీ బాస్‌ల మడుగులు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గత ఐదేళ్లు జగన్ సొంత రాజ్యాంగాన్ని అమలు చేశారని అంటుంటారు. అంతేకాదు చట్టాలు, నియమ నిబంధనలంటే డోంట్ కేర్. ఆయన చెప్పిందే రూల్. అధికారులను ఉరుకులు, పరుగులు పెట్టించి మరీ పనులు చేయించారు. తాడేపల్లి ప్యాలెస్‌కు సోకుల అద్దుడు వ్యవహారమూ ఇలాగే సాగింది. జగన్ డైరెక్షన్‌లో ఆయన బంధువు సుప్రియారెడ్డి యాక్షన్‌లో వ్యవహారం సాగింది. జగన్ నివాసం, క్యాంపు ఆఫీసులో ఆర్‌అండ్‌బీ శాఖలోని బిల్డింగ్స్ విభాగంతో చేయించిన పనుల్లో అంతా రివర్స్ ఆర్‌అండ్‌బీతో సంబంధం లేకుండా ఓ అస్మదీయ కాంట్రాక్టర్‌తో పనులు చేయించడం, ఆ తర్వాత బిల్లులను ఆర్‌అండ్‌బీ విభాగంతో ఇప్పించడం తంతుగా మార్చారు. బిల్లులు ఇప్పించే బాధ్యతను సుప్రియారెడ్డినే పర్యవేక్షించారని చెబుతున్నారు. వర్క్‌లు ఏ ప్రతిపాదికన చేపట్టారు? ఎవరు మంజూరు చేశారు? బిల్లులు ఎలా చెల్లించాలి? అని ప్రశ్నించిన ఇంజనీర్లపై జగన్ కార్యాలయంలోని అధికారులు నోరేసుకొని పడిపోయేవారు. తెలుగు డిక్షనరీలో లేని పదజాలంతో దూషణలకు దిగి బెదిరించడం సర్వసాధారణంగా సాగిపోయింది. మొదట్లో ఆర్‌అండ్‌బీ

మిగతా 10వ పేజీలో...

జగనా.. మజాకా!

రుషికొండ రాజమహల్‌కు రోజుకు 2,000 యూనిట్ల విద్యుత్

ఎవరూ లేకున్నా ఈ స్థాయిలో వాడకం.. భవనాన్ని వినియోగిస్తే ఇంకెంత అవుతుందో?

ప్రస్తుతం నెలకు 60 వేల యూనిట్ల వాడకం.. దరఖాస్తులో పేర్కొంది 250 కిలోవాట్లు మాత్రమే

రుషికొండపై ఏకంగా 10 వేల కిలోవాట్ల హైబ్రిడ్ కంటెయినర్ స్టేషన్ నిర్మాణం 10

మొత్తం విద్యుత్ ఏర్పాట్ల వ్యయం 12.9 కోట్లు.. నవంబరు నుంచి బిల్లు బకాయి 54.52 లక్షలు

డీజీపీగా తిరుమలరావు

బాధ్యతల స్వీకారం



సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌తో భేటీ 10

గవర్నర్ కార్యదర్శిగా హరిజవహర్‌లాల్

డీజీపీ తిరుమలరావుకు ఆర్టీసీ ఎండీగా అదనపు బాధ్యతలు 8

ఇంటర్ కమిషనర్‌గా నిధి మీనా.. మైన్స్ ప్రిన్సిపల్ సెక్రటరీగా యువరాజ్

రేప్ చేసి.. కర్రలతో కొట్టి చంపేసి..

బాపట్ల జిల్లాలో యువతిపై హత్యాచారం

బహిర్భూమికి వెళ్లినప్పుడు దారుణం

దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సీఎం చంద్రబాబు 10

బాధిత కుటుంబానికి 10 లక్షల పరిహారం

48 గంటల్లో పట్టుకోవాలి హోం మంత్రి అనిత ఆదేశం



మృతురాలి తల్లిదండ్రులను ఓదారుస్తున్న హోం మంత్రి అనిత

పోలీసుల అదుపులో భారతీరెడ్డి పీఏ!

షర్మిల, సునీతపై బండబూతులు పోస్టు చేసిన వర్రా రవీంద్రారెడ్డి

టీడీపీ మహిళా అధ్యక్షురాలు అనితపైనా

బాబు, పవన్.. వారి కుటుంబ సభ్యులే అతడి టార్గెట్

రెండేళ్లుగా నీచభాషలో పోస్టులు

పోలీసులకు ఫిర్యాదుచేసినా బుట్టదాఖలు

హోం మంత్రి అయ్యాక అనిత వార్నింగ్

దీంతో పులివెందుల-కదిరి మధ్య రవీంద్రారెడ్డిని పట్టుకున్న పోలీసులు

సోషల్ మీడియాలో వైసీపీ ప్రచారం



భారతీరెడ్డితో పీఏ వర్రా రవీంద్రారెడ్డి (ఫైల్)

అమరావతి, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి సతీమణి వైఎస్ భారతీరెడ్డి అండతో గత ఐదేళ్లుగా సోషల్ మీడియాలో చెలరేగిపోయిన ఆమె వ్యక్తిగత సహాయకుడు వర్రా రవీంద్రారెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. టీడీపీ, జనసేన అధినేతలు, మహిళా నాయకులతో పాటు.. జగన్‌తో విభేదించిన పాపానికి ఆయన చెల్లెళ్లు షర్మిలారెడ్డి, వివేకానందరెడ్డి కుమార్తె సునీతలపైనా ఇతడు దారుణమైన వ్యాఖ్యలు చేస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టాడు. సభ్యత ఉన్నవారెవరూ చదవడానికి వీల్లేని భాషలో అతడి పోస్టులు ఉండేవి. షర్మిలపై చండాలపు పోస్టులు పెట్టిన రవీంద్రారెడ్డిని పులివెందులలో వైఎస్ఆర్ అభిమానులు తన్నేందుకు

మిగతా 8వ పేజీలో...

వాసుదేవరెడ్డి ఇంట్లో సీఐడీ సోదాలు

చెన్నై మద్యం కంపెనీ లావాదేవీల డాక్యుమెంట్లు స్వాధీనం?

డిస్టిలరీల విభాగం సీజ్.. అక్రమాల్లో ఈ విభాగం పాత్ర కీలకం

గనుల శాఖలో సలహాదారులకు ఉద్వాసన 8

ఆటోమేటిగ్గా గ్రీన్‌కార్డు!

అమెరికా కాలేజీల్లో చదివే విదేశీ విద్యార్థులందరికీ లక్కీ చాన్స్ 8

గ్రాడ్యుయేషన్ పూర్తికాగానే మంజూరు


మాజీ అధ్యక్షుడు ట్రంప్ ప్రతిపాదన

కేజ్రీవాల్ బెయిల్‌పై స్టే

తాత్కాలికంగా నిలిపివేసిన ఢిల్లీ హైకోర్టు

2-3 రోజుల్లో నిర్ణయం వెలువరిస్తానన్న న్యాయమూర్తి 8





యోగా దినోత్సవం సందర్భంగా శుక్రవారం పరిహద్దుల్లో సైనికుల యోగాసనాలు

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

తీవ్ర విషాదం

తమిళనాడు కల్తీసారా ఘటనలో మృతుల సంఖ్య యాభైకి చేరింది. వందమందికి పైగా ఆస్పత్రిలో ఉన్నారు. కల్లకురిచ్చి జిల్లా కరుమాపుల గ్రామంలో జరిగిన ఈ దారుణంలో, మరో ముప్పైమంది పరిస్థితి ఇంకా తీవ్రంగా ఉందని అంటున్నారు. కుటుంబీకుల, బంధుమిత్రుల రోదనలు, మృతుల సామూహిక దహన సంస్కారాల దృశ్యాలు మనసు కలచివేస్తున్నాయి. జరిగిన ఘోరం మీద విపక్షాలు అధికార పక్షాన్ని తీవ్రంగా విమర్శించడం సహజం. ముఖ్యమంత్రి స్టాలిన్ నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ శాసన సభలో ఆందోళన చేస్తున్న విపక్ష సభ్యులను స్పీకర్ బహిష్కరించడం, అన్నాడీఎంకె, బీజేపీ వంటి పార్టీలు రాష్ట్రవ్యాప్త నిరసనలకు పిలుపు నివ్వడం వంటి రాజకీయ ప్రతిస్పందనలను చూస్తున్నాం. ఈ ఉదంతంపై సీబీఐ విచారణ జరిపించాలని రాష్ట్ర బీజేపీ అమిత్ షాను కోరుతున్నది. రాష్ట్రంలో కల్తీసారా ప్రవాహానికి డీఎంకే నాయకులు, కార్యకర్తలు కారకులని, వారి ఆశీస్సులతోనే అక్రమార్కులు రెచ్చిపోతున్నారనీ, సీబీఐ దర్యాప్తుతోనే సమగ్రప్రక్షాళన సాధ్యపడుతుందని బీజేపీ వాదన. సీబీసీఐడీకి ఈ కేసును అప్పగించిన స్టాలిన్ ప్రభుత్వం, జస్టిస్ గోకుల్‌దాస్ నేతృత్వంలో ఒక విచారణ కమిషన్ కూడా నియమించి, ఈ వ్యవహారంపై లోతైన దర్యాప్తు జరుగుతుందని హామీ ఇస్తున్నది.

పారిశ్రామిక విష రసాయనం మిథనాల్ కలిపిన ఈ సారాన్ని నిరుపేదలకు పోసిన కొందరు ఇప్పటికే అరెస్టయ్యారు. కల్తీసారా తయారీ ప్రధానకారకుడిని పదిరోజులక్రితమే పోలీసులు మద్యాన్ని అక్రమంగా విక్రయిస్తున్నందుకు అరెస్టు చేసి, ఆ తరువాత విడిచిపెట్టారని వార్తలు వచ్చాయి. ఇటువంటి దారుణాలు జరిగినప్పుడు ఊహించని అంశాలు చాలా వెలుగులోకి వస్తుంటాయి. కల్తీమద్యాన్ని తయారుచేసే, విక్రయించే వ్యక్తులు ఏళ్ళ తరబడి ఆ పనిచేయగలుగుతూంటే, వారికి అండగా నాయకులు, పోలీసులు నిలిచే వ్యవస్థ మనది. గత ఏడాది విల్లుపురం, చంగల్పట్టు జిల్లాల్లో ఇదే తరహా దారుణాలు జరిగి పాతిక మందికి పైగా మరణించిన ఘటన ప్రభుత్వాన్ని కానీ, అధికారులను కానీ కదల్చలేకపోయిందని అర్థం. ఇంకా చెప్పాలంటే ఆ ముందు మూడు సంవత్సరాల్లోనూ ఇటువంటి ఘటనలు జరిగాయి, పెద్ద సంఖ్యలో మరణాలు సంభవించాయి కూడా. ఇప్పుడు రాష్ట్రంలో ఎక్కడెక్కడ కల్తీసారా అమ్మకాలు జరుగుతున్నాయో తాను మార్చిలోనే అసెంబ్లీలో ప్రభుత్వాన్ని తెలియచేసి హెచ్చరించానని అన్నాడీఎంకె అంటోంది. కల్లకురిచ్చి, దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో కల్తీసారా అమ్మకాలపై పత్రికల్లో వరుస కథనాలు వచ్చిన విషయాన్ని కూడా చాలామంది గుర్తుచేస్తున్నారు. పాలకులు, అధికారులు కలసికట్టుగా ప్రదర్శించిన నిర్లక్ష్యం ఇప్పుడు యాభైమంది ప్రాణాలకు ముప్పు తెచ్చింది.

కలక్టర్‌ను బదిలీచేయడం, ఎస్పీని సస్పెండ్ చేయడం, కొందరు అధికారులను తప్పించడం వంటి చర్యలు తాత్కాలిక ఉపశమనాలే. ఏటా ఇటువంటి దారుణాలు జరుగుతున్నప్పుడు కూడా నిర్దిష్టమైన చర్యలు, నియంత్రణలు లేకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. పేదల ప్రాణాలంటే అందరికీ చులకనే. నేషనల్ క్రైమ్ రికార్డ్ బ్యూరో (ఎన్సీఆర్బీ) నివేదికల్లో కల్తీసారా మరణాల్లో తమిళనాడుకు స్థానం ఉంటుంది. కల్తీమద్యాన్ని తాగి పెద్ద సంఖ్యలో పేదలు ప్రాణాలు పోగొట్టుకుంటున్న ఘటనలు ఇప్పటికీ చాలా రాష్ట్రాల్లో జరుగుతున్నాయి. యూపీ, బిహార్‌లతో పాటు, గుజరాత్, పంజాబ్ లాంటి ఆర్థిక బలం ఉన్న రాష్ట్రాల్లోనూ ఈ ఘటనలకు తక్కువేమీ లేదు. మిథనాల్ తయారీ మీద చాలా ఆంక్షలు, నియంత్రణలు ఉన్నప్పటికీ, పరిశ్రమల నుంచి అది కల్తీసారా తయారీదారులకు అందుతున్నదంటే పోలీసుల, అధికారుల నిర్లక్ష్యం, ధనదాహం అందుకు కారణాలు.

ప్రభుత్వం విక్రయించే మద్యాన్ని కొనుగోలు చేసే ఆర్థికస్తోమతలేనివారు, ప్రధానంగా దినసరి కూలీలు అతితక్కువ ఖరీదుకు దొరికే ఈ కల్తీసారా తాగి తమ ఆరోగ్యాన్ని పాడుచేసుకుంటున్నారు. కల్తీ మద్యాన్ని నియంత్రించడంతో పాటు ప్రభుత్వం తాను విక్రయించే మద్యం ధరల విషయంమీద కూడా దృష్టిపెట్టాలి. కల్లకురిచ్చి ఘటనలో కన్నుమూసినవారంతా దళితులు, సామాజికంగానూ, ఆర్థికంగానూ వెనుకబడినవారు. జరిగిన ఘటననుంచి పాఠాలు నేర్చుకోవడం, భవిష్యత్తులో ఇటువంటివి పునరావృతం కాకుండా చూడటం ప్రభుత్వం విధి.

ఇది ప్రతిపక్షాల లోక్‌సభ!



■ పి. చిదంబరం

'పళని' పలుకు

పద్దెనిమిదవ లోక్‌సభ ఎన్నికల ఫలితాలు 16వ, 17వ లోక్‌సభల్లో లేనట్టి ఒక బలవత్తరమైన పార్లమెంటరీ ప్రతిపక్షాన్ని ప్రభవింపచేశాయి. గత రెండు సార్వత్రక ఎన్నికల (2014, 2019)ల్లో కాంగ్రెస్ ప్రధాన ప్రతిపక్షంగా ఉన్నది. అయితే ఆ సార్వత్రక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు వరుసగా కేవలం 44, 52 సీట్లు మాత్రమే లభించాయి. తత్కారణంగా లోక్‌సభలో ప్రతిపక్ష నేత హోదాను పొందలేకపోయింది. ఇతర బీజేపీ యేతర పక్షాలకు కాంగ్రెస్ కంటే ఇంకా తక్కువ సీట్లు మాత్రమే లభించాయి. తత్ఫలితంగా బీజేపీ, ఎన్నికలకు పూర్వమే ఆ పార్టీతో పొత్తు పెట్టుకున్న పార్టీలు, అప్రకటిత మిత్ర పక్షాల (వైఎస్ఆర్‌సీపీ, బిజూ జనతాదళ్) సంఖ్యా బలం, సభలో అయినదానికీ కానిదానికీ అవి చేసిన ఎడతెగని రభసలో ప్రతిపక్షం వాణి విన్పించకుండా పోయింది. మరింత స్పష్టంగా చెప్పాలంటే విపక్షం గొంతును పూర్తిగా నొక్కి వేశారు.

పాలక, ప్రతిపక్షాల సంఖ్యా బలాల్లో తీవ్ర తేడా ఉన్న దృష్ట్యా, మహోన్నత పార్లమెంటరీ సంప్రదాయాలను సభలో ఎలా నిలబెట్టుకోవాలనే విషయమై విద్యుక్త ధర్మ స్ఫూర్తితో ఆలోచించలేదు. కనీస మాత్రంగానైనా ఆ సంఖ్యా బలాల అసమతౌల్యతను పరిగణనలోకి తీసుకోలేదు. ఇక చెప్పేదేముంది? సభా కార్యకలాపాలు సరిగా సాగలేదు. చర్చలు జరగకుండానే బిల్లులు ఆమోదం పొందడం సాధారణమైపోయింది. ఈ శోచనీయ వాస్తవం సభలోని ప్రతిపక్షాలకే కాదు, సభ వెలుపలి చైతన్యశీల పౌరులకూ అర్థమయ్యేందుకు ఎంతో కాలం పట్టలేదు పార్లమెంటు ఉభయ సభలూ సమున్నత రీతిలో పనిచేయడం లేదని నిష్పాక్షిక పరిశీలకులు ఎందరో వాపోయారు.

భారత పార్లమెంటు ఘనమైన సంప్రదాయాలను పునరుద్ధరించేందుకు 2024 సార్వత్రక ఎన్నికల ఫలితాలు అటు పాలకపక్షం, ఇటు ప్రతిపక్షం రెండిటికీ ఒక మహదవకాశాన్ని కల్పించాయి. పార్లమెంటరీ ప్రజాస్వామ్యం రూపాన్ని మాత్రమే కాదు, దాని సారాన్ని సైతం సముదాత్తం చేసేందుకు మన ప్రజా ప్రతినిధులకు ఒక గొప్ప అవకాశం లభించింది. 236 మంది సభ్యులతో ప్రతిపక్షం సుదృఢంగా ఉన్నది. దేశ ప్రజల తరఫున ప్రభుత్వ వ్యవహారాలను నిశితంగా విమర్శించేందుకు, సరిదిద్దేందుకు ప్రతిపక్షానికి ఇదొక చక్కని అవకాశం.


సభా కార్యకలాపాలను ప్రతిపక్షాలు అడ్డుకోవడమనేది న్యాయబద్ధమైన పార్లమెంటరీ మార్గమని, అది 'ప్రజాస్వామ్యానికి పూర్తిగా అనుకూలమైనది' అని కీర్తిశేషుడు అరుణ్ జైట్లీ వాదించేవారు. ఆయన పదే పదే చేసిన వాదన ఒక కట్టుకథ. ఆ వాదనకు విరుద్ధమైనదే సత్యం, అదే ప్రజాస్వామ్య సమున్నతికి దోహదం చేసేది.

సరే, కొత్త లోక్‌సభలో ప్రతిపక్షం ఏమి చేయాలి? కాంగ్రెస్ మేనిఫెస్టో 2024 'న్యాయ్ పత్ర'తో ఉపక్రమించాలి. అందులో ఈ క్రింది హామీలు ఉన్నాయి: 'పార్లమెంటు ఉభయ సభలూ ఒక సంవత్సరంలో 100 రోజుల పాటు సమావేశమయ్యేలా చూస్తాం. గతంలో పరిఢవిల్లిన సమున్నత పార్లమెంటరీ సంప్రదాయాలను ఉభయ సభల్లో పునరుద్ధరించి నిష్ఠాబద్ధంగా పాటించేందుకు నిబద్ధమవుతాము'; 'ఒక వారంలో ఒక రోజును లోక్‌సభలోను, రాజ్యసభలోను ప్రతిపక్షాలు సూచించిన ఎజెండాపై చర్చించేందుకు పూర్తిగా వినియోగించేందుకు వాగ్దానం చేస్తున్నాం'; 'ఉభయ సభల సభాపతులు ఏ రాజకీయ పార్టీలతోను సంబంధాలు నిలుపుకోకుండా, తటస్థంగా ఉండేలా చేసి, 'సభాపతి సంభాషించడు' (స్పీకర్ డజ్ నాట్ స్పీక్) అనే ప్రజాస్వామ్య వ్యవస్థల్లో ఎల్లెడలా ఆమోదయోగ్యమైన ప్రమాణాన్ని పాటించేందుకు హామీ పడుతున్నాం'. ఈ వాగ్దానాలను నెరవేర్చేందుకు ఇండియా కూటమి దృఢ సంకల్పంతో నిబద్ధమవుతుంది.

పార్లమెంటు ఉభయ సభలూ ఏడాదికి 100 రోజుల చొప్పున సమావేశమవడం, వారంలో ఒక రోజు సభా కార్యకలాపాలను ప్రతిపక్షాల ఎజెండాపై చర్చకు పరిమితం చేయడం, తటస్థ సభాపతులు తదితర అంశాలపై బీజేపీకి ఎటువంటి ఆక్షేపణలు ఉండడానికి వీలులేదు.

నరేంద్ర మోదీ, ఆయన కారణంగా భారతీయ జనతా పార్టీ ఎన్నికల ఫలితాలు కలిగించిన దిగ్భ్రాంతి నుంచి తేరుకున్నట్టు కనిపిస్తున్నారు. బీజేపీకి 370, ఎన్డీఏకు 400కు పైగా సీట్లు తప్పక వస్తాయన్న పాలకపక్ష శ్రేణుల ఆశలు ఘోరంగా వమ్ము అయ్యాయి. బీజేపీకి 240 సీట్లు మాత్రమే దక్కగా ఎన్డీఏకు లభించిన సీట్లు 400కు లోపు మాత్రమే ఉన్నాయి. అయినప్పటికీ బీజేపీ అగ్రనాయకులు విజయోత్సవాలు జరుపుకునేందుకు ప్రయత్నించారు గానీ పార్టీ కార్యకర్తలు వారి ఆనందోత్సాహాలలో పాలు పంచుకోలేకపోయారు. 'మైనారిటీ సర్కార్ అనే (వెటకారపు) ముద్ర బీజేపీ నాయకత్వాన్ని వెంటాడుతూనే ఉంటుంది. దానిని తొలగించుకునేందుకు వారు శతథా ప్రయత్నిస్తారనడంలో సందేహం లేదు. ఈ ప్రయత్నాలలో భాగంగా వైఎస్ఆర్ సీపీ (నలుగురు సభ్యులు), ఆప్ (3), ఆర్ఎల్‌డీ (2), జేడీఎస్ (2), ఎజిపి (1), ఎజెఎస్‌యు (1), హెచ్ఎఎమ్ (1), ఎస్‌కేఎమ్ (1)లను బీజేపీ ప్రలోభపెట్టే అవకాశమున్నది. 12 మంది సభ్యులు గల జనతాదళ్ (యునైటెడ్) పార్టీ కూడా అందుకు మినహాయింపు కాబోదు. ఈ పార్టీలలో కొన్ని ఇప్పటికే ఎన్డీఏలో భాగస్వాములుగా ఉన్నాయి. అయినప్పటికీ వాటి సభ్యులను తన పక్షంలో మిళితం చేసుకునేందుకు బీజేపీ వెనుకాడబోదు (శివసేనకు ఏమయిందో ఒకసారి జ్ఞాపకం చేసుకోండి).

రాజ్యాంగం 10వ షెడ్యూలులో అనేక లొసుగులు ఉన్నాయి. వాటి ఆలంబనతో చిన్న పార్టీల ఎంపీలు సురక్షితంగా పార్టీ ఫిరాయింపునకు పాల్పడవచ్చు. తన సంఖ్యా బలాన్ని పెంచుకునేందుకు ఆ లొసుగులను బీజేపీ ఉపయోగించుకోకుండా ఉంటుందా? పాలక పక్షం కుటిల ప్రయత్నాలను ప్రతిఘటించేందుకు కాంగ్రెస్ మేనిఫెస్టో 2024 ఒక ప్రతిపాదన చేసింది: 'రాజ్యాంగం పదవ షెడ్యూలును సవరించి ఫిరాయింపుల (ఏ పార్టీ తరఫున లోక్‌సభ లేదా శాసనసభకు ఎన్నికైన ఎమ్మెల్యే, ఎంపీ)కు పాల్పడినవారు ఆటోమెటిక్‌గా శాసనసభ లేదా లోక్‌సభ సభ్యత్వానికి అనర్హులు అయ్యేలా చూస్తాము'.



ప్రతిపక్షాలు తామే ప్రభుత్వమన్న రీతిలో ప్రవర్తించాలి. పద్దెనిమిదవ లోక్‌సభలో తమకు లభించిన అవకాశాన్ని సంపూర్ణంగా ఉపయోగించుకుని ప్రభుత్వానికి పాలన సాగవలసిన తీరుతెన్నులను నిర్దేశించాలి. మెజారిటీ కొరవడిన బీజేపీ ప్రభుత్వం, కొత్త శక్తిమంతమైన ప్రతిపక్షానికి ఎలా ప్రతిస్పందించనున్నదో గమనించడం చాలా ఆసక్తికరంగా ఉంటుంది.

చెప్పవచ్చినదేమిటంటే రాజ్యాంగం పదవ షెడ్యూలుకు ప్రతిపక్షం ఒక సవరణను ప్రతిపాదించి తీరాలి. పాలక పక్షం ఆ సవరణ బిల్లును వ్యతిరేకించిన పక్షంలో ప్రజలు అధికార పార్టీని తప్పకుండా గర్హిస్తారు. ప్రజాస్వామ్యాన్ని భ్రష్టుపట్టించేందుకు పాలకులు పూనుకుంటున్నారన్న వాస్తవం వారికి విశదమవుతుంది. సరే, ఆర్థిక వ్యవస్థ నిర్వహణలో బీజేపీ పాలన చాలా దుర్బలంగా ఉందన్న విషయాన్ని మరి చెప్పనవసరం లేదు. మౌలిక సదుపాయాలను ఇతోధికంగా అభివృద్ధిపరచడంపై ఎవరికీ ఎటువంటి అభ్యంతరముండబోదు. అయితే కొత్త ఉద్యోగాల సృష్టి, ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడమే ఆర్థిక విధానాల లక్ష్యంగా ఉండి తీరాలి. నరేంద్ర మోదీ ప్రభుత్వం ఈ రెండు విషయాలలోను విఫలమయింది. తత్కారణంగానే ఓటర్ల తీర్పు బీజేపీ, ఎన్డీఏకు వ్యతిరేకంగా వచ్చింది. మరి బీజేపీ నాయకత్వం తన విధానపరమైన పొరపాట్లను సరిదిద్దుకుంటుందా లేదా అనే విషయం పార్లమెంటులో రాష్ట్రపతి ప్రసంగం, బడ్జెట్‌లో స్పష్టమవుతుంది.

కాంగ్రెస్ మేనిఫెస్టో 2024ను అనుసరించి ఉద్యోగాల విషయమై మోదీ ప్రభుత్వంపై కాంగ్రెస్, ఇండియా కూటమి తీవ్ర ఒత్తిడి తేవాలి: 'మేము గుత్తాధిపత్యాలను, ఆశ్రిత పెట్టుబడిదారీ విధానాన్ని వ్యతిరేకిస్తున్నాం'; 'ప్రభుత్వం నుంచి ప్రతి వ్యాపారవేత్త/ పారిశ్రామికవేత్తకు లభ్యం కాగల ఆర్థిక సహాయం, భౌతిక వనరులు, వ్యాపార అవకాశాలను ఏ ఒక్క కంపెనీ లేదా వ్యక్తి మాత్రమే పూర్తిగా స్వాయత్తం చేసుకోవడానికి వీలు లేకుండా చర్యలు చేపడతాం'; పెద్ద సంఖ్యలో ఉద్యోగాలను సృష్టించే వ్యాపార సంస్థలకు అనుకూలంగా మా విధాన ప్రాధాన్యాలు ఉంటాయి'; కేంద్ర ప్రభుత్వంలోను, దాని అనుబంధ ప్రభుత్వరంగ సంస్థలలో 30 లక్షల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలి'; కార్పొరేట్ కంపెనీలు పన్ను రాయితీలు పొందేందుకు షరతుగా కొత్త "ఎంప్లాయ్‌మెంట్ -లింక్‌డ్ ఇన్సెంటివ్" (ఇఎల్ఐ) పథకాన్ని ప్రారంభించాలి'; పట్టణ ప్రాంతాలలో మౌలిక సదుపాయాల పునర్నిర్మాణంలో పట్టణ పేదలకు ఉపాధి కల్పించేందుకు పట్టణ ఉపాధి హామీ పథకాన్ని ప్రారంభిస్తాం'; 'గ్రామ పంచాయతీలు, పురపాలక సంఘాల ద్వారా అమలయ్యే జలవనరుల పునరుద్ధరణ, బంజరు భూముల పునరుజ్జీవన కార్యక్రమాలను ప్రారంభించి నిరక్షరాస్యులు, అనిపుణ యువతకు ఉపాధి కల్పించాలి'.

ప్రతిపక్షాలు తామే ప్రభుత్వమన్న రీతిలో ప్రవర్తించాలి. పద్దెనిమిదవ లోక్‌సభలో తమకు లభించిన అవకాశాన్ని సంపూర్ణంగా ఉపయోగించుకుని ప్రభుత్వానికి పాలన సాగవలసిన తీరు తెన్నులను నిర్దేశించాలి. మెజారిటీ కొరవడిన బీజేపీ ప్రభుత్వం, కొత్త శక్తిమంతమైన ప్రతిపక్షానికి ఎలా ప్రతిస్పందించనున్నదో గమనించడం చాలా ఆసక్తికరంగా ఉంటుంది.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

సైద్ధాంతిక బలమే బీజేపీ విజయం

భారతదేశాన్ని 2014 నుంచీ పరిపాలిస్తున్న బీజేపీ దేశంలోనే అత్యంత శక్తిమంతమైన పార్టీగా అవతరించి మూడోసారి అధికార పగ్గాలు చేపట్టింది. సాంస్కృతిక జాతీయ వాద సంస్థగా ఎదిగి, తన విజయప్రస్థానాన్ని కొనసాగిస్తూ ఉంది. 1984లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కేవలం రెండు పార్లమెంట్ సీట్లును గెలిచిన బీజేపీ, నేడు దాదాపు దేశమంతా విస్తరించింది. పార్లమెంట్‌లోనూ, శాసనసభల్లోనూ సభ్యులపరంగా, ప్రాతినిధ్యం రీత్యా చూస్తే ప్రపంచంలో అతి పెద్ద పార్టీగా అవతరించి ఉండవచ్చు. సిద్ధాంత రీత్యా బీజేపీని ఇవాళ ఒక విశిష్టమైన పార్టీగా మనం పరిగణించాలి.

బీజేపీని భారత్‌లో రెండో శక్తిమంతమైన పార్టీ వ్యవస్థగా రాజకీయ విశ్లేషకుడు సుహాస్ పాల్‌శిఖర్ వివరించారు. 1984లో రాజీవ్‌గాంధీ ప్రభుత్వం సంపూర్ణ ఆధిక్యం సాధించిన తర్వాత, ఆ ఘనత సాధించిన తొలి పార్టీ బీజేపీయే. ఇందిరాగాంధీ తర్వాత, దేశవ్యాప్తంగా అదే స్థాయిలో ప్రజాదరణ కలిగిన నాయకుడు మోదీనే అని సుహాస్ చెప్పారు.

మోదీకి ఉన్న ప్రజాదరణతోపాటు కేంద్రీకృత హిందూ ఓటు బ్యాంకు, సాంస్కృతిక జాతీయ వాదం, అభివృద్ధి, ఆచరణ.. తదితర అంశాలే బీజేపీ విజయ రహస్యాలని చెప్పవచ్చు. వెనక్కి తిరిగి చూడాల్సిన అవసరం లేనంతగా నేడు ప్రజల్లో బీజేపీకి మద్దతు పెరిగింది. మోదీ ప్రజాదరణకు గల కారణాలను గమనిస్తే నిబద్ధత గల వ్యక్తిగత జీవితంతో పాటు ప్రభుత్వ పథకాల్లో పారదర్శకత, నీతి నిజాయితీలతో కూడిన సుపరిపాలన, దృఢమైన నిర్ణయాలు తీసుకోగల సామర్థ్యం వంటివెన్నో చెప్పవచ్చు. భారతదేశంలోనే గాక ప్రపంచంలోనే అత్యంత ప్రజాదరణ ఉన్న నేతగా మోదీ గుర్తింపు పొందారు. ఇక కేంద్రీకృత హిందూ ఓటు బ్యాంక్ నిర్మాణం అంశానికి వస్తే, బీజేపీ మేనిఫెస్టోలో భారతీయుల చిరకాల స్వప్నమైన రామమందిర నిర్మాణ సాకారం చేయటంలో ఆ పార్టీ సఫలీకృతం అయింది. ఇది అత్యధిక హిందువులను బీజేపీకి ఓటు వేసేలా చేసింది. మెజార్టీ హిందువుల హక్కులను పక్కన పెట్టే పార్టీలకు ఒక చెంపపెట్టులా సామరస్య వాతావరణంలో మందిర ప్రాణప్రతిష్ఠ అద్భుతంగా జరిగింది. సాధారణ ప్రజల్లోకి రామ మందిరం అంశం వెళ్ళిపోయింది. మూడవ ప్రధాన విషయం బీజేపీ ఒక సైద్ధాంతిక భూమిక ఆధారంగా నిలబడిన, కార్యకర్తల బలం గల విలక్షణ పార్టీ. ఆ సిద్ధాంతం సాంస్కృతిక జాతీయవాదం. తమ సిద్ధాంత మూలాలను బీజేపీ ఏనాడూ విస్మరించలేదు. దాన్లో భాగంగానే ఆర్టికల్ 370 రద్దు, ట్రిపుల్ తలాక్ రద్దు, రామమందిర పునః నిర్మాణం, సీఏఏ వంటివి సాధించింది.



బీజేపీ ఒక సైద్ధాంతిక భూమిక ఆధారంగా నిలబడిన, కార్యకర్తల బలం గల విలక్షణ పార్టీ. ఆ సిద్ధాంతం సాంస్కృతిక జాతీయవాదం. తమ సిద్ధాంత మూలాలను బీజేపీ ఏనాడూ విస్మరించలేదు. దాన్లో భాగంగానే ఆర్టికల్ 370 రద్దు, ట్రిపుల్ తలాక్ రద్దు, రామమందిర పునః నిర్మాణం, సీఏఏ వంటివి సాధించింది.

సాంస్కృతిక జాతీయవాద సిద్ధాంతం ఎవ్వరినీ వ్యతిరేకించేది కాదు. అభివృద్ధిలో అందరినీ భాగస్వామ్యం చేసేదే. బీజేపీ సిద్ధాంతకర్త పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ ప్రవచించిన ఏకాత్మత మానవతావాదంలో మానవునిపై చర్చ ఉందే గానీ మనుషులను విభజించే అంశాలు లేవు. సమాజంలో కింది స్థాయిలో ఉన్న వ్యక్తులకు సంక్షేమ ఫలాలు చేరాలి, కనీస అవసరాలు తీరాలి అన్నది క్లుప్తంగా ఏకాత్మ మానవతా వాదంలో ఉన్న లక్ష్యం. ఇదే పనిని పదేళ్లుగా బీజేపీ చేస్తుంది. ఇకముందూ చేస్తుంది.

'ఐక్యతపై ఎక్కువ దృష్టి కేంద్రీకరించడమే బీజేపీ, ఆరెస్సెస్‌ల విజయానికి మూల కారణమని రాజకీయ విశ్లేషకుడు వినయ్ సీతాపతి తన కొత్త పుస్తకం 'జుగల్‌బంది: ద బీజేపీ బిఫోర్ మోదీ'లో రాసుకొచ్చారు. 'శక్తిమంతమైన హిందువులు ఓడిపోవడానికి ఒకరికి ఒకరు వెన్నుపోటు పొడుచుకోవడమే కారణం. ఐక్యత లేకపోవడం వల్లే హిందువులు ఓడిపోయారు' అని అని అశోక యూనివర్సిటీలో పొలిటికల్ సైన్స్ ప్రొఫెసర్ అయిన సీతాపతి చెప్పుకొచ్చారు. ఇదే పుస్తకంలో బీజేపీకి సైద్ధాంతిక ప్రేరణ ఇచ్చే మాతృసంస్థ గురించి చెప్తూ, 'ఆరెస్సెస్ సభ్యులతో చేయించే కసరత్తులు కేవలం కసరత్తులు మాత్రమే కాదు. వీటిని అందరితో కలిపి చేయిస్తారు. కలసి మార్చ్ చేయడం, పిరమిడ్ ఆకారంలో నిలబడటం లాంటివి చేయిస్తారు. బృంద స్ఫూర్తిని పెంచేందుకు ఆడించే ఆటలను ఆడిస్తారు. ముఖ్యంగా ఐక్యత ప్రాధాన్యం చెప్పడానికే ఇవన్నీ చేయిస్తారు. ఈ ఐక్యత సంస్థకు ఒక సిద్ధాంతం లాంటిది. ఈ మద్దతుదారులు సాధారణ పార్టీల మద్దతుదారుల్లాంటివారు కాదు' అని సీతాపతి చెప్పారు. 'భారత్‌లో 80 శాతానికి పైగా ఉండే హిందువులను ఏకం చేయడమే బీజేపీ లక్ష్యం. అందుకే కులాలకు పార్టీ అంత ప్రాధాన్యం ఇవ్వదు' అని ఆయన ఆ గ్రంథంలో వివరించారు.

భారత్‌లో రాజకీయ పార్టీలను ప్రజాదరణ కలిగిన నాయకులు, సిద్ధాంతాలు, కులాలు ముందుకు నడిపిస్తుంటాయి. అసమ్మతి, అంతర్గత కలహాలు సర్వసాధారణం. పై స్థాయి నాయకుల్లో విభేదాలతో పార్టీలు చీలుతుంటాయి. కాంగ్రెస్ నుంచి వేరుపడిన చాలా మంది నాయకులు ఇలానే ప్రాంతీయ పార్టీలను పెట్టారు. కానీ, బీజేపీలో ఇప్పటివరకు ఇలాంటివేమీ జరగలేదు. డాక్టర్ శ్యామప్రసాద ముఖర్జీ, పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ అనంతరం అటల్ బిహారీ వాజ్‌పేయి, అడ్వాణీ, ప్రస్తుతం నరేంద్ర మోదీ, హోంశాఖ మంత్రి అమిత్ షా, పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా.. ఇలాంటి నాయకులందరూ పార్టీని ఐక్యతతో నడిపించారు, నడిపిస్తున్నారు.

బీజేపీని ఒక అసాధారణ పార్టీగా రాజకీయ విశ్లేషకుడు మిలన్ వైష్ణవ్ అభివర్ణించారు: 'హిందూ జాతీయవాద సంస్థల రాజకీయ పార్టీగా బీజేపీని చెప్పుకోవచ్చు. ఈ పార్టీని అనుబంధ సంస్థల నుంచి వేరు చేయడం చాలా కష్టం. ఈ సంస్థల నుంచి బీజేపీకి చాలా మద్దతు వస్తుంది. పార్టీ నుంచి ఎవరూ బయటకు పోకుండా ఈ సంస్థలే కాపాడుతుంటాయి' అని ద కార్నెగీ ఎండోమెంట్ ఫర్ ఇంటర్నేషనల్ పీస్ ఇన్ వాషింగ్టన్‌లో పరిశోధకుడైన వైష్ణవ్ చెప్పారు. 'బీజేపీ నుంచి అసమ్మతివాదులు బయటకు వెళ్లరని కాదు. అయితే, బయటకు వెళ్లినవారు రాజకీయంగా పెద్దగా విజయం సాధించలేరు. మళ్లీ పార్టీలోకి వచ్చేస్తారు. ఎందుకంటే బీజేపీ ఒక సైద్ధాంతిక పార్టీ. సిద్ధాంతాలే ఈ పార్టీని కలిపి ఉంచుతున్నాయి', అని 'ఐడియాలజీ అండ్ ఐడెంటిటీ' పుస్తక రచయిత, రాజకీయ విశ్లేషకుడు రాహుల్ వర్మ చెప్పారు. రాజకీయాల్ని బీజేపీ అధికారం కోసం చేయదు, దేశం కోసం చేస్తుంది అన్నది రాజనీతి తెలిసిన విజ్ఞుల అభిప్రాయం. మూడోసారి అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం మరిన్ని కఠిన నిర్ణయాలతో దేశాన్ని ముందుకు తీసుకువెళ్తుందని ఆశిద్దాం.

● కొట్టె మురళీకృష్ణ

ఇజ్రాయెల్‌తో విద్యా ఒప్పందాలు వద్దు

గాజాలో పాలస్తీనియన్లకు వ్యతిరేకంగా ఇజ్రాయెల్ సైన్యం పాల్పడుతున్న 'జాతి సంహారం'ను హైదరాబాద్ లోని నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు, అధ్యాపకులు తీవ్రంగా ఖండించారు. ముఖ్యంగా నసేయిరత్ శిబిరంపై కిరాతక దాడికి చలించిపోయిన నల్సార్ విద్యార్థులు, అధ్యాపకులు ఇజ్రాయెల్‌తో విద్యా విషయక సంబంధాలను పూర్తిగా తెగతెంపులు చేసుకోవాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 15న నల్సార్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్‌కు ఒక లేఖ రాశారు. స్టూడెంట్ బార్ కౌన్సిల్ కార్యవర్గ సభ్యులు ఎల్ఎల్‌బి, ఎల్ఎల్ఎమ్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ విద్యార్థులు, విశ్వవిద్యాలయ పూర్వ విద్యార్థులు, 12 మంది అధ్యాపకులతో సహా మొత్తం 362 మంది ఆ లేఖపై సంతకాలు చేశారు.

గాజాలో సాగుతున్న మారణకాండ 'జాతి సంహారమే' నని లొవెన్ స్టెయిన్ హ్యూమన్ రైట్స్ ప్రాజెక్ట్, యేల్ లా స్కూల్ ద హేగ్‌లోని అంతర్జాతీయ న్యాయస్థానం మొదలైనవి నిర్వంద్వంగా ఖండించాయని నల్సార్ విద్యార్థుల లేఖ పేర్కొంది. ఆ లేఖలో ఇంకా ఇలా ఉంది: అక్టోబర్ 7, 2023, మే 2024 మధ్య కనీసం 36,743 మంది పాలస్తీనియన్లను ఇజ్రాయెల్ హతమార్చింది. కనీసం మరో 86,727 మంది తీవ్రంగా గాయపడ్డారు. హతమారిపోయిన పాలస్తీనియన్లలో దాదాపు 15 వేల మంది బాలలే. గాజా జనాభాలో 75 శాతం (1.7 మిలియన్) మందికి పైగా పౌరులు పూర్తిగా నిర్వాసితులయ్యారు. ఆకలిదప్పులు, పోషకాహార లోపంతో ఈ అభాగ్యులూ క్రమంగా చనిపోతున్నారు. ఈ నేపథ్యంలో, విద్యా సంస్థల పాత్ర గురించి మేము ఒక అంచనాకు రావడం అనివార్యమయింది. గాజాలో సాగుతున్న ఘాతుకాలలో ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ భాగస్వాములు అవుతున్న ఇజ్రాయెలీ విద్యా సంస్థలతో పూర్తిగా తెగతెంపులు చేసుకోవాలని మేము డిమాండ్ చేస్తున్నాం. అంతర్జాతీయ అకడమిక్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్ కింద రెండు ఇజ్రాయెలీ విశ్వవిద్యాలయాలతో నల్సార్‌కు సంబంధాలు ఉన్నాయి. అవి: రాడ్ జినెర్ స్కూల్ ఆఫ్ లా, రెయిష్ మాన్ యూనివర్శిటీ; బచ్‌మన్ స్కూల్ ఆఫ్ లా, టెల్ అవీవ్ యూనివర్శిటీ. ఈ ఉన్నత విద్యా సంస్థలతో సంబంధాలు తెంచుకోవడం వల్ల వాటి అకడమిక్ ప్రతిష్ఠపై ఎటువంటి ప్రభావం ఉండబోదన్న వాదన ఒకటి వినిపిస్తోంది. అయితే ఇజ్రాయెల్‌ను అకడమిక్‌గా బాయ్‌కాట్ చేయడమనేది ఇజ్రాయెల్‌పై అంతర్జాతీయ ఒత్తిడిని మరింతగా పెంపొందించడమే కాకుండా 'విద్యా విషయక స్వేచ్ఛ' (అకడమిక్ ఫ్రీడమ్) పట్ల నిబద్ధతకు తార్కాణమవుతుంది. టెల్ అవీవ్ యూనివర్శిటీ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో గాజాలో దాడులకు సహకరిస్తోంది. గాజాలో ఇజ్రాయెల్ ప్రభుత్వ చర్యలను పూర్తిగా సమర్థిస్తున్న ప్రొఫెసర్ అహరాన్ బరాక్ లో రాడ్జినెర్ స్కూల్ ఆఫ్ లాలో ఆచార్యుడుగా ఉన్నారు. సమున్నతమైన అకడమిక్ విలువలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ఈ రెండు యూనివర్శిటీలతో అకడమిక్ సంబంధాలకు స్వస్తి చెప్పితీరాలి. లేనిపక్షంలో మానవ హక్కుల రక్షణ, విద్యా విషయక స్వేచ్ఛ, ప్రగతిశీల ఆలోచన విషయంలో నల్సార్ పేరుప్రతిష్ఠలు సార్థకమైనవి కావని మేమే కాకుండా విశాల సమాజమూ భావించవలసి వస్తుంది.

– **ఫైజన్ ముస్తాఫా**, మాజీ వైస్‌ఛాన్సలర్, **డాక్టర్ హెచ్.వాగీశన్; నిపుణవర్మన్, అంశుల్ ఇజాజ్** (పూర్వ విద్యార్థులు); **అఖిల పూజారి, బర్ఖా సింగ్** (విద్యార్థులు)

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

ఉపాధి స్వప్నం చిగురిస్తున్నది!

జగన్ ప్రభుత్వ పతనం వెనక ఉన్న బలమైన కారణాల్లో నిరుద్యోగుల ఆగ్రహం ముఖ్యమైనది. మాట ఇస్తే మడమ తిప్పడం తెలియని నేతగా భజన చేయించుకున్న జగన్ తమ పాలనలో ప్రతి ఏటా జనవరిలో జాబ్ క్యాలెండర్ అంటూ గొప్పలకు పోయారు. కానీ ఇచ్చిన హామీని నిలుపుకునే ప్రయత్నమే చేయలేదు.

2018 నాటి ఎన్నికల ప్రచార సభల్లో దేవుడి దయ, మీ చల్లని దీవెనలతో మనందరి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ పెడతామని చెప్పి అధికారంలోకి వచ్చి మెగా దగా చేశారు. ఎన్నికలకు కొద్ది రోజుల ముందు తూతూ మంత్రంలా 6 వేల పోస్టులకి ఒక డీఎస్సీ ప్రకటన చేసి చేతులు దులుపుకున్నారు. ఆ నియామక ప్రక్రియ పూర్తి అవుతుందనే నమ్మకం ఏ ఒక్క అభ్యర్థికి లేదంటేనే జగన్ మోసపు తీవ్రత ఏ పాటిదో అర్థం చేసుకోవచ్చు. జగన్ అధికారం చేపట్టకముందు ఖాళీగా ఉన్న పోస్టులు, అనంతరం పదవీ విరమణల ద్వారా ఖాళీ అయిన పోస్టులు, అన్నీ కలిపి మొత్తం 3 లక్షలకు పైగా ఉద్యోగాలు నియామకాల కోసం ఎదురుచూస్తున్నా తన ఐదేళ్ల పాలనా కాలంలో అటువైపు దృష్టి పెట్టలేదు.

విద్యా వ్యవస్థను సమూలంగా మార్పు చేస్తున్నామని ఊదరగొట్టిన జగన్ 'నాడు – నేడు' పేరుతో వేల కోట్లు వృథా చేశారు. పాఠశాల ఆధునీకరణ పేరుతో అనుయాయులకు దోచి పెట్టారు. అమ్మ ఒడి పేరుతో ప్రకటించిన పథకం ద్వారా లబ్ధిదారులకి ఇచ్చిన డబ్బులోనూ కోతలు పెట్టారు, ఆ సొమ్మును ఎలా ఖర్చు చేసారో ఎవ్వరికీ తెలియదు. నిజంగా ప్రభుత్వ బడులపై అంత చిత్తశుద్ధి ఉండి ఉంటే వందల పాఠశాలలు మూతపడేవి కావు. కేంద్రం తెచ్చిన న్యూ ఎడ్యుకేషన్ పాలసీలో ఏమి ఉందో చూడకుండా మోదీ మెప్పు కోసం అందరికన్నా ముందే అమలుకు పూనుకున్నారు. మరో వైపు ఇంగ్లీష్ మీడియంతో పాటు కోరుకున్న విద్యార్థులకు తెలుగు మీడియం కూడా ఉంచండి మహా ప్రభో అని వివిధ సంస్థలు ఏకరవు పెట్టినా లెక్క చేయలేదు. ఈ నిర్ణయం రాజ్యాంగ వ్యతిరేకమన్నా పెడచెవిన పెట్టారు. పైగా ఇలా అంటున్న వారంతా పేదలకు ద్రోహం చేసేవారని ప్రచారం చేశారు.



నిరుద్యోగ యువతలో ఐదేళ్లుగా గూడు కట్టుకుంటూ వచ్చిన ధర్మాగ్రహం సార్వత్రిక ఎన్నికల సమయానికి ప్రభుత్వ వ్యతిరేక ఓటుగా మారింది. ఇదే తరుణంలో అభివృద్ధి, సంక్షేమం రెండు చక్రాలుగా పాలన సాగించగలరనే ఆశతో, నమ్మకంతో నిరుద్యోగ యువత చంద్రబాబు వైపు చూసింది.

ఉన్న ఉపాధ్యాయుల్లో ఇంగ్లీష్ సమర్థతను బేరీజు వేయకుండా, కొత్తగా ఒక్క ఉపాధ్యాయ నియామకం కూడా చేయకుండా తామేదో మొత్తం విద్యా రంగాన్ని ఉద్ధరిస్తున్నట్లు ప్రచారం చేసుకున్నారు. ఉపాధ్యాయులు తరగతి గదిలో పాఠాలు చెప్పటానికి సమయాన్ని సర్దుబాటు చేసుకోవాల్సి వచ్చేలా వారిపై బోధనేతర పనుల భారం మోపారు.

మరో వైపు జగన్ పాలనలో యూనివర్సిటీలు రాజకీయ కేంద్రాలుగా, అధికార పార్టీకి సంబంధించిన కార్యాలయాలుగా తయారయ్యాయి. ప్రతిష్ఠాత్మక ఆంధ్ర విశ్వ కళా పరిషత్ (ఏయూ) అక్కడి ఉపకులపతి ప్రసాదరెడ్డి వ్యవహారశైలి కారణంగా నిత్యం వార్తల్లోకి ఎక్కింది. యూనివర్సిటీని సొంత సామ్రాజ్యంగా చేసుకొని, పరిపాలన భవనం చుట్టూ మూడంచెల కంచె ఏర్పాటు చేసుకొని, దాన్నో ప్రత్యేక దేశం మాదిరి మార్చుకున్నారు. ప్రశ్నించిన వారిని ఉద్యోగాల నుంచి తొలగించారు. దాదాపు 200 మంది టీచింగ్ అసిస్టెంట్ల పొట్టలు కొట్టి వైసీపీ అనుచరులను యూనివర్సిటీలోకి తెచ్చిపెట్టుకున్నారు. యూనివర్సిటీకి ఏ మాత్రం సంబంధం లేని అనుచరుడి కోసం ఏకంగా ఒక పీఠం ఏర్పాటు చేసి అందులో నియమించారు. కొద్ది కాలానికే నిబంధనలు తుంగలో తొక్కి సదరు వ్యక్తిని యూనివర్సిటీకి రిజిస్ట్రార్ బాధ్యతలు అప్పగించారు. శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీలో వీసీ పదవి తాము అనుకున్నవారికి దక్కడం కోసం నియమ నిబంధనలనే మార్పు చేశారు.

చివరికి యూనివర్సిటీలు అన్నీ శాశ్వత నియామకాలు లేక మూతపడే స్థాయికి జారుకున్నాయి. ఉన్నవారంతా తాత్కాలిక అధ్యాపకులే. వారికి పరిశోధన చేయించే అవకాశం లేక పరిశోధనా రంగం కుంటుపడింది. దాదాపు మూడు వేలకు పైగా అధ్యాపక పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. దీన్ని కూడా వాడుకోవడం కోసం ఎన్నికల సమయానికి ఒక మోసకారి నోటిఫికేషన్ ఇచ్చారు. అది తప్పుల తడక నోటిఫికేషన్. 42 వేల మంది అభ్యర్థుల నుంచి రుసుము రూపేణా సుమారు రూ.40కోట్లకు పైగా ఉన్నత విద్యాశాఖకు ఆదాయం లభించడం తప్ప ఇంకే ప్రయోజనం లేదు. ఆ నోటిఫికేషన్‌లోని తప్పుల విషయంలో హైకోర్టు అడిగిన ప్రశ్నలకు ఉన్నత విద్యాశాఖ సమాధానాలు చెప్పలేకపోయింది.

ఈ తరహా నిరుద్యోగ, యువజన వ్యతిరేక విధానాల కారణంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లోనే చెంప పెట్టు లాంటి తీర్పు ఇచ్చినా అబ్బే అదేం లేదనే రీతిలో బుకాయించడంతో పాటు మరింతగా కన్ను మిన్ను కానకుండా వ్యవహరించారు. నిరుద్యోగ యువతలో ఐదేళ్లుగా గూడు కట్టుకుంటూ వచ్చిన ధర్మాగ్రహం సార్వత్రిక ఎన్నికల సమయానికి ప్రభుత్వ వ్యతిరేక ఓటుగా మారింది. ఇదే తరుణంలో అభివృద్ధి, సంక్షేమం రెండు చక్రాలుగా పాలన సాగించగలరనే ఆశతో, నమ్మకంతో నిరుద్యోగ యువత చంద్రబాబు వైపు చూసింది.

కొత్త ప్రభుత్వం కొలువుతీరగానే ఇచ్చిన హామీ మేరకు తొలి సంతకం, చివరి సంతకం యువతను ప్రభావితం చేసే అవకాశం ఉంది. పదహారు వేలకు పైచిలుకు ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం మెగా డీఎస్సీపై ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు మొదటి సంతకం పెట్టేశారు. డిసెంబర్ చివరికి ఆ ప్రక్రియ పూర్తి కావాలనే దిశానిర్దేశం కూడా ఉండటంతో సంతకం పెట్టీ పెట్టగానే డీఎస్సీ కోసం ఆశగా ఎదురు చూస్తున్న వేలాదిమంది యువత కోచింగ్ సెంటర్ల వైపు కదలడం మొదలయింది. ఉన్నత విద్యకి సంబంధించి మనుగడ ప్రశ్నార్థకం అయిన ఈ తరుణంలో యూనివర్సిటీలను కాపాడుకోవడాన్ని కూడా ప్రభుత్వం ప్రాధాన్యత గల అంశాల్లో ఒకటిగా చూడాలి. ఖాళీగా ఉన్న ఆచార్యుల పోస్టులను భర్తీ చేయాలి. ప్రభుత్వ రంగంతో పాటు ప్రయివేటు రంగాన్ని కూడా విస్తృతపరిచే సామర్థ్యం చంద్రబాబుకు ఉన్నదని చాలా మందికి ఉన్న విశ్వాసం. అది చేయగలిగితే ఆ రంగంలోనూ ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. అన్నిటికన్నా ప్రధానమైనది నైపుణ్య గణనపై పెట్టిన ఐదో సంతకం. విద్యార్థులు, నిరుద్యోగ యువతలో నిక్షిప్తమై ఉన్న నైపుణ్యాలని వెలికితీయడమే ప్రధాన ఆశయంగా చేసిన ఈ ఐదో సంతకం పట్ల కూడా సానుకూలత వ్యక్తం అవుతున్నది. ఎవరిలో ఏ సామర్థ్యం ఉందో తెలుసుకోవడం, ఆ దిశగా మరింత శిక్షణ ఇచ్చి తగిన ఉపాధి అవకాశాల కల్పనకు శ్రీకారం చుట్టడం మంచి ఆలోచనే. ఇక అవకాశం ఉన్న మండల కేంద్రాలు, పట్టణాల్లో వర్కింగ్ స్టేషన్లు అనే ఆలోచన కూడా మంచి ఫలితాలను ఇవ్వాలని, ఉపాధి కల్పన ఆరంభ శూరత్వంగా మారకుండా ప్రభుత్వానికి నిత్యకృత్యమైన చర్య కావాలని ఆశిద్దాం.

■ డాక్టర్ సి.ఎన్. క్షేత్రపాల్ రెడ్డి

పిఓడబ్ల్యు అర్ధ శతాబ్ది ఉత్సవ సభ

ఉస్మానియా విశ్వవిద్యాలయ విద్యార్థినుల చొరవతో 1974లో అభ్యుదయ మహిళా సంఘం (పిఓడబ్ల్యు) ఏర్పడింది. ప్రణాళిక స్ఫూర్తితో ఏర్పడిన నాలుగు ప్రగతిశీల మహిళా సంఘం సంస్థలు రెండు తెలుగు రాష్ట్రాలలో మహిళా సమస్యలపై పోరాటాలు చేస్తున్నాయి. ఈ సంస్థలన్నీ గత నాలుగు దశాబ్దాలుగా స్త్రీలపై బహుముఖ రూపాలలో కొనసాగుతున్న జండర్ వివక్ష, హక్కుల అణచివేత, హింసలకు, పితృస్వామిక ఆధిపత్య సంస్కృతికి వ్యతిరేకంగా, పెట్టుబడిదారీ నయా ఉదారవాద ఆర్థిక విధానాలను ప్రశ్నిస్తూ ఉద్యమాలని నిర్మిస్తున్నాయి. అవిభాజ్య తెలుగు రాష్ట్రంలో జరిగిన చారిత్రక సారా, మద్యం వ్యతిరేక ఉద్యమంలో పిఓడబ్ల్యు సంస్థల నాయకత్వంలో మహిళలు పోరాడారు. దళిత మహిళల భూపోరాటాలను, సాయుధముఠా నాయకుల హత్యా రాజకీయాలకు వ్యతిరేకంగా ప్రజాస్వామిక ఉద్యమాలను ఈ సంస్థలు నిర్మించాయి. విద్యా, ఉద్యోగ, చట్టసభలలో 50శాతం రిజర్వేషన్ల కోసం, పట్టణ ప్రాంతాలలో పేద ప్రజల నివాస హక్కుల కోసం పోరాటాలు చేశాయి.

భావసారూప్యత కలిగిన మహిళా సంస్థలన్నీ ఒక తాటి మీదకు రావాలనే అభిప్రాయం గత ఏడాది జరిగిన సమావేశంలో వ్యక్తమయింది. ఆ స్ఫూర్తితో 2024 జూన్ 22న జరగబోయే పిఓడబ్ల్యు అర్ధ శతాబ్ది ఉత్సవ ముగింపు సభను అన్ని సంఘాలు కలిసి ఒకే వేదిక నుంచి ఉమ్మడిగా నిర్వహించాలని నిర్ణయించుకుని, ఒక సమన్వయ కమిటీని ఏర్పాటు చేసుకున్నాయి.

ఈ క్రమంలో, నాలుగు పిఓడబ్ల్యు సంస్థల భాగస్వామ్యంతో నేడు హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని ప్రెస్ క్లబ్‌లో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ముగింపు సభ జరుగుతుంది. అంతకు ముందు లిబర్టీ అంబేడ్కర్ విగ్రహం నుంచి బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్ వరకు ప్రదర్శన ఉంటుంది. అనంతరం జరిగే సభలో ప్రముఖ స్వతంత్ర జర్నలిస్ట్, రచయిత్రి, భాషా సింగ్ ముఖ్య అతిథిగా పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో ప్రొ. రమ మేల్కొటే, ప్రొ. శ్యామల, ప్రొ. లక్ష్మీ, కాత్యాయిని (చూపు) తదితర మహిళా మేధావులు పాల్గొని ప్రసంగిస్తారు. అంబిక, పిఓడబ్ల్యు అర్ధ శతాబ్ది సమన్వయ కమిటీ, జి. ఝాన్సీ, వి. సంధ్య, చంద్ర అరుణ, సుజ్ఞానమ్మ వక్తలుగా పాల్గొంటారు.

– పిఓడబ్ల్యు అర్ధ శతాబ్ది వార్షికోత్సవ సమన్వయ కమిటీ

• ప్రమాణ శ్రీకారం

అరుదైన ఘట్టం ఆవిష్కృతమైంది. కౌరవ సభ వీడి.. గౌరవ సభలో అడుగుపెట్టిన టీడీపీ కూటమి ఎమ్మెల్యేలు శుక్రవారం సగర్వంగా ప్రమాణం చేశారు. మన జిల్లా నుంచి కొలికపూడి శ్రీనివాసరావు (తిరువూరు), శ్రీరాం తాతయ్య (జగ్గయ్యపేట), తంగిరాల సౌమ్య (నందిగామ), వసంత వెంకట కృష్ణప్రసాద్ (మైలవరం), గద్దె రామ్మోహన్ (విజయవాడ తూర్పు), బొండా ఉమామహేశ్వరరావు (విజయవాడ సెంట్రల్) టీడీపీ ఎమ్మెల్యేలు సహా సుజనా చౌదరి (విజయవాడ పశ్చిమ) బీజేపీ ఎమ్మెల్యే శాసనసభలో ప్రమాణస్వీకారం చేశారు.









తనిఖీలు



నగరంలోని ప్రభుత్వ వెనుకబడిన తరగతుల బాలుర వసతి గృహాలను రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

4లో..

తొలి అడుగు

మల్లవల్లిలో మొదలైన పారిశ్రామికాభివృద్ధి



90 శాతం పనులు జరిగి ఐదేళ్లుగా అనాథగా మిగిలి ఉన్న రైల్‌నీర్ ప్రాజెక్టు

టీడీపీ కూటమి ప్రభుత్వ రాకతో పారిశ్రామిక అడుగులు వడివడిగా పడుతున్నాయి. నిన్నమొన్నటి వరకూ ఎవరికీ కాకుండా మూలనపడి ఉన్న మల్లవల్లి పారిశ్రామికవాడలోకి పరిశ్రమలు ఒక్కొక్కటిగా క్యూ కడుతున్నాయి. తాజాగా ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) నేతృత్వంలో రైల్‌నీర్ బాట్లింగ్ ప్లాంట్ పునరుద్ధరణ పనులు ప్రారంభంకావడం రాజధానికి శుభసూచకమేనని పారిశ్రామిక విశ్లేషకులు చెబుతున్నారు.

* రైల్‌నీర్ బాట్లింగ్ ప్లాంట్ పనులు పునరుద్ధరణ
* మెహై ఆక్వాకు బాధ్యతలు అప్పగించిన ఐఆర్‌సీటీసీ
* కొత్త ప్రభుత్వ రాకతో శరవేగంగా పనులు
* ఆగస్టులో ట్రయల్ రన్.. ఆ తర్వాత ప్రారంభోత్సవం
* ఐదేళ్లుగా అనాథగా మిగిలిపోయిన ప్రాజెక్టుకు జీవం



పరిశ్రమ లోపల మెషినరీ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/హనుమాన్ జంక్షన్ రూరల్) : మల్లవల్లి మోడల్ ఇండస్ట్రియల్ పార్కులో మరో మధ్య తరహా పరిశ్రమ సాకారంకానుంది. ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) నేతృత్వంలో రైల్‌నీర్ బాట్లింగ్ ప్లాంట్ పునరుద్ధరణ పనులు ప్రారంభమయ్యాయి. ఐదేళ్లుగా మల్లవల్లిలో రైల్‌నీర్ బాట్లింగ్ ప్లాంట్ పనులు అడుగు కూడా ముందుకుపడని విషయం తెలిసిందే.

శరవేగంగా పనులు

మొదట్లో ఈ పనులను గుణ్‌రాజ్ అనే సంస్థకు ఐఆర్‌సీటీసీ అప్పగించింది. ఆ సంస్థ ప్లాంట్‌ను 90 శాతం ఏర్పాటుచేసి కొంతమేర మెషినరీ తెప్పించి పనులు చేపట్టకుండా వదిలేసింది. ప్లాంట్ పూర్తి కాకపోవటంతో పాటు మెషినరీ కూడా తుప్పు పట్టే పరిస్థితికి చేరింది. ఈ రైల్‌నీర్ బాట్లింగ్ ప్లాంట్ అనేది పదేళ్ల కిందట కేంద్ర ప్రభుత్వం రైల్వే బడ్జెట్‌లో ప్రవేశపెట్టింది. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో మల్లవల్లిలో పరిశ్రమలకు ప్రోత్సాహక పాల సీలతో పెద్ద ఎత్తున సహకారం అందించటంతో ఆ ప్లాంట్ ఏర్పాటుకు భూములను కొన్నారు. పనులు 90 శాతం పూర్తయ్యాయి. బాట్లింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేయటానికి యంత్రాలను కూడా తీసుకొచ్చారు. ఉత్పత్తి ప్రారంభిం చాల్సిన గుణ్‌రాజ్ సంస్థ అర్థంతరంగా పనులను నిలిపి వేసింది. దీంతో ఆ సంస్థను వదిలించుకోవటానికి ఐఆర్‌సీ టీసీకి దాదాపు రెండేళ్లకు పైగా సమయం పట్టింది. గుణ్‌రాజ్ చెర వీడిన తర్వాత కూడా పనులు ప్రారంభించలేదు.

టీడీపీ ప్రభుత్వ రాకతో..

తాజాగా టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావటం మల్లవల్లికి పునర్వైభవం లభించింది. ఈ క్రమంలో ఐఆర్‌సీటీసీ కూడా పనులు పునఃప్రారంభించటానికి వీలుగా కొత్త సంస్థకు బాధ్యతలు అప్పగించింది. ఈ రంగంలో విశేష అనుభవం ఉన్న మెహై ఆక్వాకు వీటి బాధ్యతను అప్పగించారు. సదరు సంస్థ యుద్ధప్రాతిపదికన పనులు చేపడుతోంది. మెషినరీని వెంటనే తీసుకురావడంతో పాటు 24 గంటలూ పనులు చేయిస్తోంది. అన్నీ అనుకూలిస్తే ఆగస్టులోనే ట్రయల్ రన్ నిర్వహించటానికి మెహై ఆక్వా సంస్థ రంగం సిద్ధం చేస్తోంది. ఆగస్టు మొదటి వారంలో రైల్‌నీర్ బాట్లింగ్ ప్లాంట్ ట్రయల్ రన్ నిర్వహించిన తర్వాత ఐఆర్‌సీటీసీ అధికారుల నిర్ణయం మేరకు ప్రారంభోత్సవం జరుగుతుంది. ఈ కార్యక్రమానికి కేంద్ర రైల్వేశాఖ మంత్రిని ఆహ్వానించే అవకాశాలు ఉన్నాయి.

డయేరియా కలకలం

జగ్గయ్యపేటలో ఇద్దరు మృతి

* వ్యాధి లక్షణాలతో అనేకమంది ఆసుపత్రిపాలు
* ఇప్పటివరకు అధికారికంగా 41 కేసులు
* రోజురోజుకూ పెరుగుతున్న వ్యాధిగ్రస్తులు
* ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, కలెక్టర్ పరామర్శ



బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, కలెక్టర్ ఢిల్లీరావు

జగ్గయ్యపేటలో డయేరియా కలకలం రేగింది. పట్టణంతో పాటు వత్సవాయి మండలం మక్కపేట, వత్సవాయి, కాకరవాయి, షేర్‌మహ్మద్‌పేట, గంగ్రాయి, వేదాద్రి గ్రామాల్లో డయేరియా లక్షణాలతో అనేకమంది ఆసుపత్రుల్లో చేరుతున్నారు. ఇప్పటివరకు ఇద్దరు మృతిచెందగా, మరో 41 మంది డయేరియా లక్షణాలతో బాధపడుతున్నారు.

4లో..

ప్రేమించి పెళ్లాడాను.. ప్రాణం వదిలేస్తున్నాను

సెల్ఫీ వీడియో తీసుకుని వివాహిత ఆత్మహత్య

* భర్తతో నరకం అనుభవించానని కన్నీరు
* ఇక బతకలేనని బెడ్‌రూమ్‌లో ఉరి
* భార్య మరణాన్ని చూసి భర్త కూడా..

రామలింగేశ్వర నగర్‌లో ప్రేమకథ విషాదాంతం

విజయవాడ, జూన్ 21 (ఆంధ్రజ్యోతి) : 'జీవితంలో సరిదిద్దుకోలేని తప్పు చేశాను. జీవిత భాగస్వామిని ఎంచుకోవడంలో పొరపాటు చేశాను. భార్యను పోషించలేని వ్యక్తిని ప్రేమించి పెళ్లాడాను. ఇప్పుడు అనుభవిస్తున్నాను. ఎన్నిసార్లు చెప్పినా ఆయనలో మార్పు రావడం లేదు. చేసిన తప్పునకు నాకు నేనే శిక్ష వేసుకుంటున్నాను.' అంటూ ఓ వివాహిత సెల్ఫీ వీడియో తీసుకుని బలవన్మరణానికి పాల్పడింది. భార్య ఉరికి వేలాడుతూ కనిపించడాన్ని తట్టుకోలేని ఆ భర్త కూడా అదే గదిలో ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన నగరంలోని రామలింగేశ్వరనగర్ భవానీ రోడ్డులో శుక్రవారం జరిగింది. కృష్ణాజిల్లా బంటువిల్లికి చెందిన నాగరాజు (40), అవనిగడ్డకు చెందిన ప్రణీత (35) ఏడేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. పిల్లలు లేరు. నాగరాజు తాపీపని చేస్తుంటాడు. అతడికి మద్యం అలవాటు ఉండటంతో సంపాదించిన డబ్బుతో కుటుంబం గడవని పరిస్థితి. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ప్రణీత ఇంటి వద్ద టైలరింగ్ చేస్తూ కొంత సంపాదిస్తోంది. అయినా సమస్యలు పరిష్కారం కావడం లేదు. మద్యం అలవాటు వదిలేయాలని పలుమార్లు భర్తను ప్రాధేయపడింది. అతడిలో ఎలాంటి మార్పు రాలేదు. విసిగిపోయిన ప్రణీత ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకుంది. దీనికి ముందు తన సెల్‌ఫోన్‌లో ఓ సెల్ఫీ వీడియో తీసుకుంది. తాను నాగరాజును ప్రేమించినప్పటి నుంచి ఇప్పటి వరకు అనుభవించిన నరకాన్ని ప్రస్తావించి, శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో ఉరి వేసుకుంది. భోజనానికి ఇంటికి వచ్చిన నాగరాజు బెడ్‌రూమ్‌లో ప్రణీత ఉరికి వేలాడుతూ కనిపించింది. వెంటనే రామలింగేశ్వరనగర్ కట్టపై ఉంటున్న ఆమె తల్లిదండ్రులకు ఫోన్‌చేసి విషయం చెప్పాడు. ప్రణీత ఆత్మహత్య చేసుకుందని, ఇక తాను కూడా ఆత్మహత్య చేసుకుంటానని చెప్పి ఫోన్ పెట్టేశాడు. అనంతరం నాగరాజు కూడా అదే గదిలో ఉరేసుకున్నాడు. స్థానికులు పటమట పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇసుక అక్రమాలకు అడ్డుకట్ట



జిల్లావ్యాప్తంగా నిలిచిన వైసీపీ ఇసుక అక్రమాలు

* టీడీపీ ప్రభుత్వం రాకతో ఎక్కడికక్కడ బ్రేక్
* ఇంకా కొత్త విధానం లేకపోవడంతో ఇసుక కొరత
* ఎక్కడికక్కడ నిలిచిపోయిన పనులు

కంచికచర్ల : ఎట్టకేలకు ఇసుక అక్రమాలకు బ్రేక్ పడింది. ఇన్నాళ్లూ నిబంధనలకు విరుద్ధంగా వైసీపీ పెద్దల కనుసన్నల్లో జరిగిన అడ్డగోలు తవ్వకాలకు టీడీపీ కూటమి ప్రభుత్వం రాగానే అడ్డుకట్ట పడింది. నందిగామ డివిజన్ పరిధిలోని కృష్ణానది, మునేటిపై ఈ తవ్వకాలు ఇష్టానుసారంగా చేశారు. అనుమతులు లేకుండానే హద్దులు దాటి అడ్డూ అదుపూ లేకుండా రీచ్‌లను కొల్లగొట్టారు. భారీ యంత్రాలతో రేయింబవళ్లు ఇసుక తవ్వి, ఇతర ప్రాంతాలకు అక్రమంగా తరలించి, సొమ్ము చేసుకున్నారు. ఎన్నికల్లో వైసీపీ ఓడిపోవటంతో మున్నలూరు, చెవిటికల్లు, గని ఆత్కూరు, ఏటూరు, కాసరబాద, ఎస్.అమరవరం, పెండ్యాల, శనగపాడు తదితర రీచ్‌లలో ఇసుక తవ్వకాలు నిలిచిపోయాయి. డంపింగ్ యార్డుల్లో లోడింగ్ ఆగిపోయింది.

ఇసుక కొరత

రీచ్‌లలో తవ్వకాలు ఆపేయటంతో ఇసుకకు కొరత ఏర్పడింది. కొద్దిరోజుల నుంచి గిరాకీ పెరిగింది. ట్రక్కు ఇసుక రూ.7 వేల నుంచి రూ.10 వేలు పలుకుతోంది. ఇసుక లేనందున నిర్మాణ పనులు నిలిచిపోవటంతో కార్మికులు, నిర్మాణదారులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రిళ్లు రీచ్‌లకు వెళ్లి, ఇసుక తీసుకొచ్చి విక్రయించే కొంతమంది ట్రాక్టర్ల యజమానులు సైతం జంకుతున్నారు. ఇసుక అందుబాటులో లేనందున ఇళ్లతో పాటు ఇతరత్రా నిర్మాణ పనులు నిలిచిపోయాయి. భవన నిర్మాణ కార్మికులకు కొద్దిరోజుల నుంచి పనులు దొరకటం లేదు. కొత్త విధానం అమలు చేసేంత వరకు ఈ పరిస్థితి తప్పేలా కనిపించట్లేదు.

కొత్త విధానం ఎప్పటికీ..

ఇసుకతో పాటు ఇతరత్రా మైనింగ్‌లో జరిగిన వేల కోట్ల కుంభకోణం గురించి టీడీపీ ప్రభుత్వం ఆరా తీస్తోంది. మైనింగ్ కార్యాలయాలకు తాళాలు వేసి, పోలీస్ పహారా ఏర్పాటు చేసింది. కొత్త విధానం ఎప్పటి నుంచి అమల్లోకి వస్తుందో కచ్చితంగా తెలియదు. దీనిపై పాలకులు కసరత్తు చేస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఉచిత ఇసుక పథకాన్ని అమలు చేశారు. వాహనాల కిరాయి చెల్లిస్తే చాలు. అప్పట్లో ట్రక్కు ఇసుక రూ.800కే దొరికేది. ప్రస్తుతం ఏ విధానం అమలు చేస్తారన్న విషయమై అంతుబట్టట్లేదు. అయితే, ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని క్షేత్రస్థాయిలో మైనింగ్, రెవెన్యూ అధికారులు పరిశీలించి యార్డుల్లో నిల్వ చేసిన ఇసుక పంపిణీ చేయాలని భవన నిర్మాణ కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. లేదా రీచ్‌ల నుంచి తెచ్చుకునేందుకు కూపన్లు ఇవ్వాలని కోరుతున్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

ఎన్ఎంయూఏ వినతిపత్రం

4లో..

దివ్యయోగం



సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో 10వ అంతర్జాతీయ యోగా దినోత్సవం శుక్రవారం పటమటలోని చెన్నుపాటి రామకోటయ్య మున్సిపల్ ఇండోర్ స్టేడియంలో ఘనంగా జరిగింది. ఈ యోగాలో వెయ్యిమంది విద్యార్థులు పాల్గొనగా, అందులో 400 మంది దివ్యాంగ విద్యార్థులే కావడం విశేషం. దివ్యాంగులైనా క్రమపద్ధతిలో యోగా చేసి అందరినీ ఆకట్టుకున్నారు.



యోగాసనం వేస్తున్న దివ్యాంగుడు



మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి వినతిపత్రమిస్తున్న ఎన్ఎంయూఏ ప్రతినిధులు

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

» రవాణా మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి ఎన్ఎంయూఏ వినతి

బస్సుస్టేషన్, జూన్ 21 : ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని రవాణా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి ప్రజా రవాణా సంస్థ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్(ఎన్ఎంయూఏ) రాష్ట్ర ప్రతినిధులు శుక్రవారం విజయవాడలోని మంత్రి కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వైశ్రీనివాసరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీనివాసరాజు, రావిసుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ అభివృద్ధికి ద్వారకా తిరుమలరావు ఎనలేని కృషి

ఆర్టీసీ ఎండీగా ద్వారకాతిరుమలరావు సంస్థ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని, ఉద్యోగుల సంక్షేమానికి పాటు పడ్డారని ప్రజా రవాణా సంస్థ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు పేర్కొన్నారు. డీజీపీగా పదోన్నతి పొందిన ద్వారకాతిరుమలరావును శుక్రవారం ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ నరసయ్య ఆధ్వర్యంలో జోన్ నాయకులు ఆయనను అభినందించి సత్కరించారు.



ద్వారకా తిరుమలరావు దంపతులకు కనకదుర్గమ్మ చిత్రపటాన్ని అందజేస్తున్న ఈవో కేఎస్ రామారావు

దుర్గమ్మను దర్శించుకున్న డీజీపీ దంపతులు

వన్‌టౌన్, జూన్ 21: డీజీపీగా బాధ్యతలు స్వీకరించడానికి ముందు ద్వారకా తిరుమలరావు సతీసమేతంగా శుక్రవారం ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. ఆలయ ఈవో రామారావు, ఇతర అధికారులు, అర్చకులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. వేదపండితులు ఆశీస్సులు అందజేశారు. ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటాలను అందచేశారు.

అమ్మవారిని దర్శించుకున్న మంత్రులు, ఎమ్మెల్యేలు

కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్యేలు ఎంఎస్ రాజు, ఎస్.విజయకుమార్, గౌతు శిరీష, భూమా అఖిలప్రియ, బొజ్జల శ్రీధర్, దగ్గుబాటి వెంకటేష్ ప్రసాద్, బొలిశెట్టి శ్రీనివాస్ ఆదిరెడ్డి వాసు, చైతన్యరెడ్డి, జేసీ అస్మిత్‌రెడ్డి, అరవ శ్రీధర్, వి.వెంకటేశ్వరరావు, వంశీకృష్ణ, అశోక్‌రెడ్డి, గుండు శంకర్ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈవో రామారావు, ఏఈవో రమేష్‌బాబు తదితరులు వారందరికీ ఆలయ మర్యాదలు చేశారు. ప్రసాదం, శేషవస్త్రం, ఆశీస్సులు అందజేశారు. దుర్గగుడి ధర్మపథం వేదికపై శుక్రవారం రాత్రి మలేషియాకు చెందిన నందికేశ్వర్ నాట్య సంగీత అకాడమీ బృందం గురువు డాక్టర్ చంద్రమోహన్ రామస్వామి ఆధ్వర్యంలో నాట్య ప్రదర్శన ఇచ్చింది. శుక్రవారం సందర్భంగా కనకదుర్గమ్మ దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా అధికారులు నియంత్రణ చేశారు. పలువురు భక్తులు ఆర్జిత సేవల్లో పాల్గొన్నారు.

నగరంలో యునిడో బృందం పర్యటన

చిట్టినగర్, జూన్ 21: సస్టైనబుల్ సిటీస్ ఇంటిగ్రేటెడ్ అప్రోచ్ పైలట్(ఎస్‌సీఐఏపీ) ప్రాజెక్టులో భాగంగా యునైటెడ్ నేషన్స్ ఇండస్ట్రియల్ డవలప్మెంట్ ఆర్గనైజేషన్ (యునిడో) ప్రతినిధుల బృందం నగరంలో పర్యటించింది. బృందంతో శుక్రవారం కమాండ్ కంట్రోల్ రూమ్‌లో కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సమావేశం నిర్వహించారు.



ఎస్టీపీలను పరిశీలిస్తున్న బృందం

నగరంలో రూ.11 కోట్లతో అభివృద్ధి చేసిన ఎస్టీపీలు, డ్రైయినేజీ పంపింగ్ స్టేషన్లు, పర్యావరణ హితమైన బయోగ్యాస్ ఎనర్జీ ప్లాంట్లను నిర్మించి నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధనలతో చేపట్టిన ప్రాజెక్టుల వివరాలను ప్రతినిధుల బృందానికి కమిషనర్ వివరించారు. అనంతరం ప్రతినిధుల బృందం ఇంజనీరింగ్ అధికారులతో కలసి నగర పరిధిలోని ఎస్టీపీలను పరిశీలించింది. తోమస్ట్ పవేలేక్ ఇంటర్నేషనల్ కన్సల్టెంట్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్, యునిడో వియన్నా, సీనియర్ టెక్నికల్ అడ్వైజర్ నందపాల్ సింగ్, పెర్కారి అర్బన్ టెక్నాలజీ అండ్ ఇన్వెస్ట్మెంట్ స్పెషలిస్ట్ వెంకట రమణారావు, అడిషనల్ కమిషనర్ ప్రాజెక్ట్ కేవీ సత్యవతి, ఎస్ఈ రామ్మోహన్‌రావు, ఈఈ వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.



తవ్వకాల వల్ల పగుళ్లిచ్చిన మిరియాల వెంకటేశ్వరరావు భవనం పిట్టగోడ, పక్కింటి పునాది కంటే కిందకు సీఐ స్థలంలో చేసిన తవ్వకాలు(ఫైల్), ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్న సీఐ భవనం

సీఐ అబ్దుల్ గఫూర్‌తో నాకు ప్రాణహాని ఉంది

- అనుమతుల్లేకుండా ఆయన ఇంటి నిర్మాణం చేస్తున్నారు
- ఆ నిర్మాణం వల్ల నా భవనం కూలిపోయేలా ఉంది: సీఐ స్థలం పక్క భవన యజమాని మిరియాల వెంకటేశ్వరరావు

పటమట, జూన్ 21: పశ్చిమ గోదావరి జిల్లాలో సీఐగా పని చేస్తున్న అబ్దుల్ గఫూర్‌తో తనకు ప్రాణహాని ఉందని శివశంకర్‌నగర్‌కు చెందిన మిరియాల వెంకటేశ్వరరావు శుక్రవారం విలేకరుల వద్ద ఆరోపించారు. శివశంకర్‌నగర్‌లోని తన ఇంటిపక్కన కొంతకాలం కిందట జీ ప్లస్ వన్ భవనాన్ని సీఐ కొనుగోలు చేశాడని, కొత్తగా భవనాన్ని నిర్మించేందుకు ప్రస్తుతం ఉంటున్న భవనాన్ని భారీ యంత్రాలతో కూలగొట్టారని దీంతో పక్కన ఉన్న తన భవనం పగుళ్లు వచ్చి పూర్తిగా పాడైపోయిందని వెంకటేశ్వరరావు తెలిపారు. అబ్దుల్ గఫూర్ తన బిల్డింగ్ కోసం 10 అడుగులు పునాదులు తవ్వి ఏడాదిపాటు నిర్మాణాన్ని వాయిదా వేశారని, దీంతో వర్షాలకు పునాదుల్లో భారీగా నీరు చేరిందని, పక్కనే ఉన్న తన భవనం పునాదుల కిందకు నీరు చేరడంతో భవనం పూర్తిగా కుంగిపోయిందని తెలిపారు. తన ఇల్లు బీటలు వారి పడిపోయే పరిస్థితులలో ఉందని, తన ఇంటి వెనుక వైపున చర్చి ఉందని, పిట్టగోడ అటువైపున పడిపోతే ప్రాణనష్టం జరిగే అవకాశం ఉందని వెంకటేశ్వరరావు ఆవేదన వ్యక్తంచేశారు. భవనం పడగొట్టే సమయంలో తన భవనానికి జరిగిన నష్టానికి పూర్తిగా నష్టపరిహారం చెల్లిస్తానని సీఐ గఫూర్ మాట ఇచ్చాడని, నష్టపరిహారం చెల్లించమని అడిగితే అతని మామ బాషా కానూరుకు చెందిన రౌడీ పెద్దిరెడ్డి రామచంద్రరావుతో పాటు, కొందరిని వెంటబెట్టుకుని తనను చంపడానికి ప్రయత్నించాడని వెంకటేశ్వరరావు తెలిపారు. తాను దీనిపై స్పందనలో ఫిర్యాదు చేశానని, వారు పటమట పోలీస్‌స్టేషన్‌కు పంపారని, వారు తన వాదనను పూర్తిగా వినకుండా ఇది సివిల్ వివాదమని కేసును మూసి వేశారని వెంకటేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. సీఐ నిర్మిస్తున్న భవనానికి కార్పొరేషన్ అనుమతులు లేవని, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ స్పందించి వెంటనే ఆ నిర్మాణాన్ని ఆపివేయాలని, లేని పక్షంలో న్యాయపోరాటం చేస్తామని తెలిపారు. తనకు సీఐ గఫూర్, అతని మామ బాషాతో ప్రాణహాని ఉందని, కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను కోరారు.

పేటలో డయేరియా పంజా!

» వ్యాధి లక్షణాలతో ఇద్దరి మృతి
» గ్రామాల్లో పెరుగుతున్న కేసులు
» ఆర్ఎంపీలు, పీఎంపీల వద్ద వైద్యం
» విషమిస్తే జగ్గయ్యపేట ఆసుపత్రికి
» అధికారికంగా 40 మందికి లక్షణాలు
» వ్యాధిగ్రస్తులను పరామర్శించిన తాతయ్య
» డీఎంహెచ్‌వో, కలెక్టర్ ఆస్పత్రుల సందర్శన

జగ్గయ్యపేట, జూన్ 21 : జగ్గయ్యపేట నియోజకవర్గంలో అనేక గ్రామాల్లో డయేరియా కలకలం రేపుతోంది. పట్టణంతో పాటు వత్సవాయి మండలం మక్కపేట, వత్సవాయి, కాకరవాయి, షేర్‌మహ్మద్‌పేట, గండ్రాయి, వేదాద్రి గ్రామాల్లో ఎక్కువగా కేసులు నమోదవుతున్నాయి. బక్రీద్ పండుగ తర్వాత గ్రామాల్లో కేసులు ఉధృతమైనట్టు వైద్యవర్గాలు చెబుతున్నాయి. శాంతినగర్‌కు చెందిన సత్యనారాయణ (38), చిల్లకల్లుకు చెందిన వెంకటేశ్వరరావు (75) వాంతులు, విరేచనాలతో పాటు హృద్రోగ సమస్యలు ఉండటంతో గురువారం మృతి చెందటంతో వైద్యవర్గాలు అలర్ట్ అయ్యారు. జగ్గయ్యపేట ఆరోగ్య కేంద్రంలో ఇప్పటివరకు 41 కేసులు నమోదు కాగా, 30 మంది కోలుకోని ఇళ్లకు వెళ్లిపోయినట్టుచెబుతున్నారు. సీహెచ్‌సీతో పాటు పట్టణంలో ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో పలువురు చికిత్స పొందుతున్నారు. మక్కపేటలో కేసుల సంఖ్య అధికంగా ఉంది. ఒకే ఇంట్లో తల్లికూతుళ్లు, మనవరాలు తురకా మంగతాయయ్మ (60) యండ్రాతి మరియమ్మ (40) కీర్తి (15), జగ్గయ్యపేట మండలం బూదవాడ గ్రామానికి చెందిన గుగ్లోత్ జమ్మా (60)లు శుక్రవారం వాంతులు, విరేచనాలతో జగ్గయ్యపేట ఆసుపత్రిలో చేరారు. డాంగేనగర్‌కు చెందిన ఉమ్మినేని రంగయ్య (60), మరియమ్మ (60)ల పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో వారిని విజయవాడ రిఫర్ చేశారు. వేదాద్రికి చెందిన పసుమర్తి సత్యవతి (65) మక్కపేటలో ఉన్న సోదరి ఇంటికి వెళ్లి వాంతులు విరేచనాలు కావటంతో జగ్గయ్యపేట ఆసుపత్రికి తరలించారు. పట్టణంలో వైవై కాలనికి చెందిన మాదాల రక్షిత (24), మేడా విజయలక్ష్మీ (20)లు రెండు రోజులుగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వత్సవాయి మండలం కాకరవాయికి చెంది న తొట్టెంపుడి దివ్యశ్రీ (12), మక్కపేటకు చెందిన ధారావత్ గౌతవి (11), వత్సవాయికి చెందిన నల్లబోతుల నందిని (17)లు మూడురోజులుగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారి ఆరోగ్యం నిలకడగా ఉందని ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ హరీష్ చెప్పారు. పట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో 12 మంది చికిత్స పొందుతున్నారని డీఎంహెచ్ఓ సుహాసిని తెలిపారు.

రాత్రికి రాత్రే డీఎంహెచ్ఓ, తాతయ్య ఆసుపత్రి సందర్శన..

డయేరియా లక్షణాలతో యువకుడు, వృద్ధుడు మృతి చెందినట్టు వార్తలు రావటంతో గురువారం రాత్రి ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య హుటాహుటిన ఆసుపత్రిని సందర్శించారు. విషయాన్ని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లటంతో ఆయన వెంటనే డీఎంహెచ్ఓను జగ్గయ్యపేట వెళ్లాలని ఆదేశించడంతో ఆమె వచ్చి సమీక్షించారు. షేర్‌మహ్మద్‌పేటకు చెందిన షేక్ రేష్మా, నాగమణిలను విజయవాడ జీజీహెచ్, ఆంధ్రా ఆసుపత్రికి తరలించారు. మంత్రి ఆదేశాలతో గ్రామంలో ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటుచేశారు. గ్రామంలో నీటి కాలుష్యం అధికంగా ఉందని చెప్పటంతో గ్రామాన్ని సందర్శించారు.



బాధితులను పరామర్శించిన కలెక్టర్

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్యతో కలిసి ఆసుపత్రిలో రోగులను పరామర్శించారు. షేర్ మహ్మద్‌పేటలో తాగునీటి శాంపిల్స్ పరీక్షలకు పంపాలని ఆదేశించారు. ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. వాతావరణంలో మార్పులు, నీరు మారటం వల్ల డయేరియా లక్షణాలు కనిపిస్తున్నాయని కలెక్టర్ అన్నారు. ఎవరికి లక్షణాలు కనిపించినా ఆసుపత్రికి రావాలని ఆయన కోరారు. జిల్లా అధికారులు డయేరియా మృతిని నిర్ధారించటం లేదు.

చర్యలకు ఉపక్రమించిన మునిసిపాలిటి..

పట్టణంలో డయేరియా లక్షణాలు కనిపించటంతో మునిసిపల్ అధికారులు, ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తక్షణచర్యలకు ఉపక్రమించారు. రక్షిత మంచినీటి పథకం ట్యాంకులను శుభ్రం చేయించారు. ఛైర్మన్ వాటర్ వర్క్సును సందర్శించి, క్లోరినేషన్, ఫిల్టరేషన్‌లను పరిశీలించారు. ఎక్కడ వాటర్ లీకేజీలున్నా యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని కమిషనర్‌కు సూచించారు.



వ్యాధి లక్షణాలతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులు

అతిసారపై అప్రమత్తంకండి

» సీఎస్ వీడియో కాన్ఫరెన్స్‌లో ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల కలెక్టర్లు.. అధికారులకు సత్వర ఆదేశాలు

విజయవాడ లీగల్, జూన్ 21 : జిల్లాలో అతిసార వ్యాప్తి చెందకుండా క్షేత్రస్థాయిలో పగడ్బందీ చర్యలు చేపట్టాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ డయేరియాపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి అధికారులతో కలెక్టర్ హాజరయ్యారు. అతిసార కేసులు నమోదు కాకుండా తీసుకోవాల్సిన చర్యలపై సీఎస్ మార్గనిర్దేశనం చేశారు. అదేవిధంగా జూలై 1 నుంచి ఆగస్టు 31 వరకు నిర్వహించనున్న రాష్ట్రవ్యాప్త ప్రచార కార్యక్రమంపై సూచనలు చేశారు. అనంతరం కలెక్టర్ జిల్లా వైద్య ఆరోగ్య, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులతో సమీక్షించారు. పటిష్ట ప్రణాళిక ప్రకారం జిల్లాలో అతిసారం వ్యాప్తి చెందకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. డయేరియాపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, సురక్షిత తాగునీరు, చేతుల పరిశుభ్రత తదితరాలపై అవగాహన కల్పించాలన్నారు. తాగునీరు సరఫరా, పారిశుద్ధ్య కార్యక్రమాల అమలుపై అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. కేసులు నమోదైన చోట మూలాలను గుర్తించి సత్వరం పరిస్థితిని చక్కదిద్దాలని స్పష్టం చేశారు. బాధితులకు మెరుగైన వైద్యసేవలు అందించడంలో అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఓఆర్ఎస్, జింక్ ప్యాకెట్ల పంపిణీపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. ఆరోగ్యశాఖ అధికారుల భాగస్వామ్యంతో ఐసీడీఎస్ అధికారులు అంగన్వాడీ కేంద్రాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ కార్నర్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. డయేరియా ప్రభావిత ప్రాంతాల్లో ఇంటింటి సర్వే నిర్వహించాలని, అవసరం మేరకు వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి నిరంతర వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో వుండాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

మచిలీపట్నం (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలంలో డయేరియా కేసులు ప్రబలకుండా తగు చర్యలు తీసుకోవాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వర్షాకాలంలో తాగునీరు కలుషితమయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. తాగునీటి పైప్‌లైన్‌ల లీకేజీలను నియంత్రించాలన్నారు. తాగునీటి చెరువులు, ట్యాంకులను తరచూ క్లోరినేషన్ చేయాలన్నారు. వర్షాకాలంలో సురక్షిత తాగునీటిని ప్రజలు ఉపయోగించేలా అంగన్వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లతో ఇంటింటికీ తిరిగి అవగాహన కల్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో డీఎంఅండ్‌హెచ్‌వో గీతాబాయి, ఐసీడీఎస్ పీడీ ఎన్.సువర్ణ, ఆరోగ్యశ్రీ ట్రస్ట్ జిల్లా కో-ఆర్డినేటర్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

అమరావతి ఉద్యమంలో కీలకపాత్ర మహిళలదే

● ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు

వన్‌టౌన్, జూన్ 1: రాజధాని అమరావతి కోసం మహిళలు చాలా కష్టపడ్డారని ఉద్యమంలో మహిళలే కీలక పాత్ర పోషించారని ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు అన్నారు. శుక్రవారం బందర్‌రోడ్డులోని హోటల్ మురళీఫార్చ్యూన్‌లో ఎన్ఆర్ఐ టీడీపీ అమెరికా మహిళా వింగ్ జాగర్లమూడి శివానీ ఆధ్వర్యంలో తెలుగునారీ భేరీ కార్యక్రమంలో మంత్రి గుమ్మడి సంధ్యారాణి, రఘురామకృష్ణంరాజుతో పాటు పలువురు ఎమ్మెల్యేలు హాజరయ్యారు. రాజధాని అమరావతి అభివృద్ధి సీఎం చంద్రబాబుతోనే సాధ్యమని ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు అన్నారు. ఐదేళ్ల పాటు రాష్ట్రంలో రాక్షసపాలన కొనసాగిందని విమర్శించారు. అనంతరం ఆయనను మహిళలు ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యేలు పల్లె సింధూరారెడ్డి, అదితి గజపతి రాజు, బండారు శ్రావణి, పరిటాల సునీత, గౌరు చరిత, దేవిరెడ్డి ప్రశాంతిరెడ్డి, మాధవిరెడ్డి, గౌతు శిరీష, కాల్వ శ్రీనివాస్, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వర్లు, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి, కృష్ణాజిల్లా మాజీ ఛైర్‌పర్సన్ గద్దె అనురాధ పాల్గొన్నారు.

కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడుకు ఘనస్వాగతం

గన్నవరం, జూన్ 21: కేంద్ర పౌర విమాన యాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుకు గన్నవరం విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. శుక్రవారం రాత్రి ఢిల్లీ నుంచి ఎయిర్ ఇండియా విమానంలో ఆయన ఇక్కడికి విచ్చేశారు. కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడుకు విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) మొక్క అందజేసి స్వాగతం పలికారు. ఎయిర్‌పోర్టు డైరెక్టర్ ఎంఎల్ కె.రెడ్డి శాలువ కప్పారు. అనంతరం రోడ్డు మార్గాన రామ్మోహన్ నాయుడు నివాసమైన విజయవాడ కరెన్సీ నగర్‌కు వెళ్ళారు. ఆయన నివాసంలో కొద్దిసేపు కేంద్ర, రాష్ట్ర రాజకీయాల గురించి కేంద్ర మంత్రి, ఎంపీ చర్చించుకున్నారు.



గన్నవరం విమానాశ్రయంలో రామ్మోహన్‌నాయుడుకు స్వాగతం పలుకుతున్న ఎంపీ కేశినేని చిన్ని



కామకోటినగర్‌లో జీ ప్లస్ 2 అనుమతితో నిర్మిస్తున్న ఆరంతస్థుల భవనం

విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ విభాగంలో ఇంకా వైసీపీ నేతల హవా కొనసాగుతోంది. మాజీ మంత్రి వెలంపల్లి అనుచరులు, వీఎంసీలో కీలక స్థానంలో ఉన్న మహిళా ప్రజాప్రతినిధి భర్త కనుసన్నల్లో వసూళ్ల దందా నడుస్తున్నట్లు టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. నూతన భవన నిర్మాణాలకు ప్లాన్ అనుమతి నుంచి కొత్త నిర్మాణాలకు పన్ను వేయడం.. అనధికార కట్టడాల జోలికి వీఎంసీ అధికారులు వెళ్లకుండా చూడటం ఇలా ప్రతిదీ వైసీపీ నాయకుల కనుసన్నల్లోనే నడుస్తున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి.

కొనసాగుతున్న వసూళ్ల దందా!

అనధికార కట్టడాలపై వైసీపీ వారిదే పెత్తనం

- వెలంపల్లి, వీఎంసీలో మహిళా ప్రజాప్రతినిధి అనుచరుల దందా
- కామకోటి నగర్‌లో అనధికార కట్టడం నుంచి రూ.30 లక్షలు వసూలు
- ఇంక వైసీపీ నాయకుల సేవలోనే తరిస్తున్న వీఎంసీ టౌన్‌ప్లానింగ్ సిబ్బంది
- ప్లాన్ మొదలు పన్ను వేయడం వరకు అంతావారి కనుసన్నల్లోనే..

(ఆంధ్రజ్యోతి - విజయవాడ)

● విజయవాడ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని కామకోటి నగర్‌లో కన్యకా పరమేశ్వరి కల్యాణమండపం ఎదురుగా సుమారు 250 గజాల్లో ఓ భారీ భవన నిర్మాణం జరుగుతోంది. వాస్తవానికి ఈ భవనానికి జీ ప్లస్ 2 అనుమతి మాత్రమే ఇస్తారు. కానీ ఏకంగా ఆరు అంతస్థుల నిర్మాణం జరిగిపోతోంది.

● భవానీపురంలో ఓ వ్యక్తి సుమారు 200 గజాల్లో ఎలాంటి సెట్‌బ్యాక్‌లు లేకుండా నాలుగంతస్థుల కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మించి ఓ వాహన కంపెనీకి అద్దెకిచ్చారు. దాన్ని అనధికార కట్టడంగా గుర్తించి వీఎంసీ అధికారులు తొలుత నోటీసులు ఇచ్చారు. తర్వాత మౌనవ్రతం పాటించారు. ఈ ఉదంతంలో మాజీ మంత్రి వెలంపల్లి అనుచరులకు లక్షలాది రూపాయలు ముట్టినట్టు సమాచారం.

● ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత కామకోటినగర్‌లో జరుగుతున్న అనధికార నిర్మాణాన్ని వీఎంసీ అధికారులు అడ్డుకున్నారు. వెంటనే వెలంపల్లి అనుచరులు రంగప్రవేశం చేశారు. యజమానితో బేరాలు ఆడి సుమారు రూ.30 లక్షలు వసూలు చేసి, దాని జోలికి వెళ్లొద్దని వీఎంసీ అధికారులు హుకుం జారీ చేశారు. వైసీపీ ప్రభుత్వం పోయి టీడీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా వెలంపల్లి అనుచరుల ఆగడాలకు వీఎంసీలో అంతు లేకుండా పోతోంది. వీఎంసీలో కీలక స్థానంలో ఉన్న అధికారిణి అండతో వారు చెలరేగిపోతున్నారు. వైసీపీ సర్కార్ ఉన్న సమయంలో వీరి ఆగడాలకు అంతే లేకుండా పోయింది. సుమారు ఏడాది క్రితం విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 42వ డివిజన్ భవాపురం టెలిఫోన్ కాలనీలో ఒక బిల్డర్ చేపట్టిన అనధికార నిర్మాణాన్ని అధికారులు అడ్డుకున్నారు. వీఎంసీలో కీలకమైన స్థానంలో ఉన్న మహిళా ప్రజాప్రతినిధి భర్తకు సన్నిహితుడైన ఓ వ్యక్తి బిల్డర్‌ను మహిళా ప్రజాప్రతినిధి భర్త వద్దకు తీసుకెళ్లి డీల్ సెటిల్ చేశారు. ఆ బిల్డర్ అనధికార నిర్మాణం షురూ చేశారు. అదే సమయంలో వీఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగంలో ఏసీబీ తనిఖీల హడావుడి మొదలైంది. దీంతో స్థానిక సచివాలయ సిబ్బంది రంగ ప్రవేశం చేసి బిల్డర్‌ను అనధికార నిర్మాణం నిలిపివేయాల్సిందిగా కోరారు. ఆ బిల్డర్ తాను మహిళా ప్రజాప్రతినిధి భర్తతో మాట్లాడి అంతా సెటిల్ చేసుకున్నానని చెప్పారు. ఈ విషయాన్ని సిబ్బందే వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయడంతో ఆ మహిళా ప్రజాప్రతినిధి భర్త ఆగడాలు వెలుగులోకి వచ్చాయి. ఇప్పటికీ వెలంపల్లి అనుచరులతో కలిసి ఆయన తన దందాలు కొనసాగిస్తూనే ఉన్నారు.

ఇదీ దందాల తీరు..

● బందరు లాకుల వద్ద జరిగిన అక్రమ భవన నిర్మాణంలో పశ్చిమనియోజకవర్గానికి చెందిన వైసీపీ కార్పొరేటర్‌కు భారీగా ముడుపులు ముట్టాయి. మహిళా ప్రజాప్రతినిధి భర్తకు భవన యజమానికి ఈ కార్పొరేటర్ మధ్యవర్తిగా వ్యవహరించి తాను కూడా గట్టిగానే వెనకేశారు.

● భవానీపురం 40వ డివిజన్ స్వాతి రోడ్డులో నిబంధనలకు విరుద్ధంగా భారీ నిర్మాణం జరిగింది. కొద్ది రోజుల క్రితం అధికారులు దాన్ని అడ్డుకోవడంతో యజమాని గగ్గోలు పెట్టాడు. తాను మహిళా ప్రజాప్రతినిధి భర్తకు ముడుపులు సమర్పించుకున్నట్లు వెల్లడించారు. అదే డివిజన్ టీచర్‌కాలనీలో ఓ ప్రభుత్వ అధికారి వైసీపీ స్థానిక కార్పొరేటర్ అండతో అనధికార నిర్మాణం చేపట్టారు. దీనిపై అధికారులు ఆరా తీయగా స్థానిక కార్పొరేటర్ నుంచి వారికి ఫోను వెళ్లింది.

టౌన్ ప్లానింగ్‌లో ఆయన చెప్పిందే వేదం..!

విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ టౌన్‌ప్లానింగ్ విభాగం మొత్తం మహిళా ప్రజాప్రతినిధి భర్త కనుసన్నల్లో నడవాల్సిందే. అధికారులు, సిబ్బంది నామమాత్రమే. ఎన్నికల తర్వాత పరిస్థితి మారుతుందని ఎదురు చూసిన టీడీపీ నాయకులు నేటికీ ఆయన మాటే చెల్లుబాటు అవుతుండటంతో తమ ఎమ్మెల్యేల వద్ద పరిస్థితిని చెప్పుకుని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. వైసీపీ కార్పొరేటర్లు, మహిళా ప్రజాప్రతినిధి భర్త దూకుడుకు అడ్డుకట్ట వేయకపోతే ప్రజల్లో చెడ్డ పేరు వస్తుందని టీడీపీ డివిజన్ నాయకులు, కార్పొరేటర్లు గగ్గోలు పెడుతున్నారు.



విద్యార్థులకు స్వీట్లు పంచుతున్న మంత్రి సవిత

వసతిగృహాల్లో మంత్రి ఆకస్మిక తనిఖీ

విజయవాడ, జూన్ 21: విజయవాడలోని విద్యుత్ కాలనీలోని ప్రభుత్వ వెనుకబడిన తరగతుల బాలుర వసతి గృహాలను బీసీ సంక్షేమ శాఖ రాష్ట్ర మంత్రి ఎస్.సవిత ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతిగృహాల్లో అందిస్తున్న భోజనం, మౌలిక సదుపాయలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహాల పరిసరాలను పరిశీలించారు. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులుంటే గదులు, మరుగుదొడ్లు పరిశుభ్రంగా లేకపోవడంతో వార్డెన్‌ను మంత్రి మందలించారు. పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ అందరూ బాగా చదువుకొని ఉన్నస్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు. వసతిగృహాల్లో సమస్య లుంటే నేరుగా తనకు ఫోన్ చేయాలని తన నెంబరులు ఇచ్చారు. స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఏజీ దమ్మాలపాటికి అభినందన



నూతన ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్‌ను టీడీపీ లీగల్‌సెల్ జనరల్ సెక్రటరీ గూడపాటి లక్ష్మీనారాయణ మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. - విజయవాడ

ఐటీఐ రెండోదశ కౌన్సెలింగ్..
111 మందికి అడ్మిషన్లు

భారతీనగర్ : ప్రస్తుత విద్యాసంవత్సరానికి గాను ఎన్టీఆర్ జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేట్ ఐటీఐలలో రెండో విడత అడ్మిషన్లకు శుక్రవారం ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో నిర్వహించిన కౌన్సెలింగ్‌కు 188 మంది విద్యార్థులు హాజరు కాగా వారిలో 111 మందికి అడ్మిషన్లు కేటాయించినట్టు ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ ప్రిన్సిపల్, జిల్లా కన్వీనర్ ఎం.కనకారావు ఒక ప్రకటనలో తెలిపారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	134, 143, 154
చికెన్ విత్ స్కిన్	260
చికెన్ స్కిన్‌లెస్	270

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.10

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

మధురానగర్: మధురానగరలో ఉన్న నాలుగు అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి. విజయ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు, ఐదేళ్లలోపు పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషక విలువలు ఉన్న ఆహారాన్ని అందించడంతో పాటు పిల్లలకు చదువు చెప్పి ప్రాథమిక పాఠశాలలో చేరేలా సిద్ధం చేస్తామని చెప్పారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే పిల్లల్లో ఐదేళ్ల నిండిని వారికి పాఠశాలలో చేరడానికి వీలుగా సర్టిఫికెట్‌లను అందించారు. అనంతరం కొత్తగా అంగన్‌వాడీలో పిల్లలను చేర్పడానికి వీలుగా తల్లిదండ్రులకు అవగాహన కల్పించే నిమిత్తం బడి బాట ర్యాలీ నిర్వహించారు. టీచర్‌లు సుజాత, సుకన్య, సూర్యకుమారి, చంద్రిక, ఆయాలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ఎన్‌డీఏ కార్యాలయంలో



బెజవాడ బార్‌లో



సిద్ధార్థ పబ్లిక్ స్కూల్‌లో



సిద్ధార్థ మహిళా కళాశాలలో



లారీ ఓనర్స్ అసోసియేషన్ హాల్లో



పీబీ సిద్ధార్థ కళాశాలలో

సర్వరోగ నివారిణి యోగా

విద్యాధరపురం, జూన్ 21: ప్రపంచానికి మన సంస్కృతి, మేధశక్తిని యోగా తెలియజేస్తుందని, యోగా సర్వరోగ నివారిణి అని పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి అన్నారు. భవానీపురంలోని ఎన్‌డీఏ కార్యాలయంలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ యోగా వలన శరీరంలోని అన్ని భాగాలకు ఆక్సిజన్ అందడం వలన ఆరోగ్యవంతులుగా ఉంటారని చెప్పారు. అడ్డూరి శ్రీరామ్, శివకుమార్ పట్నాయక్, అప్పారావు, శ్రీధర్, జనసేన నాయకులు బాడిత శంకర్, ఎన్‌డీఏ నాయకులు పాల్గొన్నారు.

● కేబీఎన్ కళాశాలలో శుక్రవారం ఎన్‌సీసీ, కళాశాల క్రీడా విభాగం, జాతీయ సేవా పథకం సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన యోగా దినోత్సవంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సుజనా చౌదరి పాల్గొన్నారు. శ్రీ వెంకటేశ్వర యోగా కేంద్రం యోగా గురువు వెంకటేశ్వర గురూజీ, కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు ఉసిరిక ఉమామహేశ్వరరావు, శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపాల్ వి.నారాయణరావు, క్రీడా విభాగాధిపతి డి.హేమచంద్రరావు, హిందూ హైస్కూల్ కమిటీ అధ్యక్షుడు టి.శేషయ్య, వైస్ ప్రిన్సిపాళ్లు, ఎన్‌సీసీ ఆఫీసర్లు పాల్గొన్నారు.

● పొట్టి శ్రీరాములు చలువాది మల్లికార్జునరావు సాంకేతిక ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన యోగా కార్యక్రమంలో యోగా ఫర్ ఉమెన్ ఎంపవర్‌మెంట్‌పై సెమినార్ నిర్వహించారు. యోగా థెరపిస్ట్ డి.శిరీష ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ సీపీ చిట్టా అమర్ సుధీర్, ప్రిన్సిపాల్ డాక్టర్ జే.లక్ష్మీనారాయణ, ఎన్ఎస్ఎస్ యూనిట్ పీవో శ్రీకాంత్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు యోగాసనాలు వేశారు.

● వన్‌టౌన్‌లోని గాంధీజీ మహిళా కళాశాలలో యోగా గురువు పి.ఫణికృష్ణ విద్యార్థినుల చేత యోగాసనాలు వేయించారు. యోగాలో నైపుణ్యాన్ని ప్రదర్శించిన విద్యార్థినులకు జ్ఞాపికలను అందజేశారు. కళాశాల వైస్ చైర్మన్ కే.వి పిచ్చయ్య, కరస్పాండెంట్ సీఎల్ కాంతారావు, ప్రిన్సిపాల్ ఎం.రమణశ్రీ, అధ్యాపకులు పాల్గొన్నారు.

● వన్‌టౌన్‌లోని కూరపాటి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో విద్యార్థుల చేత సూర్యనమస్కారాలు, యోగాసనాలు వేయించారు. పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గానుగుల యుగంధరాచార్య, కార్యదర్శి కూరపాటి నారాయణరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

కృష్ణలంక: కృష్ణలంక సుధాకర్స్ ఐడియల్ స్కూల్‌లో విద్యార్థులకు యోగా గురువులచే యోగాభ్యాసాలు నేర్పించారు. స్కూల్ చైర్మన్ సుధాకరరెడ్డి, కరస్పాండెంట్ దేవినేని వరలక్ష్మి, ప్రిన్సిపాల్ రామకోటేశ్వరరావు, డీన్ సురేష్ కుమార్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

లబ్బీపేట: నలంద డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ యూనిట్ల ఆధ్వర్యంలో స్ఫూర్తి కుటుంబం ఆంధ్రప్రదేశ్ సౌజన్యంతో యోగాసనాల కార్యక్రమం నిర్వహించారు. నలంద కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనురాధ, గుణశేఖర్, స్ఫూర్తి కుటుంబం జోనల్ ఇన్‌చార్జ్ రత్నకిషోర్ బాబు, వీర రాఘవరావు, కె.మాధవ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ వి.వెంకటేశ్వరరావు, ఎన్‌సీసీ ఏఎన్‌వో కె.సధాకర్, 80మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. ● సిద్ధార్థ మహిళా కళాశాల ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విభాగాల ఆధ్వర్యంలో బందర్‌రోడ్డులోని ఇండోర్ స్టేడియంలో విద్యార్థినులు యోగాసనాలు వేశారు. ప్రిన్సిపాల్ ఎస్.కల్పన, టి.నాగరాణి, జి.జ్యోత్స్న పాల్గొన్నారు.

మొగల్రాజపురం: మొగల్రాజపురంలోని వీరమాచనేని పద్దయ్య సిద్ధార్థ పబ్లిక్ స్కూల్‌లో వెల్‌నెట్ ట్రైనర్ పి.అరుణ, దత్త క్రియా యోగ ఇంటర్నేషనల్‌కు చెందిన ఎస్.అరుణ, నిహారికలు విద్యార్థులకు, ఎన్‌సీసీ కేడెట్‌లకు యోగా గురించి వివరించి ఆసనాలు వేయించారు. ● జనశిక్షణా సంస్థాన్‌లో చైర్ పర్సన్ ఎస్. విద్యాఖన్నా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో యోగా థెరపిస్ట్ ఓ. భవానీ మహిళలతో యోగా చేయించారు. డైరెక్టర్ ఏ. పూర్ణిమ, శిక్షకులు, శిక్షణార్థులు పాల్గొన్నారు. ● సిద్ధార్థ ఫార్మసీ కళాశాలలో ఇస్కాన్ సంస్థకు చెందిన గురువులతో యోగా చేయించారు. ప్రిన్సిపాల్ ఏ. సునీత పాల్గొన్నారు.

విజయవాడ స్పోర్ట్స్ : మొగల్రాజపురంలోని పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాలలో యోగా విద్యా విభాగం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ హాజరయ్యారు. కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు యోగాసనాలు చేశారు. కళాశాల డిప్లొమో యోగా కోర్సు 2022-23 బ్యాచ్‌లో అత్యధిక మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులను సర్టిఫికెట్లతో సత్కరించారు. సిద్ధార్థ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చుండీ వెంకటేశ్వరరావు, డైరెక్టర్ వేమూరి బాబూరావు, డీన్ రాజేష్, పీడీ ఎ.చినబాబు, జూనియర్ కళాశాల పీడీ మార్కండేయులు పాల్గొన్నారు. ● గురునానక్ కాలనీలోని ఫన్‌టైమ్స్‌లో బీహార్ స్కూల్ ఆఫ్ యోగా మాస్టర్ ధారణ ఆధ్వర్యంలో ఫన్‌టైమ్స్ వాకర్స్, యోగా సభ్యులు యోగాసనాలు వేశారు. ఫన్‌టైమ్స్ కార్యదర్శి కిలా రు వెంకట శివాజీ, ఉపాధ్యక్షురాలు సుమబిందు, కార్య నిర్వాహణ కార్యదర్శి విజయరాజు, కోశాధికారి సతీష్‌లు పాల్గొన్నారు.

మానసిక ప్రశాంతతకు యోగా

మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఎ.సత్యానంద్

విజయవాడ లీగల్: న్యాయవాదులు ప్రతిరోజు క్రమం తప్పకుండా యోగా చేయడం వలన వారికి మానసిక ఒత్తిడి దూరమై ప్రశాంతత లభ్యమవుతుందని మెట్రో పాలిటన్ సెషన్స్ జడ్జి ఎ.సత్యానంద్ అన్నారు. బెజవాడ బార్ అసోసియేషన్ హాలులో బార్ అసోసియేషన్ ఆధ్వ ర్యంలో యోగాభ్యాసాలు నిర్వహించారు. న్యాయమూర్తులు, బార్ అధ్యక్ష, కార్యదర్శులు కొత్త చంద్రమౌళి, అరిగల శివరాంప్రసాద్, బార్ కౌన్సిల్ సభ్యులు చలసాని అజయ్ కుమార్, కార్యవర్గసభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

పటమట: అమరావతి యోగా అండ్ ఏరోబిక్స్ ఆధ్వర్యంలో స్థానిక లారీ ఓనర్స్ అసోసియేషన్ హాల్లో జరిగిన యోగా డేలో ముఖ్య అతిథి అదనపు డిప్యూటీ పోలీస్ కమిషనర్ హరికృష్ణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు చుక్కపల్లి అరుణ్‌కుమార్, గౌరవాధ్యక్షుడు చలసాని అజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి పెరవలి రమణ, ఉపాధ్యక్షుడు ఎల్లారావులు పాల్గొన్నారు.

● 8 ఆంధ్ర ఎన్‌సీసీ నేవల్ యూనిట్, 4 గర్ల్స్ ఆర్మీవింగ్ సంయుక్తంగా నగరంలో పలు చోట్ల యోగా ఫర్ బెటర్ సోస్టైటీ అండ్ ఉమెన్ ఎంపవర్‌మెంట్ అనే అంశంపై యోగా డెమో నిర్వహించారు. ఆర్మీవింగ్ ఎన్‌సీసీ కేడెట్స్ స్వరాజ్య మైదానం అంబేడ్కర్ విగ్రహం వద్ద యోగాసనాలు వేశారు.

పాతరాజరాజేశ్వరి పేట: స్థానిక 55వ డివిజన్, వించిపేట, నైజాంగేటు సెంటర్‌లో ఉన్న శ్రీవిద్యాంజలి హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పుప్పాల శ్రీనివాసరావు విద్యార్థులతో యోగాసనాలు వేయించారు.

ధర్నాచౌక్: ఇబ్రహీంపట్నంలోని ఏపీ జెన్కోలో జరిగిన కార్యక్రమంలో యోగశక్తి సాధన సమితి వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ మాకాల సత్యనారాయణ మాట్లాడుతూ అసహజ మరణాల తగ్గింపునకు యోగశక్తి చికిత్సను అన్ని ఆరోగ్య విభాగాలు ప్రోత్సహించాలని కోరారు. ప్లాంట్ చీఫ్ నాగరాజు, ఎస్ఈ సురేష్‌బాబు, డీఎస్ సుశీల, ఏపీఎస్ఈ ఇంజనీర్స్ అసోసియేషన్ కోశాధికారి వెంకట రమణ, డీఈ సురేష్ , ఉద్యోగులు పాల్గొని యోగాభ్యాసం చేశారు.



యోగా చేస్తున్న హాస్పిటల్ సిబ్బంది, ఇతరులు

ప్రపంచానికి భారతదేశం అందించిన అద్భుతాల్లో యోగా ఒకటి

● ఆయుష్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కోడూరు గోపాలకృష్ణ

భారతీనగర్, జూన్ 21: ప్రపంచానికి భారతదేశం అందించిన అద్భుతాలలో యోగా ఒకటని ఆయుష్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కోడూరు గోపాలకృష్ణ అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విజయవాడ ఆయుష్ హాస్పిటల్, ఇషా ఫౌండేషన్ సంయుక్తంగా ఆయుష్ హాస్పిటల్‌లో ఉచిత యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ చౌదరి మాట్లాడుతూ యోగ అనే పదం సంస్కృతంలో యజ అనే పదం నుంచి పుట్టిందని, యజ అంటే దేనినైనా ఏకం చేయగలగడం అని అర్థం, ఆసనం అనే పదానికి సంస్కృతంలో భంగిమ అని అర్థం, ఈ రెండింటిని కలిపి యోగాసనాలు అంటారని అన్నారు.

చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ జయలక్ష్మీ మాట్లాడుతూ మానసిక, శారీరక ప్రశాంతతకు యోగాని తమ దైనందిన జీవితంలో భాగంగా విధిగా నిర్వహించాలని అన్నారు. ఇషా ఫౌండేషన్ క్లాసిక్ హఠ యోగ నిపుణురాలు హరిచందన యోగా ప్రక్రియల గురించి వివరిస్తూ, శిక్షణ ఇచ్చారు. డాక్టర్ మాధవి మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించడానికి సహకరించిన హాస్పిటల్ యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. 200మందికి పైగా ఆయుష్ హాస్పిటల్ సిబ్బంది, ఇతరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ క్షేత్రంలో కూలీల యోగానందం

కృష్ణలంక, జూన్ 21: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని మిషన్ అమృత్ సరోవర్ కింద అభివృద్ధి చేసిన 77 చెరువుల వద్ద యోగా దినోత్సవాన్ని నిర్వహించి కూలీలకు యోగాసనాలపై అవగాహన కల్పించామని డ్వామా పీడీ జె.సునీత తెలిపారు. విజయవాడ రూరల్ మండల పరిధిలోని పాత పాడు సుబ్బన్న చెరువు వద్ద మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలు యోగాసనాలు వేశారు.

హెడ్ పోస్టాఫీస్‌లో..

విద్యాధరపురం: వన్‌టౌన్‌లోని ప్రధాన తపాలా కార్యాలయం(హెడ్ పోస్టాఫీస్)లో తపాలా సిబ్బందితో యోగా గురువులు ప్రవీణ, శైలజలు యోగాసనాలు వేయించారు. సీనియర్ సూపరింటెండెంట్ ఎం.నరసింహస్వామి, సీనియర్ పోస్ట్‌మాస్టర్ రావూరి ఫణిప్రసాద్, జాయింట్ మేనేజర్ ఎల్.దేవానంద్, విజయవాడ డివిజన్ తపాలా సిబ్బంది పాల్గొన్నారు.





యోగాసనాలు వేస్తున్న ఉపాధి హామీ పథకం కూలీలు, డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్

విజయవాడ రైల్వే డివిజన్‌లో..

విజయవాడ రైల్వే డివిజన్‌లో నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ముఖ్య అతిథిగా డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ పాల్గొన్నారు. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏడీఆర్ఎం పి.ఈ.ఎడ్విన్, ఆపరేషన్స్ ఏడీఆర్ఎం శ్రీనివాసరావు, కొండా గౌరవ అతిథులుగా పాల్గొన్నారు. 400 మంది అధికారులు, ఉద్యోగులు యోగాసన కార్యక్రమంలో పాల్గొన్నారు. విజయవాడ డివిజన్ పర్సనల్ అధికారి ఎం.అనిరుధ్ యోగా దినోత్సవ విశిష్టతను తెలియజేశారు. యోగా మాస్టర్ తేజ యోగాసనాలను వేయించారు. జాక్ అండ్ జిల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో రైల్వే సిబ్బంది, విద్యార్థులకు యోగా శిబిరాలు నిర్వహించారు. 150 మంది పాల్గొన్నారు. ● ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కార్యాలయంలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. కర్నూల్, నెల్లూరు, విజయవాడ, ఏలూరు, కాకినాడ, విశాఖపట్నం, శ్రీకాకుళం, పోర్ట్‌బ్లెయిర్ డివిజన్ కార్యాలయాల్లో అధికారులు, సిబ్బంది యోగా కార్యక్రమంలో పాల్గొన్నారు. అమరావతి డిప్యూటీ జనరల్ మేనేజర్ యోగా సందేశమిచ్చారు.

వీపీ సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ మ్యాగజైన్ విడుదల

మొగల్రాజపురం, జూన్ 21: విద్యార్థుల్లో అంతర్లీనంగా సాహిత్య, భాషా, సృజనాత్మకతలను వెలికి తీయడానికి వీలుగా పాఠశాలలో మ్యాగజైన్ ఉపయోగపడుతుందని వీపీ సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ మేడ సీతారామయ్య అన్నారు. శుక్రవారం పాఠశాల మ్యాగజైన్‌ను ఆయన విడుదల చేశారు. అనంతరం ఆయన మ్యాగజైన్ ప్రాముఖ్యతను వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ కె.రోజ్‌మేరీ, ప్రధానోపాధ్యాయురాలు సీహెచ్ విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు కూల్చివేత

భవానీపురం, జూన్ 21 : 45వ డివిజన్ జోజినగర్ కరెంట్ ఆఫీస్ రోడ్డులో ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మించిన పెంట్ హౌస్‌ను టౌన్‌ప్లానింగ్ అధికారులు శుక్రవారం కూల్చేశారు. సిటీ ప్లానర్ ప్రసాద్‌కు వచ్చిన ఫిర్యాదుల మేరకు ఆయన స్వయంగా పలు ప్రాంతాలను సందర్శించారు. అనంతరం బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు పర్యవేక్షణలో పెంట్‌హౌస్‌ను తొలగించారు. ప్లాన్‌కు విరుద్ధంగా పై అంతస్థుకు నిర్మించిన గోడలను ధ్వంసం చేశారు.

బాబా ఆలయంలో అన్నదానం

భవానీపురం, జూన్ 21 : హెచ్‌బీ కాలనీ సంకల్పసిద్ధి షిర్డి సాయి బాబా ఆలయంలో పౌర్ణమి సందర్భంగా 400 మంది పేదలకు శుక్రవారం అన్నదానం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు బూర్లె వెంకటేశ్వరరావు, కార్యవర్గం మోటమర్రి సుబ్బారావు, యెనిగళ్ల సుబ్బారావుల ఆధ్వర్యంలో వివిధ హోమాలను, నవగ్రహ హోమాలను నిర్వహించారు. భక్తులు హోమంను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి, ప్రసాదాలను స్వీకరించారు.

లయోలాలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై అవగాహన

భారతీనగర్, జూన్ 21: ఆంధ్ర లయోలా ఇంజనీరింగ్ కళాశాలలో ఎంబీఏ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎంబీఏ విద్యార్థులకు సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై అవగాహన సదస్సు జరిగింది. కళాశాల సెక్రటరీ, డైరెక్టర్ ఫాదర్ జోజిరెడ్డి పాల్గొని విద్యార్థులకు పలు విషయాలను తెలియజేశారు. ఎంబీఏ డిపార్ట్‌మెంట్ హెచ్‌వోడీ, అధ్యాపకులు పాల్గొన్నారు.

పశ్చిమ అభివృద్ధే లక్ష్యంగా కృషి

● ఎమ్మెల్యే సుజనా చౌదరి

వన్‌టౌన్, జూన్ 21 : పశ్చిమ అభివృద్ధే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే సుజనా చౌదరి అన్నారు. శుక్రవారం ఆయన బీజేపీ నాయకుడు పోతిన వెంకటేశ్వరరావు నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయనకు ఘన స్వాగతం పలికిన వెంకటేశ్వరరావు దుశ్శాలువా కప్పి సత్కరించారు. అనంతరం వెంకటేశ్వరరావుకు సుజనాచౌదరి తీపి తినిపించారు. ఈ సందర్భంగా ఎన్నికలలో అనుసరించిన వ్యూహాలను చర్చించుకున్నారు. నాయకులు అడ్డూరి శ్రీరామ్, పోతిన అచ్యుతరావు, ఉమ్మడి వెంకటేశ్వరరావు, బుల్లా విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా బ్రహ్మోత్సవాలు

● కృష్ణాజలాలతో స్వామివారికి అభిషేకం



స్వామివార్లకు పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న కమిటీ సభ్యులు

చిట్టినగర్, జూన్ 21: చిట్టినగర్‌లో ఉన్న పద్మావతి గోదాదేవి సమేత గరుడాచల స్థిత వేంకటేశ్వరస్వామి వార్ల త్రయోదశ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారుజామున స్వామిని పెళ్లి కుమారునిగా చేసేందుకు అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలి వచ్చారు. చిట్టినగర్ ఆలయం నుంచి మహిళా భక్తులు కలశాలతో బ్రాహ్మణవీధి నుంచి కృష్ణానదికి చేరుకొని కృష్ణాజలాలను తీసుకొచ్చి అభిషేకం చేశారు. ఉదయం ఆలయ అర్చకులు రత్నమాచార్యులు, శ్రీనువాసుల గోపాల్‌లు స్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు, అభిషేకాలు చేశారు. స్వామిని, అమ్మవారిని పెండ్లి కుమారుడిగా, పెళ్లి కుమార్తెలుగా అలంకరించి కృష్ణాజలాలు, పాలు, చందనంతో అభిషేకాలు చేశారు. సాయంత్రం విష్వక్సేన పుణ్యాహవచనం, అఖండ దీపారాధన, అంకురార్పణ, వాస్తు హోమం, వాస్తుపూజ, దీక్షాచరణ, కంకణధారణ, గరుడ ఆరాధన చేశారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

మొక్కు చెల్లించేందుకు తరలిన టీడీపీ నేతలు



భారతీనగర్, జూన్ 21: తూర్పు పరిధి 4వ డివిజన్ కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు ఆధ్వర్యంలో ద్వారక తిరుమల యాత్రకు మొక్కు చెల్లించుకోవడానికి టీడీపీ నేతలతో బయలుదేరిన బస్సును రమేష్‌హాస్పిటల్ సెంటర్‌లోని డివిజన్ కార్యాలయం నుంచి ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ శుక్రవారం జెండా ఊపి ప్రారంభించారు. రాష్ట్రంలో కూటమి విజయం, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, ఎంపీ కేశినేని శివనాథ్‌లు గెలిచిన సందర్భంగా మొక్కు తీర్చుకునేందుకు తరలివెళ్లారు. గొరిపాటి మురళీ, నాగమణి, మార్త సూర్యకుమారి, రాజామణి, ఆంజనేయులు, జాస్తి కృష్ణారావు, దోనేపూడి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ

పటమట: 12వ డివిజన్ ఫరూఖ్‌నగర్‌లో నగరపాలక సంస్థ పరిధిలోని ఉర్దూ అప్పర్ ప్రైమరీ స్కూల్లో విద్యార్థులకు శుక్రవారం తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందజేశారు. స్థానిక కార్పొరేట్ పొట్లూరి సాయిబాబు, ప్రిన్సిపాల్ రెహానా సుల్తానా పాల్గొన్నారు.

ఆర్థిక బాధలు తాళలేక ఆత్మహత్య

వన్‌టౌన్, జూన్ 21: వ్యాపారంలో నష్టం రావడంతో పాటు ఆర్థిక బాధలు తాళలేక మల్లిఖార్జునపేటకు చెందిన మోండాల ప్రసాద్(41) శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాల ప్రకారం మల్లిఖార్జునపేట ఆకుల వారి వీధిలో ప్రసాద్ భార్య తిరుపతమ్మతో ఉంటున్నాడు. వీరికి సంతానం లేదు. ప్రసాద్ దుర్గగుడిలో కొబ్బరికాయలు కొట్టే కౌంటర్ వద్ద పనిచేస్తుండగా, భార్య కనకదుర్గనగర్‌లో తోపుడుబండిపై బొమ్మలు అమ్ముతుంది. గతంలో భార్యాభర్తలు తిరునాళ్లలో బొమ్మల కొట్టు పెట్టి వ్యాపారంలో నష్టపోయారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం తెల్లవారుజామున 5 గంటలకు ప్రసాద్ డ్యూటీకి వెళ్లి 8 గంటలకు ఇంటికి వచ్చాడు. టిఫిన్ తీసుకురమ్మని భార్యకు డబ్బులు ఇచ్చి పంపించాడు. 8.30కు తిరుపతమ్మ ఇంటికి వచ్చి చూడగా తలుపులు దగ్గరకు వేసి ఉండడంతో స్థానికుల సహాయంతో తలుపులు నెట్టి లోపలకు వెళ్లి చూడగా రేకుల షెడ్డుకు ప్రసాద్ చీరతో ఉరివేసుకుని వేలాడుతూ కనిపించాడు. స్థానికులు అతనిని కిందకు దింపి చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే ప్రసాద్ మృతి చెందినట్లు తెలిపారు. భార్య ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

నటి వరలక్ష్మి శరత్‌కుమార్ త్వరలోనే వివాహబంధంలోకి అడుగుపెట్టనున్నారు. కొన్ని రోజులుగా సినీ ప్రముఖులను కలసి తన పెళ్లికి ఆహ్వానిస్తున్నారు. శుక్రవారం ఆమె తన కాబోయే భర్త నికోలయ్ సచ్‌దేవ్‌తో కలసి అల్లు అర్జున్‌కు పెళ్లి పత్రిక అందించారు. ఈ సందర్భంగా దిగిన ఫొటోలను వరలక్ష్మి సోషల్ మీడియాలో షేర్ చేశారు.



'నోర్మూసుకొని వెళ్లు'



'ఎవరు ఏమనుకున్నా డోంట్ కేర్ నా జీవితం నా ఇష్టం' అంటారు శ్రుతీ హాసన్. తన వ్యక్తిగత జీవితం గురించి ఎవరైనా అమర్యాదకరంగా మాట్లాడినా లైట్ తీసుకోకుండా అప్పటికప్పుడు ఘాటుగా సమాధానమిస్తుంటారు శ్రుతి. తాజాగా ఆమె సోషల్ మీడియాలో అభిమానులతో ముచ్చటించారు. ఈ క్రమంలో ఓ నెటిజన్ 'దక్షిణాది యాసలో ఏదైనా చెప్పండి' అని ఆమెను అడిగారు. బదులుగా శ్రుతి 'మాపై జాతి వివక్షను చూపించొద్దు. ఇడ్లీ, దోశ, సాంబార్ లాంటి పేర్లతో మమ్మల్ని పిలవడం సరికాదు. ఎలా పడితే అలా పిలుస్తుంటే సరదాగా తీసుకోం. దక్షిణాది భాషలో ఏదైనా చెప్పమన్నావు కదా 'నోర్మూసుకోని వెళ్లు'' అని తమిళంలో బదులిచ్చారు. అయితే అనంత్ అంబానీ పెళ్లి వేడుకల్లో షారూఖ్‌ఖాన్ రామ్‌చరణ్‌ను వేదికపైకి ఆహ్వానించే క్రమంలో 'ఇడ్లీ వడ' అని పిలిచాడు. ఆ సంఘటనను దృష్టిలో ఉంచుకొనే ఇప్పుడు శ్రుతి ఇలా స్పందించి ఉంటారని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం శ్రుతీహాసన్ 'సలార్ 2', 'డకాయిట్', 'చెన్నై స్టోరీ' చిత్రాల్లో నటిస్తున్నారు.



ఈసారి కూడా ఓటమి లేదు

'ఇప్పటిదాకా ఒక్క ఫైట్ కూడా ఓడిపోలేదు, ఈ సారి కూడా ఓడిపోను, బాగా ప్రిపేరయ్యి వచ్చాను... చూసుకుందాం రా' అంటూ ప్రత్యర్థులకు సవాల్ విసురుతున్నారు ప్రభాస్. భారతీయ సినీ ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రం 'కల్కి 2898 ఏడీ' చిత్రం కోసం ప్రభాస్ చెప్పిన డైలాగ్ ఇది. ఈ నెల 27న ఈ చిత్రం విడుదలవుతోంది. శుక్రవారం చిత్రబృందం రిలీజ్ ట్రైలర్‌ను విడుదల చేసింది. అమితాబ్ బచ్చన్ అశ్వత్థామగా డేరింగ్ స్టంట్స్ చేశారు. కమల్‌హాసన్ పూర్తిగా సరికొత్త లుక్‌లో ఆశ్చర్యపరిచారు. బుజ్జితో కలసి ప్రభాస్ చేసిన సాహసాలు, పోరాట ఘట్టాల్లో దిశా పటానీ మెరుపులతో ట్రైలర్ ఆద్యంతం ఆకట్టుకుంది. ప్రభాస్, దీపికా పదుకొనే జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి నాగ్ అశ్విన్ దర్శకుడు. వైజయంతీ మూవీస్ పతాకంపై సి. అశ్వనీదత్ నిర్మిస్తున్నారు.



ఒదిగి ఉండే వ్యక్తిత్వం ఆయన సొంతం

ఇటీవలే ముంబైలో 'కల్కి' చిత్రబృందం నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో అమితాబ్ బచ్చన్ నిర్మాత సి. అశ్వనీదత్ పాదాలకు నమస్కరించబోగా, ఆయన సున్నితంగా వారించారు. ఆ తర్వాత అమితాబ్ పాదాలకు అశ్వనీదత్ నమస్కరించారు. అమితాబ్ లాంటి దిగ్గజ నటుడు తన వయసు, స్టార్‌డమ్‌ను పక్కనపెట్టి నిర్మాతకు ఎంతో గౌరవం ఇస్తూ పాదాభివందనం చేయడం ఆయన సంస్కారం, గొప్ప మనసుకు నిదర్శనం అని నెటిజన్లు కొనియాడారు. ఆ సంఘటనపై నిర్మాత అశ్వనీదత్ శుక్రవారం సోషల్ మీడియా వేదికగా స్పందించారు. అసలు అమితాబ్ ఆ రోజు ఈవెంట్‌లో అలా చేస్తారని తాను ఊహించలేదని చెప్పారు. 'నేను తేరుకొని ఆయనకు ప్రతి నమస్కారం చేయడానికి కొంచెం సమయం పట్టింది. అమితాబ్ బచ్చన్ భారతీయ సినిమా యోధుడు ఎంత ఎదిగినా ఒదిగి ఉండే ఆయన వ్యక్తిత్వానికి మరోసారి అభివందనం చేస్తున్నాన'ని తెలిపారు.

ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్‌గా
రజనీకాంత్



తమిళ అగ్రహీరోలు రజనీకాంత్, కమల్‌హాసన్ యాక్షన్ బాట పట్టారు. 'విక్రమ్', 'జైలర్' చిత్రాలతో వీరిద్దరూ తమిళంలోనే కాకుండా పాన్ ఇండియా స్థాయిలో సంచలన విజయాలు అందుకున్నారు. దీంతో తదుపరి చిత్రాలు కూడా ఇదే జానర్లో చేస్తున్నారు. మణిరత్నం దర్శకత్వంలో కమల్‌హాసన్ 'థగ్‌లైఫ్' కూడా యాక్షన్ ప్యాక్‌గా ఉండబోతోంది. అలాగే శంకర్ దర్శకత్వంలో వస్తున్న 'భారతీయుడు 2' చిత్రంలో పోరాట ఘట్టాలపై అంచనాలు భారీ స్థాయిలో ఉన్నాయి. 'జైలర్' ఊపులో రజనీకాంత్ సైతం ఇలాంటి చిత్రాలకు పెద్ద పీట వేస్తున్నారు. ప్రస్తుతం ఆయన హీరోగా రూపొందుతున్న చిత్రం 'వేట్టయాన్'. 'జై భీమ్' ఫేమ్ జ్ఞానవేల్ రాజా దర్శకుడు ఇందులో రజనీకాంత్ ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్ పాత్రలో కనిపించనున్నారు. చిత్రీకరణ చివరి దశలో ఉంది. 'వేట్టయాన్' తర్వాత రజనీకాంత్ లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో 'కూలీ' చిత్రం చేస్తున్నారు. అయితే రజనీకాంత్ ఈ సినిమాలో కూడా ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్‌గానే కనిపించనున్నారని కోలీవుడ్ టాక్. మానవ అక్రమ రవాణాను అడ్డుకునే నిజాయితీపరుడైన పోలీస్ ఆఫీసర్‌గా, క్రిమినల్స్‌ను ఏరివేసేందుకు ఎంతకైనా తెగించే ఖాకీగా ఆయన శక్తిమంతమైన పాత్రలో కనిపించనున్నారట. ఇది రజనీకాంత్ 171వ చిత్రం. సన్ పిక్చర్స్ నిర్మిస్తోంది. వచ్చే ఏడాది ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. సత్యరాజ్ కీలకపాత్ర పోషిస్తున్నారు.



పీరియాడిక్ యాక్షన్ డ్రామా

'విరుపాక్ష', 'బ్రో' చిత్రాల తర్వాత సాయిదుర్గ తేజ్ నటిస్తున్న కొత్త చిత్రం షూటింగ్ ఇటీవల ప్రారంభమైంది. రోహిత్ కేపీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని నిరంజన్‌రెడ్డి, చైతన్యరెడ్డి నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన అనౌన్స్‌మెంట్ పోస్టర్‌ను శుక్రవారం విడుదల చేశారు. చుట్టూ ల్యాండ్ మైన్స్, మధ్యలో ఎడారి భూమిలో ఓ పచ్చని చెట్టు.. ఉన్న ఈ పోస్టర్ అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. ఓ యూనివర్సల్ కాన్సెప్ట్‌తో ఈ సినిమా ఉంటుందని పోస్టర్ చూడగానే అర్థమవుతుంది. నిర్మాతలు మాట్లాడుతూ 'గ్రాండ్ స్కేల్‌లో భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం. పీరియాడికల్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో హీరో సాయి పాత్ర చాలా శక్తిమంతంగా ఉంటుంది. ప్రత్యేకంగా రూపొందించిన భారీ సెట్‌లో ప్రస్తుతం షూటింగ్ జరుగుతోంది. తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల చేస్తాం' అని చెప్పారు.

నాకై నేనే తప్పిపోయా

తమిళ హీరో విజయ్ ఆంటోనీ నటిస్తున్న తాజా చిత్రం 'తుపాన్'. పొయెటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ జానర్‌లో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రానికి విజయ్ మిల్టన్ దర్శకుడు. ఇంతకుముందు విజయ్ ఆంటోనీతో 'రాఘవన్', 'హత్య' చిత్రాలను నిర్మించిన కమల్ బోరా, డి.లలిత, ప్రదీప్, పంకజ్ బోరా ఈ సినిమాను తీస్తున్నారు. ఈ చిత్రం కోసం భాష్యశ్రీ రాసిన 'వెతికా నేనే నా జాడే నిలిచి.. నాకు నేనై తప్పిపోయా' అంటూ సాగే పాటను హరి దఫూషియా సంగీత దర్శకత్వంలో మాళ్వీ నేహా పాడారు. 'తుపాన్' చిత్రానికి ఈ పాట ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని దర్శక నిర్మాతలు చెప్పారు. మేఘా ఆకాశ్ ఈ చిత్ర కథానాయిక.



షారూఖ్‌తో హ్యాట్రిక్ చిత్రం



షారూఖ్‌ఖాన్, దర్శకుడు ఫర్హాన్ అక్తర్ కలయికలో త్వరలోనే మరో చిత్రం రాబోతోందనే మాట కొన్నాళ్లుగా బాలీవుడ్ మీడియాలో వినిపిస్తోంది. దీనిపై ఫర్హాన్ అక్తర్ ఓ ఇంటర్వ్యూలో స్పందించారు. కచ్చితంగా తమ కలయికలో ఓ చిత్రం ఉంటుందని చెప్పారు. గతంలో వీరిద్దరి కలయికలో 'డాన్ 2, లక్ బై ఛాన్స్' చిత్రాలు వచ్చాయి. మరోసారి వీరి కాంబినేషన్ కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు. 'డాన్ 3'లో షారూఖ్ నటిస్తారని అభిమానులు భావించారు. అయితే ఆయన స్థానంలో రణ్‌వీర్‌సింగ్ రావడం షారూఖ్ అభిమానులను నిరాశ పరిచింది. ఈ నేపథ్యంలో తమ కాంబినేషన్‌లో త్వరలోనే ఓ చిత్రం వస్తుందని ఫర్హాన్ చెప్పారు. బాద్ షా అభిమానుల అంచనాలకు తగ్గట్టుగా ఈ చిత్రం ఉంటుందన్నారు. 'డాన్ 3' పూరయ్యాక ఈ చిత్రం సెట్స్‌పైకి వెళ్లే అవకాశముంది.



మా ఊరు శ్రీకాకుళం..

'వెన్నెల' కిశోర్, అనన్య నాగళ్ల కీలక పాత్రలు పోషిస్తున్న చిత్రం 'శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్'. రైటర్ మోహన్ దర్శకత్వంలో వెన్నపూస రమణారెడ్డి నిర్మిస్తున్నారు, ఇటీవల విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్‌కు మంచి స్పందన వచ్చింది. తాజాగా ఈ సినిమాలోని 'మా ఊరు శ్రీకాకుళం' పాటను దర్శకుడు హరీశ్ శంకర్ విడుదల చేశారు. శ్రీకాకుళం గొప్పతనం వివరిస్తూ రామజోగయ్య శాస్త్రి రాసిన పాటను మంగ్లీ పాడారు. సునీల్ కశ్యప్ స్వరపరిచారు. ఈ సందర్భంగా హరీశ్ శంకర్ మాట్లాడుతూ 'ఈ సినిమా టైటల్ ఫన్నీగా ఉంది. మోహన్ రచయితగా నాకు చాలా కాలం నుంచి తెలుసు. పాట విజువల్స్ బాగున్నాయి. మంగ్లీ బాగా పాడింది. వెన్నెల కిశోర్ నుంచి ఒక డిఫరెంట్ సినిమా ఎక్స్‌పెక్ట్ చేస్తున్నా' అన్నారు. ఈ చిత్రానికి పాటలు: రామజోగయ్య శాస్త్రి, కాసర్ల శ్యామ్, ఫొటోగ్రఫీ: మల్లికార్జున్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: రాజేశ్ రామ్, సమర్పణ: లాస్య రెడ్డి.

ఫ్రెండ్స్‌తో పెళ్లి పార్టీ



బాలీవుడ్ హీరోయిన్ సోనాక్షిసిన్హా పెళ్లి వేడుకలు మొదలయ్యాయి. ఈనెల 23న ఆమె తన ప్రియుడు జహీర్‌ను పెళ్లాడబోతున్నారు. పెళ్లికి ముందు తన స్నేహితురాళ్లకు సోనాక్షి సిన్హా పార్టీ ఇచ్చారు. ఈ సందర్భంగా దిగిన ఫొటోలను ఆమె సోషల్ మీడియాలో అభిమానులతో పంచుకున్నారు. ముంబై శివార్లలోని విలాసవంతమైన రిసార్ట్‌లో వివాహ కార్యక్రమం నిర్వహించనున్నారు. శనివారం హల్దీ వేడుకను నిర్వహించేందుకు ఏర్పాట్లను పూర్తి చేసినట్లు బాలీవుడ్ మీడియా తెలిపింది. కుటుంబ సభ్యులు, సన్నిహితులు కొద్దిమంది మాత్రమే ఈ పెళ్లికి హాజరవుతున్నారు. తన కూతురు సోనాక్షి పెళ్లి విషయం తనకు చెప్పనేలేదన్న శత్రుఘ్నసిన్హా ఆ తర్వాత మాత్రం ఈ పెళ్లికి హాజరవుతున్నట్లు తెలిపారు. జహీర్, ఆయన కుటుంబ సభ్యులతో శత్రుఘ్న సిన్హా దిగిన ఫొటోలను సోనాక్షి సోషల్ మీడియాలో షేర్ చేశారు.

బుజ్జిమేక.. బుజ్జిమేక



గ్రామీణ నేపథ్యంలో రూపుదిద్దుకుంటున్న చిత్రం 'పొట్టేల్'. యువచంద్ర కృష్ణ, అనన్య నాగళ్ల ముఖ్య పాత్రధారులు. సాహిత్ మోత్కూరి దర్శకుడు. ఇప్పటి వరకూ విడుదలైన మూడు పాటలు ప్రేక్షకుల్ని అలరించాయి. తాజాగా నాలుగో పాటను శుక్రవారం విడుదల చేశారు. 'బుజ్జి మేక.. బుజ్జిమేక' అంటూ సాగే ఈ పాటను కాసర్ల శ్యామ్ రాయగా, కాలభైరవ పాడారు. శేఖర్‌చంద్ర స్వర పరిచారు. పాటలో విజువల్స్ ఆకట్టుకొనేరీతిలో ఉన్నాయి. హార్ట్ టచింగ్ సాంగ్‌గా దర్శకుడు చిత్రీకరించారు. అజయ్, ప్రియాంక శర్మ, తనస్వి చౌదరి, నోయల్ సీన్, ఛత్రపతి శేఖర్, శ్రీకాంత్ అయ్యంగార్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి నిశాంక్ రెడ్డి కుడితి, సురేశ్‌కుమార్ నడిగే నిర్మాతలు.

రివర్స్ లవ్‌స్టోరీ



ఆంగ్లంలో 'లవ్' అనే నాలుగు అక్షరాలను రివర్స్ చేస్తే 'ఈవోల్' అని వస్తుంది. ఆ టైటిల్‌తో ఓ రివర్స్ లవ్‌స్టోరీ వస్తోంది. సూర్య శ్రీనివాస్, శివ బొడ్డురాజు హీరోలుగా, జెన్నిఫర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రం షూటింగ్ పార్ట్ పూర్తి చేసుకుంది. ఈ నేపథ్యంలో దర్శకనిర్మాత రామ్ యోగి వెలగపూడి శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతూ 'ఇద్దరు స్నేహితుల మధ్య కుదిరిన అవగాహన నేపథ్యంలో ఈ సినిమా ఉంటుంది. వాణిజ్య విలువలతో క్రైమ్ థ్రిల్లర్‌గా రూపొందించాను. హైదరాబాద్, వైజాగ్‌లో షూటింగ్ జరిగింది' అని తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: సునీల్ కశ్యప్, ఫొటోగ్రఫీ: తేడా బ్యాచ్ సినిమా టీమ్, ఎడిటింగ్: విజయ్.



ముగిసిన జ్యేష్ఠాభిషేకం

» స్వర్ణ కవచంలో మలయప్ప దర్శనం

తిరుమల, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో మూడురోజుల పాటు జరిగిన జ్యేష్ఠాభిషేక ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. చివరిరోజు ఉభయ దేవేరులతో కలిసి మలయప్పస్వామి బంగారు కవచంలో దర్శనమిచ్చారు. మళ్లీ జ్యేష్ఠాభిషేకం వరకు సంవత్సరం పొడవునా స్వామి, అమ్మవార్లు ఈ బంగారు కవచంతో ఉంటారు. ఉదయం మలయప్పస్వామి ఉభయనాంచారులతో కలిసి శ్రీవారి ఆలయంలోని సంపంగి ప్రాకారానికి వేంచేశారు. ఆలయ అర్చకులు, వేదపారాయణదారులు శాస్త్రోక్తంగా మహాశాంతి హోమం నిర్వహించారు. మలయప్పస్వామికి, దేవేరులకు శతకలశ తిరుమంజనం చేపట్టారు. అనంతరం స్వర్ణ కవచాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామికి స్వర్ణకవచ సమర్పణ వేడుకగా జరిగింది. సహస్రదీపాలంకరణ సేవ అనంతరం స్వామి, అమ్మవార్లు మాడవీధుల్లో ఊరేగి భక్తులకు దర్శనమిచ్చారు.

శ్రీవారి సేవలో జస్టిస్ రవీంద్రబాబు



తిరుమల, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవీంద్రబాబు శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. వేకువజామున జరిగిన అభిషేక సేవలో పాల్గొన్నారు. అలాగే హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఉమాదేవి కూడా శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్నారు.

హైకోర్టు లీగల్ సర్వీసెస్ చైర్మన్‌గా జస్టిస్ నరేందర్



అమరావతి, జూన్ 21(ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టు లీగల్ సర్వీసెస్ చైర్మన్‌గా న్యాయమూర్తి జస్టిస్ జి.నరేందర్ నియవిస్తూ ప్రభుత్వం శుక్రవారం గజిట్ ప్రచురించింది. ఏపీ హైకోర్టు సీజే, ఏపీ న్యాయసేవాధికార సంస్థ పాట్రన్ ఇన్ చీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ నిర్ణయం మేరకు ఈ నియామకం జరిగింది.

విద్యుత్ కుంభకోణాలపైనా విచారణ కోరాం

» దీనిపై సీబీఐ, ఈడీలకు కూడా ఫిర్యాదు చేస్తాం: ఎంపీ సీఎం రమేశ్

అమరావతి, జూన్ 21(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో చోటు చేసుకొన్న మద్యం, ఇసుక కుంభకోణాలతోపాటు విద్యుత్ రంగ కుంభకోణాలపై కూడా తమ పార్టీ విచారణ కోరిందని బీజేపీ అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ వెల్లడించారు. శుక్రవారం ఆయన ఇక్కడ అసెంబ్లీ లాబీల్లో మీడియా ప్రతినిధులతో ముచ్చటించారు. ముఖ్యమంత్రి చంద్రబాబును గురువారం రాత్రి ఆయన నివాసంలో కలిసినప్పుడు విద్యుత్ రంగ కుంభకోణాలపై కూడా విచారణ కోరుతూ తమ పార్టీ తరఫున లేఖ అందచేసినట్లు ఆయన తెలిపారు. 'కేంద్ర ప్రభుత్వం పంప్డ్ స్టోరేజి ప్రాజెక్టును రాష్ట్రానికి కేటాయించింది. వాటికి టెండర్లు పిలిచి నిష్పాక్షికంగా కంపెనీలను ఎంపిక చేయాల్సింది పోయి వైసీపీ ప్రభుత్వం తమకు కావాల్సిన వారికి నామినేషన్ పద్ధతిలో కట్టబెట్టింది. ఇది భారీ కుంభకోణం. అలాగే స్మార్ట్ మీటర్ల ఏర్పాటు పనుల అప్పగింతలోనూ భారీ అక్రమాలు చోటు చేసుకొన్నాయి. విద్యుత్ పీపీఏల్లో కూడా అవినీతి ఉంది. వీటన్నింటిపైనా విచారణ జరగాలి. వీటిపై మేం కేంద్ర ప్రభుత్వ సంస్థలు సీబీఐ, ఈడీలకు కూడా ఫిర్యాదు చేసి విచారణ జరపాలని కోరనున్నాం' అని రమేశ్ చెప్పారు. వైసీపీ పాలనలో అనేక శాఖల్లో భారీ కుంభకోణాలు చోటు చేసుకొన్నాయని.. వీటన్నింటిపైనా విచారణ జరపాల్సి ఉందని ఆయన అన్నారు.

పంచాయతీల లెక్కలు తేల్చండి

కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులెన్ని..?.. గత సర్కారు దారి మళ్లించిన నిధులెన్ని..?

» పంచాయతీల్లో డబ్బులు లేవన్న అధికారులకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాలు

» సీజనల్ వ్యాధుల నివారణకు సిద్ధం కావాలని సూచన

» గత ప్రభుత్వం నిధులు దారి మళ్లించింది: మంత్రి నారాయణ

» డయేరియాపై అప్రమత్తంగా ఉండాలి: మంత్రి సత్యకుమార్

» అసెంబ్లీలో మంత్రుల సమీక్ష



అమరావతి, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలకు వెంటనే నిధులు విడుదల చేసి తాగునీటి, పారిశుధ్యం మెరుగుదలకు చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు. అయితే.. పంచాయతీల్లో నిధులు లేవని అధికారులు ఆయనకు చెప్పగా.. కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం ద్వారా ఇచ్చిన నిధులెన్ని.. గత వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించిన నిధులెన్ని..? లెక్కలు తేల్చాలని ఆదేశించారు. శుక్రవారం అసెంబ్లీలోని సమావేశ హాల్లో మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌తో కలిసి గ్రామాల్లో తాగునీటి పరిస్థితిపై ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. స్వచ్ఛమైన తాగునీరు అందించే పరిస్థితి లేకుండా నిధులు మళ్లించేశారా..?, స్థానిక సంస్థలకు వచ్చే ఆర్థిక సంఘం నిధులు, వచ్చే ఆదాయం, చేసిన ఖర్చులతో కూడిన వివరాలతో సమగ్ర నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఏటా వర్షాకాలంలో వాతావరణం మారే సమయంలో వచ్చే వ్యాధులు గ్రామీణుల జీవన ప్రమాణాలను దెబ్బతీస్తున్నాయని పవన్ కల్యాణ్ ఆందోళన వ్యక్తంచేశారు. గత నాలుగు నెలల్లో గుంటూరు, విజయవాడ, కాకినాడ, జంగారెడ్డిగూడెం తదితర ప్రాంతాల్లో డయేరియా ప్రబలి అనేక మంది ఆస్పత్రుల్లో చేరారన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పటిష్ఠ కార్యాచరణ ప్రణాళికను అమలు చేయాలని ఆదేశించారు. డయేరియా నివారణకు ర్యాపిడ్ టీమ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 217 తాగునీటి వనరుల్లో నీటి నాణ్యత పరీక్షలు నిర్వహించగా నీరు కలుషితంగా ఉన్నట్లు తేలిందని అధికారులు పవన్ కల్యాణ్‌కు చెప్పారు. వెంటనే స్పందించిన పవన్.. నియంత్రణ చర్యలు చేపట్టాలని సీఎస్‌ఎకు సూచించారు. సురక్షిత తాగునీటి కోసం, తాగునీటి పైపులు పరిశుభ్రం చేసేందుకు నిధులు విడుదల చేయలేదని వైద్య ఆరోగ్యశాఖ ద్వారా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మున్సిపల్ పట్టణాభివృద్ధి శాఖలకు పలు దఫాలు లేఖలు రాశామని, పంచాయతీల్లో నిధులు లేకపోవడంతో ఆ పనులు జరగలేదని వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు ఉపముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. మున్సిపల్ మంత్రి నారాయణ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం నిధులు ఇతర అవసరాలకు మళ్లించడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. 15వ ఆర్థిక సంఘం తాగునీటి కోసం ఇచ్చిన నిధులను సైతం దారిమళ్లించి గ్రామాలను సమస్యల్లోకి నెట్టారన్నారు. దీంతో గుంటూరు, విజయవాడ, కాకినాడ, ఏలూరు, జంగారెడ్డిగూడెం, తుని ప్రాంతాల్లో డయేరియా ప్రబలిందన్నారు. కాగా, వెంటనే నిధులు విడుదల చేయాలని పవన్ ఈ సందర్భంగా సీఎస్‌ను ఆదేశించారు.

ప్రజల్లో అవగాహన కల్పించాలి: సత్యకుమార్

డయేరియా విషయంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులకు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ దిశానిర్దేశం చేశారు. జూలై 1 నుంచి ఆగస్టు 31 వరకు డయేరియా నియంత్రణపై ప్రచార కార్యక్రమం నిర్వహించి ప్రజల్లో అవగాహన కలిగించాలన్నారు. డయేరియా బాధితులకు సత్వరమే వైద్య సేవలందించాలని, అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని చెప్పారు.

కేంద్రమిచ్చినా విడుదల కాని నిధులు

ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు వెంటనే గత ప్రభుత్వంలో 15వ ఆర్థిక సంఘం ద్వారా కేంద్రం విడుదల చేసిన నిధులు, రాష్ట్రంలోని గ్రామీణ స్థానిక సంస్థలకు చేరిన నిధుల వివరాలు తెలియజేశారు. కేంద్రం నుంచి 15వ ఆర్థిక సంఘం నిధులు 2020-21లో రూ.2,626 కోట్లు, 2021-22లో రూ.1,918 కోట్లు, 2022-23లో 1,986 కోట్లు, 2023-24లో రూ.1,998 కోట్లు విడుదలయ్యాయని...2024-25కు సంబంధించి రూ.2,152 కోట్లు ఇంకా విడుదల కాలేదని చెప్పారు. 15వ ఆర్థిక సంఘం ద్వారా రూ.10,757 కోట్లకుగాను రూ.8,527 కోట్లు విడుదలైతే అందులో రూ.6,140 కోట్లు మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం ఆయా స్థానిక సంస్థలకు విడుదల చేసిందని తెలిపారు. 2023-24 సంవత్సరానికి సంబంధించి రెండో విడత నిధులు రూ.998 కోట్ల కోసం ఆర్థికశాఖకు ప్రతిపాదించినా ఇంకా విడుదల కాలేదని పేర్కొన్నారు.

ఆరోగ్య భాగ్యానికి యోగా

» మంత్రి సత్యకుమార్ యాదవ్

» ఆయుష్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం

» మానసిక వికాసానికి యోగా అవసరం: పురందేశ్వరి

విజయవాడ, జూన్ 21: మన ఘన వారసత్వ సంపద యోగా ఆరోగ్య భాగ్యానికి సులువైన మార్గమని మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. 10వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శుక్రవారం విజయవాడ ఎంజీ రోడ్డులోని ఏ ప్లస్ కన్వెన్షన్ సెంటర్‌లో రాష్ట్ర ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక వేడుకలు జరిగాయి. ఈ వేడుకలకు మంత్రి సత్యకుమార్ యాదవ్, అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, తిరువూరు, ఎచ్చెర్ల శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు, ఎన్.ఈశ్వరరావు, పలువురు అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, శరీరంతో పాటు మనసు శక్తిమంతం కావాలంటే అందుకు ఏకైక మార్గం యోగా అని పేర్కొన్నారు. ఈ ఏడాది 'యోగా ఫర్ సెల్ఫ్ అండ్ సొసైటీ' ఇతివృత్తంతో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు జరుగుతున్నాయన్నారు. తొలుత యోగా ద్వారా మన శరీరాన్ని, మనసును సంస్కరించుకొని తర్వాత సామాజిక శ్రేయస్సుకు కృషి చేయాలన్న గొప్ప సందేశం ఇందులో ఉందని అన్నారు. సీఎం రమేశ్ మాట్లాడుతూ, పైసా ఖర్చులేకుండా యోగాసనాల అభ్యసన ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చన్నారు. ప్రకృతి వైద్యులు మంతెన సత్యనారాయణరాజు సారథ్యంలో యోగాసనాల సాధన జరిగింది. ఆయుష్ శాఖ రూపొందించిన ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ఆఫ్ ఫార్మసీస్ అండ్ డాక్టర్స్ వెబ్‌సైట్‌ను, ఆశా/ఏఎన్ఎంల కోసం రూపొందించిన శిక్షణ పుస్తకాన్ని మంత్రి సత్యకుమార్ యాదవ్, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలసి ఆవిష్కరించారు.



అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొన్న మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎంపీ సీఎం రమేశ్ ఇతర అధికారులు

యోగాకు అంతర్జాతీయ ప్రాచుర్యం తెచ్చిన మోదీ

'యోగా అంటే కేవలం ఆసనాలు వేయడమే కాదు. నేటి ఒత్తిడి ప్రపంచంలో మానసిక వికాసానికి అవసరం' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. యోగా దినోత్సవం సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యాలయం వద్ద ఆమె పలువురితో కలిసి యోగా చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మన దేశంలో పుట్టిన యోగాకు నరేంద్ర మోదీ అంతర్జాతీయ ప్రాచుర్యం తీసుకొచ్చారని కొనియాడారు. ప్రతి ఒక్కరూ యోగా అలవరుచు కోవాలని సూచించారు.

హైకోర్టులో ఘనంగా యోగా వేడుకలు

అమరావతి, జూన్ 21(ఆంధ్రజ్యోతి): హైకోర్టు ప్రాంగణంలో యోగా వేడుకలు ఘనంగా నిర్వహించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శుక్రవారం వేర్వేరుగా నిర్వహించిన కార్యక్రమాల్లో హైకోర్టు న్యాయమూర్తులు, న్యాయవాదులు, ఉద్యోగులు యోగాసనాలు వేశారు.

ఇకపై 'అబ్దుల్ కలాం విదేశీ విద్య'

» ముస్లిం యువత కోసం కర్నూలు, కడపల్లో కమర్షియల్ కాంప్లెక్స్‌లు : మంత్రి ఫరూఖ్



మంత్రిగా బాధ్యతలు చేపడుతున్న ఎన్ఎండీ ఫరూఖ్

అమరావతి, జూన్ 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మైనారిటీ, న్యాయశాఖా మంత్రిగా ఎన్ఎండీ ఫరూఖ్ శుక్రవారం అమరావతి సచివాలయంలోని మూడవ బ్లాక్‌లో తనకు కేటాయించిన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తొలిసారిగా వక్ఫ్‌బోర్డుకు సంబంధించిన ఫైళ్లను పరిశీలించి సంతకం చేశానన్నారు. ప్రధానమంత్రి జన్ వికాస్ కేంద్రం(పీఎంజేవీకే) వంటి కేంద్ర పథకాల ద్వారా మైనార్టీల కోసం నైపుణ్యాభివృద్ధి విద్య, ఆరోగ్యం, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అంశంపై ఉన్నతాధికారులతో చర్చించి తగు నిర్ణయం తీసుకుంటామన్నారు. పీఎంజేవీకే కింద 2014-19లో మంజూరైన రూ.643.54 కోట్ల విలువైన 77 ప్రాజెక్టులను గత ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఈ క్రమంలో గత ఐదేళ్లలో ప్రాజెక్టుల విషయంలో ఎలాంటి పురోగతి లేని జిల్లాల కలెక్టర్లకు ఉత్తర్వులు ఇచ్చి త్వరగా వాటిని పూర్తి చేయాల్సిందిగా మైనార్టీల సంక్షేమశాఖ కార్యదర్శి కె.హర్షవర్ధన్‌కు సూచించినట్లు తెలిపారు. వక్ఫ్‌బోర్డుకు రూ.కోట్ల విలువైన ఆస్తులు ఉన్నాయని వాటిని కాపాడుతామన్నారు.

ఏజీతో 'ఐలు' నాయకుల మర్యాదపూర్వక భేటీ

» న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి

అమరావతి, జూన్ 21(ఆంధ్రజ్యోతి): అఖిల భారత న్యాయవాదుల సంఘం(ఐలు) రాష్ట్ర కార్యవర్గం సభ్యులు శుక్రవారం రాష్ట్ర అడ్వకేట్ జనరల్(ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఏజీగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో ఆయనకు ఐలు జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు సుంకర రాజేంద్రప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి నర్రా శ్రీనివాసరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లూరి మాధవరావు, ఉపాధ్యక్షుడు వై.రమేష్ , ఇతర కార్యవర్గం సభ్యులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలను ఏజీ దృష్టికి తీసుకొచ్చారు.

రబీ కరువు నష్టంపై నివేదిక సిద్ధం

» ఆరు జిల్లాల్లో కేంద్ర బృందం పర్యటన

» 319.77కోట్ల సాయం కోరిన రాష్ట్ర విపత్తుల శాఖ

అమరావతి, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 2023-24 రబీ సీజన్‌లో ఏర్పడిన కరువు పరిస్థితులపై కేంద్ర బృందం అధ్యయనం చేసి, నివేదికను తయారు చేసింది. కేంద్ర రైతు సంక్షేమశాఖ సంయుక్త కార్యదర్శి రితేష్‌చౌహాన్ నేతృత్వంలోని బృందం నాలుగు రోజుల పాటు నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, ప్రకాశం జిల్లాల్లో పర్యటించింది. శుక్రవారం విజయవాడలో విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయంలో రాష్ట్ర ఉన్నతాధికారులతో కేంద్ర బృందం సమావేశమై, కరువు పరిస్థితులను వివరించారు. ఈ సందర్భంగా కేంద్ర సంయుక్త కార్యదర్శి రితేష్ చౌహాన్ మాట్లాడుతూ 'క్షేత్రస్థాయిలో కరువు వల్ల నష్టం వివరాలను ఫొటో ప్రదర్శన ద్వారా, రైతులతో మాట్లాడి తెలుసుకున్నాం. కేంద్రానికి నివేదిక అందజేస్తాం. వీలైనంత మేర బాధిత రైతుల్ని అన్ని విధాలా ఆదుకునేలా చూస్తాం' అని చెప్పారు. రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ మాట్లాడుతూ 'సాధారణం కంటే తక్కువ వర్షాల వల్ల 33% కన్నా ఎక్కువ పంట నష్టాన్ని పరిగణలోకి తీసుకుని, 6జిల్లాల్లో 63 తీవ్ర కరువు, 24 మండలాల్లో మధ్యస్థ కరువు మండలాలుగా ప్రభుత్వం ప్రకటించింది. కరువు బారిన పడిన రైతులను ఆదుకునేందుకు సత్వరమే రూ.319.77కోట్లు ఆర్థిక సహాయం కావాలి. ఉపాధి హామీ పథకం కింద అదనంగా మరో 50 పని దినాలు కరువు ప్రాంతం కూలీలకు కల్పించాలి' అని కేంద్ర బృందానికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కోడికత్తి కేసు 4కి వాయిదా

» జగన్ కోర్టుకు వచ్చి సాక్ష్యం చెప్పాల్సిందే: న్యాయవాది సలీం

విశాఖపట్నం, జూన్ 21(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం విమానాశ్రయంలో జగన్మోహన్‌రెడ్డిపై కోడికత్తితో జరిగిన దాడి కేసు విచారణ జూలై నాలుగో తేదీకి వాయిదా పడింది. ఈ కేసు విచారణ శుక్రవారం విశాఖపట్నం ఎన్ఐఏ కోర్టులో జరిగింది. నిందితుడు శ్రీనివాసరావు కోర్టుకు హాజరుకాగా... బాధితుడు, ప్రధాన సాక్షి జగన్ రాకపోవడంతో కేసును వాయిదా వేశారు. దీనిపై న్యాయవాది సలీం మాట్లాడుతూ, 'ఇన్నాళ్లు ముఖ్యమంత్రిని అంటూ విచారణకు హాజరు కాలేదు. ఇప్పుడు సాధారణ ఎమ్మెల్యే కాబట్టి తప్పించుకోలేరు. కోర్టుకు వచ్చి సాక్ష్యం చెప్పాల్సిందే' అని స్పష్టం చేశారు. విదసం నాయకుడు వెంకటరావు మాట్లాడుతూ, 'పోలీసులు ఈ కేసులో పక్షపాత ధోరణి విడనాడాలి. ఈ ఘటనకు సంబంధించి రెండో కేసు నమోదైంది. అందులో నిందితులైన వైసీపీ నాయకులు కేకే రాజు, అదీప్‌రాజ్ తదితరులను కోర్టులో ప్రవేశపెట్టాలి' అని డిమాండ్ చేశారు.

తక్కువ శ్రమతో గరిష్ఠ ప్రయోజనం

ప్రపంచ శ్రేయస్సుకు యోగా ఓ సాధనం.. యోగా దినోత్సవంలో మోదీ!



యోగా దినోత్సవ వేడుకల్లో భారత సైనికులు



శ్రీనగర్‌లో మోదీ యోగాసనాలు

శ్రీనగర్, జూన్ 21: "ప్రపంచవ్యాప్తంగా యోగా అభ్యాసకుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. నేను సమావేశమైన ప్రతి దేశాధినేత యోగా ప్రయోజనాల గురించి మాట్లాడుతున్నారు. ఏకాగ్రత, జ్ఞాపకశక్తిని పెంపొందించి.. వ్యక్తిగత అభివృద్ధికి దోహదపడే మార్గం ఇది. అనేక సవాళ్లకు పరిష్కారం చూపుతుంది. తక్కువ శ్రమతో గరిష్ఠ లాభం పొందే విధానం యోగా" అని ప్రధాని మోదీ అన్నారు. ప్రస్తుతం ప్రపంచ శాంతికి యోగాను ఓ సాధనంగా చూస్తున్నారని పేర్కొన్నారు. ఫ్రాన్స్‌కు చెందిన 101 ఏళ్ల చార్లెట్ చోపిన్ ఎన్నడూ భారత్‌ను సందర్శించలేదని, కానీ, యోగా విశిష్టతను తెలుసుకుని జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు. ఫ్రాన్స్‌లో యోగా వ్యాప్తికి కృషి చేసిన ఆమెను పద్మశ్రీ పురస్కారంతో గౌరవించామని వివరించారు. శుక్రవారం ప్రపంచ పదో యోగా దినోత్సవం సందర్భంగా శ్రీనగర్‌లోని షేర్-ఎ-కశ్మీరీ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో మోదీ పాల్గొన్నారు. ప్రఖ్యాత దాల్ సరస్సు ఒడ్డున 7 వేలమందితో ప్రధాని ఆసనాలు వేసేలా తలపెట్టిన కార్యక్రమ వేదిక వర్షం కారణంగా మారింది. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ, 2015లో యోగా గురించి తొలిసారి ప్రస్తావించామని, అప్పటినుంచి క్రమంగా మార్పు మొదలైందన్నారు. సమాచార విప్లవ కాలంలో ప్రజలకు ఏకాగ్రత కుదరడం లేదని.. దానికి పరిష్కారమే యోగా అని ప్రధాని చెప్పారు. విశ్వవ్యాప్తమైన యోగా గురించి తెలుసుకునేందుకు భారత్‌కు వేలాదిమంది విదేశీయులు వస్తున్నారని చెప్పారు. కేరళ, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో యోగా టూరిజం జరుగుతోందని పేర్కొన్నారు. వ్యక్తిగత శిక్షకులను పెట్టుకుని మరీ సాధన చేస్తున్నారని, సంస్థల్లోనూ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, ఓ విధంగా యోగా సరికొత్త జీవనోపాధులు సృష్టించిందని చెప్పారు. కాగా, యోగా దినోత్సవాన్ని ప్రపంచవ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఆయా రాష్ట్రాల్లో రాజకీయ, సినీ ప్రముఖులు పాల్గొని ఆసనాలు వేశారు. ఐఎన్ఎస్ విక్రమాదిత్య యుద్ధ నౌకపైనా యోగాసనాలు వేశారు. అమెరికాలోని ప్రఖ్యాత న్యూయార్క్ టైమ్స్ స్క్వేర్‌లో భారత కాన్సులేట్ జనరల్ ఆధ్వర్యంలో వేలమంది ఆసనాలు సాధన చేశారు.

లోకం తీరు



పోలీసుల అదుపులో భారతీరెడ్డి పీఏ!

(మొదటి పేజీ తరువాయి)

సిద్ధమయ్యారు. భయపడి అబ్బే అదంతా మార్ఫింగ్ అంటూ పులివెందుల పోలీసులకు ఫిర్యాదు చేసి డ్రామాకు తెర తీశాడు. అతడి నీచ భాషను సహించలేక వివేకా కుమార్తె సునీత హైదరాబాద్ సైబర్ క్రైమ్‌లో ఫిర్యాదు చేశారు. చాలా వరకూ మహిళా నేతలనే రవీంద్రారెడ్డి టార్గెట్ చేశాడు. టీడీపీ మహిళావిభాగం అధ్యక్షురాలు (ప్రస్తుత హోం మంత్రి) వంగలపూడి అనిత, టీడీపీ సోషల్ మీడియా యాక్టివిస్ట్ ఉండవల్లి అనూషపై అనుచిత వ్యాఖ్యలతో హల్‌చల్ చేశాడు. జగనన్న సేవకుడినని గర్వంగా చెప్పుకొనే రవీంద్రారెడ్డి గత రెండేళ్లలో లెక్కలేనన్ని అసభ్య పోస్టులు పెట్టాడు. చంద్రబాబు, పవన్ కల్యాణ్, వారి కుటుంబ సభ్యులు, టీడీపీలోని మహిళా నేతలను దారుణంగా ట్రోల్ చేశాడు. ఆస్పత్రిలో అపస్మారక స్థితిలో పడి ఉన్న ఒక జనసేన బీసీ నాయకురాలిపై నీచమైన వ్యాఖ్యలు చేశాడు. వీటిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా లాభం లేకపోయింది. వారు వాటన్నిటినీ బుట్టదాఖలు చేశారు. అనితకు అక్రమ సంబంధాలు ఉన్నాయని.. ఇతర తెలుగు మహిళలు వ్యభిచారులంటూ రవీంద్రారెడ్డి పోస్టులు పెట్టాడు. భరించలేని అనిత అప్పట్లో సీరియస్‌గా వార్నింగ్ ఇచ్చారు. 'రవీంద్రారెడ్డీ.. ఇప్పుడు నువ్వు పులివెందులలో దాక్కోవచ్చు. టైమ్ ఎప్పుడూ ఒకేలా ఉండదు.. రేపంటూ ఒకటి ఉంటుంది.. నీ పాపాలకు వడ్డీ మీద వడ్డీ చెల్లిస్తాం' అని హెచ్చరించారు. అనిత హోం మంత్రి అయిన వెంటనే విలేకరుల సమావేశంలో రవీంద్రారెడ్డిపై విరుచుకుపడ్డారు. ఈ నేపథ్యంలోనే శుక్రవారం నాడు పులివెందుల-కదిరి మధ్యలో అతడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ విషయాన్ని వైసీపీ సోషల్ మీడియాలో ప్రచారం చేస్తోంది.

షర్మిలపై అధిష్ఠానానికి పద్మశ్రీ ఫిర్యాదు

- కార్యవర్గాన్ని రద్దు చేసిన పీసీసీ చీఫ్

అమరావతి, జూన్ 21(ఆంధ్రజ్యోతి): పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలపై వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర పద్మశ్రీ అధిష్ఠానానికి ఫిర్యాదు చేశారు. శుక్రవారం ఢిల్లీలో ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్‌ను కలసిన ఆమె.. 'ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక పారదర్శకంగా జరగలేదు. పీసీసీ చీఫ్‌గా షర్మిలను నియమించినపుడు కాంగ్రెస్ పార్టీ బలోపేతమవుతుందని భావించాం. కాని, అందుకు విరుద్ధంగా వ్యవహారాలు సాగాయి. షర్మిల నిర్ణయాల వల్లే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ఘోర ఓటమిని చవిచూశారు' అని ఫిర్యాదు చేశారు. ఈ సమాచారం తెలిసిన వెంటనే షర్మిల పీసీసీ కార్యవర్గాన్ని రద్దు చేశారు. త్వరలోనే కొత్త కార్యవర్గాన్ని ప్రకటిస్తామన్నారు.

డిస్టిలరీల విభాగం సీజ్

అమరావతి, జూన్ 21(ఆంధ్రజ్యోతి): విజయవాడలోని ఎక్సైజ్ కమిషనర్ కార్యాలయంలో డిస్టిలరీల విభాగాన్ని సీఐడీ సీజ్ చేసింది. పది రోజుల కిందటే బేవరేజెస్ కార్పొరేషన్ విభాగాలను సీజ్ చేయగా, గురువారం రెండో అంతస్తులో ఉన్న డిస్టిలరీల విభాగానికీ తాళాలు వేసింది. కార్పొరేషన్ మాజీ ఎండీ వాసుదేవరెడ్డి డిస్టిలరీస్ కమిషనర్‌గా కూడా పనిచేశారు. దీంతో అక్రమాలపై విచారణకు ఇబ్బంది రాకుండా ఈ మేరకు చర్యలు తీసుకున్నారు. డిస్టిలరీల వ్యవహారాల్లో భారీగా అక్రమాలు జరిగాయి. బ్రాండ్ల రెన్యువల్‌కు ఏటా భారీగా నగదు వసూలు చేశారు. కొత్త బ్రాండ్‌కు అనుమతి ఇచ్చేందుకు రూ.50లక్షల వరకు తీసుకున్నట్లు ఆరోపణలున్నాయి.

వాసుదేవరెడ్డి ఇంట్లో సీఐడీ సోదాలు

అమరావతి, జూన్ 21(ఆంధ్రజ్యోతి): ఏపీ బేవరేజెస్ మాజీ ఎండీ వాసుదేవరెడ్డిపై కేసు నమోదు చేసిన సీఐడీ బృందాలు కీలక ఆధారాలు సేకరించే పనిలో నిమగ్నమయ్యాయి. శుక్రవారం కుంచనపల్లిలోని ఆయన నివాసంలో సోదాలు చేపట్టిన అధికారులు చెన్నైకి చెందిన ఒక మద్యం కంపెనీ లావాదేవీలకు సంబంధించిన రహస్య డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఎక్కువగా ఆర్డర్లు పొందిన ఆ మద్యం కంపెనీ ప్రతినిధులతో వాసుదేవరెడ్డి జరిపిన ఆర్థిక లావాదేవీలు, అనధికారిక నగదు వ్యవహారాలపై సీఐడీ కూపీ లాగుతోంది. ఎన్నికల ఫలితాలకు ముందే వాసుదేవరెడ్డి అక్కడినుంచి కీలక డాక్యుమెంట్లు తరలించినట్లు కొన్ని సీసీటీవీ ఫుటేజీలను సీఐడీ సేకరించినట్లు సమాచారం.

వాసుదేవరెడ్డిపై చర్యలు తీసుకోవాలి: వర్ల

రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీ వాసుదేవరెడ్డిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్న సీఐడీ డీజీకి టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య శుక్రవారం ఓ లేఖ రాశారు. అనంతపురం జిల్లా విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారిగా ఉన్న పోలీస్ అధికారి మునిరామయ్య విచారణ నివేదికను పరిగణలోకి తీసుకోవాలని సీఐడీని కోరారు. గతంలో ధర్మవరం (ప్రస్తుత మాజీ) ఎమ్మెల్యే కేతిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలిచ్చిందని గుర్తు చేశారు.

ఫ్యాప్టో నూతన చైర్మన్‌గా ఎల్.సాయి శ్రీనివాస్

అమరావతి, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. చైర్మన్‌గా ఎస్టీయూ అధ్యక్షుడు ఎల్.సాయి శ్రీనివాస్, సెక్రటరీ జనరల్‌గా ఏపీటీఎఫ్-1938 ప్రధాన కార్యదర్శి ఎస్.చిరంజీవి ఎన్నికయ్యారు. కోచైర్మన్లుగా కె.నరహరి, బి.మనోజ్‌కుమార్, చందోలు వెంకటేశ్వర్లు, కె.ప్రకాశ్‌రావు, డిప్యూటీ సెక్రటరీ జనరల్స్‌గా ఎన్.వెంకటేశ్వర్లు, కె.భానుమూర్తి, వి.శ్రీనివాసరావు, కోశాధికారిగా చింతల సుబ్బారావు, కార్యదర్శులుగా ఎంఎస్ ఇమామ్ బాషా, డి.మధుసూదనరావు ఎన్నికయ్యారు.

కోస్తా, రాయలసీమల్లో తేలికపాటి వర్షాలు

విశాఖపట్నం, అమరావతి, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): ద్రోణి ప్రభావంతో శనివారం కోస్తా, రాయలసీమలోని పలు జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఇక, కోస్తాంధ్రలో అనేకచోట్ల శుక్రవారం ఉదయం నుంచి ఎండ తీవ్రత, ఉక్కపోత కొనసాగాయి. కొన్నిచోట్ల మేఘాలు ఆవరించినా వేడి వాతావరణం కొనసాగింది. పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2-4 డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. నెల్లూరులో 38.1, బాపట్లలో 38 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

గవర్నర్ కార్యదర్శిగా హరిజవహర్‌లాల్

అమరావతి, జూన్ 21(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ కార్యదర్శిగా ఎం హరి జవహర్‌లాల్‌ను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. మొన్నటి వరకూ కార్మిక శాఖ సెక్రటరీగా ఉన్న ఆయనను ప్రభుత్వం అక్కడ నుంచి బదిలీ చేసింది. ప్రస్తుతం పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న ఆయనను గవర్నర్ సెక్రటరీగా నియమించింది. రేపు ఉదయం రాజ్‌భవన్‌లో ఆయన బాధ్యతలు తీసుకోనున్నారు. డీజీపీ ద్వారకా తిరుమల రావుకు ఆర్టీసీ ఎండీగా అదనపు బాధ్యతలు అప్పగించింది.

ఇంటర్ విద్య కమిషనర్‌గా నిధి మీనా

అమరావతి, జూన్ 21(ఆంధ్రజ్యోతి): ఇంటర్ మీడియట్ ఎడ్యుకేషన్ కమిషనర్‌గా నిధి మీనాకు ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది. నలుగురు ఐఏఎస్‌లకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తూ నీరబ్‌కుమార్ ప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుతం నిధి మీనా వయోజన విద్య డైరెక్టర్‌గా ఉన్నారు. ఎస్ఎస్ఏ ఎస్పీడీగా విధులు నిర్వహిస్తున్న బీ శ్రీనివాసరావుకు స్కూల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించింది. మైన్స్ ప్రిన్సిపల్ సెక్రటరీగా ఎస్.యువరాజ్‌కు ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది. డైయిరీ డెవలప్‌మెంట్ ఎండీగా ఎం.ఎం.నాయక్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. తదుపరి ఉత్తర్వులిచ్చేదాకా వీరు ఈ బాధ్యతల్లో ఉంటారు.

నీట్ పరీక్ష నిర్వహణలో అడుగడుగునా లోపాలు

పలు పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాల్లేవు.. ప్రశ్నపత్రాలు ఉంచే గదులకు భద్రత కరువు

- పరిశీలకుల థర్డ్ పార్టీ రివ్యూలో వెల్లడి
- నీట్ కౌన్సెలింగ్ వాయిదాకు సుప్రీం నో
- 1563 మంది అభ్యర్థులకు రేపు మళ్లీ పరీక్ష



నీట్‌కు వ్యతిరేకంగా యూపీలో నిరసన ప్రదర్శన

న్యూఢిల్లీ, జూన్ 21: 'నీట్ పరీక్ష నిర్వహణలో అడుగడుగునా లోపాలున్నాయని థర్డ్ పార్టీ రివ్యూలో తేలింది. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో కలిపి దాదాపు 4 వేల కేంద్రాల్లో నీట్ పరీక్ష నిర్వహించిన సంగతి తెలిసిందే. రివ్యూలో భాగంగా వాటిలో 399 కేంద్రాల్లో థర్డ్ పార్టీ పరిశీలకులు తనిఖీలు చేశారు. నిబంధనల ప్రకారం.. నీట్ పరీక్ష జరిగే ప్రతి గదిలోనూ పనిచేసే రెండు సీసీ కెమెరాలు ఉండాలి. ఆ సీసీ కెమెరాలను ఢిల్లీలోని ఎన్‌టీఏ ప్రధాన కార్యాలయంలోని సెంట్రల్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేసి.. అక్కడున్న నిపుణులు పర్యవేక్షిస్తారు. కానీ.. థర్డ్ పార్టీ తనిఖీ చేసిన 399 సెంటర్లకు గాను 186 కేంద్రాల్లోని (46%) తరగతి గదుల్లో పనిచేసే సీసీ కెమెరాలు లేవు. అలాగే, ప్రశ్నపత్రాలను ఉంచే స్ట్రాంగ్ రూములకు గార్డులతో పటిష్ఠమైన భద్రత ఏర్పాటు చేయాల్సి ఉండగా.. 68 కేంద్రాల్లో (16%) అలాంటి ఏర్పాట్లు కనిపించలేదని వెల్లడైంది. 83 కేంద్రాల్లో.. ఉండాల్సిన బయోమెట్రిక్ సిబ్బందికి బదులుగా వేరే వ్యక్తులు ఉన్నట్టు గుర్తించారు. కాగా.. నీట్ కౌన్సెలింగ్‌ను వాయిదా వేయాలన్న అభ్యర్థనను సుప్రీంకోర్టు శుక్రవారం తిరస్కరించింది. నీట్ నిర్వహణలో జరిగిన అక్రమాల నేపథ్యంలో.. ఆ పరీక్షను రద్దు చేయాలంటూ దాఖలైన పిటిషన్‌పై జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టితో కూడిన ద్విసభ్య ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. ఈ పిటిషన్‌ను కూడా.. జూలై 8న చేపట్టే మిగతా పిటిషన్లతో కలిపి విచారిస్తామని స్పష్టం చేసింది. ఈ పిటిషన్‌పై స్పందన తెలపాలని కేంద్రానికి జాతీయ టెస్టింగ్ ఏజెన్సీకి (ఎన్‌టీఏ) నోటీసులిచ్చింది. అయితే, విచారణ సందర్భంగా పిటిషనర్ల తరఫు న్యాయవాది.. జూలై 6 నుంచి నిర్వహించతలపెట్టిన నీట్ కౌన్సెలింగ్‌ను రెండు రోజులపాటు వాయిదా వేసేలా ఆదేశాలు ఇవ్వాలని అభ్యర్థించారు. మొత్తం నీట్ పిటిషన్లన్నీ కలిపి 8వ తేదీన విచారించాలని ధర్మాసనం నిర్ణయించినందున, అప్పటిదాకా వాయిదా కోరుతున్నట్టు వివరించారు. ఈ అభ్యర్థనను కోర్టు తోసిపుచ్చింది.

మళ్లీ రాయనివ్వండి ప్లీజ్..

'హైపర్ హైడ్రోసిస్'(విపరీతంగా చెమటలు పట్టడం) అనే ఆరోగ్య సమస్య కారణంగా తాను మే 5న జరిగిన నీట్ పరీక్ష సరిగ్గా రాయలేకపోయానని.. 1563 మంది విద్యార్థులకు మళ్లీ జూన్ 23న పరీక్ష నిర్వహించడానికి ఎన్‌టీఏ సిద్ధమైనందున.. తనకు కూడా ఆరోజు మళ్లీ పరీక్ష రాసే అవకాశం కల్పించాలంటూ హైదరాబాద్‌కు చెందిన ఒక విద్యార్థి దాఖలు చేసిన పిటిషన్‌ను కూడా సర్వోన్నత న్యాయస్థానం శుక్రవారం విచారణకు స్వీకరించింది. ఎగ్జామ్ సెంటర్‌లోకి కర్చీఫ్‌ను కూడా తీసుకెళ్లనివ్వలేదని.. దీనివల్ల తన క్లయింట్ పరీక్షా కేంద్రంలో పెన్నును సరిగ్గా పట్టుకోలేకపోయాడని విద్యార్థి తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. దీంతో.. ఆ విద్యార్థి అభ్యర్థనపై ఏదో ఒక నిర్ణయం తీసుకుని, (శుక్రవారం) సాయంత్రం నాలుగు గంటల్లోగా అతడికి ఆ విషయాన్ని తెలుపాలని కోర్టు ఎన్‌టీఏను ఆదేశించింది. ఇదిలా ఉండగా, 1563 మంది అభ్యర్థులకు ఇచ్చిన గ్రేస్ మార్కులను ఉపసంహరించుకుని, వారికి మళ్లీ పరీక్ష పెడతామని కోర్టుకు తెలిపిన ఎన్‌టీఏ.. అందుకు ఏర్పాట్లు చేసింది. మేఘాలయ, హరియాణా, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, చండీగఢ్‌లోని కేంద్రాల్లో.. రకరకాల కారణాల వల్ల వీరందరికీ పరీక్ష రాయడం ఆలస్యమైంది. ఇప్పుడు ఆయా రాష్ట్రాల్లో ఏడు కేంద్రాల్లో ఆదివారం పరీక్ష నిర్వహించనున్నట్టు ఎన్‌టీఏ అధికారి ఒకరు తెలిపారు.

నిరసనల వెల్లువ..

నీట్, యూజీసీ-నెట్ పరీక్షల నిర్వహణలో అవకతవకలు, ప్రశ్నపత్రం లీక్ ఆరోపణల నేపథ్యంలో.. విద్యార్థి సంఘాలు, విపక్షాలూ వరుసగా రెండోరోజు దేశవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు నిర్వహించాయి. కాంగ్రెస్ పార్టీ అన్ని రాష్ట్రాల రాజధానుల్లో ఆందోళన కార్యక్రమాలు చేపట్టింది. నీట్ పేపర్ లీక్ అంశాన్ని పార్లమెంటులో తాను లేవనెత్తుతానని ఆ పార్టీ సీనియర్ నేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ప్రధాని మోదీ, ఆయన మంత్రుల చేతగానితనం కారణంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు అనిశ్చితిలో పడిందని ఆయన ఆవేదన వెలిబుచ్చారు. "గడిచిన ఏడేళ్లలో 70 పేపర్లు లీకయ్యాయి. రెండు కోట్ల మంది యువత ఆ లీకుల వల్ల నష్టపోయారు" అని రాహుల్ ఆ వీడియోలో అన్నారు. బీజేపీ పాలనలో పేపర్‌లీక్‌లు జాతీయ సమస్యగా మారాయని కాంగ్రెస్ నేత ప్రియాంక మండిపడ్డారు.

కల్తీసారా మృతులు 52

చెన్నై, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని కళ్లకుర్చి జిల్లా కరుణాపురం కల్తీసారా మృతుల సంఖ్య శుక్రవారం 52కు పెరిగింది. మరో 112 మంది బాధితులు పుదుచ్చేరి, విల్లుపురం, కళ్లకుర్చి, సేలం ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఇందులో 20 మంది పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్టు వైద్యులు ప్రకటించారు. కాగా కళ్లకుర్చిలో కల్తీసారా విక్రయాల వ్యవహారానికి సంబంధించి పోలీసులు మొత్తం ఆరుగురిని అరెస్టు చేశారు. కల్తీసారా కారణంగా 52 మంది మృతి చెందిన ఘటన శుక్రవారం అసెంబ్లీలో ప్రకంపనలు రేపింది. ఈ ఘటనకు బాధ్యత వహించి స్టాలిన్ సీఎం పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ అన్నాడీఎంకే ఎమ్మెల్యేలంతా నల్లచొక్కాలు ధరించి ప్లకార్డులు ప్రదర్శించారు. నినాదాలు చేశారు. దీంతో సభ గందరగోళంగా తయారవడంతో స్పీకర్ అప్పావు అన్నాడీఎంకే, పీఎంకే సభ్యులను సభ నుంచి మార్షల్స్ చేత గెంటేయించారు. కాగా, కల్తీసారా దుర్ఘటనపై సీబీఐతో దర్యాప్తు చేయించాలంటూ దాఖలైన పిల్‌పై విచారణ చేపట్టిన మద్రాస్ హైకోర్టు.. ఈ మరణాలకు ఎవరు బాధ్యులని ప్రభుత్వాన్ని నిలదీసింది. కల్తీసారాను అరికట్టేందుకు తీసుకున్న చర్యలేంటో చెప్పాలని ఆదేశించింది.

పిల్లల బాధ్యత ప్రభుత్వానిదే: స్టాలిన్

కళ్లకుర్చిలో కల్తీసారా తాగి మృతి చెందిన వారి పిల్లల బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని సీఎం స్టాలిన్ ప్రకటించారు. తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులు డిగ్రీ చదివే వరకు అయ్యే విద్యా సంబంధిత ఫీజులు, హాస్టల్ ఫీజులను ప్రభుత్వమే భరిస్తుందన్నారు. తల్లిదండ్రులను కోల్పోయి, సంరక్షకుడి పెంపకంలో ఉండే పిల్లలకు ప్రతి నెలా రూ.5వేల చొప్పున, వారికి 18 యేళ్ల వయస్సు వచ్చే వరకు ప్రభుత్వమే చెల్లిస్తుందని స్పష్టం చేశారు. అంతేగాక పిల్లల పేరుమీద రూ.5లక్షలు డిపాజిట్ చేసి, వారికి 18 యేళ్ల వయస్సు వచ్చినప్పుడు వడ్డీతో సహా ఆ మొత్తాన్ని అందిస్తుందని తెలిపారు.

ఆటోమేటిగ్గా గ్రీన్‌కార్డు

- అమెరికా కాలేజీల్లో చదివే విదేశీ విద్యార్థులందరికీ లక్కీ చాన్స్!
- గ్రాడ్యుయేషన్ పూర్తికాగానే మంజూరు
- మాజీ అధ్యక్షుడు ట్రంప్ ప్రతిపాదన



వాషింగ్టన్, జూన్ 21: అమెరికా అధ్యక్ష ఎన్నికల ముంగిట మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కొత్త వలస విధానాన్ని ప్రతిపాదించారు. అమెరికా కళాశాలల్లో చదివే విదేశీ విద్యార్థులందరికీ గ్రీన్‌కార్డు(శాశ్వత నివాస కార్డు)లు మంజూరుచేస్తామని ప్రకటించారు. గ్రాడ్యుయేషన్ పూర్తికాగానే ఆటోమేటిగ్గా గ్రీన్ కార్డు అందుకునేలా పాలసీ తీసుకొస్తానని తెలిపారు. దీనివల్ల చైనా, భారతీయ విద్యార్థులకు ఎంతగానో ప్రయోజనం కలుగుతుంది. వాస్తవానికి ఈ కొత్త పాలసీ ఆయన గత వైఖరికి భిన్నంగా ఉంది. ఆయన అధ్యక్షుడిగా ఉన్నప్పుడు అమెరికా స్వదేశీ విధానం.. 'బై అమెరికన్.. హైర్ అమెరికన్'ను కఠినంగా అమలు చేశారు. అత్యంత నైపుణ్య సిబ్బంది, విద్యార్థుల వలసలపై కఠిన ఆంక్షలు విధించారు. ఇప్పుడు ప్రవాస భారతీయులు, చైనీయుల మద్దతు కూడగట్టుకునేందుకు వైఖరి మార్చారని అంటున్నారు. గురువారం ఆయన వెంచర్ క్యాపిటలిస్టులు, టెక్ ఇన్వెస్టర్లతో పాడ్‌క్యాస్ట్ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఈ ప్రతిపాదన తీసుకొచ్చారు. జూనియర్ కాలేజీలు సహా అమెరికాలో ఏ కాలేజీలో చదివినా డిప్లొమాలో భాగంగా గ్రీన్‌కార్డు కూడా అందుతుందన్నారు. అమెరికా ఆర్థిక వ్యవస్థకు దన్నుగా నిలవడం కోసం నిపుణులందరూ అమెరికాలోనే నివసించడం అవసరమని పేర్కొన్నారు. అయితే, అమెరికా ప్రయోజనాలకు నష్టం కలిగించే కమ్యూనిస్టులు, ర్యాడికల్ ఇస్లామిస్టులు, హమాస్ మద్దతుదారులు, అమెరికా విద్వేషకులు, నేరాభియోగాలు ఉన్నవారికి ఇది వర్తించదని స్పష్టం చేశారు. ట్రంప్ ప్రతిపాదన చట్టమైతే.. గ్రీన్‌కార్డుల సంఖ్య భారీగా పెరుగుతుందని.. ఏటా 10 లక్షల మంది చైనా, భారత్ విద్యార్థులకు అమెరికా విద్యావకాశాలు కల్పిస్తోందని విశ్లేషకులు చెబుతున్నారు. ట్రంప్ ఆకస్మికంగా కొత్త పాలసీ ప్రతిపాదించడానికి ముఖ్యమైన కారణమే ఉంది. అధ్యక్షుడు, డెమోక్రాటిక్ పార్టీ అభ్యర్థి జో బైడెన్ గత మంగళవారం కొత్త వలస కార్యక్రమాన్ని ఆవిష్కరించారు. దీనిప్రకారం అమెరికన్ పౌరులను వివాహమాడేవారికి చట్టబద్ధమైన నివాస హక్కు, పౌరసత్వ హక్కు కల్పిస్తామన్నది దాని సారాంశం. ఇది బైడెన్‌కు, అధికార డెమోక్రాటిక్ పార్టీకి ఎన్నికల్లో లబ్ధి చేకూర్చే అవకాశం ఉండడంతో.. రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి ట్రంప్ ఆటోమేటిక్ గ్రీన్‌కార్డు విధానం ప్రతిపాదించారని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ ఏడాది నవంబరు 5న అమెరికా అధ్యక్ష ఎన్నికలు జరగనున్నాయి.

కేజ్రీవాల్ బెయిల్‌పై స్టే

తాత్కాలికంగా నిలిపివేసిన ఢిల్లీ హైకోర్టు

- 2-3 రోజుల్లో నిర్ణయం వెలువరిస్తామన్న న్యాయమూర్తి



న్యూఢిల్లీ, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు స్థానిక కోర్టు మంజూరు చేసిన బెయిల్‌పై ఢిల్లీ హైకోర్టు తాత్కాలిక స్టే విధించింది. దీంతో శుక్రవారం తిహాడ్ జైలు నుంచి విడుదల కావాల్సిన కేజ్రీవాల్ జైలులోనే ఉండిపోయారు. గురువారం రాత్రి కేజ్రీవాల్‌కు బెయిల్ లభించిన నేపథ్యంలో శుక్రవారం ఉదయమే ఈడీ.. విచారణ కోర్టు ఆదేశాలను హైకోర్టులో సవాల్ చేసింది. జస్టిస్ సుధీర్‌కుమార్ జైన్ దీనిపై విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఈడీ తరఫున వాదనలు వినిపించిన అడిషనల్ సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు.. కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరు చేసిన విచారణ కోర్టు న్యాయాధికారి నియయ్‌బిందుపై తీవ్ర ఆరోపణలు చేశారు. తనకు పూర్తిగా వాదనలు వినిపించటానికి అవకాశం ఇవ్వలేదన్నారు. తాము అప్పటికే సమర్పించిన పత్రాలను కూడా న్యాయాధికారి పరిశీలించలేదని, ఆ పత్రాలు చాలా ఎక్కువగా ఉన్నాయని వ్యాఖ్యానించారని చెప్పారు. కేసును త్వరగా ముగించేద్దామన్న ఆదుర్దాతో న్యాయాధికారి వ్యవహరించారని ఆరోపించారు. అహేతుకంగా, ఏకపక్షంగా ఆదేశాలు జారీ చేశారన్నారు. ఈడీ ప్రత్యక్ష సాక్ష్యాలు సమర్పించలేదన్న కోర్టు అభిప్రాయం సరైనది కాదని, మాగుంట శ్రీనివాసులురెడ్డి కేజ్రీవాల్‌ను కలిసినప్పుడు రూ.వంద కోట్లు డిమాండ్ చేశారని, ఈ విషయం మాగుంట వాంగ్మూలంలో ఉందన్నారు. గోవా అసెంబ్లీ ఎన్నికల కోసం రూ.45 కోట్లు మళ్లించారని సాక్ష్యాలతో నిరూపించినా క్రింది కోర్టు విస్మరించిందని అన్నారు. ఈ వాదనలను కేజ్రీవాల్ తరఫు సీనియర్ న్యాయవాదులు అభిషేక్ మనుసింఘ్వీ, విక్రమ్ చౌదరి ఖండిస్తూ వాదనలు వినిపించారు. విచారణ కోర్టులో ఈ కేసుపై ఐదు గంటల పాటు విచారణ జరిగితే.. అందులో 3 గంటల 45 నిమిషాల సమయం న్యాయాధికారి ఈడీకి ఇచ్చారని చెప్పారు. దేశంలోని పౌరులకు రాజ్యాంగం ప్రసాదించిన స్వేచ్ఛ ఈడీకి పట్టదని, బెయిల్ గురించి చట్టం స్పష్టంగా చెబుతోందని, కానీ, ఈడీ వ్యవహారం 'నా మాట వినకుంటే జైలుకే' అన్నట్లుగా ఉందన్నారు. విచారణ కోర్టు ఇచ్చిన ఆదేశాలను అహేతుకం అని ఈడీ న్యాయవాది అభివర్ణించటాన్ని తప్పుబడుతూ.. బావిలో కప్పలా తయారైన ఈడీకి అలా అనిపిస్తున్నట్టుంది అని ఎద్దేవా చేశారు. ఈ కేసుకు సంబంధించి కేజ్రీవాల్‌కు ఒక్క పైసా లభించినట్టుగా కూడా ఈడీ ఇప్పటివరకూ ఒక్క ఆధారమూ సేకరించలేదన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న జస్టిస్ సుధీర్ కుమార్ జైన్.. ఈ కేసుకు సంబంధించిన అన్ని రికార్డులను పరిశీలించి 2-3 రోజుల్లో నిర్ణయం వెలువరిస్తానని చెప్పారు. అప్పటి వరకూ విచారణ కోర్టు ఇచ్చిన బెయిల్‌పై స్టే విధిస్తున్నట్లు ప్రకటించారు. ఈ నెల 24వ తేదీలోపు ఇరుపక్షాలు లిఖితపూర్వక వాదనలు సమర్పించాలన్నారు. కేసును జూలై 10కి వాయిదా వేశారు.

ఢిల్లీ మంత్రి అతిషి నిరాహార దీక్ష

ఢిల్లీలో రోజురోజుకు నీటి సంక్షోభం ముదురుతోంది. హరియాణా నుంచి దక్కాల్సిన నీటి వాటాను డిమాండ్ చేస్తూ ఆ రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అతిషి దక్షిణ ఢిల్లీలోని భోగల్‌లో శుక్రవారం మధ్యాహ్నం నుంచి నిరవధిక నిరాహార దీక్షను ప్రారంభించారు. అంతకుముందు సునీత కేజ్రీవాల్, మంత్రి సౌరబ్ భరద్వాజ్, ఎంపీ సంజయ్ సింగ్ ఇతర పార్టీ నేతలతో కలసి రాజ్‌ఘాట్ వద్ద మహాత్మా గాంధీకి నివాళులర్పించారు. అతిషి దీక్ష ప్రారంభించిన అనంతరం.. కేజ్రీవాల్ జైలు నుంచి పంపిన సందేశాన్ని సునీత చదివి వినిపించారు. అతిషి చేపట్టిన దీక్ష విజయవంతమవుతుందని కేజ్రీవాల్ ఆశాభావం వ్యక్తం చేశారు.

యెడియూరప్పకు ఎలా?

ఓ బాలికపై లైంగిక దాడికి పాల్పడినట్లు తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న కర్ణాటక మాజీ సీఎం యెడియూరప్పకు అరెస్టు నుంచి రక్షణ కల్పిస్తూ యాంటిసిపేటరీ బెయిల్ లభించిందని, కిడ్నాప్ కేసు ఎదుర్కొంటున్న హెచ్‌డీ రేవన్నకు బెయిల్ లభించిందని.. కానీ, కేజ్రీవాల్, హేమంత్ సోరేన్‌లకు లభించలేదని సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఎంపీ కపిల్ సిబల్ పేర్కొన్నారు. దేశంలో నియంతృత్వం అన్ని హద్దులనూ దాటిందని కేజ్రీవాల్ భార్య సునీత విమర్శించారు.

దడ పుట్టిస్తున్న ధరలు!

భారత్‌లో ఆహార ధరోల్బణం.. మండిపోతున్న కూరగాయల రేట్లు

- పాలు, పప్పు దినుసుల ధరలు పైపైకి
- వర్షాభావం, వేడిగాలుల ప్రభావం
- 'నైరుతి' ముందే వచ్చినా జోరందుకోని సాగు
- ఆగస్టు వరకూ ధరలు తగ్గుదల లేనట్టే!



న్యూఢిల్లీ, జూన్ 21: భారత్‌లో ఆహార ధరోల్బణం నెలకొంది. కూరగాయలు, పప్పుదినుసులు, పాలు.. ఏది కొందామన్నా ధరలు దడ పుట్టిస్తున్నాయి. ప్రతికూల వాతావరణం, వర్షాభావం, తీవ్రమైన వడగాడ్పుల కారణంగా కూరగాయలు, తృణధాన్యాల ఉత్పత్తి గణనీయంగా తగ్గింది. దీంతో గతేడాది నవంబరు నుంచి దేశంలో వార్షిక ఆహార ద్రవ్యోల్బణం 8శాతంగా ఉంది. ఈ ఏడాది రుతుపవనాలు ముందే వచ్చినప్పటికీ ఈ నైరుతి సీజన్‌లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదవుతుందనే అంచనాలు ఉన్నా ఆగస్టు వరకు ద్రవ్యోల్బణం తగ్గే పరిస్థితి కనిపించడం లేదు. ఆహార ఉత్పత్తుల ధరల పెరుగుదల కారణంగా వినియోగదారులు అధికంగా ఖర్చుచేయాల్సి వస్తోంది.

ఆహార ద్రవ్యోల్బణానికి కారణం?

గతేడాది కరువు, ఈ ఏడాది ఇంకా కొనసాగుతున్న వడగాడ్పులతో పప్పుదినుసులు, కూరగాయలు, తృణధాన్యాల ఉత్పత్తి, సరఫరా గణనీయంగా తగ్గింది. దీంతో ధరలు పెరిగిపోయాయి. దీని నుంచి ఉపశమనం కోసం ఆహార ఉత్పత్తుల ఎగుమతులపై ఆంక్షలు విధించినా, దిగుమతులపై సుంకాలు తగ్గించినా పెద్దగా ప్రభావం చూపడంలేదు. సాధారణంగా వేసవిలో కూరగాయల ఉత్పత్తి తక్కువ ఉంటుంది. ఈ ఏడాది అది మరింత ఎక్కువగా కనిపిస్తోంది. దేశంలోని దాదాపు సగం ప్రాంతంలో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 4-9 శాతం అధికంగా నమోదవుతున్నాయి. దీనివల్ల పండించిన, నిల్వ చేసిన కూరగాయలు త్వరగా పాడైపోతున్నాయి. ఈ ఏడాది అధిక వేడి, నీటి ఎద్దడి కారణంగా నారు పోయడానికి, నాట్లు వేయడానికి ఆటంకం ఏర్పడింది. ఉల్లి, టమాటా, వంకాయ, ఆకుకూరల సాగుకి వేడి వాతావరణం ఆటంకం కలిగిస్తోంది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం వార్షిక ద్రవ్యోల్బణం కూరగాయలకు 28శాతం, పప్పుధాన్యాలకు 17శాతం, తృణధాన్యాలకు 8.6శాతం, మాంసం, చేపలకు 8.2శాతం, సుగంధ ద్రవ్యాలకు 7.8శాతం, గుడ్లకు 7.1శాతంగా ఉంది.

రుతుపవనాలు వచ్చినా ఎందుకీ పరిస్థితి?

నైరుతి రుతుపవనాలు ఈసారి ముందే భారత్‌లోకి ప్రవేశించాయి. దేశమంతా వేగంగానే పురోగమించాయి. అయితే ఆరంభంలో ఉన్న వేగం ఆ తర్వాత క్షీణించింది. దీంతో ఈ నైరుతి సీజన్‌లో ఇప్పటి వరకు 18శాతం లోటు వర్షపాతం నమోదైంది. రుతుపవనాల బలహీనతకు వడగాడ్పులు తోడవడంతో పంటలసాగు ఆలస్యమవుతోంది. ముఖ్యంగా వరి, పప్పుధాన్యాలు, కూరగాయలు, సోయాబీన్స్ సాగుపై తీవ్ర ప్రభావంపడింది. జూలై తొలివారంలో వర్షాలు పెరిగితే లోటు వర్షపాతం నుంచి బయటపడొచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. కాగా రుతుపవనాలు పుంజుకుని దేశవ్యాప్తంగా విస్తరించి వర్షాలు కురిస్తే ఆగస్టు నుంచి కూరగాయల ధరలు తగ్గే అవకాశం ఉంది. అయితే జూలై, ఆగస్టు నెలల్లో వరదలు లేదా ఎక్కువ రోజులు కొనసాగే పొడి వాతావరణం పంట ఉత్పత్తులపై ప్రభావం చూపొచ్చు. దీంతో డిమాండ్‌కు తగ్గ సరఫరా ఉండదు కాబట్టి పాలు, తృణధాన్యాలు, పప్పు దినుసుల ధరలు ఇప్పట్లో తగ్గే అవకాశం కనిపించడం లేదు. గోధుమల ఉత్పత్తి క్షీణించినా ప్రభుత్వం దిగుమతి చేసుకునే చర్యలు తీసుకోలేదు. దీంతో వాటి ధరలు మరింత పెరిగే చాన్స్ ఉంది. ధాన్యం కనీస మద్దతు ధరను ప్రభుత్వం 5.4 శాతం పెంచడంతో బియ్యం ధరలు పెరగొచ్చు. గతేడాది కరువుతో కంది, మినుములు, శనగల సరఫరా తగ్గింది. ఈ సీజన్‌లో ఆ పంటలు పండి మార్కెట్‌కు చేరేవరకు వాటి ధరలు తగ్గే అవకాశం ఉండదు. ఆహార ద్రవ్యోల్బణం నేపథ్యంలో కొన్ని ఉత్పత్తుల ఎగుమతులపై ఆంక్షలు విధించడం, దిగుమతులకు సుంకా న్ని తగ్గించడంవంటి చర్యలను కేంద్రం చేపట్టింది. ధరల తగ్గదలకు ఇది కొంతమేర సహాయపడుతుంది.

పిఠాపురం నుంచి డిప్యూటీ సీఎంగా..

అసెంబ్లీ గేటైనా తాకనివ్వబోమన్నారు.. భారీ విజయంతో సభలోకి పవన్..

- ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం
- సభ వాయిదాపడ్డాక ఆయనతో సెల్ఫీలు, ఫొటోల కోసం ఎమ్మెల్యేల హడావుడి



ఎమ్మెల్యేగా గెలవనివ్వబోమన్నారు.. అసెంబ్లీ గేటు కూడా తాకనివ్వబోమని సవాల్ చేశారు. వైసీపీ నేతల సవాల్‌ను జనసేనాని పవన్ కల్యాణ్ స్వీకరించారు.. ఇబ్బందులను, అవమానాలను అధిగమించి.. పిఠాపురం నుంచి భారీ మెజారిటీతో గెలిచి మొదటిసారి సభలోకి అడుగుపెట్టారు. అది కూడా ప్రభుత్వంలో భాగంగా.. ఉపముఖ్యమంత్రి హోదాలో సభాప్రవేశం చేశారు. ఆయన సభలోకి అడుగుపెడుతున్న సమయంలో కూటమి ఎమ్మెల్యేలంతా గట్టిగా బల్లలు చరిచి స్వాగతం పలికారు. ఆయన అందరికీ సమస్కరిస్తూ వచ్చి సభలో తనకు కేటాయించిన సీట్లో కూర్చుకున్నారు. ఆయన ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేస్తున్న సమయంలో కూడా సభ్యులు చప్పట్లతో అభినందించారు. ఉదయం సభలో అడుగుపెట్టినప్పటి నుంచి సభ వాయిదాపడేవరకు పవన్ సభలోనే గడిపారు. సభ నిర్వహణ, కార్యకలాపాలను ఆసాంతం పరిశీలించారు. ప్రమాణస్వీకారం చేసిన ప్రతి ఎమ్మెల్యే ప్రమాణ స్వీకారం అనంతరం ఆయన వద్దకు వచ్చి నమస్కారం చేయడంతో ఆయన కూడా వారందరికీ అభినందనలు తెలిపారు. ప్రొటెం స్పీకర్ సభను వాయిదా వేసిన తర్వాత ఎమ్మెల్యేలంతా ఆయన వద్దకు చేరారు. చాలా మంది సభలోనే ఆయనతో సెల్ఫీలు, ఫొటోలు దిగారు. పవన్ కూడా ఓపిగ్గా అందరితో మాట్లాడుతూ ఫొటోలు దిగారు. కాగా.. ఆయన సోదరుడు నాగబాబు జనసేన గుర్తు ఉన్న కండువాతో సభకు సందర్శకుడిగా వచ్చారు.

చంద్రబాబు శపథం నెరవేరింది: భువనేశ్వరి



టీడీపీ అధినేత చంద్రబాబు శపథం నెరవేరినందుకు ఆయన సతీమణి నారా భువనేశ్వరి సంతోషాన్ని వ్యక్తం చేశారు. నాటి శాసనసభలో శపథం చేసిన చంద్రబాబు... నేడు అదే సభలో ముఖ్యమంత్రి హోదాలో అడుగు పెట్టడంపై భువనేశ్వరి శుక్రవారం స్పందించారు. 'నేడు గౌరవ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు' అంటూ ఒక వీడియోను ఎక్స్‌లో పోస్టు చేశారు. 'నిజం గెలిచింది... ప్రజాస్వామ్యం నిలిచింది... తెలుగు ప్రజలకు ప్రణామం' అని భువనేశ్వరి పేర్కొన్నారు.

శుక్రవారం చంద్రబాబు ప్రమాణ స్వీకారాన్ని టీవీలో వీక్షిస్తున్న ఆయన సతీమణి భువనేశ్వరి



శాసనసభలో ప్రమాణస్వీకారం చేస్తున్న లోకేశ్



నిజం గెలిచింది... ప్రజాస్వామ్యం నిలిచింది అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న టీడీపీ ప్రజాప్రతినిధులు

ప్రతిజ్ఞ నెరవేరిన వేళ..!

కౌరవ సభను గౌరవ సభగా చేసిన తర్వాత ముఖ్యమంత్రిగానే సభకు వస్తానని 2021 నవంబరులో టీడీపీ అధ్యక్షుడు, నాటి విపక్ష నేత చంద్రబాబు అసెంబ్లీలో చేసిన ప్రతిజ్ఞ నెరవేర్చుకున్నారు. రెండున్నరేళ్ల తర్వాత సీఎం హోదాలోనే సభలో అడుగుపెట్టారు. శుక్రవారం ఉదయం ఆయన అసెంబ్లీ ప్రధాన ద్వారం ముందు మెట్ల వద్ద నడుం వంచి నమస్కరించి, పూలు చల్లి లోపల అడుగు పెట్టారు. 16వ శాసనసభ తొలి సమావేశానికి వచ్చిన ఆయనకు మంత్రులు, టీడీపీ ఎమ్మెల్యేలు ఘన స్వాగతం పలికారు. సభ భవనంలో అడుగు పెట్టడానికి ముఖ్యమంత్రికి ప్రత్యేక ద్వారం ఉంటుంది. అయితే చంద్రబాబు అటు వెళ్లకుండా ఎమ్మెల్యేలు వెళ్లే ప్రవేశ ద్వారం నుంచే అడుగు పెట్టారు. ఆయనకు అసెంబ్లీ ప్రధాన ద్వారం వద్ద వేద పండితులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. చంద్రబాబు లాబీల్లో నడుచుకుంటూ తన కార్యాలయంలోకి వెళ్లారు. అక్కడ వేద పండితులు మరోసారి ఆయనకు ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం ముహూర్తం ప్రకారం ఉదయం 9.46 గంటలకు సభలో ఆయన అడుగు పెట్టారు. సభలోకి రాగానే టీడీపీ ఎమ్మెల్యేలు 'నిజం గెలిచింది-ప్రజాస్వామ్యం నిలిచింది' అన్న నినాదం రాసి ఉన్న ప్లకార్డులను పట్టుకుని నిలబడ్డారు.

పసుపు చొక్కాలు, కండువాలతో..

తొలి రోజు అనేక మంది టీడీపీ ఎమ్మెల్యేలు, మంత్రులు పసుపు చొక్కాలు, కండువాలతో హాజరయ్యారు. శింగనమల ఎమ్మెల్యే శ్రావణి పసుపు చీర ధరించి వచ్చారు. వైసీపీ ఎమ్మెల్యేలు తమ పార్టీ కండువాలు, బీజేపీ ఎమ్మెల్యేలు కాషాయ కండువాలతో వచ్చారు. జనసేన ఎమ్మెల్యేలు అవేవీ లేకుండా వచ్చారు.



అసెంబ్లీ సమావేశానికి వస్తున్న సీఎం చంద్రబాబు



కొలువుదీరిన కొత్త సభ



..గౌరవ సభ

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. వీరిలో కాబోయే స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు కూడా ఉన్నారు. జనసేన, బీజేపీ, వైసీపీలకు చెందిన అందరూ ప్రమాణం చేశారు. టీడీపీకి చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలు జీవీ ఆంజనేయులు, పితాని సత్యనారాయణ, వమాడి వెంకటేశ్వరరావు మాత్రం వ్యక్తిగత కారణాలతో మొదటిరోజు సభకు హాజరుకాలేదు. వారు శనివారం ప్రమాణం చేస్తారు. కాగా ప్రభుత్వం నిర్ణయించుకున్న ముహూర్తం ప్రకారం ఉదయం 9.26 గంటలకు సభ ప్రారంభమైంది. పవన్, లోకేశ్ సభలోకి వస్తుండగా.. కూటమి ఎమ్మెల్యేలంతా కరతాళ ధ్వనులతో స్వాగతం పలికారు. మొదటిసారి ఎమ్మెల్యేగా ఎన్నికై సభలోకి అడుగుపెట్టిన లోకేశ్, సభలోకి మొట్టమొదటిసారి వచ్చిన పవన్ ఒకింత ఉద్వేగానికి గురయ్యారు. సీఎంగానే సభలోకి అడుగుపెడతానని శపథం చేసిన చంద్రబాబు దానిని నెరవేర్చుకున్నారు. ముఖ్యమంత్రి హోదాలోనే సభలోకి వచ్చారు. కరతాళ ధ్వనులతో కూటమి ఎమ్మెల్యేలంతా ఆయన్ను ఘనంగా స్వాగతించారు. 'ప్రజాస్వామ్యం గెలిచింది', 'గౌరవ సభలోకి స్వాగతం', 'బాస్ ఈజ్ బ్యాక్' అంటూ నినాదాలు చేశారు. బాబు సభలోకి రాగానే పవన్‌ను ఆత్మీయంగా ఆలింగనం చేసుకోవడంతో సభ మరోసారి చప్పట్లతో మార్మోగింది. జాతీయ గీతాలాపనతో ప్రొటెం స్పీకర్ సభను ప్రారంభించారు. 9.51 గంటలకు మొదట చంద్రబాబు ఎమ్మెల్యేగా ప్రమాణం చేశారు. రిజిస్టర్‌లో సంతకం చేసిన తర్వాత అన్ని పార్టీలతో పాటు వైసీపీ సభ్యులకు కూడా నమస్కారం చేశారు. ఆ తర్వాత ఉపముఖ్యమంత్రి పవన్ ప్రమాణం చేశారు. మంత్రులు ప్రమాణం చేసిన తర్వాత ఆలస్యంగా సభలోకి వచ్చిన జగన్.. తమ ఎమ్మెల్యేల పక్కన కూర్చున్నారు. కూటమి ఎమ్మెల్యేల్లో బీజేపీకి చెందిన విష్ణుకుమార్‌రాజు ఒక్కరే ఆయన వద్దకు వెళ్లి పలుకరించారు. మహిళా సభ్యుల తర్వాత జగన్ ప్రమాణం చేశారు. అనంతరం బయటకు వెళ్లిపోయారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కూడా ప్రమాణం చేసిన తర్వాత వెళ్లిపోయారు. మిగతా వైసీపీ ఎమ్మెల్యేలు సభలోనే ఉన్నారు. అతిథి గజపతిరాజు, పల్లె సింధూరారెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, సంగా రోషన్‌కుమార్, బొజ్జల సుధీర్‌రెడ్డి, బీఎన్ విజయ్‌కుమార్ ఇంగ్లీష్‌లో ప్రమాణం చేయగా మిగిలిన వారంతా తెలుగులోనే చేశారు. సభ్యులంతా దైవసాక్షిగా ప్రమాణం చేశారు. రోడ్లు-భవనాల మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి దైవ సాక్షి, పవిత్ర హృదయంతో ప్రమాణం చేశారు. ప్రమాణ స్వీకారం అనంతరం లోకేశ్ తన తండ్రి చంద్రబాబుకు పాదాభివందనం చేశారు.

ఏకపక్ష విజయంతో ఉత్సాహం

చరిత్రాత్మక విజయం తాలూకు ఉత్సాహం శాసనసభలో కూటమి సభ్యుల ముఖాల్లో తొణికిసలాడింది. ఎటుచూసినా టీడీపీ, జనసేన, బీజేపీ ఎమ్మెల్యేలే కావడంతో పరస్పర కరచాలనాలతో అభినందనలు తెలుపుకొన్నారు. సభ మొదలయ్యే సమయానికి వైసీపీ ఎమ్మెల్యేలు ఏడుగురే ఉన్నారు. ఆ తర్వాత జగన్‌తో మిగతావారు వచ్చారు. వైసీపీ ఎమ్మెల్యేలు నిరుత్సాహంగా కనిపించారు. కనీసం ఎమ్మెల్యేగా గెలిచామన్న సంతృప్తి కూడా వారిలో కనిపించలేదు.

బాబు కాన్వాయ్‌కు ముందు గోనుగుంట్ల..

అసెంబ్లీకి వచ్చే ముందు వెంకటపాలెంలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి చంద్రబాబు పూలమాల వేశారు. అక్కడ నుంచి అసెంబ్లీకి ఆయన కాన్వాయ్ సాగే సమయంలో దివ్యాంగ కార్పొరేషన్ మాజీ చైర్మన్, టీడీపీ సీనియర్ నేత గోనుగుంట్ల కోటేశ్వరరావు తన త్రిచక్ర వాహనంతో పైలట్‌లాగా ముందు ప్రయాణించారు. అయితే మధ్యలో పోలీసులు ఆయన వాహనాన్ని నిలిపివేసి పక్కన పెట్టించారు. కార్లోంచి అది చూసిన చంద్రబాబు వారిని వారించారు. కోటేశ్వరరావు వాహనాన్ని తన వాహన శ్రేణి ముందు పెట్టించారు. గతంలో కూడా అనేక సందర్భాల్లో కోటేశ్వరరావు తన త్రిచక్ర వాహనంతో చంద్రబాబు కాన్వాయ్ కంటే ముందు ప్రయాణించారు.



స్పీకర్‌గా అయ్యన్న పాత్రుడి తరఫున నామినేషన్ దాఖలు చేస్తున్న పవన్, లోకేశ్, అచ్చెన్న, నాదెండ్ల, పయ్యావుల, సత్యకుమార్

స్పీకర్‌గా అయ్యన్న ఏకగ్రీవ ఎన్నిక

- సభలో నేడు అధికారిక ప్రకటన
- మూడు సెట్లు దాఖలు చేసిన కూటమి పార్టీలు



అమరావతి, జూన్ 21(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్‌గా సీనియర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్పీకర్ పదవికి ఎన్నిక కోసం శుక్రవారం ఉదయం నోటిఫికేషన్ జారీ చేశారు. అయ్యన్న తరఫున మధ్యాహ్నం టీడీపీ, జనసేన, బీజేపీ విడివిడిగా 3 సెట్లు దాఖలు చేశాయి. ఆ కార్యక్రమంలో టీడీపీ తరఫున లోకేశ్, అచ్చెన్నాయుడు, జనసేన తరఫున ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నాదెండ్ల మనోహర్, బీజేపీ తరఫున మంత్రి సత్యకుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. సెట్లు మూడైనా, నామినేషన్ ఒక్కటే కావడంతో అయ్యన్నపాత్రుడి ఏకగ్రీవ ఎన్నిక ఖరారైంది. శనివారం సభలో ఆయన ఎన్నికను అధికారికంగా ప్రకటిస్తారు. శాసనసభ ఉదయం పదిన్నరకు ప్రారంభం కానుంది. ముగ్గురు ఎమ్మెల్యేలు శుక్రవారం తమ ప్రమాణ స్వీకారం చేయలేదు. శనివారం ఉదయం మొదట ఆ ముగ్గురితో చేయిస్తారు. తర్వాత పదకొండు గంటలకు స్పీకర్ ఎన్నిక జరుగుతుంది.

అసెంబ్లీలోకి ఏడోసారి... స్పీకర్‌గా...

అయ్యన్న 1956 సెప్టెంబరు, 4న చింతకాయల వరహాల దొర, చెల్లాయమ్మ దంపతులకు జన్మించారు. బీఏ చదివిన అయ్యన్న 1983లో రాజకీయ రంగ ప్రవేశం చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు 10 సార్లు అసెంబ్లీకి, రెండు సార్లు (1996, 98లో) పార్లమెంట్‌కు పోటీ చేశారు. 1983, 1985, 1994, 1999, 2004, 2014, 2024 ఎన్నికల్లో.. మొత్తం ఏడుసార్లు అసెంబ్లీకి ఎన్నికయ్యారు. 1996లో లోక్‌సభ సభ్యుడిగా ఒకసారి గెలిచారు. ఐదు పర్యాయాలు రాష్ట్ర మంత్రిగా పని చేశారు. 1985-87 మధ్య ఎన్టీఆర్ కేబినెట్‌లో సాంకేతిక విద్య, క్రీడల శాఖల మంత్రిగా తొలిసారి బాధ్యతలు చేపట్టిన అయ్యన్న 1994-96 మధ్య రోడ్లు, భవనాల శాఖ, 1999-2004 మధ్య అటవీశాఖ, 2014-17 మధ్య పంచాయతీరాజ్‌శాఖ, 2017-19 మధ్య రోడ్లు, భవనాల శాఖ మంత్రిగా వ్యవహరించారు. ఇప్పుడు 7వ సారి అసెంబ్లీలో అడుగుపెట్టి స్పీకర్‌గా ఎన్నికయ్యారు. 1989, 2009, 2019 అసెంబ్లీ ఎన్నికల్లో, 1998 పార్లమెంట్ ఎన్నికల్లో ఆయన ఓడిపోయారు.

సభను హుందాగా నడుపుతా: అయ్యన్న

స్పీకర్ అనేది పదవి కాదు, బాధ్యత అని నర్సీపట్నం ఎమ్మెల్యే చింతకాయల అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యానించారు. శుక్రవారం అమరావతి అసెంబ్లీ ప్రాంగణంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'సభాపతి పదవి రాజకీయాలకు అతీతం. సభలో శాసనసభ్యులందరికీ మాట్లాడే అవకాశం కల్పిస్తా. ప్రతిపక్ష పార్టీ సభ్యులకూ తగిన అవకాశం ఇస్తా. సభను హుందాగా నడుపుతా. అవసరమైతే సభ్యులకు తగిన శిక్షణ ఇస్తాం' అని అయ్యన్న అన్నారు.

రాష్ట్ర పునర్నిర్మాణానికి సహకరించాలి: ఎంపీ కలిశెట్టి

అమరావతి, జూన్ 21(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల తర్వాత రాష్ట్రప్రజలకు స్వాతంత్ర్యం వచ్చిందని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు వ్యాఖ్యానించారు. శుక్రవారం అమరావతి అసెంబ్లీ ప్రాంగణంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ ఏర్పాటుతో గత ఐదేళ్ల నియంత పాలనా సంకెళ్ల వీడి, మీడియాకూ స్వాతంత్ర్యం వచ్చినట్లైంది. నియంత పాలన పోవడంతో తెలుగు ప్రజలంతా సంబరాలు చేసుకుంటున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర పునర్నిర్మాణానికి జగన్ సహకరించాలి. ప్రతిపక్ష హోదా లేకున్నా.. జగన్‌కు చంద్రబాబు ఇచ్చిన గౌరవాన్ని ప్రజలంతా చూశారు. ఇలాగే ప్రభుత్వానికి జగన్ మంచి సలహాలు, సూచనలివ్వాలి' అని ఎంపీ అన్నారు.

ఇదేం సభామర్యాద?

సభ్యులు ప్రమాణం చేస్తుండగా మధ్యలోనే జగన్ జంప్.. స్పీకర్ ఎన్నికకూ వచ్చే చాన్స్ లేదు..

పులివెందులకు పయనం.. ఇది సభను, సభాపతిని అవమానపరచడమే!

మందడం గుండా రావడానికి ముఖం చెల్లక.. అసెంబ్లీకి వెనుకదారిలో వచ్చిన మాజీ సీఎం



అసెంబ్లీలో ప్రమాణం చేస్తున్న వైఎస్ జగన్

అమరావతి, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): అధికారానికి దూరమైనా.. మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి శాసనసభకు, తోటి శాసనసభ్యులకు ఏ మాత్రం గౌరవం ఇవ్వలేదు. సభ్యుల ప్రమాణ స్వీకారం ముగియకముందే.. ఎమ్మెల్యేగా తాను మాత్రం ప్రమాణం చేసేసుకుని సభ నుంచి వెళ్లిపోయారు. ప్రతిపక్ష నేతగా ఐదేళ్లు, ముఖ్యమంత్రిగా ఐదేళ్లు బాధ్యతలు నిర్వర్తించిన ఆయన.. సభలో శుక్రవారం వ్యవహరించిన తీరు తీవ్ర విమర్శలకు తావిచ్చింది. అసెంబ్లీ ఎన్నికల్లో నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం శుక్రవారం ఉదయం జరిగింది. సభలోకి ఆలస్యంగా లోపలకు వచ్చిన జగన్.. కొద్దిసేపు వెనుక వరుసలో అప్పటికే ఉన్న వైసీపీ ఎమ్మెల్యేలతో పాటు కూర్చున్నారు. తన పేరును ప్రమాణ స్వీకారం కోసం పిలువగానే వేదిక వద్దకు వెళ్లారు. తడబడుతూ ప్రమాణం చదివారు. 'శాసనసభ్యునిగా ఎన్నికైన జగన్‌మోహన్ అనే నేను' అని తొలుత చదివారు. అంతలోనే సర్దుకుని.. 'జగన్మోహన్‌రెడ్డి అనే నేను' అని చదివారు. తన ప్రమాణం ముగిశాక బయటకు వెళ్లిపోయారు. కాసేపు గతంలో డిప్యూటీ స్పీకర్‌కు కేటాయించిన చాంబర్లో కూర్చుని నిష్క్రమించారు. శాసనసభ మర్యాదలు, సంప్రదాయాల మేరకు సహచర సభ్యుల ప్రమాణ స్వీకారం పూర్తయి.. ప్రొటెం స్పీకర్ సభను వాయిదావేసేవరకు సభ్యులందరూ సభలోనే ఉంటారు. ఈ మర్యాదను జగన్ పాటించలేదు. కనీసం వైసీపీ సభ్యుల ప్రమాణాలైనా ముగియక ముందే.. సభ నుంచి వెళ్లిపోవడాన్ని సీనియర్ సభ్యులు తప్పుబట్టారు. ఇక సభ్యుడిగా ప్రమాణం చేశాక ముందు వరుసలోని పవన్ కల్యాణ్, చంద్రబాబుకు నమస్కారం చేస్తూ ప్రొటెం స్పీకర్ గోరంట్ల బుచ్చయ్య చౌదరి వద్దకు వెళ్లారు. వారు కూడా ప్రతినమస్కారం చేశారు. బుచ్చయ్య చౌదరికి తొలుత నమస్కారం చేశాక.. కరచాలనం కూడా చేశారు. ఆ వెంటనే.. మీరు మంత్రి అవుతారని అనుకున్నానంటూ బుచ్చయ్య భుజం తట్టారు. తనకంటే వయసులో పెద్దవాడైన బుచ్చయ్య చౌదరి భుజాన్ని తట్టడం.. అందునా స్పీకర్ స్థానంలో ఉన్నప్పుడు అలా చేయడం సభ్యులను నివ్వెరపరచింది. ఇది నిజంగా దుస్సంప్రదాయమేనని వారిలో పలువురు వ్యాఖ్యానించారు. కాగా.. అసెంబ్లీ స్పీకర్‌గా టీడీపీ సీనియర్ ఎమ్మెల్యే చింతకాయల అయ్యన్నపాత్రుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం ఈ విషయాన్ని ప్రొటెం స్పీకర్ గోరంట్ల బుచ్చయ్యచౌదరి సభలో లాంఛనంగా ప్రకటిస్తారు. ఆ వెంటనే సభలోని అన్ని పార్టీల నేతలు స్పీకర్‌ను సభాధ్యక్ష స్థానానికి తోడ్కొని వెళ్లడం సంప్రదాయం. అయితే జగన్ ఈ కార్యక్రమంలో పాల్గొనబోవడం లేదు. ఎందుకంటే ఆయన శనివారం ఉదయమే పులివెందులకు వెళ్తున్నారు. ఇది నూతన సభాపతినే గాక.. యావత్ సభనే అవమానించినట్లేనని టీడీపీ వర్గాలు అంటున్నాయి.

అటు రావడానికి ముఖం చెల్లక..

తాడేపల్లి నివాసం నుంచి శుక్రవారం ఉదయం 8.45 గంటలకు జగన్ అసెంబ్లీకి బయల్దేరారు. సీడ్ యాక్సెస్ రోడ్ నుంచి నేరుగా హైకోర్టుకు వెళ్లే దారిలోకి వెళ్లి.. దొడ్డిదోవన అసెంబ్లీ రోడ్డులోకి వచ్చారు. కరకట్ట మీదుగా మందడం గ్రామానికి వచ్చేందుకు ఆయనకు ముఖం చెల్లలేదు. మూడ్రోజులుగా ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అటు వస్తున్నప్పుడు మందడం ప్రజలు దారిపొడవునా పూలు చల్లుతూ ఘన స్వాగతం పలికారు. తానూ ఇదే దారిలో అసెంబ్లీకి వెళితే పూలు చల్లడం మాట అటుంచితే.. రాజధాని ప్రజల నుంచి అవమానాలు ఎదురవుతాయని భావించారో.. లేదంటే ముఖం చెల్లకేమో.. వెనుక దారిలో అసెంబ్లీకి వచ్చారు.



అసెంబ్లీకి వస్తున్న జగన్మోహన్‌రెడ్డి

జగన్‌కు సముచిత గౌరవం

- సాధారణ ఎమ్మెల్యేగా పరిగణించకుండా మాజీ సీఎంకు ప్రత్యేక మర్యాద
- ఉదారంగా వ్యవహరించాలని సీఎం ఆదేశం
- జగన్ వాహనానికి అసెంబ్లీ ప్రధాన ద్వారం వరకు అనుమతి
- అలాగే అక్షర క్రమం పాటించకుండా ఎమ్మెల్యేగా ప్రమాణానికి ఆహ్వానం

అమరావతి, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో ఘోరపరాజయం పాలైన వైసీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి కొత్త శాసనసభలో సముచిత రీతిలో గౌరవం లభించింది. టీడీపీ కూటమి ప్రభుత్వం ఆయనకు ప్రత్యేక మర్యాదలు కల్పించింది. గత ఐదేళ్లలో తమ పట్ల ఆయన వ్యవహార శైలిపై ఆగ్రహావేశాలు ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనతో టీడీపీ సభ్యులు హుందాగా వ్యవహరించారు. 175 స్థానాల అసెంబ్లీ ఎన్నికల్లో 11 సీట్లు మాత్రమే గెలుచుకున్న వైసీపీకి ప్రతిపక్ష హోదా కూడా దక్కలేదు. దీంతో అసెంబ్లీలో జగన్‌కు కూడా ప్రతిపక్ష నేత హోదా లభించలేదు. మిగిలిన ఎమ్మెల్యేల మాదిరిగా ఆయన కూడా సాధారణ సభ్యుడు మాత్రమే. అయితే తమ నేతకు సభలో కొంత ప్రాధాన్యమివ్వాలని వైసీపీ శాసనసభాపక్షం సభావ్యవహారాల మంత్రి పయ్యావుల కేశవ్‌కు లేఖ రాసింది. ఆయన ఆ విషయం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మాజీ సీఎం పట్ల ఉదారంగా, గౌరవంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. సాధారణ ఎమ్మెల్యేలు తమ వాహనాలను శాసనసభ ప్రాంగణం బయటే ఉంచి అక్కడ దిగి నడుచుకుంటూ లోపలకు రావలసి ఉంటుంది. కానీ జగన్ తన వాహనంలోనే సభ ప్రాంగణంలోకి రావడానికి అనుమతించాలని చంద్రబాబు సూచించారు. దీంతో సభా భవనం ప్రధాన ద్వారం వరకూ ఆయన వాహనాన్ని అనుమతించారు. ఎమ్మెల్యేగా ప్రమాణం చేసే సమయంలో ఆయన మిగిలిన సభ్యులతోపాటు అక్షర క్రమంలో తన పేరు వచ్చినప్పుడు మాత్రమే ప్రమాణం చేయాలి. ఆ విషయంలో కూడా ఆయనకు చంద్రబాబు మినహాయింపు ఇచ్చారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ప్రమాణం తర్వాత ఆయనతో చేయించాలని సూచించారు. అయితే జగన్ ఆలస్యంగా సభలోకి వచ్చారు. అప్పటికి మంత్రులు ప్రమాణం చేసేశారు. మహిళా సభ్యులతో ప్రొటెం స్పీకర్ ప్రమాణం చేయించేటప్పుడు జగన్ వచ్చారు. వారి తర్వాత జగన్‌కు అవకాశమిచ్చారు. కాగా.. మాజీ సీఎం సభకు వచ్చినప్పుడు హుందాగా వ్యవహరించాలని, వ్యతిరేక నినాదాలు వంటివి చేయవద్దని చంద్రబాబు ముందే టీడీపీ ఎమ్మెల్యేలకు సూచించారు. గతంలో చంద్రబాబు ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో ఆయనపై వైసీపీ ఎమ్మెల్యేలు ఒంటికాలిపై లేచేవారు. ఆయన ఏదైనా మాట్లాడటానికి లేచి నిలబడగానే పక్క నుంచి నోటికి వచ్చినట్లు అసభ్యంగా వ్యాఖ్యలు చేసేవారు. శుక్రవారం జగన్ విషయంలో టీడీపీ సభ్యుల వైపు నుంచి అటువంటి దాడి జరగలేదు. సభా నియమాలకు కట్టుబడి ఉంటానని తన ప్రమాణంలో భాగంగా జగన్ అన్నప్పుడు మాత్రం ఒక ఎమ్మెల్యే అది జరిగే పనేనా అంటూ గట్టిగా అరిచాడు. వెంటనే చంద్రబాబు చెయ్యి పైకి లేపి ఎవరూ మాట్లాడవద్దని సైగ చేయడంతో అందరూ మౌనం పాటించారు. వైసీపీ ఎమ్మెల్యేల ప్రమాణం సమయంలో కూడా టీడీపీ ఎమ్మెల్యేలు ఏమీ మాట్లాడకుండా సంయమనం పాటించారు.

జగన్‌ను అవమానకరంగా చూడం: పయ్యావుల

వైసీపీకి అసెంబ్లీలో తగిన సంఖ్యాబలం లేకపోయినా, జగన్‌కు ప్రతిపక్ష నేత హోదా లేకపోయినా.. ఆయన్ను అధికార పక్షం అవమానకరంగా చూడబోదని సభావ్యవహారాల మంత్రి పయ్యావుల కేశవ్ స్పష్టం చేశారు. అసెంబ్లీ ప్రారంభానికి ముందు మీడియాతో మాట్లాడారు.

జగన్ ఎక్కువగా ఊహించుకుంటున్నారు: రఘురామ



అమరావతి, జూన్ 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని నాశనం చేసి, ప్రజల్ని బాధించి, ప్రతిపక్ష నేతల్ని వేధించిన మాజీ సీఎం జగన్‌రెడ్డి ఎందుకో తెగ బాధ పడిపోతున్నాడని ఉండి టీడీపీ ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు వ్యాఖ్యానించారు. శుక్రవారం అసెంబ్లీ ప్రాంగణంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ 'ఐదేళ్ల తర్వాత మళ్లీ తనదే అధికారమంటూ జగన్ ఎక్కువగా ఊహించుకుంటున్నారు. వాళ్ల కార్యకర్తలపై ఒకటి, రెండు చోట్ల వ్యక్తిగత కక్షలతో దాడి జరిగితే.. పార్టీల మధ్య విభేదాలుగా మాట్లాడుతున్నారు. మరి ఎన్నికల ఫలితాలు వచ్చాక ముగ్గురు టీడీపీ కార్యకర్తలను చంపేశారు. దీనికి జగన్ ఏం చెప్తారు. జగన్ ఓదార్పు యాత్ర ఎందుకు? ఎవర్ని ఓదారుస్తారు' అని ప్రశ్నించారు.

జగన్‌కు ప్రజాస్వామ్యంపై నమ్మకం లేదు: మంత్రి కొలుసు



అమరావతి, జూన్ 21(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్‌కు ప్రజాస్వామ్యంపై నమ్మకం లేదని, తొలిరోజు అసెంబ్లీలో పట్టుమని గంట కూడా లేరని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. శుక్రవారం అమరావతి అసెంబ్లీ ప్రాంగణంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, టీడీపీని సింగిల్ డిజిట్‌కే పరిమితం చేస్తానంటూ జగన్ వ్యాఖ్యానించడం ఆయన అవివేకానికి నిదర్శనమని మండిపడ్డారు. గత ఐదేళ్లూ రాష్ట్రంలో గృహ నిర్మాణ కార్యక్రమం పూర్తిగా కుంటుపడిందని, వచ్చే ఐదేళ్లలో అర్హులైన పేదలందరికీ ఇళ్లు కట్టిస్తామని చెప్పారు.

జగన్‌వి పగటి కలలు: సోమిరెడ్డి



అమరావతి, జూన్ 21(ఆంధ్రజ్యోతి): మళ్లీ ఐదేళ్లకు వచ్చే ఎన్నికల్లో టీడీపీకి సింగల్ డిజిట్ వస్తుందని వ్యాఖ్యానించిన జగన్‌రెడ్డి.. ముందు తనపై ఉన్న సీబీఐ కేసుల్లో ఇక నుంచైనా విచారణకు హాజరు కావాలని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సూచించారు. శుక్రవారం అమరావతి అసెంబ్లీ ప్రాంగణంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... 'ఐదేళ్లు సీఎం పదవిని అడ్డం పెట్టుకుని, తప్పించుకు తిరుగుతూ, కోర్టుకు డుమ్మాకొట్టాడు. ఇక ఆ పప్పులేమీ ఉడకవు. విచారణకు హాజరవ్వాల్సిందే. మొన్న జరిగిన ఎన్నికలని ప్రజలే నిర్వహించి, చంద్రబాబును సీఎంగా అసెంబ్లీకి పంపి, జగన్‌ను ప్యాలెస్‌కు పరిమితం చేశారు' అని ఎద్దేవా చేశారు.

‘తాడేపల్లి’ రూల్సే వేరు

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్య కార్యదర్శిగా పనిచేసిన కృష్ణబాబు, ఆయన బదిలీ తర్వాత కార్యదర్శిగా వచ్చిన ప్రద్యుమ్న కూడా బిల్లుల చెల్లింపు కోసం ఆ శాఖ అధికారులపై తీవ్ర ఒత్తిళ్లు తీసుకొచ్చినట్లు విమర్శలున్నాయి. నిబంధనలకు విరుద్ధమైన పనులు చేసి బిల్లులు అడిగితే ఎలా? అని ధైర్యంగా జగన్ కార్యాలయం అధికారులను ప్రశ్నించకపోగా.. రూల్స్ ప్రస్తావన తీసుకొచ్చిన తమ శాఖ అధికారులపైనే తమ ప్రతాపం చూపించారని తెలిసింది. దీంతో అధికారులు చేసేదేమీలేక బిల్లులను పాస్ చేయించినట్లు తెలిసింది. గత నాలుగున్నరేళ్లుగా ఇదే వ్యవహారం సాగిందని అధికార వర్గాలు చెబుతున్నాయి. జగన్ సీఎం అయ్యాక తాడేపల్లిలోని తన నివాసాన్ని క్యాంపు ఆఫీసుగా మార్చుకున్న సంగతి తెలిసిందే. అమరావతి సచివాలయానికి వెళ్లకుండా క్యాంపు ఆఫీసులోనే సీఎంఓను నిర్వహించారు. ఇటు, నివాసం, అటు క్యాంపు ఆఫీసుల్లో భద్రతా చర్యలు, ఇతర హంగులు, ఆర్భాటాల కోసం వివిధ పద్దుల కింద ఆర్అండ్‌బీలోని బిల్డింగ్స్ విభాగం ద్వారా రూ.45.54 కోట్లపైనే ఖర్చు పెట్టించారు. ఇంకా వెలుగు చూడని ఖర్చు చాలా ఉందని అధికారవర్గాలు చెబుతున్నాయి. బిల్డింగ్స్ విభాగంలోని మెయింటెనెన్స్ కోసం ఇచ్చిన ఫండ్‌లో 75 శాతం తాడేపల్లి నివాసం కోసమే ఖర్చుపెట్టారని, ఇందులో ఇద్దరు ఉన్నతాధికారుల పాత్ర ఉందని అంటున్నాయి. క్యాంపు ఆఫీసులో ఇంటీరియర్స్ డిజైన్, సెక్యూరిటీ బ్లాక్‌లు, పెయింటింగ్స్, ఆర్ట్ గ్యాలరీ, ఇతర ఆర్భాటాల కోసం ప్రదీప్‌రెడ్డి అనే కాంట్రాక్టర్‌తో ముందుగానే వర్క్‌లు చేయించేవారని తెలిసింది. ఆ కాంట్రాక్టర్‌కు పనులవారీగా బిల్లులు చెల్లించాలని సుప్రియారెడ్డి ఆర్అండ్‌బీ ఉన్నతాధికారులను మౌఖికంగా ఆదేశించేవారని సమాచారం. లిఖితపూర్వక బిల్లులు ఇవ్వకుండా, నేరుగా కాంట్రాక్టర్ ఖాతాకు బిల్లులు చెల్లించాలని ఒత్తిడి చేసేవారని అధికార వర్గాలు తెలిపాయి. లిఖితపూర్వక బిల్లులు ఉండాల్సిందేనని పట్టుబడితే జగన్ కార్యాలయంలోని అధికారుల పేషీల నుంచి ఆర్అండ్‌బీ అధికారులకు వెంటనే ఫోన్‌లు వచ్చేవి. ఎక్కువగా ముత్యాలరాజు, ధనుంజయరెడ్డి పేషీల్లోని అధికారులు.. చిర్రుబుర్రులాడేవారని తెలిసింది.

సుప్రియారెడ్డి చెప్పినట్లుగానే..

“ఏ పని చేశారో చెప్పరు. ఎవరి అనుమతి తీసుకొని వర్క్‌లు చేపట్టారో వివరించరు. ప్రదీప్‌రెడ్డి అనే కాంట్రాక్టర్‌కు తక్షణమే బిల్లులు చెల్లించాలని సుప్రియారెడ్డి ఫోన్ చేసేవారు. టెండర్లు లేకుండా ఎలా చేశారని అడిగితే.. మీరు ఎవరితో మాట్లాడుతున్నారో తెలుసా? అది సీఎం ఇల్లు. ఉద్యోగంలో ఉండాలని లేదా అని ఆమె తీవ్ర స్వరంతో హెచ్చరించేవారు. అయినా మేం నిబంధనల ప్రకారం ప్రతిపాదనలు లేని వర్క్‌లకు బిల్లులు చెల్లించలేమని చెబితే ముత్యాలరాజు, ధనుంజయ్‌రెడ్డి పేషీల్లోని అధికారులు ఫోన్ చేసేవారు. సీఎం ఇంటికి కూడా బిల్లులు అడుగుతారా? ఇష్టం ఉంటే ఉండండి.. లేదంటే మీ సీటు మార్చుకోండని ఇంజనీరింగ్ సీనియర్ అధికారులను బెదిరించేవారు. ఇదే విషయాన్ని కృష్ణబాబు దృష్టికి తీసుకెళ్తే... వారు చెప్పినట్లు చేయాలని చెప్పేవారు. ఒకసారి ఓ రిటైర్డ్ డీఎస్పీ ఫోన్ చేసి బిల్లులు ఆపినందుకు ఓ సీనియర్ అధికారిని దూషించారు. ఇదే విషయాన్ని ఆర్అండ్‌బీ కార్యదర్శిగా ఉన్న ప్రద్యుమ్న దృష్టికి తీసుకెళ్లగా, ఆయన కూడా సదరు అధికారినే తూలనాడుతూ మాట్లాడారు. బుద్ధిలేదా? ఎన్నిసార్లు చెప్పించుకుంటారని పలుమార్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. సొంతశాఖ అధికారులనే దూషించేవారు. చేసేదేమీలేక సుప్రియారెడ్డి చెప్పినట్లుగా బిల్లులు పాస్‌చేయడం అలవాటైంది” అని ఇంజనీరింగ్ ఉన్నతాధికారి చెప్పారు. ముత్యాలరాజు పేషీలో పనిచేసే ఓ అధికారి తనకంటే ఎంతో సీనియర్ అయిన ఆర్అండ్‌బీ అధికారికి ఫోన్ చేసి సకాలంలో బిల్లులు పాస్ చేయనందుకు సెలవుపెట్టి వెళ్లిపోవాలని, లేదంటే మరో శాఖకు బదిలీపై వెళ్లాలని తీవ్రస్వరంతో హెచ్చరించినట్లు ఆయన వివరించారు. ఈ పరిణామం ఆర్అండ్‌బీలో తీవ్ర చర్చనీయాంశమైనా ఉన్నతాధికారులు, ఈఎన్‌సీ, ఇతర అధికారులు స్పందించలేదని ఆ అధికారి వివరించారు.

విచారిస్తే గుట్టురట్టవుతుంది

జగన్ తాడేపల్లి క్యాంపు కార్యాలయంపై పెట్టిన ఖర్చుపై విజిలెన్స్ విచారణ చేయించాలని ఇంజనీరింగ్ వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి. సీఎం క్యాంపు ఆఫీసు అయినా, ఏ ప్రభుత్వ బిల్డింగ్‌లో అయినా వర్క్‌లు చేయాలంటే నిబంధనల ప్రకారం టెండర్లు పిలుస్తారని, ఆ తర్వాతే వర్క్‌లు చేయిస్తారని ఓ సీనియర్ అధికారి చెప్పారు. నామినేషన్‌పై ఇచ్చే వర్క్‌లను కూడా పరిశీలిస్తారని, నాణ్యత ప్రమాణాలు బాగున్న తర్వాతనే బిల్లులు చెల్లిస్తారని ఆయన తెలిపారు. “క్యాంపు ఆఫీసులో సుప్రియారెడ్డే సుప్రీమ్. జగన్ చెప్పడం, ఆమె మాకు ఆదేశాలు ఇవ్వడం. టెండర్లు లేవు. నామినేషన్ విధానం లేదు. నేరుగా పనులు చేయించుకుని, వాటికి ఎంత బిల్లు ఇవ్వాలో ఆమే నిర్దేశించేవారు. నాణ్యతా పరిశీలన ఉండేది కాదు. లిఖితపూర్వక బిల్లులు ఇచ్చేవారు కాదు. అయినా మేమే సొంతంగా బిల్లులు తయారు చేసి కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించేవారం. ఈ పరిణామంపై విజిలెన్స్‌తో విచారణ చేయిస్తే అసలు విషయాలు వెలుగు చూస్తాయి. కృష్ణబాబు, ప్రద్యుమ్నకు తెలిసినా తప్పులను అడ్డుకోకుండా కొమ్ముకాశారు. వారి తీరుపై కూడా విచారణ జరిపించాలి. అప్పుడే అన్ని వాస్తవాలు బయటకొస్తాయి” అని ఆయన చెప్పారు.



రుషికొండపై విద్యుత్ వెలుగులు

రుషికొండ ధగధగలకు

రోజుకు 2000 యూనిట్లు

- రాజమహల్ కరెంటు లెక్క ఇదీ
- ఎవరూ లేకున్నా ఈ స్థాయిలో వాడకం
- భవనాన్ని వినియోగిస్తే ఇంకెంత అవుతుందో?

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖలోని రుషికొండపై జగన్ కుటుంబం కోసం నిర్మించిన రాజమహల్‌కు సంబంధించి రోజుకో కొత్త విషయం వెలుగులోకి వస్తోంది. ఈ విలాసవంతమైన భవనంలో నెలకు 60 వేల యూనిట్ల విద్యుత్ వినియోగిస్తున్నారు. అంటే... రోజుకు రెండు వేల యూనిట్లు. అంతమొత్తం విద్యుత్‌తో ఒక మధ్య తరహా పరిశ్రమను నడపొచ్చు. గత ఏడాది నవంబరు నెల నుంచి విద్యుత్ వినియోగానికి బిల్లింగ్ జరుగుతోంది. జూన్ 18వ తేదీ నాటికి రూ.54.52 లక్షలు బకాయి ఉంది. ఇప్పటివరకు ఏపీఈపీడీసీఎల్‌కు బిల్లు రూపేణా రూపాయి కూడా చెల్లించలేదు. ఇదంతా ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) ఘనతే. ఈ సంస్థ ఇతర ప్రాంతాల్లో నిర్వహిస్తున్న పర్యాటక అతిథి గృహాలకు విద్యుత్ బిల్లు చెల్లించకపోతే సరఫరా నిలిపివేసే అధికారులు ఇక్కడ ఆరు నెలలుగా బిల్లు కట్టకపోయినా చోద్యం చూస్తున్నారు.

55 రెట్లు అధికంగా...

రుషికొండపై హరిత రిసార్ట్స్‌ను కూలగొట్టి వాటి స్థానంలో మరింత విశాలమైన పర్యాటక భవనం నిర్మిస్తామని కేంద్ర అటవీ పర్యావరణ మంత్రిత్వ శాఖకు చెప్పిన జగన్ ప్రభుత్వం... దీనికోసం కేవలం 250 కిలోవాట్ల విద్యుత్ సరిపోతుందని దరఖాస్తులో పేర్కొంది. అందులో 50 కిలోవాట్లకు సోలార్ పవర్ ఏర్పాటు చేస్తామని, అప్పటికే అక్కడున్న సోలార్ ప్లాంటు కంటే పెద్దది వస్తుందని వివరించింది. ఇది పోను 200 కిలోవాట్లు మాత్రమే ఏపీఈపీడీసీఎల్ నుంచి తీసుకుంటామని తెలిపింది. అయితే వాస్తవం చూస్తే కళ్లు బైర్లు కమ్ముతాయి. ఈ రాజమహల్‌కు విద్యుత్ ఏర్పాట్లలో భాగంగా మొదట 100 కేవీఏ సరఫరాకు గత ఏడాది సెప్టెంబరు 30న అనుమతి ఇచ్చారు. దీనికి రూ.43 లక్షలు వ్యయమైంది. అదే రోజు మరో 1000 కిలోవాట్ల సరఫరాకు ఇంకో అనుమతి ఇచ్చారు. దానికి రూ.76.4 లక్షలు ఖర్చు అయింది. అదే ఏడాది నవంబరు 29న మరో 100 కేవీఏ సరఫరాకు మరో కనెక్షన్ ఇచ్చారు. దానికి రూ.15.4 లక్షలు వ్యయమైంది. ఇవన్నీ ఏర్పాటు చేశాక.. ఇక లాభం లేదని ఏకంగా హైబ్రిడ్ కంటెయినర్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. పది వేల కేవీఏ సామర్థ్యం కలిగిన దీనిని రూ.11.55 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేశారు. ఇందుకోసం సమీపంలోని ఆదిభట్లనగర్ కాలనీ నుంచి అండర్ గ్రౌండ్ కేబుల్ కూడా వేశారు. సోలార్ విద్యుత్ పోను 200 కిలోవాట్లు చాలని చెప్పిన అధికారులు ఏపీఈపీడీసీఎల్‌తో ఏకంగా 11,200 కిలోవాట్ల సామర్థ్యం కలిగిన కనెక్షన్లు తీసుకున్నారు. అంటే చెప్పిన దానికంటే 11 వేల కిలోవాట్లు అధికం. 55 రెట్లు ఎక్కువ. వీటికి అయిన మొత్తం వ్యయం రూ.12.9 కోట్లు. ఇందులో రూపాయి కూడా ఏపీటీడీసీ వెనక్కి ఇవ్వలేదని విద్యుత్ సంస్థ వర్గాలు తెలిపాయి. ఇది కాకుండా నవంబరు నుంచి వినియోగిస్తున్న విద్యుత్ బిల్లు బకాయి రూ.54.52 లక్షలు కలుపుకొంటే మొత్తం ఏపీటీడీసీ చెల్లించాల్సిన మొత్తం రూ.13.5 కోట్లు.

కనిపించని సోలార్

సోలార్ విద్యుత్ వినియోగం పెంచాలని, ఉత్పత్తి కూడా పెరగాలని, లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులకు ఒప్పందాలు చేసుకున్న జగన్ ప్రభుత్వం ఈ రాజమహల్‌పై కనీసం ఒక్క లైటుకు కూడా సోలార్ విద్యుత్ వాడలేదు. 50 కిలోవాట్లకు సోలార్ ప్లాంటు ఏర్పాటు చేస్తామని కేంద్ర సంస్థకు ఇచ్చిన హామీని బుట్ట దాఖలు చేసింది. సూయిజ్ ట్రీట్‌మెంట్ ప్లాంటుతో సహా అన్నింటికీ ఏపీఈపీడీసీఎల్ విద్యుత్‌నే వాడుతోంది. అది కూడా రోజుకు 2 వేల యూనిట్లు. అక్కడ ఎవరు ఉంటున్నారు? ఇంత విద్యుత్ ఎందుకు వినియోగం అవుతోంది? అన్నదానిపై వెంటనే విచారణ చేయకపోతే ఇంకా నష్టాలు పెరిగే ప్రమాదం ఉంది. రాజమహల్‌లో ఎవరూ లేకుండా కేవలం రాత్రిపూట విద్యుద్దీపాలు వెలిగిస్తుంటేనే రోజుకు రెండు వేల యూనిట్ల విద్యుత్ వినియోగం జరుగుతుంటే.. ఇక ఆ భవనాన్ని వినియోగంలోకి తీసుకువచ్చి సెంట్రలైజ్డ్ ఏసీలు, ఫ్యాన్లు, గీజర్లు, విద్యుద్దీపాలు ఉపయోగిస్తే ఇంకెంత విద్యుత్ కాలుతుందో? ప్రస్తుతం నెలకు రూ.10 లక్షల బిల్లు వస్తోంది. అదే భవనం వినియోగిస్తే ఆ బిల్లు కచ్చితంగా రూ.25 లక్షలకు చేరుతుంది.

అందరికీ ఓ రూల్... వీరికి మాత్రం

ఎవరికైనా కమర్షియల్ విద్యుత్ కనెక్షన్ కావాలంటే... వినియోగం ఏమిటో వివరిస్తూ దరఖాస్తు సమర్పించాలి. అందులో ఏసీలు, విద్యుద్దీపాలు, గీజర్లు, ఇతర పాయింట్లు అన్నీ చూసుకొని ఎంత లోడ్ పడుతుందో లెక్కించి ఆ ప్రకారం కిలోవాట్‌కు ఇంత అని డిపాజిట్ కట్టించుకుంటారు. ఆ తరువాత విద్యుత్ లైన్ వేయడానికి, అవసరమైన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు అంచనా వ్యయం చెబుతారు. ఆ మొత్తం చెల్లించాకే పనులు ప్రారంభిస్తారు. ఇక్కడ ఆ నిబంధనలు ఏమీ పాటించలేదు. సాధారణంగా కమర్షియల్ కనెక్షన్‌కు కిలోవాట్‌కి లోడ్ డెవలప్‌మెంట్ చార్జీల కింద రూ.2 వేలు, సెక్యూరిటీ డిపాజిట్ కింద రూ.1,200 కలిపి మొత్తం రూ.3,200 తీసుకుంటారు. ఈ లెక్కన 11,200 కిలోవాట్లకు ఏపీటీడీసీ ముందుగా రూ.3.58 కోట్లు చెల్లించాలి. లైన్ల ఏర్పాటు, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు అయ్యే వ్యయాన్ని కూడా కట్టాలి. అయితే ఏపీటీడీసీ రూపాయి కట్టకపోయినా రూ.20 కోట్ల విలువైన పనులు చేశారు. జగన్ కుటుంబం కోసం నిర్మించిన భవనం కావడంతో ఏ అధికారీ దాని జోలికి వెళ్లే సాహసం చేయలేదు. ఇప్పుడు ఇదే ఏపీటీడీసీ ఇంకో చోట భవనం నిర్మిస్తే.. రూపాయి కూడా చెల్లించకుండా విద్యుత్ సదుపాయం కల్పిస్తారా? అంటే సాధ్యంకాదు. ఇక ఈ భవనం నిర్మాణాలకు జీవీఎంసీకి రూ.19.5 కోట్లు వివిధ ఫీజుల రూపంలో కట్టాలి. వాటిని కూడా కట్టలేదు. దానికి శ్రీలక్ష్మి మినహాయింపు ఇప్పించారు.

బాత్‌రూమ్‌కే రూ.50 లక్షలు

పేదల ప్రతినిధినని చెప్పుకొనే జగన్ కుటుంబం కోసం అత్యంత విలాసవంతంగా నిర్మించుకున్న భవనంలో బాత్‌రూమ్ వైశాల్యం 1000 చ.అడుగులు. బాత్‌రూమ్‌కు రూ.50 లక్షలకుపైగా వెచ్చించారు. అందులో టబ్ ఖరీదు రూ.36 లక్షలు. మరుగుదొడ్డి కమోడ్ 13.5 లక్షలు. అదే విశాఖ శివారులో జగనన్న కాలనీల్లో పేదలకు ఇంటికి కేటాయించిన స్థలం కేవలం సెంటు. నిర్మాణ వ్యయం రూ.1.8 లక్షలు.



జగన్ కోసం నిర్మించిన రాజమహల్‌లోని బాత్‌రూమ్



శరత్ థియేటర్‌లో వెలిసిన యలవర్తి యువసేన బ్యానర్

కొడాలి చెర వీడింది!

- ధృతరాష్ట్ర కౌగిలి నుంచి 50 కోట్ల ఆస్తికి విముక్తి
- 5 ఏళ్లుగా సొంత జాగీరులా థియేటర్ స్థలం
- టీడీపీ కూటమి విజయంతో ఎట్టకేలకు ఆగడాలకు చెక్

గుడివాడ, జూన్ 21: మాజీ ఎమ్మెల్యే కొడాలి నాని దాష్టీకాలు, కబ్జాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. మంత్రిగా, ఐదేళ్లపాటు ఇతరుల ఆస్తిని తన సొంత జాగీరులా వాడుకుని పెత్తనం చెలాయించారు. అధికారం పోవడంతో ధృతరాష్ట్ర కౌగిలి నుంచి రూ.50కోట్ల ఆస్తికి విముక్తి కలిగింది. నిన్నటి వరకు కొడాలిని దేవుడు, నాయకుడు అని కొలిచిన కార్యకర్తలు, అభిమానులు సైతం ఆయన అక్రమాల గురించి తెలిసి చీదరించుకుంటున్నారు. గుడివాడ పట్టణ నడిబొడ్డులో 4600 చ.గ. విస్తీర్ణంలో సువిశాల ప్రాంగణంలో శరత్ థియేటర్ ఉంది. సదరు ఆస్తిలో ప్రధాన వాటాదారులు, వారసులైన విజయవాడకు చెందిన సంజీవరావు, కృష్ణారావు తమ వాటాలను అలాగే ఉంచుకున్నారు. మిగిలిన వారసులు తమ రెండు వాటాల ఆస్తిని విక్రయించారు. ఒక వాటా 1,150 చ.గలను కొడాలి నాని తన సోదరుడు కొడాలి నాగేశ్వరరావు(చిన్ని) పేరుతో, మరో వాటా 1,150 చ.గలను మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు కొనుగోలుచేశారు. వాటాదారులు మారడంతో, ఆస్తి ముక్కలు కావడం, రానురాను సినిమాలపై మోజు తగ్గుతుండటంతో 2019కి ముందే శరత్ థియేటర్ మూతపడింది. కొన్నాళ్లుగా కొడాలి నాని ఈ ప్రాంగణంలో వైసీపీ కార్యాలయాన్ని ఏర్పాటుచేసి కార్యకలాపాలు నిర్వహించారు. 2019లో వైసీపీ అధికారంలోకి రావడం, నాని మంత్రి కావడంతో ఎలాగైనా మొత్తం ఆస్తి కాజేయాలని కుట్రలు పన్నారు. తన సొంత జాగీరులా థియేటర్ ప్రాంగణాన్ని వాడుకున్నారు. మిగిలిన వాటాదారులను అటువైపు కన్నెత్తి చూడనివ్వలేదు. వారి వాటాలను తాను సూచించిన ధరకు అమ్మేయాలంటూ పలుమార్లు హుకుం జారీచేశారు. నయానో భయానో వారినుంచి ఆస్తిని తక్కువ ధరకు కొట్టేయాలని ప్రయత్నాలు చేశారు. ఎంత ఒత్తిడి చేసినా.. మంత్రిగా జులుం ప్రదర్శించినా ఆ ముగ్గురూ ఎక్కడా తగ్గలేదు. వంద గొడ్లను తిన్న రాబందు ఒక్క గాలివానకు నేలకొరిగినట్టు ఒక్క ఓటమి నానీ స్థాయిని బయటపెట్టింది. ఇన్నాళ్లూ.. నానీ, అతడి అనుచరులు, గడ్డం గ్యాంగ్‌లు సాగించిన దౌర్జన్యకాండ, దాష్టీకాలు, కబ్జాలకు తెర పడింది. నానీ, అతడి అనుచరుల చెరలో ఉన్న తమ ఆస్తులు ఒక్కొక్కటిగా ప్రజలు తిరగబడి లాక్కుంటున్నారు. తాజా ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి వెనిగండ్ల రాము చేతిలో నాని ఘోరఓటమి చవిచూడటంతో నియోజకవర్గ ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. పట్టణానికి ఆనుకుని 9 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న 66 ప్లాట్‌లను గడ్డం గ్యాంగ్ కబ్జా చేయగా, వైసీపీ ఓటమితో అసలు యజమానులు తమ ప్లాట్‌లు తిరిగి స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. నేడు అదే పంథాలో థియేటర్‌లో ప్రధాన వాటాదారులు తమ తమ ఆస్తిని స్వాధీనం చేసుకున్నట్టే. ఈ క్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు అనుచరులు, అభిమానులు యలవర్తి యువసేన పేరుతో థియేటర్‌లో బ్యానర్‌లను ఏర్పాటు చేశారు. ఇదిప్పుడు పట్టణంలో హాట్‌టాపిక్‌గా మారింది.

తెలంగాణ హద్దులు దాటి ఏపీలోకి..



ఆంధ్ర సరిహద్దు నుంచి తరలిస్తుండగా అధికారులు సీజ్ చేసిన ట్రాక్టర్లు

- తుంగభద్రలో ఇసుక అక్రమ తవ్వకాలు
- 51 ఇసుక ట్రాక్టర్ల యజమానులకు జరిమానా

కర్నూలు, జూన్ 21(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర నదిలో ఏపీ- తెలంగాణ రాష్ట్రాల మధ్య ఇసుక తవ్వకాల్లో సరిహద్దు వివాదం తలెత్తింది. కర్నూలు, తెలంగాణకు చెందిన జోగులాంబ గద్వాల కలెక్టర్లు పరస్పరం చర్చలు జరిపి వివాదానికి తెరదించారు. వివరాలివీ.. కర్నూలు రూరల్ మండలం ఆర్.కొంతలపాడు, సుంకేసుల గ్రామాల సమీపంలో నాణ్యమైన ఇసుక నిల్వలు ఉన్నాయి. వీటికి సమీపంలోనే సుంకేసుల జలాశయం, తాగు, సాగునీటి ప్రాజెక్టులు ఉండడం వల్ల ఏపీ అధికారులు ఇసుక రీచ్‌కు అనుమతి ఇవ్వలేదు. నది అటువైపున జోగులంబ గద్వాల జిల్లా రాజోలి మండలం తూర్పు గార్లపాడు గ్రామం వద్ద తుంగభద్ర నదిలో ఇసుక రీచ్‌కు ఆ రాష్ట్రం అనుమతి ఇచ్చింది. దీంతో టీఎస్ శాండ్ యాప్‌లో రాయల్టీ చెల్లించి ఇసుకను తవ్వి ట్రాక్టర్లతో రవాణా చేస్తున్నారు. ఆ రీచ్‌లో ఇసుక నిల్వలు ఖాళీ కావడంతో ఏపీ పరిధిలో ఉన్న ఇసుకపై తెలంగాణ ఇసుక రవాణాదారుల కన్ను పడింది. దాదాపు ఏడాదిన్నరకు పైగా అనుమతి పేరిట అక్రమంగా సరిహద్దు దాటి 100మీటర్లకు పైగా ఏపీ భూభాగంలోకి చొచ్చుకొచ్చి ఇసుక తవ్వకాలు, రవాణా చేస్తున్నారని కర్నూలు మండలం ఆర్.కొంతలపాడు, సుంకేసులకు చెందిన కె.మహానంది, శ్రీరాములుతోపాటు గ్రామాల రైతులు శుక్రవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ సృజన ఆదేశాల మేరకు కర్నూలు రూరల్ తహసీల్దారు రామాంజులు నాయక్, సీఐ శ్రీధర్, మైనింగ్ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ మురహరి, ఇతర రెవెన్యూ సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇసుక అక్రమంగా తవ్వకాలు చేసి రవాణా చేస్తున్న 51 ట్రాక్టర్లను అదుపులోకి తీసుకున్నారు. ఇసుక తరలించిన ఒక్కో ట్రాక్టరు నుంచి రూ.5 వేల జరిమానా వసులు చేసేలా నిర్ణయం తీసుకున్నారు.



డీజీపీగా బాధ్యతలు చేపడుతున్న ద్వారకా తిరుమల రావు

డీజీపీగా తిరుమలరావు బాధ్యతల స్వీకారం

అమరావతి, జూన్ 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నూతన డీజీపీగా సీనియర్ ఐపీఎస్ అధికారి ద్వారకా తిరుమలరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. మంగళగిరిలోని రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయంలో ఈసీ నియమించిన డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా నుంచి బాధ్యతలు స్వీకరించారు. పోలీసు గౌరవ వందనం స్వీకరించి సరిగ్గా 7.50గంటలకు చార్జి తీసుకున్న తిరుమలరావుకు పలువురు ఐపీఎస్ అధికారులు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆయన అసెంబ్లీకి వెళ్లి సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం జనసేన రాష్ట్ర కార్యాలయంలో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో భేటీ అయ్యారు. ఐపీఎస్ అధికారుల బదిలీలు, శాంతి భద్రతలపై సమీక్ష, పోలీసు శాఖలో ఇబ్బందులపై ముఖ్యమంత్రికి ఇచ్చేందుకు నోట్ తయారు చేయించినట్లు తెలిసింది.

కరికాల వలవన్ రాజీనామా ఆమోదం

అమరావతి, జూన్ 21(ఆంధ్రజ్యోతి): దేవదాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికాల వలవన్ రాజీనామాను ప్రభుత్వం ఆమోదించింది. ఈ మేరకు సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణకు ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. కాగా, సీఎం ముఖ్య కార్యదర్శి ముద్దాడ రవిచంద్ర వద్ద ఓఎస్‌డీగా వెళ్లిన ఆప్కోస్ ఎండీ వాసుదేవరావు రిలీవ్ అయ్యారు. కేవలం వారం రోజులు ఆయన ఓఎస్‌డీగా పనిచేశారు. ఆయనపై పలు ఆరోపణలు రావడంతో వెంటనే వెనక్కు పంపేశారు. ఆప్కోస్ ఎండీగా ఆయనను ప్రభుత్వం కొనసాగించనుంది.

చెల్లితో రాజీకి తల్లిని కోరిన జగన్: ఆదినారాయణరెడ్డి

అమరావతి, జూన్ 21(ఆంధ్రజ్యోతి): తన ఓటమికి చెల్లెలు షర్మిలే కారణమని జగన్ గ్రహించారని బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం అసెంబ్లీ లాబీల్లో ఆయన మాట్లాడారు. ‘చెల్లెలు షర్మిలతో రాజీ చేయాలని జగన్ తన తల్లిని కోరాడు. అప్పుడు జగనే కాంగ్రెస్ పార్టీలో చేరాలని షర్మిల చెప్పేసింది. త్వరలోనే వివేకా హత్యకేసులో అవినాశ్‌రెడ్డి అరెస్టు అవుతారు. బీజేపీలో చేరేందుకు స్వయంగా మిథున్‌రెడ్డే బీజేపీ అగ్ర నాయకత్వంతో టచ్‌లోకి వెళ్లారు. బీజేపీలో చేరాల్సిందిగా తన తండ్రి పెద్దిరెడ్డి మీద కూడా ఆయన ఒత్తిడి తెస్తున్నారు. వైసీపీ ఖాళీ కావడం ఖాయంగా కనిపిస్తోంది. బీజేపీ ఒప్పుకుంటే అవినాశ్‌రెడ్డి మినహా వైసీపీ ఎంపీలంతా పార్టీ మారడానికి రెడీగా ఉన్నారు. బీజేపీ నాయకత్వం మాత్రం వాళ్లు అక్కర్లేదని అంటోంది’ అని ఆదినారాయణరెడ్డి అన్నారు.

దస్తగిరిని సాక్షిగా గుర్తిస్తే అభ్యంతరం లేదు

- వివేకా హత్య కేసులో కోర్టుకు తెలిపిన సీబీఐ.. నిందితుల అభ్యంతరం

హైదరాబాద్, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): వివేకా హత్యకేసుపై హైదరాబాద్ సీబీఐ కేసుల ప్రత్యేక కోర్టు శుక్రవారం విచారణ చేపట్టింది. ఈ విచారణకు చంచల్‌గూడ జైల్లో ఉన్న నిందితులు ఎర్ర గంగిరెడ్డి, సునీల్‌యాదవ్, ఉమాశంకర్‌రెడ్డి, ఉదయ్‌రెడ్డిలను పోలీసులు హాజరుపర్చారు. బెయిల్‌పై బయట ఉన్న నిందితులు దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఎంపీ అవినాశ్‌రెడ్డి, అప్రూవర్ దస్తగిరి విచారణకు హాజరయ్యారు. జైల్లో ఉన్న నిందితుల రిమాండ్‌ను జూలై 5 వరకు పొడిగిస్తూ సీబీఐ కోర్టు న్యాయమూర్తి టీ రఘురాం ఉత్తర్వులిచ్చారు. కాగా తనను సాక్షిగా గుర్తించాలని దస్తగిరి దాఖలు చేసిన దరఖాస్తుపై వాదోపవాదాలు తీవ్రస్థాయిలో కొనసాగాయి. అవినాశ్‌రెడ్డి సహా ఇతర నిందితుల తరపు న్యాయవాదులు దస్తగిరిని సాక్షిగా గుర్తించడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. మరోవైపు దస్తగిరిని కోర్టు సాక్షిగా గుర్తించాలనే నిర్ణయం తీసుకుంటే తమకెలాంటి అభ్యంతరం లేదని సీబీఐ తరపు న్యాయవాదులు పేర్కొన్నారు. మరోవైపు జగన్ అక్రమాస్తుల కేసులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న దాదాపు 130 డిశ్చార్జి పిటిషన్‌లపై శుక్రవారం వాదనలు కొనసాగాయి. ఇందులో కొన్ని కేసులు ఈనెల 24కు, మరికొన్ని జూలై 5కు వాయిదా పడ్డాయి.

గనుల శాఖలో సలహాదారులకు ఉద్వాసన

- డీఎల్ఆర్ ప్రసాద్‌తో పాటు మరో ఇద్దరు ఔట్

అమరావతి, జూన్ 21(ఆంధ్రజ్యోతి): గనుల శాఖలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఏపీఎండీసీలో సలహాదారు హోదాలో రాజభోగాలు అనుభవిస్తున్న డీఎల్ఆర్ ప్రసాద్‌ను ఉద్యోగం నుంచి తొలగిస్తూ సర్కారు నిర్ణయం తీసుకుంది. ఆయనతో పాటు మరో ఇద్దరు సలహాదారులు నాగేశ్వరరావు, ఎం. వెంకట రమణను కూడా ఆ పోస్టుల నుంచి తొలగిస్తూ ఎండీసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎన్. యువరాజ్ శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. తొలగింపు ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వస్తాయని పేర్కొంటూ ఆఫీస్ ఆర్డర్ ఇచ్చారు. ఈ ముగ్గురు సలహాదారులు ఏపీఎండీసీ మాజీ ఎండీ వెంకటరెడ్డికి అత్యంత సన్నిహితులు. డీఎల్ఆర్ ప్రసాద్ 2019లోనే ఎండీసీలో సలహాదారుగా చేరారు. ఆయన కోల్ విభాగం సలహాదారుగా ఉన్నారు. ఎండీసీలోకి రావడానికి ముందు అదానీ కంపెనీలో పనిచేశారు. జగన్ సిఫారసుతోనే ప్రసాద్‌ను ఎండీసీలో బొగ్గు విభాగం సలహాదారుగా నియమించారు. ఆ తర్వాత మధ్యప్రదేశ్‌లోని సులియారీ కోల్‌బ్లాక్‌లో బొగ్గు వేలం టెండర్లను కూడా అదానీ సంస్థనే దక్కించుకుంది. ఇందులో ప్రసాద్ పాత్ర ఉందన్న విమర్శలు వచ్చినా ప్రభుత్వం తెచ్చిపెట్టుకున్న వ్యక్తి కావడంతో ఈ విషయంపై విజిలెన్స్ దృష్టి సారించ లేక పోయింది. నెలకు రూ.4.50 లక్షల వేతనంతో ప్రసాద్ రాజభోగాలు అనుభవించారు. వారంలో మూడు రోజులు మాత్రమే కార్యాలయానికి వచ్చేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక, జగన్ సర్కారులో పనిచేసిన సలహాదారులందరినీ తొలగించింది. ఏపీఎండీసీలో ఉన్న ప్రసాద్‌తో పాటు మరో ఇద్దరు శుక్రవారం దాకా కొనసాగారు. ఈ అంశాన్ని గుర్తించిన యువరాజ్ తక్షణమే వారిని తొలగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఇదిలా ఉంటే, మంగంపేటలోని బెరైటీస్ ప్రాజెక్టులో మేనేజర్‌గా ఉన్న పి.కొండారెడ్డి రాజీనామాను ప్రభుత్వం ఆమోదించింది.

ఎల్లుండి నుంచి తెరుచుకోనున్న కార్యాలయాలు

గనుల శాఖ ఆఫీసులు సోమవారం నుంచి తెరుచుకోనున్నట్లు తెలిసింది. ఆ శాఖ మాజీ డైరెక్టర్, ఎండీసీ ఎండీ వెంకటరెడ్డిని ఈ నెల 7న బదిలీ చేసిన ప్రభుత్వం... ఆ రోజు అర్ధరాత్రి నుంచి ఇబ్రహీంపట్నంలోని డైరెక్టరేట్, తాడిగడపలోని ఎండీసీ ఎండీ కార్యాలయాన్ని సీజ్ చేసింది. వెంకటరెడ్డి బదిలీ తర్వాత యువరాజ్‌కు తాత్కాలిక బాధ్యతలు అప్పగించారు. తాజాగా ప్రవీణ్‌కుమార్‌ను గనులశాఖ డైరెక్టర్‌గా, ఎండీసీకి ఇన్‌చార్జి ఎండీగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. సోమవారం ఆయన బాధ్యతలు తీసుకుంటారని తెలిసింది.

రేప్ చేసి.. కర్రలతో కొట్టి చంపేసి..

- బాపట్ల జిల్లాలో యువతిపై హత్యాచారం
- బహిర్భూమికి వెళ్లినప్పుడు దుర్ఘటన

బాపట్ల, అమరావతి (ఆంధ్రజ్యోతి), చీరాల, జూన్ 21: బహిర్భూమికి వెళ్లిన యువతిపై గుర్తుతెలియని వ్యక్తులు అత్యాచారానికి పాల్పడ్డారు. ఆపై కర్రలతో తలపై మోది అత్యంత పాశవికంగా హత్య చేశారు. ఈ దారుణం బాపట్ల జిల్లా చీరాల మండలం ఈపురుపాలెం పంచాయతీ సీతారంపేటలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన పములజుల సుచరిత (21) శుక్రవారం తెల్లవారుజామున సమీపంలోని రైలుపట్టాల వైపు బహిర్భూమికి వెళ్లింది. ఆ సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డారు. అనంతరం కర్రలతో ముఖంపై బాది హత్యచేశారు. చెవులకున్న కమ్మలు కూడా లాక్కెళ్లారు. ఎంతసేపటికీ కుమార్తె ఇంటికి రాకపోవటంతో అనుమానం వచ్చిన తండ్రి వెళ్లి చుట్టుపక్కల వెతికారు. రైలు పట్టాల సమీపంలో కుమార్తె విగతజీవిగా కనిపించింది. దీంతో కన్నీరుమున్నీరవుతూ చుట్టుపక్కల వారికి, పోలీసులకు సమాచారమిచ్చారు. తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతురాలిది చేనేత కుటుంబం. ఎనిమిదేళ్ల క్రితం నెల్లూరు జిల్లా గూడూరు ప్రాంతం నుంచి ఈపురుపాలెం వచ్చింది. సుచరిత కొవిడ్ సమయంలో ఇంటర్ మధ్యలోనే చదువు ఆపేసింది. ఆ తర్వాత మిషన్ నేర్చుకుని కుటుంబానికి చేదోడువాదోడుగా ఉంటుంది. ఆ పరిసరాల్లో కొందరు యువకులు గుంపులుగా తిరుగుతుంటారని మృతురాలి తండ్రి పోలీసులకు తెలిపారు. కాగా, సీఎం చంద్రబాబు ఆదేశాలతో పోలీసులు ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిందితుల కోసం గాలిస్తున్నాయి. మృతురాలి కుటుంబానికి ప్రభుత్వం రూ.10లక్షల సాయం అందించింది.



రూ.10 లక్షల పరిహారం చెక్కును చీరాల ఎమ్మెల్యే కొండయ్యకు అందిస్తున్న హోంమంత్రి అనిత

తీవ్రంగా స్పందించిన సీఎం చంద్రబాబు

యువతి హత్యాచారం విషయం తెలుసుకున్న సీఎం చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. వెంటనే ఘటన స్థలానికి వెళ్లి బాధితులకు ధైర్యం చెప్పాలని అసెంబ్లీలో ఉన్న హోంమంత్రి వంగలపూడి అనితను ఆదేశించారు. దీంతో హోంమంత్రి వెంటనే సీతారాంపేటకు చేరుకుని.. చీరాల ఎమ్మెల్యే ఎం.ఎం కొండయ్య, కలెక్టర్ రంజిత్‌బాషా, ఎస్పీ వకుల్‌జిందాల్‌లతో కలసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం హతురాలి తల్లిదండ్రులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు.. అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అంతకుముందు డీజీపీ ద్వారకా తిరుమలరావు సచివాలయంలో సీఎం చంద్రబాబుతో భేటీ అయ్యారు. అత్యాచార ఘటనపై ప్రాథమిక సమాచారాన్ని సీఎంకు వివరించారు. నిందితులకు వెంటనే శిక్ష పడేలా చూడాలని డీజీపీని సీఎం చంద్రబాబు ఆదేశించారు.

48 గంటల్లో పట్టుకోవాలి: అనిత

నిందితులను 48 గంటల్లో పట్టుకుని కోర్టులో హాజరు పరచాల్సిందిగా పోలీసులను ఆదేశించినట్లు హోంమంత్రి తెలిపారు. గంజాయి మత్తులోనా, లేక.. ఇది బ్లేడు బ్యాచ్ వల్ల ఈ దారుణం జరిగిందా..? అనేది విచారణలో తేలుతుందన్నారు. రాష్ట్రంలో ఐదేళ్లలో గంజాయి అమ్మకాలు విచ్చలవిడిగా పెరగడం వల్ల కూడా గతంలో ఎన్నో ఘటనలు జరిగాయన్నారు. కాగా, చీరాల ఎమ్మెల్యే కొండయ్య బాధిత కుటుంబాన్ని కలిసి ఆ రూ.10లక్షల చెక్కును అందజేశారు.

జగన్ విధ్వంసంపై ఏడు శ్వేతపత్రాలు

- శాఖలకు డెడ్‌లైన్ విధించిన ప్రణాళికా శాఖ

అమరావతి, జూన్ 21(ఆంధ్రజ్యోతి): జగన్ పాలనలో జరిగిన విధ్వంసంపై ఏడు శ్వేతపత్రాలను విడుదల చేసేందుకు సీఎం చంద్రబాబు సర్కారు సిద్ధమైంది. ఈ మేరకు ఏడు శాఖలకు ఆఖరి తేదీలను ప్రణాళికా శాఖ ఖరారు చేసింది. ఆ గడువు లోపు ఆయా రంగాల్లో జరిగిన విధ్వంసాలను వివరిస్తూ శాఖాపరంగా శ్వేతపత్రాలు తయారు చేయాలని ప్రణాళికా శాఖ ఎక్స్ అఫిషియో ప్రిన్సిపల్ సెక్రటరీ గిరిజాశంకర్ శుక్రవారం మెమో విడుదల చేశారు. పోలవరం, అమరావతి, విద్యుత్తు, సహజ వనరుల దోపిడీ, మద్యం, ఎక్సైజ్, శాంతి భద్రతలు, ఆర్థిక శాఖల్లో జరిగిన అక్రమాలను ప్రజల్లోకి తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది. పోలవరానికి సంబంధించి జలవనరుల శాఖ ఈ నెల 25లోగా, అమరావతి విధ్వంసంపై సీఆర్‌డీఏ, మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ విభాగాలు 28వ తేదీలోపు, విద్యుత్తు రంగంలో జరిగిన అక్రమాలపై ఇంధన శాఖ జూలై 1వ తేదీలోగా శ్వేతపత్రాలను సిద్ధం చేయాలని సూచించారు. సహజ వనరుల దోపిడీ (ఇసుక, మైనింగ్, భూమి తదితరాలు)పై పరిశ్రమలు(మైన్స్ అండ్ జియాలజీ), ఇండస్ట్రీస్(ఏపీఐఐసీ), రెవెన్యూశాఖలు వచ్చే నెల 4లోగా శ్వేతపత్రాన్ని తయారు చేయాలని ఆదేశించారు. మద్యం, ఎక్సైజ్, ఇతర అంశాలపై ఎక్సైజ్ శాఖ వచ్చేనెల 8లోగా, శాంతి భద్రతలపై హోంశాఖ, డీజీపీ వచ్చేనెల 10లోగా, ఆర్థిక శాఖలో అక్రమాలపై వచ్చేనెల 12లోగా శ్వేతపత్రాలు సిద్ధం చేయాలని గిరిజాశంకర్ స్పష్టం చేశారు. కొత్తగా జలవనరుల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా బాధ్యతలు తీసుకున్న జి.సాయిప్రసాద్ పోలవరం విధ్వంసంపై సమాచారాన్ని సేకరించడం ప్రారంభించారు. పోలవరం నిర్మాణ సంస్థను అర్ధంతరంగా మార్చేయడం, రివర్స్ టెండర్ విధానానికి వెళ్లడం, ఆ సమయంలో కేంద్రం చేసిన హెచ్చరికలు, కేంద్రం రాష్ట్రానికి అప్పట్లో పంపిన లేఖలు వంటి వాటిని సేకరిస్తున్నారు. అదేవిధంగా ఇంధన శాఖకు సంబంధించిన శ్వేతపత్రం దాదాపు సిద్ధమైంది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
శనివారం • 22 జూన్ 2024

నేరేడు పండ్ల పానకం

జంబూ ఫలంత్వ స్థివివర్జితం హి
సుమర్దితం శర్కరాయా
అంబునాళమ్!
సువాసితం వాల్లిజభృంగపత్రె
రుచిం వివర్తె విరుచౌ జనానామ్!

క్షేమశర్మ తన 'క్షేమ కుతూహలం' గ్రంథంలో నేరేడు పండు పానకాన్ని ఎలా తయారు చేసుకోవాలో, ఎందుకు తీసుకోవాలో చక్కగా వివరించాడు. నేరేడు ప్రాముఖ్యతని పట్టించుకోకపోవటం వల్ల ఎక్కువగా నష్టపోయేది మనమే.

పూజా సంకల్పంలో 'జంబూ ద్వీపే... భరతవర్షే... భరత ఖండే' అంటూ మన నివాస ప్రాంతాన్ని జంబూ ద్వీపంతో మొదలెడతారు. భారత ఉపఖండం యావత్తూ జంబూ ద్వీపమే! నేరేడు చెట్లు ఎక్కువగా పెరిగే ప్రాంతం ఇది. అనేక మొక్కలుండగా నేరేడునే ఎందుకు చెబుతున్నారంటే, ఆరోగ్యపరంగా దాని ప్రాధాన్యత అంతటిది కాబట్టి. రోడ్డు పక్కన పెరిగే మొక్కే ఇది. నేరేడు పేరుచెప్పగానే ఎవరికైనా షుగరు వ్యాధికి మందు అనే విషయం గుర్తుకొస్తుంది. తేలికగా దొరికే నేరేడు పండ్లు, ఆకులు, గింజల్ని షుగరు వ్యాధి నివారణ కోసం ఉపయోగించవచ్చు.

నేరేడు పండ్లు అతిమూత్రాన్ని అరికడతాయి. మూత్రంలో పచ్చదనాన్ని, వేడిని తగ్గిస్తాయి. వాంతిని ఆపుతాయి. తీసుకున్న ఆహారం వంటబట్టకపోవటం, జిగురు, నీళ్ల వి రేచనాలను అదుపు చేస్తాయి. వేడిని, మంటల్ని తగ్గిస్తాయి. గొంతు నొప్పి తగ్గుతుంది. చిక్కిపోతున్నవారికి, కడుపులో నులి పురుగులున్న వారికి, దగ్గు, జలుబు ఆయాసాలు ఉన్నవారికి ఇవి మేలు చేస్తాయి. నోటికి రుచిని కలిగిస్తాయి.

నేరేడు ఆకులతో...

నేరేడు పండ్లు దొరకని కాలంలో నేరేడు ఆకుల్ని నీళ్లలో వేసి టీ కాచుకుని తాగవచ్చు. పండులోని గుణాలే ఆకులకూ ఉన్నాయి. షుగరు వ్యాధిలో తప్పనిసరిగా తీసుకోదగిన పానీయం ఇది. ఈ ఆకుల్లో షుగరు స్థాయి రక్తంలో తగ్గించే ఆల్కలాయిడ్స్ ఉన్నాయి.

ఇన్సులిన్ ఉత్పత్తిని పెంచేందుకు ఇవి సాయపడతాయి.

జీర్ణశక్తిని పెంచి స్థూలకాయాన్ని తగ్గించగలుగుతాయి. నేరేడు ఆకుల కషాయం పుక్కిలిస్తే నోటి పూత, గొంతులో పుండు (సోర్ థ్రోట్) తగ్గుతాయి.

కీళ్లవాతంలో వాపులు త్వరగా తగ్గుతాయి.

వీటిలో యాంటీ ఆక్సిడెంట్లు విషహర లక్షణాలను కలిగి ఉంటాయి.

దీన్ని రోజూ ఒక కప్పు చొప్పున రెండు పూటలా తీసుకోవచ్చు. దీనివల్ల మానసిక ప్రశాంతత కూడా కలుగుతుంది.

చర్మానికి పోషణ ఇస్తుంది.

కీళ్లవాతంలో వాపుల్ని ఇది తగ్గిస్తుంది. జ్వరాల్లో కూడా ఇది పని చేస్తుంది. ఎక్కువ తింటే మలబద్ధకం కలుగుతుంది. నీరసం, నిస్సత్తువనీ తక్షణం తగ్గిస్తుంది. తిన్నది వంటబట్టేలా చేస్తుంది. అన్నిటికన్నా చెప్పుకోదగింది... పుండును, ఇన్‌ఫెక్షన్లను త్వరగా తగ్గిస్తుంది. స్త్రీల సంబంధిత వ్యాధుల మీద పని చేసే పుష్యానుగ చూర్ణం, జంబూవాసవం, ఉసీరాసవం లాంటి ఔషధాల తయారీలో నేరేడు పండ్లు ఉపయోగపడతాయి. నేరేడు పండు వగరు, తీపి రుచులు కలిగి ఉంటుంది. దీని వగరు రుచే ఇన్ని ఔషధ గుణాలకు కారణం.

పానకం ఇలా...

మంచి నేరేడు పండ్లను శుభ్రంగా కడిగి, వాటి గుజ్జు, గింజలు వేరు చేయండి. ఈ గుజ్జుకి సమానంగా పంచదార, తగినన్ని నీళ్లు కలిపి చక్కగా చిలకండి. దీంట్లో బిర్యానీ ఆకు, గుంటకలగరాకులను వేస్తే పరిమళభరితంగా ఉంటుంది.

'జంబూ ఫలభవం రుచ్యం పానకం కఫ నాశనమ్'... ఈ పానకం జీర్ణశక్తిని పెంచేందుకు ఉద్దేశించింది. జీర్ణకోశానికి సంబంధించిన అన్ని వ్యాధుల్లోనూ దీన్ని ఔషధంగా ఇవ్వచ్చు. ఇది అజీర్తిని, కఫాన్ని హరిస్తుంది. వగరు రుచి వాతాన్ని పెంచుతుంది కాబట్టి... నేరేడుని పానకం రూపంలో తీసుకోవాలి. షుగరు వ్యాధి ఉన్నవారు తీపి కలవకుండా... గింజలతో సహా నేరేడు పండుని నూరి, పంచదార లేకుండా పైన చెప్పిన పద్ధతిలో పానీయాన్ని తయారు చేసుకోవచ్చు. స్థూలకాయులకు కూడా ఇది ఉపయోగపడుతుంది.



ప్రకృతి వరప్రసాదం నేరేడు. ఈ చెట్టు, దాని ఆకులు, పూలు, చెక్క కూడా పండ్లతో సమానంగా పని చేస్తాయి. రోడ్డు పక్కన పెరిగే మొక్కే. కాబట్టి ఎక్కువ మందికి ఇవి దొరికే అవకాశం ఉంది. దొరకని వారు పండ్లను వాడుకోవచ్చు. నేరేడు ఆకుల పొడి, నేరేడు+ వేపాకు పొడి, నేరేడు గింజల పొడి కూడా ఆన్‌లైన్‌లో లభిస్తున్నాయి... ప్రయత్నించండి.

• గంగరాజు అరుణాదేవి

వంటిల్లు

మునగ రుచికరంగా!

ఎన్ని మాటలైనా చెప్పు.. మునక్కాయలతో చేసిన కూరలు మాత్రం మహా మెప్పు, భలే రుచి. మునక్కాడ మటన్, మునక్కాడ చికెన్ కర్రీ, మునక్కాడ ఉల్లిపాయకారం వంటలను ఈ వీకెండ్‌లో వండుకోండిలా..



మునక్కాడ చికెన్ కర్రీ

కావాల్సిన పదార్థాలు

లేత మునక్కాయలు- 3, చికెన్- అర కేజీ, నూనె- రెండు టేబుల్ స్పూన్లు, టమోటాలు- 2 (ముక్కలుగా తరగాలి), ఉల్లిపాయలు- 2 (చిన్న ముక్కలుగా తరగాలి) పచ్చిమిర్చి- 4 (నిలువుగా కోయాలి), అల్లం,వెల్లుల్లి పేస్ట్- 2 టీ స్పూన్లు, చికెన్ మసాలా- 2 టీస్పూన్లు, కారంపొడి- 2 టీస్పూన్లు, పసుపు- కొద్దిగా, ఉప్పు- రుచికి సరిపడ, కొత్తిమీర- కొద్దిగా, యాలకులు- 2, బిర్యానీ ఆకు- 1

తయారీ విధానం

మూకుడులో నూనె వేయాలి. కాస్త వేడయ్యాక యాలకులు, బిర్యానీ ఆకు, పచ్చిమిర్చి వేసి బాగా కలపాలి. ఆ తర్వాత ఉల్లిపాయ ముక్కలు వేసి మూడు నిముషాల పాటు కలిపాక పసుపు, ఉప్పు వేసి కలపాలి. మూకుడుపై మూత ఉంచి రెండు నిముషాల తర్వాత గరిటెతో కదిపి.. అల్లం, వెల్లుల్లి పేస్ట్ వేయాలి. రెండు నిముషాల పాటు గరిటెతో కలిపాక.. మునక్కాయలు, కారం పొడి వేసి కలపాలి. రెండు నిముషాలు ఆగాక చికెన్ వేసి బాగా కలపాలి. మూకుడుపై మూత ఉంచి.. మూడు నిముషాల పాటు కుక్ చేశాక టమోటా ముక్కలు వేసి కలిపిన తర్వాత చికెన్ మసాలా వేసి కలిపి మూత పెట్టాలి. పెద్దగ్లాసు నీళ్లు పోసి చికెన్ ముక్కలు ఉడికేంత వరకూ కనీసం పదిహేను నిముషాలు కుక్ చేయాలి. చికెన్ ఉడికిందో లేదో చూసుకుని కొత్తిమీర చల్లి దించేసుకోవటమే తరువాయి. మునక్కాడ చికెన్ కర్రీని చపాతీ, అన్నంతో తినాలి.

మునక్కాడ మటన్

కావలసిన పదార్థాలు

లేత మునక్కాయలు- 2, మటన్ ముక్కలు- 1 కేజీ, నూనె- 2 టేబుల్ స్పూన్లు, ఉల్లిపాయలు-2 (సన్నగా తరగాలి), పచ్చిమిర్చి- 3 నిలువుగా సగానికి కట్ చేసుకోవాలి), కొత్తిమీర- 2 టేబుల్ స్పూన్లు, జింజర్ గార్లిక్ పేస్ట్- 1 టేబుల్ స్పూన్, పసుపు- కొద్దిగా, కారం- 2 టేబుల్ స్పూన్లు, ఉప్పు- రుచికి సరిపడ, చిన్న టమోటాలు- 2



తయారీ విధానం

ముందుగా మటన్‌ను శుభ్రంగా కడిగి పక్కన ఉంచుకోవాలి. దీంతో పాటు మునక్కాయలను కడిగి.. వీటిని చిటికెన వేలంత పరిమాణంలో కట్ చేసుకోవాలి. ఆ తర్వాత కుక్కర్‌లో నూనె వేయాలి. కాస్త వేగిన తర్వాత ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిర్చి వేసి కలపాలి. ఉల్లిపాయలు రంగు మారిన తర్వాత కొత్తిమీర వేసి రెండు నిముషాలు కలపాలి. జింజర్ గార్లిక్ పేస్ట్, పసుపు, కారంపొడి, ఉప్పు వేసి మిశ్రమాన్ని గరిటెతో రెండు నిముషాల పాటు బాగా కలపాలి. ఇపుడు మటన్ వేసి కలపాలి. టమోటా ముక్కలు వేసి కలపాలి. ఐదు నిముషాల పాటు కుక్ చేయాలి.

ఐదు నిముషాల తర్వాత గ్రేవీకి సరిపడ అంటే కనీసం 300 మి.లీ. నీళ్లను పోయాలి. గరిటెతో కలిపిన తర్వాత కుక్కర్‌పై మూతను క్లోజ్ చేసి ఆరేడు విజిల్స్ వచ్చేంత వరకు ఉంటే.. మటన్ బాగా ఉడుకుతుంది.

ఆ తర్వాత మూత తీసి మునక్కాయ ముక్కలను వేయాలి. మంటను తగ్గించి.. ఐదు నిముషాల పాటు కుక్ చేయాలి. పులుసు కాస్త అవసరం అనుకుంటే కొన్ని నీళ్లు వేసుకోవచ్చు. రెండు నిముషాల పాటు ఉడికించి చివరగా కొత్తిమీరను గార్నిష్‌గా చల్లుకోవాలి. ఈ మునక్కాడ మటన్‌ను భోజనంతో లేదా చపాతీతో తింటే రుచికరం.

మునక్కాడ ఉల్లిపాయకారం

కావల్సిన పదార్థాలు

లేత మునక్కాయలు- 2, నూనె- మూడు టేబుల్ స్పూన్లు, మెంతులు- అర టేబుల్ స్పూన్, ధనియాలు- టేబుల్ స్పూన్, జీలకర్ర- టేబుల్ స్పూన్ ఎండు మిరపకాయలు- 10, ఆవాలు- కొద్దిగా, శగనపప్పు- టేబుల్ స్పూన్, మినప్పప్పు- టీస్పూన్, మీడియంసైజ్ ఉల్లిపాయలు-4 (సన్నగా తరగాలి), టమోటా ముక్కలు- కప్పు, వెల్లుల్లి రెబ్బలు-8, పసుసు- కొద్దిగా, చింతపండు రసం- టేబుల్ స్పూన్



తయారీ విధానం

ప్యాన్‌లో టేబుల్ స్పూన్ నూనె వేసి మెంతులు, ధనియాలు, ముప్పావు టేబుల్ స్పూన్ జీలకర్ర, ఎండు మిరపకాయలు వేసి గరిటెతో కదుపుతూ వేయించాలి. ఈ మిశ్రమాన్ని జార్‌లో వేసి సగం ఉల్లిపాయ ముక్కలు, వెల్లుల్లి రెబ్బలు వేసి.. మరీ మెత్తగా కాకుండా.. మిక్సీ పట్టాలి. అదే ప్యాన్‌లో రెండు టేబుల్ స్పూన్ల నూనె వేసి మిగిలిన జీలకర్ర, ఆవాలు, శనగపప్పు, మినప్పప్పు వేసి గరిటెతో తిప్పుతూ లోఫ్లేమ్‌లో రెండు నిముషాల పాటు వేయించాలి. ఆ తర్వాత సగం ఉల్లిపాయ ముక్కలు, మునక్కాయ ముక్కలు వేసి కలపాలి. లోఫ్లేమ్‌లో రెండు నిముషాలు వేయించాలి. రుచికి సరిపడ ఉప్పు వేసి.. కొద్దిగా కరివేపాకు వేయాలి. ఈ మిశ్రమాన్ని గరిటెతో తిప్పుతూ ఉండాలి. రెండు నిముషా తర్వాత టమోటా ముక్కలు వేసి కొద్దిసేపు కలిపాక ప్యాన్‌పై మూత ఉంచి కుక్ చేయాలి. ఐదు నిముషాల తర్వాత చూస్తే టమోటా, మునక్కాయ ముక్కలు బాగా ఉడుకుతాయి. గరిటెతో కదిపి పసుపు వేసి మరోసారి కలపాలి. మూడు టేబుల్ స్పూన్ల నీళ్లు పోసి ప్యాన్ మూత ఉంచి మూడు నిముషాల పాటు కుక్ చేయాలి. మునక్కాయ ముక్కలు ఉడికింది చెక్ చేసుకుని జార్‌లో పట్టిన ఉల్లిపాయ కారం వేసి కలపాలి. ఆ తర్వాత రుచికి సరిపడ ఉప్పు వేసిన తర్వాత చింతపండు రసం వేయాలి. మూడు నిముషాల పాటు గరిటెతో కదుపుతూ ఉండాలి. మునక్కాయ ఉల్లిపాయకారం రెడీ. రైస్‌తో తింటే భలే ఉంటుంది.

కేన్సర్ వస్తే, దాన్ని లాగి పెట్టి కొట్టి, మన దారిన మనం వెళ్లిపోవాలి. అంతేగానీ దాన్నే పట్టుకుని వేలాడుతూ, కుదేలైపోకూడదు అంటున్నారు హైదరాబాద్‌కు చెందిన కేన్సర్ సర్వైవర్, జ్యోతి పనింగిపల్లి. వ్యాధి నుంచి నెలల వ్యవధిలోనే పూర్తిగా కోలుకున్న ఆవిడ, తన కేన్సర్ అనుభవాన్ని అరమరికలు లేకుండా 'నవ్య'తో ఇలా పంచుకున్నారు.

కేన్సర్ సర్వైవర్

ఆగితే అనర్థమే!



"బరువు తగ్గితే ఎవరికైనా సంతోషమే! ఎలాంటి ఆహార నియమాలు పాటించకపోయినా రెండేళ్ల వ్యవధిలో పది కిలోలు బరువు తగ్గిపోయేసరికి నేను కూడా తెగ సంతోషపడిపోయాను. కానీ ఒంట్లో దాగిన కేన్సర్ రాకాసి నిశ్శబ్దంగా ఆరోగ్యాన్ని కుదేలు చేస్తోందనే విషయాన్ని మాత్రం కనిపెట్టలేకపోయాను. నోట్లో చిగురు వాచింది. అయినా ఎలాంటి నొప్పి, అసౌకర్యం లేదు. చెన్నైలో ఉన్న కొడుకు, కోడలి దగ్గరకు వెళ్లినప్పుడు ఈ విషయాన్ని వాళ్లతో పంచుకున్నాను. కోడలు డెంటిస్ట్ కావడంతో క్లీన్ చేస్తే సమస్య సర్దుకుంటుందని చెప్పడంతో క్లీనింగ్ చేయించుకున్నాను. ఆ సమయంలో అక్కడేదో సమస్య ఉన్నట్టు మా కోడలు కనిపెట్టింది. అనుమానంతో బయాప్సీ చేయిస్తే కేన్సర్ బయటపడింది. దాంతో అందరం ఒక్కసారిగా హతాసులమైపోయాం. మా అబ్బాయి కేన్సర్ సంబంధిత డాక్టర్ కావడం కూడా నాకు కలిసొచ్చింది. అదృష్టవశాత్తూ కేన్సర్ ఇంకా ప్రాథమిక దశలోనే ఉంది. అయినా 'అన్ని విధాలా ఆరోగ్యంగా ఉండే నాకు కేన్సర్ సోకడమేంటి?' అనే షాక్‌లోనే నేను ఉండిపోయాను. తర్వాత చెన్నైలోని గ్లోబల్ హాస్పిటల్‌లో పని చేస్తున్న ఆంకాలజీ డైరెక్టర్ డాక్టర్ సుందరరాజన్‌ను కలిశాం. అప్పుడాయన, 'సర్జరీ ఎప్పుడు చేయించుకుంటావు?' అని నన్ను అడిగారు. 'రేపే చేయించుకుంటాను' అని నేను చెప్పేశాను. అదొక సుదీర్ఘమైన సర్జరీ. గత నవంబరు 7న, 12 గంటల సుదీర్ఘమైన సర్జరీ జరిగింది. వ్యాధి సోకిన కుడివైపు దవడలో కొంత భాగాన్ని తొలగించి, కాలి ఎముకలో కొంత భాగాన్నీ, తొడ నుంచి కొంత కండరాన్నీ సేకరించి, దవడ ప్రదేశంలో ఫ్లాప్ వేశారు. జనవరిలో రేడియేషన్ తీసుకున్నాను. అదృష్టవశాత్తూ నాకూ కీమోథెరపీ అవసరం కూడా పడలేదు. కేన్సర్ బయల్పడడం, సర్జరీ జరగడం, తర్వాత రేడియేషన్, ఫాలోఅప్‌లో కేన్సర్ పూర్తిగా నయమైపోయిందని తేలడం... ఇవన్నీ ఆరు నెలల వ్యవధిలోనే జరిగిపోయాయి. నేనిప్పుడు అందర్లాగే పరిపూర్ణ ఆరోగ్యంతో ఉన్నాను.

లక్ష్యం ఏర్పరుచుకోవాలి

కేన్సర్ ఉందని చెప్పినప్పుడు నాకు మొదట డాక్టర్ల మీద కోపమొచ్చింది. నాకెలాంటి నొప్పి లేదు, అసౌకర్యం లేదు. కాబట్టి నాకసలు కేన్సర్ లేదనే అనుకున్నాను. కానీ సర్జరీ తప్ప వేరే ప్రత్యామ్నాయం లేదని వైద్యులు నచ్చజెప్పిన తర్వాత, పరిస్థితిని అంగీకరించాను. పరిస్థితిని అంగీకరించిన తర్వాతే మనసు నెమ్మదించింది. శరీరంలో ఎక్కడ, ఏ సమస్యైనా తలెత్తవచ్చు. దాన్ని వైద్యంతో సరిదిద్దుకోక తప్పదు. నాకు కేన్సర్ సోకిన అమ్మ డిఎన్ఏ సంక్రమించింది. కాబట్టే ఆరోగ్యంగా ఉన్నప్పటికీ కేన్సర్ బారిన పడ్డాను. ఇలా ఎంతోమందికి జరుగుతుంది. కుటుంబ చరిత్రలో కేన్సర్లు ఉన్నవాళ్లు రెట్టింపు అప్రమత్తంగా ఉండాలి. ఒకవేళ సోకినా అక్కడితో జీవితం అంతమైపోయిందని కుంగిపోకూడదు. అలాంటి క్లిష్ట సమయంలోనే మనకంటూ ఒక లక్ష్యాన్ని ఏర్పరుచుకోవాలి. త్వరగా కోలుకుని మనవళ్లు, మనవరాళ్లతో ఆడుకోవాలనీ, పుణ్యక్షేత్రాలు సందర్శించాలనీ.. ఇలా ఏదో ఒక లక్ష్యాన్ని ఏర్పరుచుకుని, ఆ రోజు కోసం ఆతృతగా ఎదురుచూడాలి. అప్పుడే మనం వేగంగా పూర్వపు స్థితికి చేరుకోగలుగుతాం! నేనేమీ సూపర్ విమెన్‌ను కాను కదా, కాబట్టి మొదట్లో నేనూ కుంగిపోయాను. ఒంటరితనాన్ని ఆశ్రయించి, ఏడుస్తూ ఉండిపోయాను. ఆ సమయంలో మా అబ్బాయి నాకు ధైర్యం చెప్పి, కేన్సర్‌తో పోరాడే ధైర్యాన్ని నూరిపోశాడు. సర్జరీ జరిగిన సమయంలో నేను చెన్నైలో ఉన్నాను. నాకేమో హైదరాబాద్‌లో ఉన్న మా ఇంటికి వచ్చేయాలని ఉండేది. అంతకంటే ముఖ్యంగా మునుపటిలా ఆరోగ్యంగా మారిపోవాలనీ, ఇంట్లో 18 ఏళ్లుగా ఆరిపోకుండా కాపాడుకుంటూ వస్తున్న అఖండ జ్యోతికోసమైనా కేన్సర్‌ను జయించాలనీ పట్టుదలను పెంచుకున్నాను. కాబట్టే త్వరగా కోలుకోగలిగాను.

అన్ వెయిట్ కీలకం

కేన్సర్ వచ్చేవరకూ వెయిట్ చేయకూడదు. అందుకే అందరికీ నేను 'అన్ వెయిట్... అంటే, నెత్తిన కేన్సర్ బాంబు పడేవరకూ ఆగకుండా ముందుగానే అప్రమత్తం కావాలని చెప్తూ ఉంటాను. మరీ ముఖ్యంగా కుటుంబ చరిత్రలో కేన్సర్ ఉన్నవాళ్లు, కేన్సర్ సోకే పరిస్థితుల్లో జీవించేవాళ్లు కేన్సర్ దాడి చేసే వరకూ ఆగకుండా, ముందుగానే అప్రమత్తం కావాలి. వ్యాధి తీవ్రమై కోలుకోలేని పరిస్థితి సమీపించేవరకూ ఆగకూడదు. సాధారణంగా ఎవరైనా ప్రతి ఆరు నెలలకూ వైద్య పరీక్షలు చేయించుకుంటూ ఉంటాం. చిన్న రుగ్మత తలెత్తితే వైద్యుల దగ్గరకు పరుగులు పెడతాం. కానీ కేన్సర్ ఒక వ్యాధేననీ, అది ఎప్పుడైనా, ఏ అవయవానికైనా సోకే అవకాశం ఉంటుందనే విషయాన్ని విస్మరిస్తూ ఉంటాం! నిజానికి కేన్సర్ సోకవచ్చేమోననే ఆలోచనే మనలో ఎవరికీ తట్టదు. కానీ మిగతా వైద్య పరీక్షల్లాగే కేన్సర్ పరీక్షలు కూడా చేయించుకోగలిగితే ఆ వ్యాధిని ప్రారంభంలోనే కనిపెట్టవచ్చు. సమర్థ చికిత్సతో నియంత్రించుకోవచ్చు. నిజానికి కేన్సర్ లక్షణాలు ఏదో ఒక రూపంలో బయల్పడుతూ ఉంటాయి. వాటిని కనిపెడుతూ ఉండాలి.

> రాజమండ్రి దగ్గరున్న ధవళేశ్వరం మా ఊరు. మా వారి వృత్తిరీత్యా దేశంలోని పలు ప్రాంతాలు తిరిగి, చివరకు హైదరాబాద్‌లో స్థిరపడ్డాం. మా వారు, టివికె. రాజు భారతం, రిలయన్స్‌లో వైస్ ప్రెసిడెంట్‌గా పని చేశారు. ఆరోగ్య సమస్యతో ఆయన మూడేళ్ల కిందటే పోయారు. మా అబ్బాయి డాక్టర్ కౌండిన్య కిరణ్, చెన్నైలోని చెట్టినాడ్ మెడికల్ కాలేజీలో పని చేస్తాడు. మా కోడలు అశ్విని వెంకటేశన్, ప్రశాంతి నిలయంలో డెంటిస్ట్‌గా పని చేస్తుంది. కూతురు డాక్టర్ అనూష భారతం కూడా ఆస్ట్రేలియాలో డెంటిస్ట్‌గా పని చేస్తోంది. మా అల్లుడు, నాగేంద్ర ముదునూరు అక్కడే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నాడు.

మెదడు మాటలను శరీరం వింటుంది

ఈ వ్యాధి వచ్చినవాళ్ల కంటే, చుట్టుపక్కల వాళ్లు, తమకే కేన్సర్ సోకినంతగా బాధపడిపోతూ ఉంటారు. వ్యాధి నుంచి పూర్తిగా కోలుకున్నాక.. భోరున ఏడ్చేసేవాళ్లూ ఉంటారు. పదే పదే గుర్తు చేసే వాళ్లకు దూరంగా ఉండడమే మేలు. అమ్మో నాకు కేన్సర్ సోకిందని ఏడుస్తూ, భయపడుతూ, కుంగిపోతూ కూర్చున్నంత మాత్రాన వ్యాధి తగ్గిపోదు. మన మెదడులోకి విషాదకరమైన ఆలోచనలని ప్రవేశించనీయకూడదు. వీలైనంత త్వరగా చికిత్సతో నయం చేసుకుని, హుషారుగా సాగిపోవాలి. లేచి నడువు అని మనసు చెప్పినప్పుడు, దాని నోరు మూయించకుండా నడవాలి. అప్పుడే త్వరగా కోలుకోగలుగుతాం! నేనిక్కడ ఇంట్లో ఒంటరిగానే ఉంటాను. 'ఒక్కతివే ఎలా ఉండగలుగుతున్నావు?' అని కొందరు ఆశ్చర్యంగా అడుగుతూ ఉంటారు. 'అమ్మమ్మా, ఇంట్లో నువ్వొక్కదానివే ఒంటరిగా ఎందుకుంటున్నావు? నిన్నెవరూ పెళ్లి చేసుకోలేదా? అని మా ఏడేళ్ల మనవడు కూడా ఒక సందర్భంలో అడిగాడు. అందుకు నేను... అందంగా లేనని నన్ను పెళ్లి చేసుకోడానికి ఎవరూ ముందుకు రావడం లేదని అన్నప్పుడు, 'నేను నిన్ను పెళ్లి చేసుకుంటాను అమ్మమ్మా' అన్నాడు. ఆ మాటలకు నా చిన్న మనవడేమో... 'వయసులో పెద్దవాళ్లను పెళ్లి చేసుకోకూడదురా' అని వాడికి నచ్చచెప్పాడు. నిజం చెప్పాలంటే ఇలాంటి జ్ఞాపకాలతో ఏకాంతంలోనే నాకు కావలసినంత కాలక్షేపం అవుతూ ఉంటుంది.

• గోగుమళ్ల కవిత, ఫొటో: రామినేని రాజ్ కుమార్

మేకప్

పార్టీలో తళుకులీనేలా...

స్కిన్ ప్రిపరేషన్: ఎలాంటి మేకప్ కోసమైనా, చర్మం శుభ్రంగా ఉండి తీరాలి. కాబట్టి చర్మపు పిహెచ్ వాల్యూకి తగిన సబ్బు లేదా ఫేస్ వాష్‌తో ముఖం శుభ్రపరుచుకోవాలి. చక్కెర స్క్రబ్‌తో పెదవుల మీద మృత చర్మాన్ని కూడా వదిలించాలి. తర్వాత పెదవులకు లిప్ మాస్క్ వేసుకోవాలి. తర్వాత ముఖ చర్మం తేమ కోల్పోకుండా ఉండడం కోసం, హైడ్రేటింగ్ సీరమ్ లేదా మన్నికైన మాయిశ్చరైజర్ అప్లై చేసుకోవాలి. ఇలాంటి స్కిన్ ప్రిపరేషన్‌తో మేకప్ మొదలుపెడితే, మేకప్ చర్మం మీద సమంగా పరుచుకుని, రెట్టింపు ఆకర్షణను తెచ్చిపెడుతుంది.

చర్మానికి తగిన ప్రైమర్: జిడ్డు చర్మమైతే మాటిఫైయింగ్ లేదా సిలికాన్ ఫ్రీ ప్రైమర్ ఎంచుకోవాలి. పొడి చర్మమైతే, హైడ్రేటింగ్, ల్యూమినస్ బ్రైటెనింగ్, గ్లోయింగ్ అనే లేబుల్ ఉన్న ప్రైమర్ ఎంచుకోవాలి. అలాగే దాన్లో విటమిన్ సి ఉండేలా చూసుకోవాలి.

ఫౌండేషన్: దీర్ఘకాలం పాటు పాడవకుండా ఉండే ఫౌండేషన్ ఎంచుకోవాలి. కాబట్టి 12 నుంచి 16 గంటల పాటు చెక్కుచెదరకుండా ఉండే ఫౌండేషన్ వాడుకోవాలి. ఇందుకోసం లాంగ్ వేర్, ట్రాన్స్‌ఫర్, స్వెట్ రెసిస్టెంట్ ఫార్ములాతో కూడిన ఫౌండేషన్ కోసం వెతకాలి.

కలర్ కరెక్ట్: ఇది, మచ్చలను కప్పేయడం కోసం వాడిన ఫౌండేషన్ లేదా కన్‌సీలర్లను కనిపించకుండా చేస్తుంది. కళ్ల దిగువన ఉండే నల్లని వలయాలను కనిపించకుండా చేయడం కోసం, బ్రైట్ నుంచి బ్రిక్ టోన్‌లో ఉండే ఆరెంజ్ కరెక్టర్ సూటవుతుంది. తెల్లని చర్మం కలిగినవాళ్లకు పీచ్ రంగులోని కలర్ కరెక్టర్ బాగుంటుంది. కరెక్షన్ కోసం మొదట అవసరమైన ప్రదేశంలో కలర్ కరెక్టర్ అప్లై చేసి, వేళ్లతో లేదా బ్రష్‌తో అద్దుకోవాలి.

కన్‌సీలర్: మొటిమలు, కళ్ల కింది వలయాలను దాచడం కోసం కన్‌సీలర్ ఉపయోగించాలి. అయితే దీన్ని అప్లై చేసే ముందు ఆ ప్రదేశాల్లో ట్రాన్స్‌ల్యూసెంట్ పౌడర్‌ను అప్లై చేయాలి. తర్వాత దాని మీద కన్‌సీలర్ అద్ది, అంచులు కలిసిపోయేలా బ్రష్‌తో అద్దుకోవాలి. కంటి దిగువన వీలైనంత తక్కువ కన్‌సీలర్ వాడుకోవాలి.

బ్లష్: మేకప్ ఫ్లాట్‌గా కనిపిస్తుందంటే కచ్చితంగా బ్లష్ అప్లై చేసుకోవాలి. చక్కని మెరుపు, వర్ఛస్సుతో కనిపించడానికి బ్లష్ తోడ్పడుతుంది.

హై లైటర్: ముక్కు, చుబుకం, బుగ్గలు, నుదురు... ఈ ప్రదేశాల్లో హై లైటర్ వాడుకుంటే, ముఖం మరింత ఆకర్షణీయంగా కనిపిస్తుంది.



మా నాయకులు చెప్పారనే ఊరుకుంటున్నాం

» లేదంటే నీ సెంటర్‌కు వచ్చి నడిరోడ్డు మీద తంతా

» కొడాలి నానికి బుద్దా వెంకన్న మాస్ వార్నింగ్



విజయవాడ(వన్‌టౌన్), జూన్ 21 : గుడివాడ మాజీ ఎమ్మెల్యే కొడాలి నాని.. సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లను మళ్లీ వాడు, వీడు అని వాగుతున్నాడని.. ఈసారి ఎవరైనా వాళ్లిద్దరిపై ఒక్క మాట మాట్లాడినా ఊరుకునేది లేదని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బుద్దా వెంకన్న హెచ్చరించారు. శుక్రవారం విజయవాడలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొడాలి నానీ విషయంలో తమ నాయకులు చెప్పారు కనుక ఊరుకుంటున్నామని, లేదంటే గుడివాడలో అతడి సెంటర్‌కు వెళ్లి తంతానంటూ మాస్ వార్నింగ్ ఇచ్చారు. జగన్ ఏమైనా కోడి అనుకుంటున్నాడా ఈకలు పీకడానికి అని పేర్కొన్నారు. తాము ఎవరి జోలికీ వెళ్లబోమని, ఇలా పరుష పదాలు ఉపయోగిస్తే మాత్రం ఊరుకునేది లేదని చెప్పారు. వైజాగ్ రుషికొండపై అంతలేసి ఖర్చులు పెట్టి ప్యాలెస్‌లు ఎందుకని ప్రశ్నించారు. ప్రపంచంలో ఉన్న స్మగ్లర్లు అక్కడకు వస్తారని, వ్యాపారులెవ్వరూ రారని వ్యాఖ్యానించారు. జగన్ ఫర్నిచర్ దొంగ అని విమర్శించారు. ప్రజాధనం దొంగతనం చేసింది గాక డబ్బులు పడేస్తామని మాట్లాడడం సరికాదన్నారు. గన్నవరం పిల్లి వంశీ ఎక్కడున్నాడంటూ ప్రశ్నించారు. ఈ ఎన్నికల్లో విద్యావంతులను పోటీగా నిలబెట్టి వంశీ, కొడాలి నానీలను చిత్తుగా ఓడించారని చెప్పారు.

శుక్రవారం దేశ రాజకీయ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించే రోజని బుద్దా పేర్కొన్నారు. ఇది గౌరవ సభ కాదు కౌరవ సభ అని.. మళ్లీ ముఖ్యమంత్రిగానే ఈ సభలో అడుగుపెడతానని చంద్రబాబు నాయుడు నాడు చేసిన భీష్మ ప్రతిజ్ఞను నెరవేర్చుకుని.. ఈ రోజు హుందాగా, ఎంతో గర్వంగా, వినమ్రంగా, ధీశాలిగా సభలో అడుగు పెట్టారని బుద్దా తెలిపారు.

ఏవోబీలో మావోయిస్టుల డంప్ స్వాధీనం

సీలేరు, జూన్ 21: ఆంధ్రా, ఒడిశా సరిహద్దుల్లో మావోయిస్టుల డంప్‌ను ఒడిశా పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. సీలేరు నదికి అవతల బెజ్జంగివాడ అటవీ ప్రాంతంలో మావోయిస్టుల కదలికలు ఉన్నాయన్న నిఘా వర్గాల సమాచారంతో బీఎస్ఎఫ్, ఎస్‌వోజీ బలగాలు గాలింపు చేపట్టాయి. ఈ క్రమంలో మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ బ్లాక్ పరిధిలోని కుర్మనూరు పంచాయతీ దూలగండి గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో మావోయిస్టుల డంప్‌ను పోలీసులు వెలికితీశారు. ఇందులో మూడు ఎస్‌బీఎంఎల్ తుపాకీలు, మూడు ఎలక్ట్రిక్ డిటోనేటర్లు, 98 జిలిటెన్ స్టిక్స్, గ్యాస్ సిలిండర్‌తో పాటు ఇతర సామగ్రి లభ్యమైంది.

రాజధానిలో ముళ్లపొదలు తొలగింపునకు టెండర్లు

» పురపాలకశాఖ మంత్రి నారాయణ

అమరావతి, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో పరిస్థితిని సీఎం చంద్రబాబు పర్యటించి తెలుసుకున్నారని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి నారాయణ తెలిపారు. శుక్రవారం అసెంబ్లీ ఆవరణలో తనను కలిసిన నారాయణ మీడియాతో మాట్లాడారు. రాజధాని ప్రాంతమంతా ముళ్లకంపలతో నిండిపోయిందని వీటన్నింటినీ వెంటనే తొలిగించమని సీఎం ఆదేశించారన్నారు. 217 చదరపు కిలోమీటర్లలో మెజార్టీ ఏరియా అడవిలాగా తయారైందని చెప్పారు. ముళ్ల కంపలను తొలగించేందుకు టెండర్లు పిలిచేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారని మంత్రి తెలిపారు. అంతా క్లీన్ చేసిన తర్వాత పరిశీలించి ఎక్కడ ఎంత డ్యామేజ్ జరిగిందన్నది ఎస్టిమేట్ వేసుకుని ముందుకుపోతామని మంత్రి నారాయణ పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో.. వర్షాకాలం సమయంలో పంచాయతీరాజ్, పురపాలకశాఖ అధికారులు, వైద్యారోగ్యశాఖ అధికారులు తీసుకోవాల్సిన అంశాలపై సూచనలు ఇచ్చామని, డయేరియా ప్రబలకుండా తీసుకోవాల్సిన చర్యలపై అన్ని జిల్లాల అధికారులకు ఆదేశాలు ఇచ్చామని తెలిపారు.

బాల సంజీవని పునరుద్ధరణ

అమరావతి, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): వైఎస్సార్ సంపూర్ణ పోషణ, పోషణ ప్లస్ పథకాల పేర్లను బాల సంజీవనిగా పునరుద్ధరిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు రాష్ట్ర మహిళా,శిశు సంక్షేమశాఖ కార్యదర్శి జయలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు.

ఉమ్మడి నెల్లూరులో

టైగర్ కారిడార్

నాలుగు జిల్లాలను కలుపుతూ ఏర్పాటు

నెల్లూరు-కడప జిల్లాల మధ్యనున్న అటవీ ప్రాంతంలో కొన్నేళ్లుగా పెద్దపులుల సంచారం పెరుగుతున్నట్లు అటవీ అధికారులు గుర్తించారు. రెండేళ్ల క్రితం ఆత్మకూరు అటవీ రేంజ్ పరిధిలో ఓ ఆడ పులి పాదముద్రలను గుర్తించారు. తాజాగా మర్రిపాడు మండలం కదిరినాయుడిపల్లి వద్ద మగ పులికి చెందిన పాదముద్రలను అటవీ అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో టైగర్‌కారిడార్ ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలనే దానిపై అటవీ శాఖ ఉన్నతాధికారులు దృష్టి సారించారు. కేంద్రానికి ప్రతిపాదనలు పంపారు.

» పెద్ద పులుల సంచారంతోనే నిర్ణయం

» ఇప్పటికే కేంద్రానికి చేరిన ప్రతిపాదనలు

» అటవీ సిబ్బందికీ శిక్షణ పూర్తి

నెల్లూరు (వెంకటేశ్వరపురం) జూన్ 21 : ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిధిలో టైగర్ కారిడార్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను ఇప్పటికే కేంద్ర అటవీ శాఖకు పంపింది. ఇటు శేషాచలం నుంచి అటు నల్లమల అడవుల మధ్యనున్న తిరుపతి, కడప, నెల్లూరు, ప్రకాశం జిల్లాలను కలుపుతూ ఈ టైగర్ కారిడార్ ఏర్పాటు కానుంది. ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిధిలోని వెంకటగిరి, ఆత్మకూరు, రాపూరు, ఉదయగిరి రేంజ్‌లలో దాదాపు 1.50 లక్షల హెక్టార్లు టైగర్ కారిడార్ పరిధిలోకి తీసుకురానున్నట్లు సమాచారం. ఈ మేరకు పూర్తిస్థాయి నివేదికలను జిల్లా అధికారులు రాష్ట్ర కార్యాలయానికి పంపారు. అయితే, ఈ టైగర్ కారిడార్ దాదాపు నాలుగు జిల్లాల పరిధిలో విస్తరించి ఉండనున్నది. నెల్లూరు జిల్లాలోని నాలుగు రేంజ్‌లతో పాటు తిరుపతి జిల్లాలోని పలు రేంజ్‌లు, కడప పరిధిలో బద్వేల్, ప్రొద్దుటూరు రేంజ్‌లు, ప్రకాశం జిల్లా గిద్దలూరు పరిధిలో కనిగిరి రేంజ్ ఇలా నాలుగు జిల్లాల అటవీ ప్రాంతంలో దాదాపు 4 లక్షల హెక్టార్లలో ఈ టైగర్ కారిడార్ ఏర్పాటు కానుంది. కారిడార్ ఏర్పాటుపై ఇప్పటికే జిల్లాలో అటవీ అధికారులకు, సిబ్బందికి నాగార్జునసాగర్ టైగర్ రిజర్వుఫారెస్ట్ పరిధిలోని సున్నిపెంటలోని ప్రత్యేక ప్రావీణ్యం ఉన్న అధికారులతో శిక్షణ ఇచ్చారు. టైగర్ కారిడార్ ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఎలా ఏర్పాటు చేయాలి? కారిడార్ ప్రాంతాల్లో తీసుకోవల్సిన జాగ్రత్తలపై పూర్తిస్థాయి అవగాహన కల్పించారు.

ప్రత్యేక కార్యచరణ అవసరం

టైగర్ కారిడార్‌లో తీసుకోవాల్సిన ప్రత్యేక చర్యలపై అటవీ అధికారులు దృష్టి సారించినట్లు తెలుస్తోంది. కారిడార్ పరిధిలో అనేక చోట్ల కెమెరాల ఏర్పాటుకు ఇప్పటికే ప్రతిపాదనలు పంపించారు. అదేవిధంగా పెద్దపులులు సంచరించే ప్రాంతాల్లో జింకలను, కణుజులను ఎక్కువగా పెంచాల్సి ఉంటుంది. ఆహారంగా వాటిని పులి తీసుకుంటుంది. అదేవిధంగా మంచినీటి తొట్టెలనూ ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఇక పెద్దపులులు తిరిగే ప్రాంతాల్లో చెట్లను నరకకూడదు. తరచూ అటవీ అధికారులు క్యాంపులను ఏర్పాటు చేసి అడవుల్లో చేయాల్సిన ఏర్పాట్లు పర్యవేక్షించాల్సి ఉంటుంది. అదే విధంగా చుట్టు పక్కల గ్రామాల ప్రజలను అప్రమత్తం చేస్తూ అడవుల్లోకి వెళ్లకుండా చూడాలి. హెచ్చరిక బోర్డులనూ ఏర్పాటు చేయాల్సి ఉంటుంది.



నెల్లూరు జిల్లా మర్రిపాడు ప్రాంతంలో సేకరించిన పెద్దపులి పాదముద్రలను చూపుతున్న డీఎఫ్‌వో చంద్రశేఖర్ (ఫైల్)

టైగర్ కారిడార్‌పై ప్రతిపాదనలు పంపాం

నెల్లూరు జిల్లాలో పెద్దపులుల సంచారం పెరుగుతున్న నేపథ్యంలో టైగర్ కారిడార్ ఏర్పాటు అనివార్యం కానుంది. అందుకోసం రాష్ట్రప్రభుత్వం తరఫున కేంద్రానికి ప్రతిపాదనలు పంపించాం. నెల్లూరు జిల్లాలో రాపూరు, ఉదయగిరి, వెంకటగిరి, ఆత్మకూరు రేంజ్‌ల పరిధిలో ఈ టైగర్ కారిడార్ ఏర్పాటుకానుంది.

- చంద్రశేఖర్, నెల్లూరు డీఎఫ్‌వో





ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బస్సు డ్రైవర్లు

జాతీయ రహదారిపై దోపిడీ

దొంగల బీభత్సం

» నిద్రిస్తున్నవారిపై రాళ్లు, బీరు సీసాతో దాడి

» తీవ్రంగా గాయపరిచి నగదు దోచుకుని పరారీ

» శ్రీసత్యసాయి జిల్లా ఎన్ఎస్ గేటు వద్ద ఘటన

చెన్నేకొత్తపల్లి, జూన్ 21: శ్రీసత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి మండల పరిధిలోని ఎన్ఎస్ గేటు వద్ద జాతీయ రహదారిపై దోపిడీ దొంగల ముఠా బీభత్సం సృష్టించింది. వాహన డ్రైవర్లపై రాళ్లు, బీరు సీసాలతో దాడిచేసి తీవ్రంగా గాయపరిచి, రూ.20 వేలు దోచుకువెళ్లింది. ఈ ఘటన శుక్రవారం తెల్లవారుజామున చోటు చేసుకుందని రామగిరి సీఐ శివాంజనేయులు తెలిపారు. కర్ణాటక రాష్ట్రం గుల్బర్గాకు చెందిన డ్రైవర్లు మహేశ్, శ్రీనివాస్, హైదరాబాద్‌కు చెందిన రవి.. హైదరాబాద్‌లోని ఓ షోరూం నుంచి ప్రైవేటు బస్సులను కేరళకు తరలిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం రాత్రి ఎన్ఎస్ గేటు సమీపంలోని అమరనారాయణస్వామి ఆలయం వద్ద జాతీయ రహదారి పక్కన వాహనాలను ఆపి నిద్రపోయారు. కర్ణాటకలోని పేరేచంద్రకు చెందిన హెచ్‌ఆర్ శ్రీనివాస్, మనోహర్ హైదరాబాద్‌లో మామిడికాయలు అన్‌లోడ్ చేసి తిరిగి వస్తూ.. అదే ప్రాంతంలో వ్యాన్‌ను ఆపి నిద్రకు ఉపక్రమించారు. తెల్లవారుజామున 3 గంటల సమయంలో 25 నుంచి 30 ఏళ్ల వయసున్న ముగ్గురు దొంగలు వారిపై రాళ్లు, బీరు బాటిళ్లతో దాడి చేశారు. డ్రైవర్లు నిద్ర నుంచి తేరుకునేలోగా తీవ్రంగా గాయపరిచారు. వారి వద్ద ఉన్న రూ.20 వేల నగదు దోచుకుని పారిపోయారు. దొంగల దాడిలో బస్సుల డ్రైవర్లు మహేశ్, శ్రీనివాస్, రవి తీవ్రంగా గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం అనంతపురం తరలించారు. వ్యాన్ డ్రైవర్లు స్వల్పంగా గాయపడ్డారు. దాడికి పాల్పడిన ముగ్గురు యువకులు ముసుగులు ధరించి ఉన్నారని, హిందీలో మాట్లాడారని బాధితులు తెలిపారు. దాడి చేయవద్దని వేడుకున్నా వినిపించుకోలేదని, తీవ్రంగా కొట్టారని వాపోయారు. శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. దొంగల ముఠా కోసం గాలిస్తున్నామని తెలిపారు.

నిబంధనలను అనుసరించండి


» వైసీపీ కార్యాలయం వ్యవహారంలో సీఆర్డీఏకు హైకోర్టు ఆదేశం

అమరావతి, జూన్ 21(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా, తాడేపల్లిలో నిర్మాణంలో ఉన్న తమ కార్యాలయం కూల్చివేతకు సీఆర్డీఏ ప్రయత్నిస్తోందంటూ వైసీపీ శుక్రవారం అత్యవసరంగా హైకోర్టును ఆశ్రయించింది. న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ... సీఆర్డీఏ చట్ట నిబంధనలు పాటించడం లేదన్నారు. తుది ఉత్తర్వులు జారీ చేయకుండానే కార్యాలయం కూల్చివేతకు చర్యలు చేపడుతుందన్నారు. ఈ వాదనలు పరిగణలోకి తీసుకున్న న్యాయస్థానం వైసీపీ కార్యాలయం కూల్చివేత వ్యవహారంలో చట్ట నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని సీఆర్డీఏకు స్పష్టం చేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

రాష్ట్రవ్యాప్తంగా నీటి వనరుల్లో నాణ్యత పరీక్షలు

» మున్సిపాలిటీల్లో డయేరియా ప్రబలితే కమిషనర్లదే బాధ్యత

» 1 నుంచి డయేరియా నియంత్రణపై అవగాహన



అమరావతి, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): డయేరియా నియంత్రణ, వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జూలై 1 నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ వెల్లడించారు. ఈ మేరకు శుక్రవారం అమరావతి సచివాలయంలో ఆయన ఈ అంశంపై సంబంధిత శాఖల అధికారులు, జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో గత నాలుగు నెలల కాలంలో గుంటూరు, విజయవాడ, కాకినాడ, జంగారెడ్డిగూడెం తదితర ప్రాంతాల్లో డయేరియా వ్యాధి ప్రబలి అనేక మంది అనారోగ్యం పాలై ఆసుపత్రుల్లో చేరారని తెలిపారు. ఫిబ్రవరిలో ఒక వ్యక్తి డయేరియాతో చనిపోయారని తెలిపారు. అలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా యుద్ధ ప్రాతిపదికన కార్యాచరణ ప్రణాళికను అమలు చేయాలని పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఆరోగ్య, మున్సిపల్ శాఖల అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో 217 తాగునీటి వనరుల్లో నీటి నాణ్యత పరీక్షలు నిర్వహించగా కలుషితమైనట్లు పరీక్షల్లో తెలిందన్నారు. ఆయా వాటర్ సోర్సుల్లో వెంటనే నీటి కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టాలని అధికారులను సీఎస్ ఆదేశించారు. వైద్యారోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా నీటివనరుల్లో నాణ్యత పరీక్షలను పెద్ద ఎత్తున నిర్వహించాలని, గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో వాటర్ క్వాలిటీ పరీక్షల కిట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. నూరు శాతం మంచి నీటి సోర్సుల తనిఖీ చేయాలని కలెక్టర్లకు స్పష్టం చేశారు. పట్టణ ప్రాంతాల్లో డయేరియా నియంత్రణకు సంబంధించి మున్సిపల్ కమిషనర్లను బాధ్యులను చేయాలని మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కలెక్టర్లను ఆదేశించారు. అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులందరికీ సురక్షిత, వేడి నీళ్ల తాగించే విధంగా చర్యలు తీసుకోవాలని మహిళా, శిశు సంక్షేమశాఖ కార్యదర్శి జయలక్ష్మి చెప్పారు.

‘సెబ్’ సంగతేంటి?

ఎక్సైజ్‌ను రెండు ముక్కలు చేసిన జగన్.. 70శాతం ఉద్యోగులతో ఏర్పాటైన విభాగం

» అధికారాల్లేకుండా బాధ్యతలు అప్పగింత

» ఉద్యోగులపై పెరిగిన పోలీసుల పెత్తనం

» ఐదేళ్లలో గంజాయివైపు చూడని సిబ్బంది

» ఇసుక అక్రమాలపైనా ఉత్తుత్తి అధికారం

» ఇటు ఉద్యోగుల్లేక చిన్నబోయిన ఎక్సైజ్

» సెబ్‌ను కొత్త ప్రభుత్వం రద్దుచేసే చాన్స్?

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్) భవితవ్యంపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఎలాంటి కసరత్తు లేకుండా హడావుడిగా రాత్రికి రాత్రి సృష్టించిన ఈ ప్రత్యేక విభాగం పూర్తి నిష్ప్రయోజనంగా మారడంతో దీన్ని రద్దు చేయడమే మేలు అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 2020 మేలో గత సీఎం జగన్ ఆదేశాలతో సెబ్ ఏర్పడింది. గ్యాంబ్లింగ్, గేమింగ్, మట్కా, గంజాయి, గుట్కా, ఎర్రచందనం స్మగ్లింగ్, ఇసుక అక్రమ రవాణా నియంత్రణ కోసం దీనిని ప్రత్యేకంగా సృష్టించారు. అయితే దీనికోసం పటిష్ఠ వ్యవస్థను ఏర్పాటు చేయకుండా ఎక్సైజ్ శాఖను రెండు ముక్కలుగా చేసి 70శాతం ఉద్యోగులను సెబ్‌లోకి మార్చారు. మిగిలిన 30శాతం ఉద్యోగులతో ఎక్సైజ్ ఉందా... లేదా... అన్నట్టుగా మారింది. ఆర్భాటంగా సెబ్‌ను ఏర్పాటుచేసినా దానికి అధికారాలు మాత్రం ఇవ్వకుండా కోరలు పీకేశారు. మద్యం అక్రమాలు తప్ప మరే ఇతర కేసులు నమోదు చేసినా సెబ్ సిబ్బంది సివిల్ పోలీసులకు అప్పగించాలి. ఇది సెబ్, పోలీసు శాఖల మధ్య అంతరాలను పెంచింది. మేం పట్టుకుని వాళ్లకు అప్పగించడం ఏమిటని సెబ్ అధికారులు, ఉద్యోగులు గగ్గోలు పెట్టినా ఎవరూ పట్టించుకోలేదు. మరోవైపు పెద్ద స్థాయి అక్రమాల బాధ్యతలు అప్పగించడం, సిబ్బంది తక్కువ కావడంతో సెబ్ పూర్తి స్థాయిలో పనిచేయలేకపోయింది. ఇసుక, ఎర్రచందనం లాంటి భారీ అక్రమాల జోలికి వెళ్లే వీల్లేకుండా పోయింది. దీంతో ఉన్నామంటే ఉన్నాం అన్నట్టుగా సెబ్ అధికారులు, ఉద్యోగులు అశక్తులుగా మిగిలిపోయారు. దశాబ్దాలుగా ఎక్సైజ్ శాఖలో ఉద్యోగం చేస్తున్న అధికారులు, ఉద్యోగులు గత ఐదేళ్లలో విపరీత పరిస్థితులు ఎదుర్కొన్నారు. గతంలో ఎక్సైజ్ తరఫున గంజాయి, నాటుసారా, అక్రమ మద్యంపై ఉక్కుపాదం మోపిన వీరు... వైసీపీ ప్రభుత్వంలో ఎటూ కాకుండా మిగిలిపోయారు. బదిలీల్లో ఎక్సైజ్ నుంచి సెబ్‌కు బదిలీ అనే మాట వస్తేనే బెంబేలెత్తిపోయారు. దీనిపై కోర్టుల వెళ్లేవరకూ పరిస్థితి వచ్చింది. ఇది రెండు శాఖల మధ్య విభేదాలు పెంచింది. జిల్లాల్లో అదనపు ఎస్పీలు వీరికి బాస్‌లుగా ఉండటంతో సెబ్‌పై పోలీసు పెత్తనం విపరీతంగా పెరిగింది. దీంతో ఈ శాఖలో ఉద్యోగమే వద్దు అని అనేకమంది సెలవుపై వెళ్లే దుస్థితిని తీసుకొచ్చారు.

ఎక్కడ పట్టుకున్నారు?

2020 మేలో సెబ్ ఏర్పడిన తర్వాత నాలుగేళ్ల కాలంలో సెబ్ అధికారులు ఇసుక, ఎర్రచందనం, గుట్కాను పట్టుకున్నట్టు ఎక్కడా ఒక్క పెద్ద కేసు బయటకు రాలేదు. అడపాదడపా ప్రతిపక్షాలకు సంబంధించిన వారిపై కేసులు పెట్టడంతోనే సరిపెట్టారు. మాజీ మంత్రి కొడాలి నాని ఏకంగా గోవా క్యాసినోని రాష్ట్రానికి తెచ్చినా సెబ్ అధికారులు అటువైపు కన్నెత్తి చూడలేదు. తెలంగాణ నుంచి మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి యథేచ్ఛగా మద్యం తీసుకొచ్చి అమ్మినా పట్టుకునే ధైర్యం చేయలేదు. అంతకుముందు టీడీపీ ప్రభుత్వంలో గంజాయి సాగుపై ఉక్కుపాదం మోపిన ఎక్సైజ్... గత ఐదేళ్లలో ప్రత్యేకంగా రైడ్‌లు చేసిన దాఖలాలు లేవు. సెబ్ అధికారులు పట్టుకుంటారని సివిల్ పోలీసులు వదిలేయగా, తమను అటువైపు రానీయడం లేదని సెబ్ సిబ్బంది కూడా చేతులెత్తేయడంతో అక్రమాలకు అడ్డూ అదుపూ లేకుండా పోయింది.

ప్రైవేటు పాలసీకి ఎక్సైజ్ అవసరం

ఎన్నికల మేనిఫెస్టో ప్రకారం కూటమి ప్రభుత్వం ప్రైవేటు షాపుల పాలసీని తిరిగి తీసుకురానుంది. దాంతో ప్రభుత్వ మద్యం షాపులు రద్దవుతాయి. ప్రైవేటు పాలసీ వస్తే మళ్లీ ఎక్సైజ్‌ను బలోపేతం చేయాలి. షాపుల్లో ఎమ్మార్పీ ఉల్లంఘనలు, నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్‌పై నిఘా, నాటుసారా బాధ్యతలు పెరుగుతాయి. దానికోసమైనా సెబ్‌ను రద్దుచేసి ఎక్సైజ్‌లో కలుపుతారని ఉద్యోగులు భావిస్తున్నారు. ఎలా చూసినా ఈ ప్రత్యేక వ్యవస్థను కొత్త ప్రభుత్వం కొనసాగించదనే వాదన వినిపిస్తోంది.

ప్రజా సంక్షేమం కోసమే ‘పవర్’: నాగబాబు

అమరావతి, జూన్ 21(ఆంధ్రజ్యోతి): 'పవన్ కల్యాణ్ సినిమా వరకే పవర్ స్టార్. రాజకీయాల్లో ఆయన రియల్ హీరో' అని జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన అమరావతి అసెంబ్లీ ఆవరణలో మీడియాతో మాట్లాడారు. 'నేను అసెంబ్లీ చూడడం ఇదే మొదటిసారి. మా అధ్యక్షుడు, తమ్ముడు పవన్ కల్యాణ్ మంత్రిగా అసెంబ్లీకి రావడంతో మా బాధ్యత మరింత పెరిగింది. ప్రభుత్వం ద్వారా వచ్చే అధికారాన్ని ఎంజాయ్ చేసే ఆలోచన మాకు లేదు. ప్రజా సంక్షేమ కోసం అధికారంతో వచ్చిన పవర్‌ను ఉపయోగించాలన్నదే మా అభిప్రాయం. పవన్‌పై ఎక్కువ బాధ్యత ఉంది. పంచాయతీరాజ్, అటవీ పర్యావరణ శాఖలపై చాలా లోతుగా పని చేయాల్సి ఉంది. ఆయన కూడా చాలా ఫోకస్డ్‌గా పని చేయాలని ఉన్నారు. పదవి వచ్చిందన్న దానికంటే... దానిని ఎంత బాధ్యతగా నిర్వర్తించాలన్న దానిపై పవన్ దృష్టి కేంద్రీకరించారు. మేం అందరం ఆయన వైపే ఉన్నాం... ఆయన ఆలోచనలకు అనుగుణంగా ఉన్నాం. ఏదైనా సరే ప్రజలకు, ప్రజా సంక్షేమానికి ఉపయోగపడేది చేయాలనే ఒక అన్నగా కోరుకుంటా. పదవి తాలుకా పవర్‌ను ఆశించేలా మేం లేము. ఎందుకంటే ఈ పదవి వల్ల కొత్తగా మాకు వ్యక్తిగతంగా వచ్చే లాభమేమీ లేదు' అని నాగబాబు చెప్పారు.

నెట్ ప్రశ్నపత్రం లీక్ చేసిన

చానెళ్లను నిషేధించాం: టెలిగ్రాం

న్యూఢిల్లీ, జూన్ 21: యూజీసీ-నెట్ ప్రశ్నపత్రాల లీకేజీలో భాగస్వాములైన చానెళ్లపై కఠిన చర్యలు తీసుకున్నట్లు టెలిగ్రాం సంస్థ తెలిపింది. "పరీక్ష ప్రశ్నపత్రాలను సర్క్యులేట్ చేసిన అన్ని చానెళ్లను నిషేధించాం. పేపర్ లీకేజీపై ప్రభుత్వ సంస్థల విచారణకు పూర్తిగా సహకరిస్తాం. చట్టాలకు అనుగుణంగా పనిచేస్తాం" అని టెలిగ్రాం సంస్థ ప్రతినిధి శుక్రవారం తెలియజేశారు. చట్టబద్ధమైన ప్రభుత్వ సమాచారం సర్క్యులేషన్‌కు సంబంధించి తమ హెల్ప్‌డెస్క్‌కు ఎప్పుడు ఫిర్యాదు అందినా న్యాయపరమైన తనిఖీలు చేసి, ఐటీ చట్టం 2000 ప్రకారం దాన్ని తొలగిస్తామని వెల్లడించారు. యూజీసీ-నెట్‌ను ఈ నెల 18న దేశవ్యాప్తంగా రెండు విడతల్లో నిర్వహించిన సంగతి తెలిసిందే. 9 లక్షల మంది అభ్యర్థులు పరీక్షలు రాశారు. అయితే నెట్ ప్రశ్నపత్రాలు డార్క్‌నెట్‌లో అందుబాటులోకి వచ్చాయని, వాటిని టెలిగ్రాంలో సర్క్యులేట్ చేశారని పరీక్ష జరిగిన మరుసటి రోజే యూజీసీకి ఫిర్యాదు అందాయి. దీంతో పరీక్షను రద్దు చేశారు.

సీఎస్ఐఆర్-యూజీసీ నెట్ పరీక్ష వాయిదా

న్యూఢిల్లీ, జూన్ 21 : నీట్ పేపర్ లీకేజీపై తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టీయే) మరో పరీక్షను వాయిదా వేసింది. ఈ నెల 25, 27 తేదీల్లో నిర్వహించాల్సిన జాయింట్ కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ అండ్ యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నేషనల్ ఎలజిబిలిటీ టెస్ట్(సీఎస్ఐఆర్-యూజీసీ నెట్)ను వాయిదా వేస్తున్నట్టు శుక్రవారం ప్రకటించింది. జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్, అసిస్టెంట్ ప్రొఫెసర్, అత్యున్నత విద్యా సంస్థల్లో సైన్స్ కోర్సుల్లో పీహెచ్‌డీ ప్రవేశాలకు అర్హత పరీక్షగా ఎన్టీయే ప్రతీ ఏటా జూన్, డిసెంబరులో సీఎస్ఐఆర్-యూజీసీ నెట్ నిర్వహిస్తుంటుంది. తప్పనిసరి పరిస్థితుల్లో జూన్ విడత పరీక్షను వాయిదా వేసినట్టు వెల్లడించింది.

హిందూజాలకు స్విట్జర్లాండ్ కోర్టు జైలు శిక్ష

జెనీవా, జూన్ 21: బ్రిటన్‌లో అత్యంత సంపన్నుల్లో ఒకరిగా పేరుగాంచిన హిందూజా కుటుంబంలోని ప్రకాష్ ఆయన భార్య కమల్, కుమారుడు అజయ్, కోడలు నమ్రతకు స్విట్జర్లాండ్ క్రిమినల్ కోర్టు శుక్రవారం నాలుగు నుంచి నాలుగున్నరేళ్ల జైలు శిక్ష విధించింది. ప్రవాస భారతీయులైన వీరికి జెనీవాలో విలాస భవనం ఉంది. పిల్లల సంరక్షణ, ఇంటి పని కోసం అందులో భారతీయులను నియమించుకున్నారు. వారితో రోజుకు 18 గంటలు పనిచేయిస్తూ, వేతనంగా రూ.667 (ఏడాదికి రూ.2.43 లక్షలు) మాత్రమే చెల్లిస్తున్నారని, ఈ మొత్తం హిందూజాల పెంపుడు కుక్కపై వెచ్చిస్తున్నదాని (రూ.8.30 లక్షలు) కంటే తక్కువని, సిబ్బంది పాస్‌పోర్ట్‌లను స్వాధీనం చేసుకున్నారని నమోదైన కేసులో వారికి శిక్ష పడింది.

హజ్ యాత్రలో 98 మంది భారతీయుల మృతి

న్యూఢిల్లీ, జూన్ 21: ఈ ఏడాది సౌదీ అరేబియాలో హజ్ యాత్ర సందర్భంగా వేర్వేరు కారణాలతో 98 మంది భారతీయులు మరణించినట్టు కేంద్రప్రభుత్వం శుక్రవారం వెల్లడించింది. ఈ ఏడాది 1,75,000 మంది భారతీయ యాత్రికులు హజ్ కోసం మక్కాను సందర్శించినట్టు తెలిపింది. కాగా, సౌదీ అరేబియాలో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలో హజ్ యాత్రలో వడదెబ్బతో పది దేశాలకు చెందిన 1,081 మంది యాత్రికులు చనిపోయినట్టు తెలిసింది.



ర్యాలీలో అభివాదం చేస్తున్న కేంద్ర మంత్రి పెమ్మసాని

పెమ్మసాని విజయోత్సవర్యాలీ

» వందల కార్లు, వేల బైకులతో హోరెత్తిన గుంటూరు

గుంటూరు, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): కేంద్ర సహాయ మంత్రిగా బాధ్యతలు తీసుకున్న తరువాత తన సొంత నియోజకవర్గం గుంటూరులో శుక్రవారం మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ చేపట్టిన విజయోత్సవ ర్యాలీ హోరెత్తింది. జాతీయ రహదారిపై కాజ టోల్ ప్లాజా నుంచి గుంటూరు నగరం మీదగా సమావేశ ప్రాంతమైన శ్రీ కన్వెన్షన్ వరకు ప్రదర్శన సాగింది. ప్రతి కూడలిలో వందలాదిమంది తెలుగు తమ్ముళ్లు, జనసైనికులు, బీజేపీ నేతలు, స్థానిక ప్రజలు పెమ్మసానికి ఘనంగా స్వాగతం పలికారు. బాణా సంచా పేల్చి, తారాజువ్వలు ఎగరేసి, అడుగడుగునా భారీ గజ మాలలతో స్వాగతం పలికారు. డీజేలు, దాండియాల మోతలతో ఆయనను నగర వీధుల్లో ఊరేగించారు. శ్రీ కన్వెన్షన్‌లో వేలాది మంది సమక్షంలో సభ జరగ్గా జనం కిక్కిరిసిపోయారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గళ్లా మాధవి, మొహమ్మద్ నసీర్, బూర్ల రామాంజనేయులు, ధూళిపాళ్ల నరేంద్రకుమార్, తెనాలి శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

25 కిలోమీటర్లు వెంటాడి

రూ.70 లక్షల గంజాయి స్వాధీనం

» సినీ ఫక్కీలో ముగ్గురు స్మగ్లర్లను పట్టుకున్న ఎక్సైజ్ అధికారులు

» భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఘటన



పోలీసుల అదుపులో ముగ్గురు స్మగ్లర్లు, స్వాధీనం చేసుకున్న గంజాయి సంచులు

దుమ్ముగూడెం, జూన్ 21: కారులో అక్రమంగా రవాణా చేస్తున్న సుమారు రూ.70లక్షల గంజాయిని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సినీ ఫక్కీలో 25 కిలోమీటర్లు వెంటాడి పట్టుకున్నారు. ఏపీ నుంచి ఒక కారు గంజాయి ప్యాకెట్లతో భద్రాచలం వైపుగా వస్తోందని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ శ్రీనివాసరావుకు శుక్రవారం తెల్లవారుజామున సమాచారం అందింది. సీఐ తన సిబ్బందితో కలిసి కూనవరం రోడ్డులో కాపలా ఉన్నారు. భద్రాచలం వంతెన సమీప చెక్‌పోస్టు వద్ద కొంతమంది సిబ్బందిని ఉంచారు. కూనవరం రోడ్డులోనే తమిళనాడు రిజిస్ట్రేషన్‌కు చెందిన ఓ కారు వేగంగా వెళ్లడంతో దాన్ని సీఐ వెంబడించారు. అధికారులను గమనించిన స్మగ్లర్లు తమ కారును భద్రాచలం వంతెన వైపు కాకుండా చర్ల వైపునకు మళ్లించారు. వేగంగా వెళుతున్న స్మగ్లర్ల కారుకు దుమ్ముగూడెం ఎస్ఐ కేశవరావు, పోలీసు సిబ్బంది బైక్‌లను అడ్డుపెట్టి ఆపేశారు. కారులోని ముగ్గురు స్మగ్లర్లను అదుపులోకి తీసుకున్నారు. స్మగ్లర్లను వెంబడిస్తూ వచ్చిన ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ శ్రీనివాసరావు కారు డిక్కీను తెరిచి చూడగా, ఒక్కొక్కటి కిలో బరువుగల 280 గంజాయి ప్యాకెట్లున్నాయి. పోలీసులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. స్మగ్లర్లు తమిళనాడు రాష్ట్రానికి చెందినవారని తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.70లక్షల దాకా ఉంటుందన్నారు.

రోహిణి సింధూరి

భూములు ఆక్రమించారని ఫిర్యాదు

బెంగళూరు, జూన్ 21(ఆంధ్రజ్యోతి): కర్ణాటక ఐఏఎస్ అధికారిణి రోహిణి సింధూరి మరోసారి వివాదంలో చిక్కుకున్నారు. తమ ట్రస్టు పేరిట ఉన్న భూములను ఆక్రమించారని ఆమెపై ప్రముఖ బాలీవుడ్ సింగర్ లక్కీ అలి కర్ణాటక లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. న్యూ యలహంక టౌన్ పరిధిలో తమ ట్రస్టు భూమిని రోహిణి సింధూరి మద్దతుతో ఆమె భర్త సుధీర్ రెడ్డి, మరిది మధుసూదన్ రెడ్డి ఆక్రమించారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. తద్వారా రోహిణి సింధూరి తన అధికారాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపించారు. గతంలో ఐఏఎస్ అధికారి డీకే రవి ఆత్మహత్య సందర్భంలో సింధూరిపై పలు ఆరోపణలు వచ్చాయి. ఇటీవల ఐపీఎస్ అధికారిణి రూపా మౌద్గల్, రోహిణి సింధూరి మధ్య తలెత్తిన వివాదం సుప్రీం కోర్టు దాకా వెళ్లిన విషయం తెలిసిందే.

ఆంధ్రజ్యోతి దిక్సూచి
diksuchi@andhrajyothy.com
విజయవాడ ● శనివారం 22 జూన్ 2024

ఇంజనీరింగ్ అంటే కంప్యూటర్ సైన్స్ అన్నట్లుగా రోజులు మారాయి. నిజానికి కోర్ ఇంజనీరింగ్‌లో కంప్యూటర్ సైన్స్ లేదు. ఇంజనీరింగ్ మూలపుటమ్మలుగా ప్రసిద్ధి చెందిన మూడింటిలో సివిల్ ఒకటి కాగా మెకానికల్, ఎలక్ట్రికల్ తతిమా రెండూ. ఇప్పుడు ఉన్న ఇంజనీరింగ్ బ్రాంచ్‌లన్నింటికీ మాతృకలు ఇవే. అయితే కంప్యూటర్ మోజులో ప్రపంచవ్యాప్తంగా చాన్నాళ్ళుగా సివిల్ ఇంజనీరింగ్‌కు ఆదరణ బాగా తగ్గింది. ఆ నేపథ్యంలో సదరు డిసిప్లిన్ అవసరాన్ని, అవకాశాలను **రాయపూర్ ఎన్ఐటి డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్.వి.రమణారావు** తార్కికంగా వివరించారు.



కోర్ బ్రాంచెస్‌లో బెస్ట్ సివిల్ ఇంజనీరింగ్

గత దశకం అంటే 2013 నుంచి సివిల్ ఇంజనీరింగ్‌కు ప్రపంచవ్యాప్తంగా ఆదరణ తగ్గుతోంది. 2022 వరకు ఈ డిసిప్లిన్‌లో చేరిన విద్యార్థుల సంఖ్య బాగా తగ్గింది. అయితే గత సంవత్సరం నుంచి దీనికి పాపులారిటీ పెరుగుతోంది. సివిల్ ఇంజనీర్లకు రానున్న రోజుల్లో డిమాండ్ అధికం కానుందన్న లెక్కలే ఇందుకు ఆలంబన. గ్లోబల్ గణాంకాల ప్రకారం 2020 నుంచి 2027 వరకు సివిల్ ఇంజనీరింగ్ మార్కెట్ సైజ్ 5.4 శాతం చక్రీయ వార్షిక వృద్ధి రేటు(కాంపౌండ్ యాన్యువల్ గ్రోత్ రేట్) సాధించనుంది. భారత దేశంలో కూడా మౌలిక నదుపాయాలపై వ్యయం పెరుగుతోంది. టెక్నాలజీ, ఆటోమేషన్‌పై మౌలికరంగం ఆధారపడుతున్న నేపథ్యంలో అది మరిన్ని జాబ్స్ సృష్టికి దారితీస్తుంది. అంటే లేటెస్ట్ టెక్నాలజీలపై పట్టు ఉన్న విద్యార్థులకే ఆ ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని చెప్పవచ్చు. అలా సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులు భారత దేశ ఆర్థికవ్యవస్థ ఎదుగుదలలో కీలకపాత్ర పోషించనున్నారు. దరిమిలా అటు ప్రభుత్వ ఇటు ప్రైవేటు రంగంలో ఉద్యోగ అవకాశాలపరంగా సివిల్ ఇంజనీర్లు అప్పర్ ఎడ్జ్‌లోనే ఉంటారని కూడా చెప్పవచ్చు. సివిల్ ఇంజనీరింగ్ తరవాత ఉద్యోగమే కాదు, సొంతంగా వెంచర్లను ప్రారంభించుకోవచ్చు. అలా కాదనుకుంటే వృత్తిపరంగా కొంత అనుభవం గడించిన తరవాతైనా సొంతంగా వ్యవహారాన్ని నడుపుకోవచ్చు.


భౌతికంగా లేదంటే సహజంగా ఏర్పాటైన కట్టడాల డిజైన్, నిర్మాణం, నిర్వహణ కలగలిసిన వృత్తిపరమైన డిసిప్లిన్ సివిల్ ఇంజనీరింగ్. పబ్లిక్ వర్క్స్ అంటే రహదారులు, వంతెనలు, కాల్వలు, డ్యామ్‌లు, ఎయిర్‌పోర్టులు, మురుగునీటి వ్యవస్థలు, పైప్‌లైన్‌లు, భవనాలకు సంబంధించిన స్ట్రక్చరల్ కాంపోనెంట్స్, రైల్వేలు, వాటర్ సప్లయ్, ఇండస్ట్రియల్ ప్రాజెక్టులు, నివాస గృహాలు సహా భూమి, నీరు, పర్యావణం, సివిలైజేషన్ అలాగే సంబంధిత ప్రాసెసెస్‌కు సంబంధించినవన్నీ సివిల్ ఇంజనీరింగ్‌లోకే వస్తాయి.

రిలేటెడ్ బ్రాంచ్‌లు

సివిల్(కన్‌స్ట్రక్షన్), సివిల్(పబ్లిక్ హెల్త్ అండ్ ఎన్విరాన్‌మెంట్) ఇంజనీరింగ్, సివిల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్, సివిల్ అండ్ రూరల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్(కన్‌స్ట్రక్షన్ టెక్నాలజీ), సివిల్ ఇంజనీరింగ్(ఎన్విరాన్‌మెంట్ అండ్ పొల్యూషన్ కంట్రోల్), సివిల్ ఇంజనీరింగ్(పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్), సివిల్ ఇంజనీరింగ్(రూరల్ ఇంజనీరింగ్), సివిల్ టెక్నాలజీకి తోడు ప్లానింగ్, ఆర్కిటెక్చర్‌కు అందులోని ఉప విభాగాలకూ ఇదే మాతృక.

అవకాశాలు

ప్రభుత్వ, ప్రైవేటు విభాగాల్లో సివిల్ ఇంజనీర్లకు ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయి. ప్రభుత్వ అంటే మున్సిపల్ కార్పొరేషన్స్, వాటర్ బోర్డులు, ఢిల్లీ డెవలప్‌మెంట్ అథారిటీ, న్యూఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్, మెట్రోరైల్, నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, ఢిల్లీ స్టేట్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, పబ్లిక్‌వర్క్స్ డిపార్ట్‌మెంట్, సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్, బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్, మిలిటరీ ఇంజనీరింగ్ సర్వీసెస్, ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఎయిర్ ఫోర్స్, రైల్వేస్, ఇరిగేషన్ అండ్ ఫుడ్ కంట్రోల్ డిపార్ట్‌మెంట్, పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్, నేషనల్ హైడ్రో-ఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్, నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్, ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ లిమిటెడ్, డిఫెన్స్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్, ఆర్ఐటీఈఎస్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డులు, వివిధ సంస్థలకు చెందిన బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ విభాగాలు సహా ఈ జాబితాకు అంతు లేదు. అలాగే అసిస్టెంట్, ఇంజనీర్, అసిసెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, చీఫ్ ఇంజనీర్ వంటి ఉద్యోగాలు ప్రభుత్వ సంస్థల్లో ఉంటాయి.



- అదే ప్రైవేట్ సెక్టర్‌లోకి వస్తే ట్రైనీ ఇంజనీర్‌తో మొదలై చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వరకు వేర్వేరు హోదాల్లో ఉద్యోగాలు ఉంటాయి. కన్‌స్ట్రక్షన్, డిజైన్ విభాగాల్లో సివిల్ ఇంజనీర్ సేవలు అవసరమవుతాయి. కాడ్(సీఏడీ) సాఫ్ట్‌వేర్‌పై పరిజ్ఞానానికి తోడు ఫైనైట్ ఎలిమెంట్ అనాల్సిస్ అలాగే అవసరమైన నైపుణ్యాలను అలవర్చుకుంటే ప్రైవేటు సంస్థల్లో ఎదుగుదలకు ఢోకా ఉండదు. ఆరంభంలో రెండున్నర నుంచి మూడున్నర లక్షల రూపాయల వార్షిక ప్యాకేజ్ ఉంటుంది. ప్రైవేటు రంగంలో ముఖ్యంగా ఎల్ అండ్ టి మొదలుకుని టాటా ప్రాజెక్ట్స్ లిమిటెడ్, గ్యామన్ ఇండియా, గ్యామన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ ప్రాజెక్ట్ లిమిటెడ్, ఒమెక్స్, సూపర్‌టెక్, షాపూర్‌జి అండ్ పల్లోంజి గ్రూప్, జీఎంఆర్ గ్రూప్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లీజ్ అండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్, హిందుస్థాన్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ, ఆఫ్కాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్, రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, అశోకా బిల్డ్‌కాన్, బిఎల్ కాష్యప్ అండ్ సన్స్ లిమిటెడ్, కన్సాలిడేటెడ్ కన్‌స్ట్రక్షన్ కన్సార్టియం లిమిటెడ్, ఎస్సార్ గ్రూప్, ఇర్కాన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్, జేపీ గ్రూప్, నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్, నేషనల్ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్, పుంజ్ లాయిడ్ తదితరాలు అతి పెద్ద కన్‌స్ట్రక్షన్ కంపెనీల్లో కొన్ని మాత్రమే.

అవసరం

సివిల్ ఇంజనీరింగ్ విషయంలో ప్రమోషన్ కార్యకలాపాలు చాలా అవసరం, కీలకం కూడా. కన్‌స్ట్రక్షన్ పరిశ్రమ, సంబంధిత సంస్థలు, వ్యవస్థలు అలాగే మీడియా ఇందుకు చేతులు కలపాల్సిన అవసరం ఉంది. రెగ్యులేటరీ వ్యవస్థలు, ప్రొఫెషనల్ సంస్థలతో కూడా కలిసి పనిచేయాలి. పే ప్యాకేజ్‌తో మొదలుపెట్టి కరికులమ్‌లో ఇండస్ట్రీ నిర్దేశిత థియరటికల్ కాన్సెప్ట్స్, నైపుణ్యాల పెంపుపై దృష్టిసారించాలి. అన్నింటికీ మించి అటు ఇండస్ట్రీ ఇటు విద్యా సంస్థలు చేతులు కలపాలి. వివిధ ఇంజనీరింగ్ విభాగాల మధ్య విద్యా సంస్థల్లో సీట్లు - భర్తీ విషయంలోనూ శాస్త్రీయ విధానాన్ని అమలు చేయాలి. ఒక జాబ్‌కు ఉన్న డిమాండ్, వేకెన్సీలను దృష్టిలో పెట్టుకుని ఇదంతా జరిగితే ఇంజనీరింగ్ విద్యావ్యవస్థలో మంచి రోజులు రావడమే కాదు, ఫలితాలూ బాగుంటాయి. దేశ భవిష్యత్తుకు ఈ ప్రక్రియ చాలా అవసరం కూడా.

జేఎన్‌టీయూహెచ్‌లో ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సులు

హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూహెచ్)కి చెందిన డైరెక్టరేట్ ఆఫ్ ఇన్నోవేటివ్ లెర్నింగ్ అండ్ టీచింగ్(డీఐఎల్‌టీ)- ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఒక్కో కోర్సు వ్యవధి ఆర్నెల్లు. ప్రతి కోర్సులో మూడు థియరీ సబ్జెక్టులు ఉంటాయి. ఒక్కో సబ్జెక్ట్‌కు రెండు నెలల సమయం, 24 తరగతులు, మూడు క్రెడిట్‌లు నిర్దేశించారు. సాయంత్రం ఆరున్నర నుంచి ఎనిమిదిన్నర వరకు ఆన్‌లైన్ సెషన్స్ ఉంటాయి. కనీసం 75 శాతం అటెండెన్స్ తప్పనిసరి. అదనంగా ఒక నెల ప్రాజెక్ట్ వర్క్ చేయాల్సి ఉంటుంది. దీనికి ఆరు క్రెడిట్‌లు ఉంటాయి. కోర్సులో భాగంగా అసైన్‌మెంట్‌లు, ఎండ్ ఎగ్జామినేషన్ ఉంటాయి. అసైన్‌మెంట్‌లకు 40 శాతం, ఎండ్ ఎగ్జామినేషన్‌కు 60 శాతం వెయిటేజీ ఇస్తారు. ఫ్యాకల్టీ మెంబర్లు, ఉద్యోగస్తులు, విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఫస్ట్ కం ఫస్ట్ సర్వ్ పద్ధతిలో అడ్మిషన్స్ ఇస్తారు. యూనివర్సిటీకి చెందిన టీచింగ్& నాన్ టీచింగ్ సిబ్బంది, అకడమిక్ స్టూడెంట్స్‌కు కోర్సు ఫీజులో 40 శాతం రాయితీ లభిస్తుంది.

క్లౌడ్ అండ్ డెవోప్స్ కోర్సు: ఇందులో క్లౌడ్ టెక్నాలజీ ఏడబ్ల్యూఎస్ & మైక్రోసాఫ్ట్ అజ్యూర్, కంటిన్యూయస్ ఇంటిగ్రేషన్/కంటిన్యూయస్ డిప్లాయ్‌మెంట్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రొవిజనింగ్ సబ్జెక్టులు ఉంటాయి.

డేటా సైన్స్ అండ్ జనరేటివ్ ఏఐఎల్‌ఎల్‌ఎమ్ కోర్సు: ఇందులో పైథాన్ ప్రోగ్రామింగ్, మెషిన్ లెర్నింగ్-డీప్ లెర్నింగ్, జనరేటివ్ ఏఐ అండ్ లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ సబ్జెక్టులు ఉంటాయి.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి డిప్లొమా/యూజీ/పీజీ పూర్తిచేసిన/చదువుతున్న వారు దరఖాస్తు చేసుకోవచ్చు. కంప్యూటర్స్‌కు సంబంధించి ప్రాథమిక పరిజ్ఞానం, ఏదేని ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్‌పై అవగాహన తప్పనిసరి.



ముఖ్య సమాచారం

- **కోర్సు ఫీజు:** రూ.25,000
- **అడ్మిషన్ ఫీజు:** రూ.1000
- **రిజిస్ట్రేషన్ ఫీజు:** రూ.500
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 20
- **దరఖాస్తుల పరిశీలన:** జూలై 31
- **ఆన్‌లైన్ మోడ్‌లో సర్టిఫికెట్ల వెరిఫికేషన్:** ఆగస్టు 1 నుంచి 7 వరకు
- **అడ్మిషన్ ఫీజు, ట్యూషన్ ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ:** ఆగస్టు 14
- **అడ్మిషన్ పొందిన అభ్యర్థుల జాబితా విడుదల:** ఆగస్టు 17
- **ప్రోగ్రామ్‌లు ప్రారంభం:** ఆగస్టు 20 నుంచి
- **ప్రోగ్రామ్‌ల ముగింపు:** 2025 ఫిబ్రవరి 19న
- **వెబ్‌సైట్:** www.jntuh.ac.in

తెలంగాణ ఎస్టీ గురుకులాల్లో నీట్ లాంగ్ టర్మ్ కోచింగ్

హైదరాబాద్‌లోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ(టీజీటీడబ్ల్యూఆర్‌జేసీ)- ఆపరేషన్ ఎమరాల్డ్(ఓపీఈఎం)లో భాగంగా నీట్ 2025కు హాజరయ్యే అభ్యర్థుల కోసం లాంగ్ టర్మ్ కోచింగ్ ప్రోగ్రామ్‌ను నిర్వహిస్తోంది. నీట్ 2024లో సాధించిన మార్కుల ఆధారంగా పీవీటీజీ గురుకులాల్లో అడ్మిషన్స్ ఇస్తారు. బాల బాలికలకు క్యాంపస్‌లు వేరుగా ఉంటాయి. బోధన ఉచితం. భోజన, వసతి సౌకర్యాలు కల్పిస్తారు. రాష్ట్రానికి చెందిన ఎస్టీ కేటగిరీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

గిరిజన గురుకులాలు-సీట్లు

- టీజీటీడబ్ల్యూఆర్‌జేసీ(పీవీటీజీ-బాలురు) హయత్‌నగర్- 50+25 (ఎస్టీ+పీవీటీజీ)
- టీజీటీడబ్ల్యూఆర్‌జేసీ(పీవీటీజీ-బాలికలు) హయత్‌నగర్- 50+25 (ఎస్టీ+పీవీటీజీ)

అర్హత: అభ్యర్థులు నీట్ 2024 రాసి ఉండాలి. కుటుంబ వార్షికాదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1,50,000; పట్టణాల్లో రూ.2,00,000 మించకూడదు. గతంలో ఆపరేషన్ ఎమరాల్డ్(ఓపీఈఎం) కింద ఈ అవకాశాన్ని వినియోగించుకున్న వారు ప్రస్తుతం దరఖాస్తుకు అనర్హులు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.200
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 26
- **దరఖాస్తుతోపాటు అప్‌లోడ్ చేయాల్సిన పత్రాలు:** నీట్-2024 స్కోర్ కార్డ్, కుల ధ్రువీకరణ పత్రం, ఇన్‌కం సర్టిఫికెట్, పదోతరగతి సర్టిఫికెట్, ఇంటర్/పన్నెండోతరగతి సర్టిఫికెట్, నాలుగు ఫొటోలు
- **ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** జూన్ 27
- **సర్టిఫికెట్‌ల వెరిఫికేషన్:** జూన్ 29
- **తరగతులు ప్రారంభం:** జూలై 1 నుంచి
- **వెబ్‌సైట్:** tgtwgurukulam.telangana.gov.in

పీజేటీఎస్‌ఏయూలో యూజీ ఎన్ఆర్ఐ కోటా



హైదరాబాద్-రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ(పీజేటీఎస్‌ఏయూ)- ఎన్ఆర్ఐ/ఎన్ఆర్ఐ స్పాన్సర్డ్ కోటా కింద బీఎస్సీ ఆనర్స్, బీటెక్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. విదేశాల్లో నివశిస్తున్న ఎన్ఆర్ఐ అభ్యర్థులు, ఎన్ఆర్ఐలు స్పాన్సర్ చేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంపీసీ, బైపీసీ స్ట్రీమ్‌లలో అడ్మిషన్స్ నిర్వహిస్తారు. అకడమిక్ మెరిట్(ఇంటర్/పన్నెండోతరగతి మార్కులు) ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఎంపికైన అభ్యర్థులు రూ.9,53,450లకు డీడీ, రూ.46,550ల నగదుతో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలి. వీరికి ఫీ రీయింబర్స్‌మెంట్, ప్రభుత్వ రాయితీలు లభించవు. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు.

- **బీటెక్ స్పెషలైజేషన్‌లు:** ఫుడ్ టెక్నాలజీ, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్
- **బీఎస్సీ ఆనర్స్ స్పెషలైజేషన్‌లు:** అగ్రికల్చర్, కమ్యూనిటీ సైన్స్

బైపీసీ స్ట్రీమ్ కళాశాలలు-సీట్లు: హైదరాబాద్-రాజేంద్రనగర్‌లోని కాలేజ్ ఆఫ్ అగ్రికల్చర్‌లో బీఎస్సీ ఆనర్స్ అగ్రికల్చర్ 10 సీట్లు; నిజామాబాద్-రుద్రూర్‌లోని కాలేజ్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో బీటెక్(ఫుడ్ టెక్నాలజీ) 1 సీటు; హైదరాబాద్-సైఫాబాద్‌లోని కాలేజ్ ఆఫ్ కమ్యూనిటీ సైన్స్‌లో బీఎస్సీ ఆనర్స్ కమ్యూనిటీ సైన్స్ 2 సీట్లు ఉన్నాయి.

ఎంపీసీ స్ట్రీమ్ కళాశాలలు-సీట్లు: సంగారెడ్డి-కందిలోని కాలేజ్ ఆఫ్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్‌లో బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) 3 సీట్లు; నిజామాబాద్-రుద్రూర్‌లోని కాలేజ్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో బీటెక్(ఫుడ్ టెక్నాలజీ) 1 సీటు; హైదరాబాద్-సైఫాబాద్‌లోని కాలేజ్ ఆఫ్ కమ్యూనిటీ సైన్స్‌లో బీఎస్సీ ఆనర్స్ కమ్యూనిటీ సైన్స్ 2 సీట్లు ఉన్నాయి.

అర్హత వివరాలు: బైపీసీ స్ట్రీమ్ కింద అప్లయ్ చేసుకోవాలంటే గుర్తింపు పొందిన బోర్డు(ఇండియన్/విదేశీ బోర్డు) నుంచి బయలాజికల్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి.

- ఎంపీసీ స్ట్రీమ్ కింద అప్లయ్ చేసుకోవాలంటే ఏదేని ఇండియన్/విదేశీ బోర్డు నుంచి మేథమెటిక్స్, ఫిజికల్ సైన్సెస్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి పూర్తిచేసి ఉండాలి.
- అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 17 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.

ముఖ్య సమాచారం

- **ప్రాసెసింగ్ ఫీజు:** రూ.5,000
- **చివరి తేదీ:** ఆగస్టు 31
- **వెబ్‌సైట్:** www.pjtsau.edu.in

చిట్టీల్స్


తగ్గితే ఎందుకు మంచిది


ఒక ఊరిలో జగ్గు, రంగా అనే ఇద్దరు వ్యక్తులు ఉండేవారు వారిద్దరు మాటిమాటికీ కారణం లేకున్నా గొడవలు పడుతుండేవారు. ఎంతమంది మందలించినా, వారిద్దరూ తమ వైఖరి మార్చుకోలేదు. ఆ ఊరివారు ఊరు చివరనున్న చెరువులోనుంచి తాగడానికి నీళ్లు తెచ్చుకునే వారు.

ఆ చెరువుకు వెళ్లే దారి కొండ మీదుగా చాలా సన్నగా, ఇరుగ్గా ఉండేది. కొంచెం పక్కకు జరిగితే కొండ మీదినుండి పడిపోయే విధంగా ఉన్న ఆ దారిలో ఒక రోజు జగ్గు నీళ్ల కోసం వెళ్లాడు. అదే సమయానికి రంగా నీళ్లు తీసుకుని వెనక్కి వస్తూ ఇద్దరూ ఒకరికొకరు ఎదురు పడ్డారు కానీ ఎవరూ వెనక్కి వెళ్లడానికి ఇష్టపడలేదు. ఇద్దరూ పట్టు తప్పి, కొండమీద నుండి కిందపడి దెబ్బలు తగిలించుకున్నారు.

కొన్ని పార్లు నెగ్గడానికి కాకుండా తగ్గడానికి ఇష్టపడితేనే బాగుపడతాం.

7 తేడాలు గుర్తించండి





దారి కనుక్కోండి





జంతువులు ఎన్ని?



సరైన నీడ ఏది?

డైలీ సుడోకు - 339

1	4		2		8			
		5	6					
				5	4			7
	6		4				5	3
	1	8				6	9	
3	5				9		8	
4			3	1				
					6	3		
			8		5		6	1

సుడోకు - 338 సమాధానం

8	4	7	6	1	3	2	9	5
6	9	1	5	2	8	3	7	4
2	3	5	7	9	4	8	6	1
4	5	3	1	8	7	9	2	6
1	7	6	9	5	2	4	3	8
9	2	8	3	4	6	5	1	7
5	6	9	8	3	1	7	4	2
7	8	2	4	6	9	1	5	3
3	1	4	2	7	5	6	8	9

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.



టెస్టింగ్‌లో 'నోట్స్'



యూట్యూబ్ కొత్తగా 'నోట్స్' ఫీచర్‌ను తీసుకు వచ్చే ప్రయత్నంలో ఉంది. టెస్టింగ్ దశలో ఉన్న ఈ ఫీచర్ ఎక్స్‌కు చెందిన కమ్యూనిటి నోట్స్ మాదిరిగానే ఉండనుంది. వీడియోపై కాంటెక్స్ రాసేందుకు ఇది వీలుకల్పిస్తుంది. మిస్‌లీడింగ్, ఔట్ ఆఫ్ కాంటెక్స్ అని టాగ్ కూడా చేయవచ్చు. టెస్టింగ్ దశలో భాగంగా ముందుగా కొందరు యూజర్లు, క్రియేటర్లకు ఈ ఫీచర్ అందుబాటులో ఉంటుంది. రెలవెంట్, టైమ్లీ, ఈజీ టు అండర్‌స్టాండ్ కాంటెక్స్ వంటివి వీడియోలపై రాసే అవకాశం లభిస్తుంది. ఒక పాటకు పారడీ నుంచి ప్రొడక్ట్ న్యూవెర్షన్ రెవ్యూ, ఎప్పటిదో ఇప్పటిదంటూ పెట్టిన ఫుటేజీని గుర్తించడం వంటివన్నీ ఈ ఫీచర్‌తో తెలుసుకునేందుకు వీలుంటుంది. ఇంగ్లీష్‌లో రాయవచ్చు. అమెరికాలోని మొబైల్ యూజర్లకు మొదట ఇది అందుబాటులోకి వస్తుంది. టెస్టింగ్ దశలో ఎవాల్యుయేటర్లు ఈ ఫీచర్‌కు రేటింగ్ ఇస్తారు. ఏ మేరకు ఉపయోగపడుతుందన్నది తెలియజేస్తారు.

ఆంధ్రజ్యోతి
నవ్య స్మార్ట్
శనివారం • 22 జూన్ 2024

అందుబాటులోకి గూగుల్ జెమిని యాప్

గూగుల్ జెమిని మొబైల్ యాప్ మన దేశంలో అందుబాటులోకి వచ్చింది. గూగుల్ ప్లే స్టోర్ నుంచి దీన్ని పొందవచ్చు. అడ్వాన్స్‌డ్ ఏఐ ఫీచర్లను ఉపయోగించుకోవచ్చు. తెలుగు సహా తొమ్మిది భారతీయ భాషలను ఇది సపోర్ట్ చేస్తుంది. జెమిని 1.5ప్రొ కూడా ఇండియాలో లభిస్తుంది. జెమిని అడ్వాన్స్‌డ్ ఫీచర్స్ విషయానికి వస్తే,



- దీంతో 1500 పేజీల మేర డాక్యుమెంట్స్‌ను అప్‌లోడ్ చేయవచ్చు. అంతేకాకుండా 100 ఈమెయిల్స్‌ను చాట్‌బోట్ సమ్మరైజ్ చేస్తుంది. ఇచ్చిన డేటా ఆధారంగా చర్యకు అవసరమైన ఇన్‌సైట్స్‌ను అందిస్తుంది.
- కాంప్లెక్స్ డేటా అనాల్సిస్ సౌలభ్యం కూడా ఉంది. గూగుల్ షీట్స్, సీఎస్‌వీలు, ఎక్సెల్ నుంచి పొందిన సమాచారం నుంచి విశ్లేషణ మొదలుకుని ఇంటరాక్టివ్ చార్ట్స్ వరకు పొందవచ్చు.
- గూగుల్ మెసేజెస్‌తో ఇంటిగ్రేట్ అవుతుంది. దాంతో స్నేహితులు, కొలీగ్స్‌తో కొలాబిరేషన్‌కు వీలుపడుతుంది.



సెక్యూరిటీ లూప్‌హోల్!

గూగుల్ - పీసీలపై ఉండే క్రోమ్ బ్రౌజర్‌లో భద్రతపరమైన లోపాలు తలెత్తాయని, రాబోయే రోజుల్లో సరికొత్త అప్డేట్‌తో వాటన్నింటినీ పరిష్కరిస్తామని ప్రకటించింది. సెక్యూరిటీ సమస్యలకు వీలున్న వాటిని మొదట ఇండియన్ కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్(సీఈఆర్‌టీ) గుర్తించింది. విండోస్ పీసీలు, లినక్స్, మేక్ కంప్యూటర్స్‌లో ఉన్నట్టు కనుగొన్నారు. వీటిలో టైప్ కన్ఫ్యూజన్, వెబ్‌అసెంబ్లీ అమలులో అవకతవకలు, డాన్ సంబంధ సమస్యల ఫలితమే ఇది అని సీఈఆర్‌టీ తేల్చింది. గూగుల్ వీటికి అంగీకరించడానికి తోడు తదనుగుణ చర్యలు తీసుకుంటోంది. రిలీజ్ చేయబోయే అప్డేట్స్‌ను కూడా వెల్లడించింది. ఈలోపు గూగుల్ పిక్సెల్ ఫోన్స్‌లోనూ సంబంధిత సమస్యలను కనుగొన్నారు. లక్షిత డివైజ్‌లను టార్గెట్ చేస్తూ ఇప్పటికే రిమోట్ హేకర్ ఒకరు యత్నించారు. సులువుగా డివైజ్‌పై పట్టు సాధించాడు. డినయల్ ఆఫ్ సర్వీస్(సర్వీస్ తిరస్కరణ) అటాక్‌ను కూడా నిర్వర్తించాడు.

'లాగిటెక్' కొత్త కీ బోర్డు

లాగిటెక్ కొత్త కీబోర్డును ప్రకటించింది. పదేళ్ళ నాటి కీస్-టు-గో కీబోర్డ్ స్థానే కొత్తది 'కీస్-టు-గో 2' ఈ నెల మార్కెట్లోకి వస్తోంది. డిజైన్ నుంచి ఫీచర్ల వరకు అన్నింటినీ ఆధునీకరించారు. లాగిటెక్ కీబోర్డ్ మొదట 2014లో విడుదలైంది. రెండేళ్ళ క్రితం కొద్దిపాటి మార్పులు కూడా చేశారు. ఇప్పుడు మరిన్ని మార్పులతో విడుదల అవుతోంది. ప్లాస్టిక్ డెక్‌పై సక్రమంగా కీ, స్విచ్‌లు ఉన్నాయి. కీ బోర్డ్‌పై పనిచేస్తునప్పుడు దాని చుట్టూ ఉన్న కవర్ మూసుకునేలా ఏర్పాటు చేశారు. తయారీలో 36 శాతం మేర రీసైక్లిడ్ ప్లాస్టిక్‌ను ఉపయోగించారు. సూపర్ థిన్ అంటే 4.57 ఎంఎం ఉంది. మూసినప్పుడు 8.77 ఎంఎం అంటే కవర్‌తో కలిపి ఉంటుంది. కాయిన్ సెల్ బ్యాటరీలతో పనిచేస్తుంది. 36 నెలలు వస్తుంది. లాగిటెక్‌కు చెందిన 'ఈజీ-స్విచ్' కీ సపోర్ట్ ఉంది. వివిధ డివైజ్‌ల మధ్య స్వైపింగ్ అవకాశం ఉంది. రమారమి 80 డాలర్లకు రెండు వెరైటీలు అంటే ఒకటి యాపిల్ డివైజ్‌ల కోసం మరొకటి అన్ని రకాలకు ఉపయోగపడేలా రూపొందించారు. లిలాక్, పేల్ గ్రే, గ్రాఫైట్ కలర్‌వేస్ రంగుల్లో రెండు వెరైటీలు లభ్యమవుతాయి.





షేర్ మెనూలో ఆండ్రాయిడ్ డివైజ్ లింక్

మైక్రోసాఫ్ట్ - విండోస్ 11లో చేయబోయే అప్డేట్‌తో ఆండ్రాయిడ్ ఫోన్ డివైజ్, షేర్ మెనూతో ఇంటిగ్రేట్ కానుంది. షేర్ మెనూ కింద ఫైల్స్ లింక్స్ తదితరాలను పీసీల నుంచి ఆండ్రాయిడ్ ఫోన్లకు పంపుకోవచ్చు. ఇందు కోసం షేర్ మెనూలో 'మై ఫోన్' జతపడుతుంది. ఫోన్ లింక్ ద్వారా ఇది పనిచేస్తుంది. అలాగే ఆండ్రాయిడ్ డివైజ్‌ల్లో ఉండే యాప్‌తో సాధ్యమవుతుంది. నోటిఫికేషన్స్ సింకింగ్ నుంచి యాప్స్ -ఫైల్స్ యాక్సెస్ తదితరాలకు ఈ యాప్ ఉపయోగపడుతుంది. సరికొత్త ఎడిషన్స్‌తో ఐటెమ్స్‌ను వేగంగా, సులువుగా పంపుకోవచ్చు. అయితే ఎప్పుడు అందుబాటులోకి వస్తుందన్న సమాచారం మాత్రం లేదు. బేటా టెస్టర్లకు మాత్రమే ప్రస్తుతానికి దీన్ని పంపుతోంది.

క్షణాల్లో యాప్ పేర్లను దాయొచ్చు!

ఐఫోన్‌లో యాప్స్ పేర్లను దాచిపెట్టవచ్చు. ఐఫోన్ కస్టమైజేషన్ కోసం ఐఓఎస్ 18 సరికొత్త ప్రమాణాన్ని సెట్ చేసింది. తద్వారా ఐఫోన్ హోమ్ స్క్రీన్‌పై యాప్‌ల పేర్లను దాచి ఉంచొచ్చు. అందుకోసం...



- ఐఫోన్ హోమ్ స్క్రీన్‌పై లాంగ్ ప్రెస్ చేయాలి.
- ఎడిట్‌ని టాప్ చేయాలి. కస్టమైజ్‌ను సెలెక్ట్ చేసి లార్జ్‌ని ఎంచుకోవాలి.
- లార్జ్‌ని సెలెక్ట్ చేయగానే యాప్ నేమ్ అదృశ్యమవుతుంది. ఐకాన్ సైజ్ కూడా కొద్దిగా పెరుగుతుంది.

దీనికితోడు ఐకాన్‌లను డార్క్‌మోడ్‌లోకి మార్చుకోవచ్చు. లేదంటే అన్నింటినీ పింక్ కలర్‌లోకి చేంజ్ చేసుకోవచ్చు. ఆండ్రాయిడ్‌పై ఈ ఫీచర్ ఇప్పటికే ఉంది. అదే ఇప్పుడు ఐఓఎస్‌లోకి వచ్చింది. ఐఫోన్ 11, 12 13, 14 ఫోన్లలో చాలా వాటికి ఈ ట్రిక్ పనిచేస్తుంది.

వాచ్ ఓఎస్ 11 అప్డేట్‌తో రింగ్‌టోన్‌లో మార్పు

యాపిల్ వాచీ



యాపిల్ వాచీలో ఇప్పటి వరకు డిఫాల్ట్‌గా ఒకే రింగ్‌టోన్ ఉంది. అయితే వాచ్‌ఓఎస్ 11 అప్డేట్‌తో వేర్వేరు రింగ్‌టోన్‌లను తీసుకునే అవకాశం యూజర్లకు కలుగుతుంది. '9టుస్‌మేక్' రిపోర్ట్ ప్రకారం తాజా అప్డేట్‌తో రెండు ఒరిజినల్ సహా ఎనిమిది రింగ్‌టోన్‌లకు అవకాశం ఉంటుంది. పెబల్స్(సెల్యులర్ రింగ్‌టోన్), ఫోకస్, జింగిల్(ఒరిజినల్ రింగ్‌టోగోన్), నైట్‌థవాక్, ట్రాన్స్‌మిట్, ట్విర్ల్, వైండప్, వండర్ ఈ రింగ్‌టోన్స్‌లో ఉన్నాయి. వీటితో ఇంకో సదుపాయాన్ని కూడా కల్పిస్తోంది. అలెర్ట్స్, నోటిఫికేషన్స్, రిమైండర్స్, టెక్స్ మెసేజెస్, ఈమెయిల్స్ తదితరాలకు వేర్వేరుగా ఈ రింగ్‌టోన్స్‌ను ఏర్పాటు చేసుకోవచ్చు. రింగ్‌టోన్స్‌కు తోడు ఆటోమేటిక్ స్లీప్ ట్రాకింగ్‌ను కూడా తీసుకువస్తున్నట్టు సమాచారం. షాజమ్ కోసం స్మార్ట్ స్టాక్ విడ్జెట్‌ను తీసుకువస్తోంది. యాప్‌స్టోర్‌లో ఇది ఇప్పటికే యూజర్లకు అందుబాటులో ఉంది. మ్యూజిక్ సెర్చ్ వేగంగా జరిగేందుకు ఇది ఉపయోగపడుతుంది.

ఏఐతో ఇంటరాక్షన్‌కు 'బటర్‌ఫ్లైస్'

మామూలు వ్యక్తులు, ఏఐ పర్సన్స్‌లతో ఇంటరాక్షన్‌కు వీలుగా బట్టర్‌ఫ్లైస్ యాప్ అందుబాటులోకి వచ్చింది. మనం కొన్ని డిస్క్రిప్షన్ గనక బట్టర్‌ఫ్లైస్‌కి ఇస్తే మిగిలిన పని అంతా అదే చేసుకుంటుంది. ఒక ప్రొఫైల్ ఇమేజ్, లైఫ్, కారెక్టర్ అన్నీ సెకెండ్ల వ్యవధిలో క్రియేట్ చేసుకుంటుంది. ఇది అవసరం అయితే తనంతగా తానే మాట్లాడటం, ప్రశ్నిస్తే సమాధానాలు ఇవ్వడం అన్నీ చేస్తుంది. గూగుల్ ప్లే అలాగే యాపిల్ యాప్ స్టోర్‌లో ఈ యాప్ ఉచితంగా లభిస్తోంది. ఇది జనరేటివ్ ఏఐ(ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్) - సెంట్రిక్ నెట్ వర్కింగ్ యాప్. స్మార్ట్‌ఫోన్లలో ఉపయోగించేందుకు వీలుగా రూపొందించారు. స్నాప్ ఇంక్‌లో ఒకప్పుడు ఇంజనీరింగ్ మేనేజర్‌గా పనిచేసిన వ్యక్తి దీన్ని అభివృద్ధిపర్చారు.

టెక్స్ డిస్క్రిప్షన్‌తో బట్టర్‌ఫ్లైస్ పర్సన్స్‌ని రూపొందించుకోవచ్చు. మెదడులో పుట్టిన ఆలోచనలకు అనుగుణంగా ఇమేజ్, అదేవిధంగా నిర్వర్తించాల్సిన పని ఉంటాయి. అంతే కాదు, ఆ ఏఐ పర్సన్స్ సందర్భానుసారం లేదంటే కామెంట్‌కు తగ్గట్టు స్వతంత్రంగా సమాధానమిస్తాయి. ఉదాహరణకు రైతు, తను చేసే పనిని ఊహించి యూజర్ రాసిందే తడవు, మూడు వరకు ఏఐ జనరేటెడ్ ఫోటోలకు తోడు హ్యాష్‌ట్యాగ్స్ వచ్చాయి. నెలల తరబడి బేటా టెస్టింగ్ జరిగిన తరవాత కొద్ది రోజుల క్రితం ఈ యాప్‌ను విడుదల చేశారు. ఇన్‌స్టాగ్రామ్ తరహా ఇంటర్‌ఫేస్ దీనికి ఉంది. హార్ట్ ఆకారంలో బటన్, బాణం మాదిరి షేర్ బటన్ ఉన్నాయి. కింద యూజర్లు సమాధానం ఇవ్వవచ్చు. బట్టర్‌ఫ్లైస్‌లో ఏఐ పర్సన్ కోసం ఏమి చేయాలంటే...

- హోమ్ పేజీ - ప్లస్ గుర్తుని టాప్ చేయాలి. అక్కడ ఆర్ట్ స్టయిల్(సెమి- రియలిస్టిక్/డ్రాయింగ్)ని ఎంపిక చేసుకోవాలి.
- యాప్‌లో ఏఐ ప్రొఫైల్ క్రియేషన్ కోసం డిస్క్రిప్షన్‌ను టైప్ చేయాలి. పేరు ఇవ్వాలి. యూనిక్ పర్సనాలిటీ కోసం గుణాలను జోడించాలి. బ్యాక్‌గ్రౌండ్ అంటే ఫ్యామిలీ, ఎడ్యుకేషన్, నిర్వర్తించాలని భావిస్తున్న పనిని కలపాలి.
- అప్పుడు యాప్ ప్రొఫైల్ ఉన్న ఫోటోల నుంచి సరైన ఇమేజ్‌ని వెతికే పనిని చేపడుతుంది. వర్ణించిన లక్షణాలకు అనుగుణంగా ఉన్న ఫోటోని తీసుకుని, యూజర్ కోరుకున్నవాటిని కలుపుతుంది.

అప్పుడు ఇక బట్టర్‌ఫ్లైస్ రూపొందించిన ఏఐ వ్యక్తి మెసేజ్‌లు, ఇమేజ్‌లను పోస్ట్ చేస్తూ ఉంటుంది. యూజర్లు కూడా మెసేజ్‌లను పోస్ట్ చేస్తే ఏఐ పర్సన్ స్పందిస్తూ ఉంటారు. సానుకూల దృక్పథంతో కూడిన ఆలోచనలకు తోడు మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించే సూచనలు కూడా ఇస్తుంది. ప్రస్తుతానికి ఈ యాప్ ఉచితంగానే అందుబాటులో ఉంది. అయితే సబ్‌స్క్రిప్షన్ మోడల్‌ను రూపొందించే పనిలో సదరు కంపెనీ ఉందని సమాచారం.

జీపీఎస్ సామర్థ్యాలతో 'బౌల్ట్' డాష్‌క్యామ్

బౌల్ట్ క్రూయిజ్ క్యామ్ ఎక్స్1 - జీపీఎస్ లాగింగ్ ఫీచర్‌తో అలాగే అది లేకుండా కూడా వచ్చింది. లాగింగ్ ఫీచర్‌తో వాహనం వేగం, లోకేషన్‌ను డ్రైవర్ ట్రాక్ చేయగలుగుతాడు. ఇండియాలో రెండు వేరియంట్లను విడుదల చేశారు. 108పీ కెమెరా, జీపీఎస్ లాగింగ్ సామర్థ్యాలు 360 డిగ్రీల రొటేటబుల్ డిజైన్ ఉన్నాయి. మొదటిదానిలో 2 - మెగా పిక్సల్ కెమెరా ఉంది. 170 డిగ్రీల వైడ్ యాంగిల్ లెన్స్ కారణంగా ఎక్కువ రోడ్డును కవర్ చేస్తుంది. దాంతో బ్లయిండ్ స్పాట్స్ నుంచి తప్పించుకునే అవకాశం ఉంటుంది. ముందే చెప్పినట్టు లోకేషన్, వేగాన్ని డ్రైవర్ ట్రాక్ చేయగలుగుతాడు. అలాగే దీన్ని స్మార్ట్‌ఫోన్‌తో కనెక్ట్ చేసుకోవచ్చు. సంబంధిత యాప్ గూగుల్ ప్లేస్టోర్, యాప్ స్టోర్‌లో ఉన్నాయి. సదరు యాప్ రికార్డింగ్స్‌కు వీలుగా ఉంటుంది. రికార్డ్ అయినా మీడియాను సర్దుబాటు చేసే ఆర్గనైజ్ గ్యాలరీ ఉంటుంది. వాహనంలో లైవ్ స్ట్రీమింగ్‌కు అవకాశం ఉంటుంది. ఇక రెండో దానిలో 360 డిగ్రీల రొటేషనల్ డిజైన్ ఉండటంలో డ్రైవర్ తన అవసరాలకు తగ్గట్టు అడ్జస్ట్ చేసుకోవచ్చు. ఇన్‌బిల్ట్ జి-సెన్సర్ కారణంగా ప్రమాదాలను డిటెక్ట్ చేస్తుంది. ఎమర్జెన్సీ వీడియో రికార్డింగ్ సదుపాయం కూడా ఉంది. డ్యాష్‌క్యామ్‌కు అల్యూమినియం చాసిస్‌తో మన్నిక బాగుంటుంది. జీపీఎస్‌తో ఉన్నది రూ.3,999 కాగా లేనిది రూ.2,999కే లభిస్తుంది. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, బౌల్ట్ అధికారిక వెబ్‌సైట్ నుంచి వీటిని పొందవచ్చు.



వైఫై నుంచి అటాక్!

విండోస్ అప్డేట్‌ను వాయిదా వేస్తుంటే సరిగ్గా ఇప్పుడు ఆ పని అంటే ఇన్‌స్టాల్ చేసుకోవడం మంచిది. పబ్లిక్ వైఫై నెట్‌వర్క్‌తో కనెక్ట్ అయిన పీసీల్లో రిస్క్ ఉందన్న విషయాన్ని మైక్రోసాఫ్ట్ గమనించింది. అందుకనే విండోస్ 11, 10విండోస్‌ను ఇప్పుడు అప్డేట్ చేసుకోవడం మంచిది అంటోంది. 'ద రిజిస్టర్' దీన్ని ముందు గుర్తించింది. విమానాశ్రయాలు, కాఫీ షాపులు లేదంటే వర్క్‌ప్లేసుల్లో ముఖ్యంగా పబ్లిక్ వైఫైతో కనెక్ట్ అయ్యే డివైజుల్లో ఈ ప్రమాదం పొంచి ఉంది. యూజర్ ఇంటరాక్షన్ లేదంటే అథెంటికేషన్‌తో హ్యాకర్ రిమోట్ నుంచి డివైజ్‌ను స్వాధీనం చేసుకోగలుగుతారు. ఈ ప్రమాదాన్ని 'ఇంపార్టెంట్'గా మైక్రోసాఫ్ట్ పేరుపెట్టింది. భద్రతపరమైన రిస్క్‌ల్లో దీన్ని రెండో పెద్ద థ్రెట్‌గా పేర్కొంది. ప్యాచ్ విషయంలో ఆలస్యం చేస్తే ముప్పు తప్పదని హెచ్చరించింది.



స్క్రీన్‌షాట్ ప్రివ్యూ రీడిజైన్

ఆండ్రాయిడ్ 15 బేటా 3లో స్క్రీన్‌షాట్ ప్రెవ్యూని రీడిజైన్ చేశారు. పిక్సెల్‌కు చెందిన జనరేటివ్ ఏఐ స్టిక్కర్లపై పని జరుగుతున్నట్టు అనిపిస్తోంది. ఏపీకే ఇన్‌సైట్ పోస్టును డి కంపైల్ చేసినప్పుడు వివిధ కోడ్స్ కనిపించాయి. అది సరికొత్త ఫీచర్ రాబోతోందని తెలుపుతోంది. కొత్త పిల్ షేప్ కంటైనర్ అదీ సర్క్యులర్ షేర్, మేకప్ బటన్స్‌తో ఉంది. ఇది సైడ్ బై సైడ్ అప్రోచ్‌కు బదులుగా ఉండనుంది. ఇది తుది డిజైన్ కావచ్చు. బగ్ కూడా కావచ్చు. ఏదన్నది స్పష్టం కాలేదు. మొత్తానికి ప్రత్యేకించి పిక్సెల్ డివైజ్‌ల కోసం ఇది క్రియేటివ్ అసిస్టెంట్ యాప్/సర్వీసెస్‌ను రూపొందించనుంది. స్క్రీన్‌షాట్ ఎడిటింగ్ టూల్‌తో ఇంటిగ్రేట్ చేయడంతో రీమిక్స్‌డ్ స్టిక్కర్లు, ఇమేజ్‌లు జనరేట్ అవుతాయి. అప్పుడు మార్పు లేనట్టే. స్క్రీన్‌షాట్ ప్రెవ్యూకు తోడు సిస్టమ్ షేర్ షీట్, గూగుల్ ఫొటోస్, ఫైల్స్ యాప్‌లో ఇంటిగ్రేట్ అయింది. ఎఐకోర్ పర్మిషన్‌ను క్రియేటివ్ అసిస్టెంట్ తీసుకుంటుంది. ఆన్-డివైజ్ మోడల్‌ని ఉపయోగించి స్టిక్కర్లు జనరేట్ చేయవచ్చు. మొత్తానికి ఫన్‌కు అవకాశం కలుగుతుంది.

